భారతి

సంపుటము **25** | మే, **1948** సర్వధారి చైత్రము MAY | సంచిక **5**

వీరేశలింగోదాహరణము

•

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

౧

ఆఱని సౌరభంబు భరతావని నాల్గుచెఱంగులందు, పొం
గారెడి తీరుగా శతశతాబ్దము లెండని నిండుటేఱులై
పాఱి రసజ్ఞచిత్తములు పండువుసేసిన 'కందుకూరి'మం
దారమరందముల్ తెలుఁగునాఁటను జిందిన జీవబిందువుల్.

*

జాతిలోఁ గలుషవిశ్వాసంబుఁ దొలఁగించి-నీతిసంస్కృతి ధర్మనియతులు వెలయించి
భావవైశాల్య మేర్పఱచి దేశమునందు-జీవకల్యాణపవిత్రికి నెఱివిందు
సంతరించిన మహాశయులలోఁ బ్రథముఁడు-పంతమ్ము గల బుద్ధివరులలోఁ బ్రథితుండు
భవ్యసంస్కారరూపక మహారంగము-నవ్యకవిత్వపు నాంది మా 'లింగము'

*

సహాసశక్తిని దేర్చి—ప్రహసనంబులు గూర్చి
పుడమిలోఁ గల మఱక—కడిగివేసెడి యెఱుక
గలిగి పొల్చినవాఁడు—తెలుఁగు నిల్పినవాఁడు
తెలివి మెచ్చినవాఁడు—వెలుఁగు దెచ్చినవాఁడు

౨

ఒకకరంటఁ మన తెన్గుజాతిపరమాయుర్గ్రంథి గుర్తించి వే
ఱొకకరంటఁ మన తెన్గుభారతి శుభోద్యోగంబు గాంచించి, సాం

ఘికసారస్వతనైతికోన్నతుల కేకీభావముం బెంచి, కాం
చక యేనాఁడో గతించిపోయిన కవిస్వామిం బ్రశంసించెదన్.

*

సొగసుఁగప్పురములో సొలపుఁ జంధనములో-ముగుద తెమ్మెరలలో మురియు నందనములోఁ
బాలపమ్ము వెలయఁ జూపులకు విందులుగూర్చి-యలఁతిపల్కుల గద్య మలరించి యెకలూర్చి
ఆనాఁడు తిక్కన య్యాహరించిన పల్కు-లీనాఁడు కృతులలో నెదుటనే రసమొల్కఁ
జిలికిన కవిరాజశేఖరు నెదలోన-వెలయఁ జేయుట పురావిభవమ్ము మనలోన.

*

జాతిలో నొక క్రొత్త—జాతిసంస్కృతి హత్తఁ
బ్రాకృతప్రజకు మొదలు—సొక ముద్దులు పొదలు
వచనశైలికి మంచి—రుచియు వన్నెయుఁ బెంచి
యమృతుఁడైన కవీంద్రు—నమరఁ గొల్చుట విందు.

3

చివురించెం గవితాతరుల్, విరియఁబూచెం, గాచె, వీరేశలిం
గవసంతోదయమాధురీరుచిరసంక్రాంతిన్ మహాంధ్రంబునన్;
గవితాకల్పము కొమ్మకొమ్మదెసఁ బైకశ్రీసుధాగానముల్
సవరింపంబడెఁ గందుకూరికవిచేఁ జారుప్రసారంబునన్.

*

యుగయుగంబులకేని యొఱపు మాఱని వాసి-యుగము వాఙ్మయమున నుదయింపఁగాఁజేసి
పెఱబాస సాహితిపెంపు తెల్గున దింపె-నరసభావనకు వైశాల్యంబు నొగి నింపె
శ్రీబాలవృద్ధసుధీగణధ్యేయమ్ము-గా, బాసలో నూత్నగతి శ్రవఃపేయమ్ము
సరిక్రొత్తశైలి మెచ్చఁగ నంతరించెను-గరుణమై మనబాస కఱ వంతరించెను.

*

అతనిచే నొక వెలుఁగు—అతనిచే మన తెలుఁగు
అన్యఖండములందు—అన్యసీమలయందు
పారదంబయి విరిసి—పాఱె; నాగతి దెలిసి
లెండు! బంగరుపంట—పండఁజేయుఁడు వెంట!

౪

తెనుఁగుంగబ్బము సంతరించిన కవుల్ తెల్గన్న, తిమ్మన్న, లిం
గన లంచుం గొనియాడి నిండిన మదిం గైమోడ్చు వీరేశలిం
గనకై కావ్యములోన నాఁడల సుధీగణ్యుండు కొక్కొండ; పా
త్రనఁగా, నుత్తరదక్షిణధ్రువము లొండైయుండె నన్నట్లుగన్.

అనసూయులై, సంఘ మారఁగప్పిన కారు-తునుకమబ్బుల నూఁదఁదోడరిన తన తీరు
తరతరంబులదాఁకఁ జెఱుగక విఱుగక-తిరముగా నిలిచి నర్తించును దఱుగక
ఎదిరిపాముల డెంద మేఁచు కాటులకునై-ముదితొక్కుల వెడఁగు బోసిపోటులకునై
పిల్లల కంకర బెడ్డరువ్వులకునై-మెల్లసత్యమును మాయించు నవ్వులకునై

*

ఎన్ని మంథులు ద్రింగి—ఎన్ని సందుల వంగి
ఎన్ని యొడ్డులు వెట్టి—ఎన్ని గడ్డలు నెట్టి
బ్రదికెనో నిరుపేద—బ్రదుకు! జీవము లేద
యీ మహాత్మునియెడలఁ—బ్రేమగౌరవ మెడల.

౫

పౌలపము దక్క పుర్వులకు బోనము వెట్టెడి తాటియాకుఁగ
ట్టలఁ బడి బూజుపట్టుచుఁ జెడంజెడియున్న పురామహాకవీ
శుల కవితామణీగణరుచుల్ వెలిసేసి, తదీయసాధుగా
థలకు వెలుంగుచూపిన యుదారునివల్లఁ జరిత్ర మేల్కొనెన్.

*

శ్రీమద్రవుఁ ప్రాచ్యకృతిశాల కురిచీలు-భూమ 'తంజా' మహాపురి మంజులశ్రీలు
'వేదవిలాస'పవిత్రమందిరభిత్తి-చేదోడువాదోడు సేయ నద్భుతవృత్తిఁ
దాళపత్త్రిముల కాంతారమ్ములోఁ బడి-మేలిదారులు తీసి మెఱయించి ప్రాఁబడి
పడియున్న కవులకుఁ బ్రప నిల్పె నా జోదు;-పుడమి నాతనిఁ బట్టి పుట్టని కథ లేదు.

*

అతని సత్కృతు లెల్ల—అతని సంస్కృతు లెల్ల
తిరుగఁదోఁడి తెలుంగు—ధరణిలోన వెలుంగు
వెలయఁజేయుట మేలు—పలుకులాడుట చాలు!
నిలకుఁ బంతులుగారి—చెలిమి చల్లని దారి.

౬

మొత్తముమీఁద వాఙ్మయపుఁ బోకడ లెన్నియొ యాకళించి, క్రొం
గ్రొత్తగఁ దాన పన్నుకొని తూర్ణము సేయని లెన్న లేదు: తా
నెత్తిన త్రోవలో నడచి మే కవులై రల 'చిల్కమర్తి' వి
ద్వత్తముఁ డాదిగా విబుధు;లా మహనీయునకుం గృతజ్ఞులై.

*

మృతిలేని జీవిత మెసలారు జననంబు-శతవార్షికముల యుత్సవసమాచరణంబు
పడయుటగా; దాంధ్రభాష యుండినదాఁక-గడియారముల లెక్క గడచిపోయెడిదాఁక

కలకాలమును, కాలకాలమ్ము దీపించు-నిలిచి దేశాలకు వెలుఁగు చూపించు
ఒక యుపాధ్యాయున కొక బాఁపనయ్యకు-ఒక పేదజియ్యకు నొక మునలయ్యకు-

*

ఔరా! ఎంతటి శక్తి!-ఔరా! ఎంతటి సూక్తి!
ఒక్క పీనసరోగి-కొక్క సంస్కృతిరాగి
కెట్టి యద్భుతశక్తి!-యిట్టి యుత్సవరక్తి
తెలుఁగు దేశములోన-వెలయు టెన్నఁడుగాన.

౭

ఒక్కటి కాదు: భారతము నూఁపిన సర్వసమస్యలందుఁ జే
రెక్కినయట్టి నేర్పరి: మహిన్ మన సాహితిసొంపు చాటి, పెం
పెక్కినయట్టి తీరుపు రచించిన కూర్పరి: కందుకూరి వ
మ్యక్కవితాకళారతునియందుఁ గృతజ్ఞము సర్వలోకమున్.

*

అచ్చ తెనుంగు కావ్యముల కూరుపునేర్పు-మెచ్చఁగా నవలలు మెఱయించు బలుతీర్పు
మధురకథాభినిర్మాణంబులోఁ దీరు-ప్రథితనాటకకళాగ్రథనంబులో సౌరు
కవికథాసంధానకరణమ్ములో శక్తి-నవరీతిఁ బరిశోధనంబులో ననురక్తి
ఒకటికా దెన్నెన్నొ యుదయించి పెంపొందె-సకలంబు వీరేశసాహిత్యఖనియందె

*

కొన్నిదారులు చూపెఁ-గొన్నిదారులు మాపె
తెలుఁగుసాహితిలోన-తెలుఁగుసంఘములోన
కందుకూరికవీంద్రు-నందు నాంధ్రుల విందు
కడలిలోపలఁ బెట్టు-వెడఁగు తేనియబొట్టు.

పరమపవిత్రశీత 'శతవార్షిక' వార్షికబిందుబృందబం
ధురతకుఁ జాతకంబులయి నోరులు విచ్చిన తెన్గువారిపైఁ
గురియుము! నీ కటాక్షరసగుంభన; మోయమృతప్రభాసహో
దరహృదయాంబుజా! సరి యుదాహరణంబులు లేవు నీ కెటన్.

గాథాసప్తశతిలోని తెనుగుపదాలు*

శ్రీ టి. రామచంద్ర

రాజకీయప్రాబల్యమూ, సాహిత్యప్రాచుర్యమూ గల భాషలు ఇతరభాషలను, జాతులను లోబరచుకొంటాయి. పూర్వం మతానికీ, రాజకీయాలకూ అంతరం లేదుగనుక ప్రాచీనఆర్యభాషకు మాండలిక మాత్రమైనప్పటికీ సంస్కృతభాష ఇతరభారతీయ భాషలను కొన్ని శతాబ్దాలవరకూ తలఎత్తనివ్వలేదు. మతంతోపాటు వ్యాపించిన సంస్కృతం విభిన్న జాతులతో, సంఘాలతో సంబంధం ఏర్పడినకొద్దీ వారి భాషల పదాలనూ, భావాలనూ ఆకళించుకొన్నది. డాక్టర్ గుండెర్ట్ పండితుడు అన్నట్లు అన్యభాషా పదాలను, సంప్రదాయాలను సంతరించుకొనకపోయి వుంటే సంస్కృతసాహిత్యం ఇంత విశాలంగానూ, సమృద్ధంగానూ అయివుండేదే కాదు. సంస్కృతప్రత్యయాలతోను, ఉపసర్గలతోను ఇతరభాషాశబ్దాలు వేషం మార్చుకొని సంస్కృతంలో లీనమైన వైనానికి తంత్రవార్తికకారుడు కుమారిలభట్టువాక్యాలే మనకు నిదర్శనం.

మీన, పీలు, కుంతల, హేరంబ, పలాండు, పున్నాగ, మరీచ, వ్రీహి, అటవి, పుత్ర, మందిర, ఖర్జు, కశిపు, పుట్ట, కంపు, బలాకా, నూదనా మున్నగు శబ్దాలు దక్షిణభారతభాషలనుంచి సంస్కృతంలో చేరినట్లు కిట్టెల్ పండితుడు తన కన్నడనిఘంటువులో సోపపత్తికంగా నిరూపించాడు. "పున్నామ్నో నరకాత్ త్రాయత ఇతి పుత్రః" అన్నే వ్యుత్పత్తికంటే పుట్టు ధాతువునుంచి జనించిన పుట్ట శబ్దం 'పుత్ర' గా మారిందనడమే సహేతుకం. మందిర శబ్దానికి మను, ఇరు పదాలే మూలమనడం సమంజసం. వెల్ + పక్కి = బలాకా అయివుంటుంది. ఏదో ఒక విధంగా వ్యుత్పత్తి కల్పిద్దామనే ఉద్దేశంతో సంస్కృతపండితులు శబ్దాల మూలరూపం గుర్తించ రానంత తప్పుదోవ పట్టించారు. కావి + ఏఱు = కావేఱు, కావేరి (ఎఱ్ఱని నీరు) అనే వ్యుత్పత్తి స్పష్టముగా కనిపిస్తూండగా, "కవేరస్య అపత్యం స్త్రీ" అని వ్యుత్పత్తి చెప్పడంలోనే సంస్కృతవ్యామోహం ఎంత ఉందో మనకు విస్పష్టం. గోదేరే గోదావరి అయింది.

సంస్కృతం మాండలికంగా మాత్రమే వున్నప్పుడు సర్వజనీనంగా అభివృద్ధిపొందిన ప్రాచీనభాష ప్రాకృతంకూడా ఇతరదేశ్యాలను తనవిగా చేసుకొనక పోలేదు. ప్రాకృతవైయాకరణులకు, నిఘంటుకారులకు దేశ్యాలపై ప్రాకృతముద్ర వేద్దామనే వ్యామోహం లేనందున వాటిని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

ఆర్యావర్తంలో బుద్ధునికాలపు వ్యవహారభాష పాలీ. తన సిద్ధాంతాలను బుద్ధభగవానుడు ఆ భాషలోనే ఉపదేశించాడు. బుద్ధుని సందేశాలతో పాలీని మొట్టమొదట దక్షిణాపథానికి తెచ్చినవాడు అశోకుడు.

---

* గాథాసప్తశతిలోని కన్నడశబ్దాలనుగురించి ౧౯౩౯ లోనో, ౪౦లోనో 'ప్రబుద్ధకర్ణాటక'లో ఒక వ్యాసం చూచాను. రచయితపేరు మరచిపోయాను. వ్యాసంలోని పొట్ల, తుప్పశబ్దాలుమాత్రం జ్ఞాపకమున్నవి. కన్నడమైనా, తెనుగైనా గాథాసప్తశతిలోని దేశిశబ్దాలు మొదటిమారు తెలిపినవాడు అయనే. ఆయనపేరు మరచానుకనుక 'ప్రబుద్ధకర్ణాటక' పత్రికకే వందనాలు సమర్పిస్తున్నాను.

దక్షిణాపథంలోనూ పాలీభాషే వ్యవహరింప బడేదనీ, ఇతరభాషలు లేవనీ, అశోకుడూ, ఖారవేల్లుడూ పాలీభాషలో శాసనాలు వేయించడానికి ఇదే కారణమనీ చేసే వాదం సహేతుకం కాదు. పాలీ మతభాషగా గ్రహించడంవల్లనే (బౌద్ధమతానికే ప్రాధాన్యంగనుక) అశోకుడు పాలీలో శాసనం వ్రాయించాడు. ఖారవేల్లుడు తెనుగువాడైనప్పటికీ అంతే.

బృహత్కథలో ప్రాకృత, సంస్కృత, దేశీ భాషలు వున్నట్లు వేర్వేరుగా ఉల్లేఖించడమూ, క్రీస్తు పూర్వంకటిశతాబ్దానికి ముందున్న పాలీశాసనాలలోకూడా తెనుగువూళ్ల పేర్లు లభించడమూ, చీనాయాత్రికుడు హుయన్ త్సాంగ్ ౭ వ శతాబ్దం ప్రారంభంలో కళింగానికి వచ్చినప్పుడు అక్కడిభాషలు వేరేవని తెలుపడమూ, దాక్షిణ్యచిహ్నసూరి కువలయమాలలోని జాతివర్ణన, అన్నిటికంటె ముఖ్యంగా కర్ణాటకదేశంలో లభ్యమౌతున్న ప్రాచీనశాసనాలూ దక్షిణాపథంలో పాలీగాని, సంస్కృతంగాని సామాన్యవ్యవహారభాషగా లేవనడానికి ప్రబలనిదర్శనం. శ్రీ సునీతికుమారచటర్జీ అన్నట్టు పాలీభాషలో శాసనాలు వెలయించిన ఖారవేల్లుని పేరు తెనుగే (కాలు + వేల్ =కల్లటి బల్లెం గలవాడు). జైనబౌద్ధమతాల ద్వారా దక్షిణభారతదేశంలో వ్యాపించిన ప్రాకృతభాషకూడా సంస్కృతంవలెనే దేశభాషల సంప్రదాయాలనూ, శబ్దజాలాన్నీ లోబరచుకొన్నది. ప్రాకృతంలో మిళితమైపోయిన కోలంబ, రింఛోళి, తాలూర మున్నగు దేశిశబ్దాలను సంస్కృతమహాకవులుకూడా గతానుగతికంగా ప్రయోగించగా 'మేదినీ' మున్నగు నిఘంటుకారులు స్వీకరించి సంస్కృతముద్ర వేశారు. "కోలంబశబ్దం సంస్కృతేపి కేచి ద్గతానుగతికతయా ప్రయుంజతే" అని హేమచంద్రుడు దేశీనామమాల సప్తమసర్గ ౨ వ ఆర్యావివృతిలో తెలిపాడు.

ప్రాకృతంలో చెప్పు, చెక్కు, చూచు మున్నగు తెనుగుక్రియలు చవఇ, చఅఇ, చచ్ఛఇ, చజ్జఇ మున్నగు రూపాలతో చేరిపోయాయి. ఈవిధంగా గుర్తింప రానంత మార్పుతో అన్యదేశిశబ్దాలు ప్రాకృతసాహిత్యంలో మిళితంకావడంవల్లనే ఆచార్య హేమచంద్రుడు దేశీశబ్దాలకు అన్వయమే కుదరదనీ, అన్వయం కుదిరినా అర్థంకావడం కష్టమనీ దేశీనామమాల ప్రారంభంలోనే అన్నాడు. ("దేశీ దుస్సందర్భా, ప్రాయ స్సందర్భితాపి దుర్బోధా, ఆచార్య హేమచంద్ర స్త త్తాం సందృభతి విధజతిచ".) దేశికి వ్యుత్పత్తి తెలియనందున ప్రాచీనసంప్రదాయసిద్ధమైన అర్థాన్నే గ్రహించాలని హేమచంద్రుడు నిర్దేశించాడు. దేశీశబ్దాలు అర్థంకాక తప్పుడు వ్యాఖ్యలు చేసినవారిని చూచి హేమచంద్రుడు "ఇప్పటి దేశికవులవి, వాటి వ్యాఖ్యాతలవి ఎన్ని తప్పులని ఏరను ?" (అధునాతన దేశీకారాణాం, తద్వ్యాఖ్యాతౄణాంచ కియంత స్స్వమోహాః పరిగణ్యంతే" అష్టమసర్గ, ౧౨ వ ఆర్య.) అని ఎంతో కష్టపడ్డాడు. తాను 'పారతరదేశిదర్శనంతో' వ్రాస్తున్నాననీ, తన నిఘంటువులో పొరపాట్లుండవని "తిణిసశబ్ద" వ్యాఖ్యానసందర్భంలో స్పష్టపరిచాడు. ("తిణిసంచ వృతువిశేషమాచక్షతే. అస్మాభిస్తు పారతరదేశిదర్శనే న తిణిసశబ్దో మధుపటలార్థో వ్యాఖ్యాతః. తత్ర యుక్తాయుక్త బహుదృశ్వానః ప్రమాణం" తృతీయ సర్గ౧౨వ ఆర్య) సంస్కృతప్రాకృత సాహిత్యాలలో యుగపురుషుడుగా వెలసిన హేమచంద్రునివంటివాడు భ్రాంతిపడడం పొసగదు.

గాథాసప్తశతి తెనుగుగడ్డపై వెలసిన రచన, ప్రజాకవులు రచించిన ఈ అమరగాథలను సేకరించి ప్రాకృతసాహిత్యవధువుకు అందచందాలు సంతరించినవాడు హాలసాతవాహనుడు. హాలుని కాలం క్రీస్తుశకం ౬౮ వ సంవత్సరమని విన్సెంట్ స్మిత్ నిర్ణయం. తెనుగుకవిరాజు సేకరించిన ఈ గాథలలో దేశిపదాలు, ముఖ్యంగా తెనుగుపదాలూ, సంప్రదాయమూ వెల్లివిరియక మానవుకదా ! దీనిలో ప్రయోగించిన అత్తి, తుప్ప, మఇఅ, మసహ, కిలించిఅ, పిలుఅ, ఎక్కల, పక్కల మున్నగునవి ప్రాకృతపదాలు కావనీ, కేవలం దేశ్యాలేననీ నిర్ధరించడానికి శ్రీ కులబాలదేవుడు మున్నగు వ్యాఖ్యాతలూ, పాదలిప్తాచార్యుడు మొదలు ఆచార్య హేమచంద్రునివరకు గల ప్రాకృతవైయాకరణ నిఘంటుకారులూ ప్రమాణం. ఉచ్చారణసాదృశ్యాన్నీ,

అర్థసామ్యాన్ని బట్టి వీనిలోని తెలుగుశబ్దాలను వింగడించడం మన కర్తవ్యం.

(౧) అత్తా:

ఏత్థ ణిమజ్జఇ అత్తా
ఏత్థ అహం ఏత్థ పరిఅణో సఅలో
పంథిఅ రత్తీఅంధఅ
మామహ సఅణే ణిమజ్జిహిసి.

(౭వ శతకం, గాథ ౬౭.)

(ఆ. ఇచట నే బరుందు, నిచ్చట నత్తగా,
యిచట బరిజనంబుఁ దెలిసికొనుము.
రాత్రి నీవు గానరాదు, నాశయ్యపై
తప్పిపడెద వేమొ! దారికాడ!)*

తన అభిప్రాయాన్ని తెలుసుకున్న తెరువరిని ఉద్దేశించి ఒక జారిణి అన్న మాట ఇది: "ఏత్థ ణిమజ్జఇ అత్తా" (ఇక్కడ అత్తగారు పడుకొంటుంది) అనే పాదంలో 'సాసూ'శబ్దానికి మారుగా 'అత్తా' అనే పదాన్నే కవి ప్రయోగించాడు. 'అత్తా' అనే పదం సప్తశతిలో దాదాపు ౧౨ సార్లు ప్రయుక్తమైంది. ఆ గాథల పాదాలు మాత్రమే ఉదహరిస్తున్నాను. (౧) అత్తా తహ రమణిజ్జం—౧-౮, (౨) గ్రామణి ఘరమ్మి అత్తా—౫-౬౯, (౩) మహమహఇ మలఅవాఓ, అత్తా వారేఇ—౫-౯౭, (౪) అత్తాణ అవాఇ మలఅగంధవహో—౬-౪౨, (౫) అత్తా మత్తా పతీఅఇ అణ్ణత్థో—౬-౪౯, (౬) పంజరసారిం అత్తా—౬-౫౨, (౭) చింతిజ్జంతో మణసల్లవో అత్తా—౭-౫౧, (౮) వాహేణ రుఅవిఅ అత్తా—౭-౬౭ (౯) ఏత్థ ణిమజ్జఇ అత్తా—౭-౬౭, (౧౦) భణిఏ భణామి అత్తా—౭-౭౪. ఈ 'అత్తా' తెలుగు అత్తగారే ననడం స్పష్టం. ఛాయాకారులూ, వ్యాఖ్యాకారులూ దీనికి 'శ్వశ్రూః' అని అర్థం చెప్పడం మన ఊహకు సాధకం. మామభార్యకు మామీ, మామి అనీ, మేనత్తకు పిఉచ్ఛా అనీ వేరు గాథలలో ప్రయోగాలు కనబడుతున్నవి.

తెలుగువారికిమాత్రం మేనత్త అయినా, అత్తగారయినా, మామభార్యఅయినా అత్తే. దీనికి కారణం తెలుగు, కన్నడ దేశాలలో వున్న మేనరికపు సంప్రదాయమే. అత్తాళ్ అంటే తమిళంలో అమ్మ అని అర్థం. మాతృసమాన గనుకనే పిల్లను ఇచ్చిన ఆమెకూడా అత్తాళే. ఇది క్రమంగా అత్త అన్నంతవరకే మిగిలివుంటుంది. అత్తై, అత్త అనికాకుండా అత్తా అని దీర్ఘాంతంగానే గాథలలో వుండడంవల్ల ఈపదాన్ని తెలుగునుంచే ప్రాకృతకవులు గ్రహించివుంటారు.

(౨) వాలుంకి:

సహి ఈరిసిచ్చిఅ గఈ
మారువ్వసు తంసవలిఅముహఅందం
ఏఆణ బాలవాలుం
కి తంతుకుడిలాణ పేమ్మాణం.

(అలఅప్ప ౧-౧౦)

ప్రణయకలహంతో పెడమొగం పెట్టిన నాయికను ప్రణయాభిముఖనుగా చేయడానికి చెలికత్తె ఇలా అంటున్నది: "సఖి, ఎందు కలా పెడమొగంతో కన్నీళ్లు కుక్కుకుంటున్నావు? ప్రేమవాలుంకి పిల్లకాళ్ళవలె దగ్గర వున్నవారిని చుట్టుకుంటుంది. కొంచెం లాగితే వాటివలెనే ముక్కలుముక్కలుగా విరిగిపోతుంది."

ప్రేమ చాలా సుకుమారమని తెలుపడానికి గ్రామీణులకు తరచుగా తెలిసిన పిల్లవాలుంకి తీగకాళ్ళను అలఅకవి (బహుశా ఇతను అల్లయ్య అయివుంటాడు) చక్కగా పోల్చిచెప్పాడు. వాలుంకి శబ్దానికి కర్కటి (ఎండ్రకాయ) అని వ్యాఖ్య. తెలుగులో ఒల్లెంక, వాలుగ అనే రెండు శబ్దాలు మత్స్యభేదాలు తెలిపేవి వున్నవి. ఒల్లెంక=సన్నని కాళ్ళు గలిగి గోళాకారంగా వుండే చేప. దీని మాంసం విషం అని ప్రాచ్య నిఘంటువు తెలుపుతున్నది. శబ్దరత్నాకరంలో కూడా ఈ రెండుశబ్దాలూ వున్నవి. "తెలి వాలుగల డాలు గల సోగకన్నులు" (శుకసప్తతి ఆ. ౧) "వాలుము తాకునట్టి గిరులు వజ్రనిపాతము సంస్మరింపగా వాలుగలై" (పారి. ఆ. ౩.) ఒల్లెంక, వాలుగ రెండూ ఒకటే అయివుంటాయి. ఒల్లెంకే క్రమంగా వాలుగ

---

* రసవంతమైన ఈ గాథలు పాఠకులకు తెలియడం కోసం శ్రీ అనంతకృష్ణశర్మగారి అనువాదం పొందుపరిచాను. ఈ వ్యాసంలోని తెలుగుపద్యాలన్నీ వారివే.

అయివుంటుంది. ప్రాకృతవాలుంకికీ, తెనుగు ఒల్లెంకకూ గల అర్థసామ్యాన్ని బట్టీ, ఒకారోచ్చారణమూ, వాకారోచ్చారణమూ వ్యవహారంలో గల సన్నిహితత్వాన్ని బట్టీ ఒల్లెంకే వాలుంకి అయి ప్రాకృతంలో చేరి వుంటుంది. ఎంద్రకాయమూ, గోళాకారమైన ఈ చేపమూ గల సాదృశ్యంతో, వ్యాఖ్యాతలు ఎంద్రకాయ అని భ్రమపడి వుంటారు.

(౩) పిలుఅ:

తడపంతిఅ తీరేక్కం
తపిలుఅ రక్ఖణేక్క దిణ్ణమణా
అగణిఅ విణివాఅభయా
పూరేణ సమం వహాఇ కాఈ.

(మాణస్స ౨-౨)

(తే. కొమ్మకొనపయి గూటిలో గూర్చుమన్న
తనదు పిల్లల గాపాడు పనియె తలచి
మునిగిపోవుదు నను భీతి గొనక కాకి
వెషలెడిని గంటె చెట్టుపై వెల్లివెంట.)

పిలుకః=శాబకః (పిల్ల) అని కులబాలదేవుని వ్యాఖ్య. సంస్కృతంలో ఈ శబ్దం "పీలతి ప్రతిష్నాతీతి పీలుకః=పిపీలికా, క్రిమిభేదః" అని అర్థాంతరంలో వున్నది. తెనుగులోని పిలుక శబ్దానికి పక్షి లోనగువాని పిల్ల అని అర్థం. పిల్లె, పిళ్ళె, పిన్న మున్నగు తమిళ కర్ణాటకశబ్దాలు పిల్ల, పిలుక అనే తెనుగుపదానికి సమానార్థకాలు. పిలుకశబ్దమే ప్రాకృతంలో చేరి, అక్కడినుంచి గతానుగతికంగా సంస్కృతంలో సూక్ష్మక్రిమి, పిపీలికా అనే అర్థంలో ప్రయుక్తమయింది. ప్రస్తుతం హిందీలో కుక్కపిల్లకు పిల్లా అనే వ్యవహారం కలదు.

(౪) పోట్టం:

పోట్టం భరంతి సఉణా
విమాఉఅ అప్పణో అణువిగ్గా
విహాలుద్ధరణ సహావా
హువంతి జఇ కేవి సప్పురిసా.

(అలక్కస్స ౩-౯౫)

పక్షులుకూడా ఏదో విధంగా పొట్ట పోసుకుంటాయి. దుఃఖాలనుంచి దీనులను గట్టెక్కించే స్వభావం కల సత్పురుషులు కొందరేసుమా! అని ఈ గాథ అర్థం.

పోట్టశబ్దం మరి రెండుచోట్లకూడా ప్రయుక్తమయింది. (౧) ణోక్ఖఏఇ పోట్టంహా పట్టేఇ—౨-౬౧. (౨) పోట్ట పడిఏహి దుఃఖం—౧-౮౩.

"పోట్టం ఉదరం" అని వ్యాఖ్య. దీనిని హేమచంద్రుడు దేశీనామమాలలో ఉదాహరించాడు. సంస్కృతప్రాకృతభాషలలో ఒకారం లేదుగనుక పొట్టశబ్దమే పోట్టగా ప్రాకృతంలో గ్రహించివుంటారు. పొట్టశబ్దం తెనుగు కాదని, పృష్ఠం అనే సంస్కృతశబ్దం నుంచి పుట్టిందని అనడానికి ఎవరూ సాహసించరను కుంటాను.

(౫) కిలించిఅ:

ణ్ణాణ హలిద్దా భరిఅం-
తరాఇ జాలాఇ జాలవలఅస్స
సోహంతి కిలించిఅకం
టఏణ కం కాహిసీ కఅత్థం ?

(ముఅరందస్స ౧-౮౦)

(తే. వసవునీల్లాడి దువ్వెనపండ్లనడుమ
జిక్కుకొనియున్న మైలను జిన్నముల్లు
గ్రుచ్చి తీసెద వెవ్వని కోర్కె పండ
జేయనున్నావు తెల్పవే చిన్నదాన ?)

ఈ గాథలోని కిలించిఅ శబ్దానికీ, పాఠాంతరంగా గ్రహించిన కిలిచ్చిఅ శబ్దానికీ సూక్ష్మం అని వ్యాఖ్యాతల నిర్వచనం. సన్నని, నీచమైన అనే అర్థాలలో క్రించు, కించుశబ్దాలు తెనుగుసాహిత్యంలో లభిస్తున్నవి. "మగటిమిరొ క్రించుపని కిట్టు" (భార. స్త్రీ. ౨-౯౬). తమిళ, కన్నడభాషలలోని కిళి, కిళింజల్, కిళిచ్చల్, కీళ్ శబ్దాలకు సన్నని, సన్నగా చేయు, -చించు అని అర్థం. కిలించిఅ శబ్దానికీ, కిళిచ్చల్, క్రించు, కించు శబ్దాలకూ గల సాదృశ్యాన్ని బట్టి కిలించిఅ తెనుగేనని నిశ్చయించడానికి అవకాశం కలదు. దీనిని గతానుగతికంగా సంస్కృతపండితులూ ప్రయోగించడంవల్ల

త్రికాండశేషకారుడు కిలింజకం, కిలింజం అని సంస్కృతముద్ర వేసి సూక్ష్మదారువు అని వ్యాఖ్య చేశాడు.

(౬) అద్దాఏ:

ఫుట్టం తేణ వి హాలఏ
ణమామి జీవ్వంజ్జఏ జ్జిమ్మి
అద్దాఏ పడిబింబం
వ్వ జమ్మి దుఃఖం ణసంకమఇ.

(రాఅవగ్గస్స ౩-౮)

(ఆ. అద్దమందు నీడ యంటున ట్లెవ్వని
యాత్మ నొరుల వగపు లంటుకొనవొ
యట్టివానితోడ చెట్టు చెప్పుచు నత్త,
మనసు వ్రక్కలైన మాట గాని.)

"అద్దాఏ—ఆదర్శే" అని వ్యాఖ్య. దీనిని హేమచంద్రుడు దేశీనామమాలలో గ్రహించాడు. అద్దునది, ఎదుట ఉన్నదానిని తనలో అద్దుకొను నది గనుక అద్దము. అద్దబు, అద్దవు క్రమంగా అద్దాఓ అయింది. అర్థసామ్యాన్ని బట్టి ఆదర్శశబ్దంనుంచే అద్దాఓ పుట్టిం దనడానికి వీలులేదు. సమీకరణప్రక్రియప్రకారం తర్క్యామి-తక్కేమి, నిర్బంధ-ణిబ్బంధ, మార్గ-మగ్గ, ప్రియదర్శి-పిఅదస్సీ అయినట్లు ఆదర్శ-ఆదస్సో కాగలదు కాని అద్దాఓ కాజాలదు. దీనిని హేమచంద్రుడు దేశీనామమాలలో పఠించడాన్ని బట్టికూడా ఇది తెనుగుపదమే అనడం స్పష్టం. హిందీ, పంజాబీ, బెంగాలీలలో ఆదర్శశబ్దం ఆరసీ అయింది.

(౭) ఘోండీ:

దట్ఠూణ రుందతుండ
గ్గణిగ్గఅం ణిఅసుఅస్స దాఢగ్గం
ఘోండీ విణావి కజ్జే
ణ గామణిఅడే జవే చరఇ.

(విగ్గహస్స ౫-౨)

(ఆ. పెడదమూతిచుదను పెడలిన వాడియా
కోలపంటితోడి కొడుకుజూచి
తల్లిపంది తనకు నొల్లకున్నను మేయు
నూరిప్రక్కతోట నుండు యవలు.)

"ఘోండీ=సూకరీ" అని వ్యాఖ్యానం. దేశీనామమాల దీనిని ఘుండో అని ఉకారాదిగా గ్రహించింది. ఘుండీరో, బుండో అనేవి పర్యాయ శబ్దాలు. ప్రాకృతంలో ఇ ఏ లకు, ఉ ఓ లకు పరస్పర వినిమయం సహజం కనుక ఘోండశబ్దాన్ని గ్రహించి నట్లే. ఇది తెనుగుపందే ననడం నిస్సంశయం. సామాన్య వ్యవహారంలో అకారం ఒకారంగా మారుతుంది. మగడు-మొగడు. "మొగ డొచ్చి పిలచెను, పోయి వచ్చెద సామి." పంది పొంది అయి, తవర్గం టవర్గంగా మారి, పొండి ఉచ్చారణలో ఊదిపలకడానికి చేయ వలసిన ప్రయత్నాన్ని బట్టి ఆదివర్ణం మహాప్రాణంగా పరిణమించి ఘోండి అయివుంటుంది. దీన్ని స్త్రీలింగంగా భావించినందున పుల్లింగ ఘోండ, ఘుండశబ్దాలు కల్పించబడినవి. ఇది అప్పట్టిదైన తెనుగుపదం అనడానికి దేశీనామమాల గ్రహించిన ఘుండీరోశబ్దం పరమ ప్రమాణం. ప్రాచీన తెలుగుపదం పంద్రి. ఇది ప్రస్తుతం తమిళంలో పన్ఱి అయింది. శకటరేఫతో కూడిన నకారాన్ని ఉచ్చరించేటప్పుడు న్ద్రి అవుతుంది; న్డ్రికూడా అవుతుంది. పది రెండు=పంద్రెండు. న్ద్రి ఉచ్చారణ మళయాళంలో మాత్రం నేడు మిగిలింది. పంద్రెండు మళయాళరూపం. తెనుగులో పన్ద్రి పంది అయిందికాని పన్ని కాలేదు. పన్ని నేడు తమిళవ్యవహారంలో వున్నది. మున్ఱు శబ్దానికి మాత్రం ముందు, మున్ను అని కూడా రూపాలు. పన్ద్రి క్రమంగా పందిరి, ఘోండిరి అయింది. పన్ద్రి అన్నప్పుడు చేయవలసిన ఉచ్చారణ ప్రయత్నవిశేషాన్ని బట్టికూడా మొదటి అల్పప్రాణం మహాప్రాణ మైవుంటుంది. ఘోండీతోపాటు ప్రాచీన శబ్దం ఘోండీరోకూడా ప్రాకృతంలో చేరింది.

(౮) పరఅస్స:

ఆరుహఇ జొణ్ణఅం ఖు
జ్జఅం విజంఉఅహ వల్లరీ తఉసీ
ణీలుప్పల పరిమల వా
సిఅస్స పరఅస్సపో ణోసో. (౬-౩౮)

ఉఅ మాణిణీ పరఅం (౬-౫౦)

వయసు దిగజారినా చెలువకల్లు క్రొవ్వి మన్మథ వికారం పొందిన ఒక వనితను చూచి శరద్వర్ణనవ్యాజముతో హేళన చేస్తూ చెప్పిన గాథ యిది.

ప్రక్కన వున్నవాటిని చుట్టుకొనడమే స్వభావంగా గల దోసతీగ శరత్కాలం రాగానే పక్కన రాయివున్నా రప్పవున్నా, చెట్టువున్నా మోడువున్నా అల్లుకుంటుంది. సారాయి తాగి కైపెక్కిన ఈ వయసు జారిన వనితకూడా ప్రక్కన వున్న వానిపై తూలుతుంది. నీలోత్పల పరిమళం గల సరకపు దోసమేసుమా ఇది. సరక అన్నప్పుడు శరత్కాలమూ, చెఱకుసారాయి అని శ్లేష.

సరకశబ్దం శరత్కాలం అనే అర్థంలో తద్భవమే. ఇక్షుమద్యం అనే అర్థంలో వ్యుత్పత్తి లేదు. ఇది తెనుగుచెఱకే కాని మరేమీ కాదు. తమిళకన్నడాలలో చెఱకుకు సమానార్థకంగా కఱుంబు, కబ్బు పదాలు వ్యవహృతాలు. కఱచి తినేదికనుక కఱుంబు, కబ్బు, చెఱకు అయివుంటుంది. తర్వాత చెఱకునుంచి పుట్టిన మద్యానికి లాక్షణికంగా వ్యవహారం కలిగివుంటుంది. ("ప్రాప్తాయాం నిశి సప్రచ్ఛ నిజం పరిజనం చ సః, కిమద్య రాత్రిపర్యాప్తమస్తి న స్సరకం నవా?" కథాసరిత్సాగరం, ౫౪-౯౯) సరకశబ్దాన్ని క్రమంగా మధుపానానికీ, మధుపాత్రకూకూడా వ్యవహరించారు. తర్వాతి సంస్కృతకోశకారులు దీనిని గ్రంథస్థం చేశారు. "సరకో౽స్త్రీ శీధుపానే శీధుపాత్రే శీధుని౹"—మేదినీ. "కఱకంచు సేయవిల్లగు చెఱకుం జెఱకైన వంటచెఱకుం జెఱకే" (ఉత్తరహరివంశం, ఆ.౬.) అని ప్రాచీనప్రయోగాలలో ఎకారాదిగానే చెఱకుశబ్దం ఉన్నా, దీని ప్రాచీనరూపం అకారాదిగా చఱకు అనే వుంటుంది. కఱుంబు, కబ్బు అని తమిళ కర్ణాటకభాషలలో రూపాలు వుండడం ఈ ఊహకు సాధకం. గడ్డ-గెడ్డ, గంటు-గెంటు వలెనే చఱకుకూడా చెఱకు అయివుంటుంది.

(౯) తుప్పు:

తుప్పాణణా ! దో చి
టస్సిత్తి పడిపుచ్ఛి అఏ బహుత్తఏ
విఉణా కేట్ఠిఅ జహా
తేలాఢ లజ్జోణఅం హసిఅం.

(అలక్కస్స ౩-౭౯)

వణ్ణఘిఅ తుప్పముహిఏ (శంగవిఅరస్స ౧-౨౨.)

తుప్పశబ్దవిచారానికి ముందు పై గాథఅర్థాన్ని కొంత వివరిస్తాను: "ముఖానికి నెయ్యి పూసికొని ఎందుకు నిలుచుకున్నావు" అని అడుగగా, కోడలు సిగ్గుపడి చీరను మరొకమారు ఒంటిచుట్టూ చుట్టుకుని నవ్వింది. చెరగుమాసిందని భావము. ఆకాలంలో రజస్వలలు గుర్తుగా మొగానికి పస్పుకలిపిన నేయి పూసికొనడం దేశాచారమని ౧-౨౨ వ గాథా వ్యాఖ్యానంలో వివరించబడింది. ఈ ఆచారం నేటికీ కర్ణాటకదేశంలోను, రాయలసీమలో కొన్ని ప్రాంతాల లోను లాంఛనప్రాయంగా వున్నది. ప్రథమరజస్వలకు ౧౬ నాళ్ళ (పదునాఱు)దాకా నూనెపసపు కాని, నేయిపసపు కాని రాయడం కలదు. రక్తదోషం కలుగకుండా ప్రథమరజస్వలఆరోగ్యాన్ని రక్షించడంకోసం జరిపే వైద్యశాస్త్రప్రక్రియ అట ఇది. రజోగంధం నుంచి విషక్రిములు ఆకర్షింపబడకుండా తొలగిపోవడంకూడా ఈ పసపునేయిపూతఉద్దేశమట. ౨౦౦౦ ఏండ్లనాటి ఈ ఆచారం లాంఛనప్రాయంగామాత్రమే నేడు నిలిచింది.

పైన ఉదహరించిన రెండవ గాథ చరణంలోని 'వణ్ణఘిఅ తుప్ప'శబ్దానికి 'హరిద్రాదివర్ణప్రధానం ఘృతం' అని వ్యాఖ్యానం.

ఈ గాథలలో ప్రయోగించిన తుప్పశబ్దం నెయ్యికి ప్రాచీనపర్యాయపదం. నన్నయకాలానికే వ్యవహారచ్యుతమైనది. తుఱుపు-అవు-నుంచి వచ్చింది గనుక తుఱుప్పు-త్రుప్పు-తుప్పు-తుప్ప అయింది. అవు నేయి అన్న మాట. తుఱుపుశబ్దం రాష్ట్రకూటధ్రువ రాజశాసనం (క్రీ. శ. ౭౮౦) లో ప్రయోగింపబడింది. తమిళంలో ఆలమందకు తొఱువు అనే ప్రయోగం వుండనీ, పై ధ్రువరాజశాసనంలోని తుఱుపుశబ్దానికీ, తొఱువుకూ మూలరూపం తొఱు అయివుంటుందనీ ఎపిగ్రాఫియా ఇండికాలో చర్చించబడింది. తొఱ్ఱుపట్టు=గోష్ఠము. "ఘనభుజుండు నరుడు దన తొఱ్ఱుపట్టుల విశ్రమించి"—(భారతం, ఆది. ౮-౨౧౦.) "బుధవ్యక్తంబుగ దొఱ్ఱుపట్ల విశ్రమించుచు"- (భారతం, అరణ్య. ౩-౧౧౮). తొఱ్ఱులు=ధేనువులు. "తొఱ్ఱులు గాచిన నందుని"-(భాగవతం, ౧౦ పూర్వ.

౬-౩౩). త్రువ్వ, ఎద్దు, ఆవు. "త్రువ్వట బాబా, తలపై పువ్వట." తువ్వాయి దూడకు వ్యవహారం. త్రువ్వ, తులువులకు సంబంధించిన వస్తువులన్నీ కూడా లాక్షణికంగా తులువు అయివుంటుంది. తులువు తుప్పు అయిన క్రమాన్ని మొదటే నిరూపించాను. "తుప్పో స్నిగ్ధః" అని హేమచంద్రుడు దేశీనామమాలలో పఠించాడు. ౬.

తులువు ప్రయోగాన్ని శ్రీ నిడదవోలు వేంకటరావుగారు నాకు తెలిపారు. ఇంతేకాక ఈ వ్యాసంలో ఉదాహరించిన వేంటు, పాణిసి, చిప్పర, పెచ్చారికసం -వీనికి ప్రాచీన తెలుగు ప్రయోగాలు కూడా వారు తెలిపినవే. వారి వాత్సల్యానికి నేను శాశ్వతంగా ఋణిని.

(౧౦) ఫలహీ:

ఫలహీ వాహణపుణ్ణా
హామంగలం లంగలే కుణంతీ ఏ
అసతీఅ మణోరహా గ
ర్భిణీఅ హత్థా థరథరంతి.

(కపిలస్స ౨-౬౫)

(ఆ. ప్రత్తిచేను దున్నవలసి మంచిదినాన
మడకపూజ చేయకొడగినపుడు
కోర్కె లాక్క గుబులుకొన గడగడమని
వడకదొడగె గావు చెడిపె కేలు.)

ఫలహీశబ్దం మరి మూడు చోట్లకూడా ప్రయుక్తమైంది. (౧) ఫలహీ వెంటేసు ఉఅహ బహుఅవి —౪-౫౯ (౨) హాసిఅంత ఫలహీఏ—౪-౬౦, (౩) ఫలిహం అమోడిఅం మహిళవీణ—౬-౪౯. "ఫలహీ = కార్పాసవృక్షః" అని దేశీవ్యవహారమని కులబాలదేవుని వ్యాఖ్య. పలహీ అని హేమచంద్రుడు దేశీనామమాలలో పఠించి వలహీ, వవణీ అని పర్యాయపదాలు పేర్కొన్నాడు. తెలుగు ప్రత్తే ఫలహీ గా మారింది. ప్రత్తికి ఆదిరూపమైన పలుత్తి పలుత్థి అయి అంత్య ద్విత్వాక్షరాన్ని ఊదిపలుకడంవల్ల క్రమంగా పలుత్థీ-పలహీ అయివుంటుంది. పత్త్రికాశబ్దంనుంచి పత్తి అయివుంటుందని, ప్రపతత్త్రికాశబ్దంనుంచి ప్రత్తి పుట్టివుంటుం దనీ అనేవాదం సహేతుకం కాదు. పత్రికా నుంచి పత్తియ-పత్తి కావడానికి వీలున్నా అర్థంకోసం లాక్షణికంగా నానాబాధలు పడవలసివుంటుంది. ప్రపతత్త్రికాశబ్దంనుంచి ప్రత్తి అనే రూపం అసలే కాదు. తెలుగుసంప్రదాయానికి ఉపసర్గవిధానమే విరుద్ధం. 'పత్రికా' నుంచి 'పత్తిఅ' కావచ్చునుకాని 'ఫలహీ' ని ఏవిధంగానూ సాధించలేము. ఛిద్రవాచక ఛిల్ల, ఉచ్ఛిల్ల శబ్దాలు రెండూ వేర్వేరనీ, ఉచ్ఛిల్లశబ్దం ఉత్పూర్వక ఛిల్లశబ్దం కాదనీ, దేశీశబ్దాలకు ఉపస సంబంధం వుండదనీ హేమచంద్రుడు దేశీనామమాల ప్రథమసర్గ ౯౫ శ్లోకవ్యాఖ్యలో వివరించాడు. ("నహి దేశీశబ్దానాం ఉపసర్గసంబంధో భవతి.")

(౧౧) వేంట:

అజ్జం మోహణ సుహిఅం
మురత్తి మోత్తూ పలాఇఏ హలిఏ
దరఫుడిఅ వేంటభారో
ణఅఇ హసిఅంఅ ఫలహీ ఏ.

(జణ్ణందపారస్స ౪-౬౦)

(ఆ. చొక్కి కనులుమూయు సుదతి జప్పె నటంచు
విడిచి పాఱు కాపువడను జూచి
ప్రత్తికొమ్మ సగము పగిలిన కాయల
మొగము వంచి చేల నగియెంబోలె.)

మరి రెండుచోట్లకూడా వేంటశబ్దం ప్రయుక్తం.

(౧) ఫలహీ వేంటేసు ఉఅహ వహుఅవి—౪-౫౯, (౨) తాలవేంటజాఅం—౪-౯౨.

"వేంటో కార్పాసఫలం" అని దేశీవ్యవహారమున్నట్టు కులబాలదేవుని వ్యాఖ్య. ప్రత్తివిత్తు, ప్రత్తివెంట్లు అన్నమాట. ఉరుల్ ధాతుమూలంగా గల ఉరుండై, ఉండ, ఉంట క్రమంగా వెంటు, వెంటి అయింది. గడ్డివెంటు=గడ్డిచుట్ట. ప్రత్తివెంటు=ప్రత్తిచుట్ట. ప్రత్తివుండ-ప్రత్తికాయ. "కచ్చడం బాదిగా గల చీరలెల్ల, చెచ్చెర వెంట్లుగా జేసి మట్టించి" (బసవపురాణం, దీపకళియార్ కథ, పేజీ ౬౫), "కోకలు వెంట్లుగా చెవచి" (శివధర్మాలు ౬. ౧) ఉండ, ఉంట, వెంటి అని క్రమపరిణామం స్పష్టంగా గోచరిస్తుండగా వర్తుల, వృత్తశబ్దాలనుంచి వ్యుత్పత్తి

సాధించవలసిన అవసరం ఏమిటి? ప్రాకృతం ద్వారా వెళ్లిన తెనుగువెంటుశబ్దాన్ని వంటః=ఖండః, భాగః అని సంస్కృతీకరించి పండితులు గ్రహించారు.

ఉంటశబ్దం ఓంటుగాకూడా మారింది. ఓంట్లు = పోగులు. 'పచ్చరాయొంటువాని'-ప్రయోగం. తాల వేంటు యుగం=తాళపత్రతాటంకం అని వ్యాఖ్య. చెవాకు అన్నమాట. చుట్టు అనే అర్థం కల ఓంటుశబ్దం వేంటరూపంతో తాలపత్రంతోపాటు చెవిఎక్కి తాళాన్ని తోసివేసి పోగు, కుండలం అయికూచుంది.

(౧౨) రుంప-రంప:

ఉక్ఖిప్పఇమండలి మా
రుఏణ గేహంగణాహి వాహీఏ
సోహగ్గధఅవడా అ
వ్వ ఉఅహ ధణురుంపరింఛోలీ.
(హాలస్స ౨-౨౦)

(ఆ. చెంచుమగువ ఇంటిచెంగటం జెక్కిన
మగని పెద్దవింట దెగిన చిలుగు
పొట్టు మింటి కెగిరిపోయెడు సుడిగాలి
దాని భాగ్యగుణపతాక యనగ.)

మరొక ప్రయోగం:

సోహగ్గం ధణురుంప
చ్ఛలేణ రచ్ఛాసు విక్కిరఇ. (హాలస్స ౨-౧౯)

రుంపశబ్దానికి రంప అని పాఠాంతరం. రుంప, రంప=తక్షత్వక్ (చెక్కిన పొట్టు) అని వ్యాఖ్యాత వివరిస్తున్నాడు. అంపవు పొట్టు అని అర్థం. అంపము పాత తెనుగుఆయుధాలలో ఒకటి. రంపె=తోలు తోసెడి సాధనము (శబ్దం). రంపఇ=తక్ష్ణోతి (చెక్కుతున్నాడు) అని ధాత్వాదేశంగా విధించినట్టు హేమచంద్రుడు దేశీనామమాలలో పేర్కొన్నాడు. అంపు=తాయిడి పెట్టు, అంపులాడు=ఎప్పుడూ పీకులాడే వాడు. అంపుధాతువు మొదట చెక్కడానికికూడా ప్రయోగింపబడేదేమో! తర్వాత కోయడానికి వ్యవహరింపబడివుంటుంది. ఆచార్య హేమచంద్రుని మాటలను బట్టి ఇది దేశీ. మనకు తెనుగు.

(౧౩) సిప్పర:

ఖరసిప్పర ఉల్లిహిఆఇం—
(పసణ్ణస్స ౪-౩౦)

సిప్పరఉల్లిహిఆఇం=పలాలోల్లిఖితాని (గడ్డితో తుడిచివేస్తున్న) అని వ్యాఖ్య. సిప్పరశబ్దం తృణవాచకంగా దేశీనామమాలలో పఠితం. "పచ్చని కంబలి గవిసి కొన్న విధమున బొలుపుగ చిప్పరలు గవిసె ధూతల మెల్లన". (నన్నెకుమార. ౬-౭౫౪.) చిప్పర=సన్నని గడ్డి. చిర్+ఫల్ క్రమంగా చిర్ఫల్-చిప్పర అయింది. ప్రాకృతంలో తృణసామాన్యవాచిగా గ్రహించబడింది. తెనుగులో క్రమంగా పెద్దదై ప్రస్తుతం చీపురై మారలబడింది.

(౧౪) తాలూర:

తాలూరభమాఉల ఖుడి
అకేసరో గిరిణఈఏ పూరేణ
(అవటంకస్స ౧-౩౪)

(తే. కొండసెలయేటి సుడికి జిక్కికొని కలగి
తిరుగుచును గేసరంబులు విఱిగిపోవ
కొంత మునుగుచు దేలుచు గొదమతేటి
వెంటనంట గడిమిపూవు వెల్లబోయె)

తాలూరో=జలావర్త ఇతి దేశీ అని వ్యాఖ్య. తలయతి తలం దర్శయతీతి తాలూరః-అని శబ్దకల్పద్రుమ వ్యుత్పత్తి. తాలూరశబ్దం దేశీ అని వ్యాఖ్యాత అంటున్నాడు. దేశీనామమాల ఫేనపరంగాను, ఆవర్తపరంగాను ఈ శబ్దాన్ని గ్రహించింది. ఇది తెనుగుశబ్దమనడానికి చాలా ఉపపత్తి కలదు. తిర్, త్రిప్పు, తిరుగు, తలారు అనునవి తెనుగులో భ్రమివాచకాలు. తలారు శబ్దానికి మరలు, తిరుగు అని అర్థము. తలారుకూ, తాలూరకూ సంబంధం వున్నట్టు తోస్తున్నది. తాలు శబ్దానికి తిరుగు, తాలించు, తాలబోయు అనే అర్థాలు కలవు. "క్రేపులం దలచి తలారింపక" (భాగవతం, స్కం. ౧౦.) తలారే తాలూరశబ్దానికి మూలం అయివుంటుంది.

(౧౫) మడహసరిఆ

ఓహిఅఅ మడహసరిఆ
జలరఅహీరంత దీహదారువ్వ

తాణేతాణే వ్విఅ ల
గ్గమాణ కేణావి ణజ్ఝిహసి. (మహాదేవస్స ౨-౫)
(ఆ. చిన్న వాగునడికి జిక్కి కొట్టుకపోవు
పాడుగుకట్టెవోలె నడుమ నడుమ
దగులుకొనెదు మనస, తప్పక యెవ్వరో
కడకు నిన్ను బట్టి కాల్చివైచు.)

"మడహాశబ్ద స్స్వల్పవాచకః" అని వ్యాఖ్య. దేశీశబ్దమాలలోను, సంస్కృతనిఘంటువులలోను ఇది లభించడంలేదు. అడఁగు, మడఁగు, అణఁగు, మణఁగు శబ్దాలకు "తగ్గియుండు" అని అర్థము. మడుము=నిలిచిపోవుట, మడకు=నక్కుట అని బ్రౌణ్యనిఘంటువు. "అప్పుడు తొలఁగి యొయ్యన నడఁగిడుచు మడకుచు దీపముల్ మరుగుపెట్టుచును"—బ్రౌణ్ ఉదాహరణ. మడకుచు అనగా మెల్లిగా వెళ్ళుచు అనిఅర్థం. మడహసరిఅ=మెల్లిగా ప్రవహించే నది. మడవ అన్నమాట. నీళ్ళు తగ్గిఉన్నప్పుడే నదీప్రవాహవేగం మందగించి వుంటుంది. మడ=ప్రవాహ మార్గము (కాలువ) (శబ్ద రత్నా.) "మడలు దరులు వాఁకలును గ్రమంబుగ నొకడుగ్" (హరివంశం, పూ. ఆ. ౭.) "మడల తీరంబుల మడుగుల మేటి, పడియల" (వరనాథ చరిత్ర భా. ౩.) మడకు, లేక మడుగువల్ల పుట్టిన మడవశబ్దమే మడహా అయింది.

(౧౬) ఓ:

ఓ హిఅఅ ఓహిడిఅహం (౫-౩౪)
ఓ హిఅఅ మడహసరిఅ (౨-౫)

ఓ హిఅఅ అన్నప్పుడు హే అనే సంబోధన ప్రథమావిభక్తి మారుగా ఓ అనే తెనుగువిభక్తి ప్రత్యయం ప్రయుక్తమైంది. ఓ, ఓయి అనేవి ప్రాచీన తెనుగుసంబోధనప్రథమావిభక్తిప్రత్యయాలు. నన్నయభట్టారకుడు సంస్కృతాభిమానముకొద్ది తెనుగుసంబోధన ప్రత్యయాలను వాడక సంస్కృతసంబోధనప్రత్యయాలనే వాడినాడు. నన్నయ ఆంధ్రశబ్దచింతామణిని మొదట సూత్రించి దానికి లక్ష్యంగా భారతాన్ని రచించాడని వాదిస్తున్న పెద్దలు "ఓ ఇ త్యామంత్రణే ను విక్రుతా స్యాత్" అనే సూత్రానికి నన్నయభారతంలో లక్ష్యం లేనందుకు కారణం చెప్పవలసివుంది.

(౧౭) వోడసుణఓ:

వోడసుణఓ విఅణ్ణో
అత్తామత్తా పఈవి అణ్ణత్థ
ఫలిహం వ మోడిఅం మహి
సవిణ కోతస్స సాహేఉ. (౬-౪౯)
(ఆ. అత్త పడిన దింట మత్తెక్కి, పతి పొరు
గూరి కేగ, కుక్క దోరిపోయె,
ప్రత్తిచేను విఱుగబడ మేసె వెనుబోతు
దీని వతని కెవరు దెలుపువారు!)

"వోడో దుష్టః, ఛిన్నకర్ణో వా" అని వ్యాఖ్య. ఛిన్నకర్ణ మనగా అవిటు అని మనం గ్రహిస్తే గాథలోని అర్థం మరింత రసవంతంగా వుండగలదు. "మొదలే అవిటు కుక్క, అదికూడా ఇప్పుడు జబ్బు పడ్డది." అని సంగతంగా వుంటుంది. ఓడు, ఓట=చీటలువారినది. "ఉద్దవిడిని కేల నోడుగా వైచి"—(ప్రభులింగలీల, ౨-౪౭.) ఓటికుండ, ఓటినోరు అని వ్యవహారం. ఏవిధంగా చూచినా ఇది అవిటో, ఓడో—తెనుగుపదమే.

(౧౮) పాఉలీ:

సుఅణువఅణం ఛిఅంతం
సూరంమా పాఉలీఅ వారేఇ. (సీలస్స ౩-౬౯)
(ఆ. తరుణి, నీమొగంబు దాకెడు సూర్యుని
జెఱగుపెట్టి యడ్డుసేయవలదు.)
వాఉవ్వేలిఅపాఉలి—(౪-౫)

పాకలీ అని పాఠాంతరంకూడా. "పాకలీ=వస్త్రాంచలవాచకో దేశీ" అని వ్యాఖ్యానము. "పాఉలీ=పల్లవికా" అని కులబాలదేవుని టీక. పాహలీ శబ్దాన్ని వస్త్రపర్యాయంగా దేశీనామమాల గ్రహించింది. చెఱగు=కప్పుకొనే వస్త్రము అని అర్థము. తెనుగు పాలువే వర్ణవ్యత్యయంతో పాఉలీ అయింది. "పాపగ గతివన్నె పాలువ ముసుగుపెట్టి" అని పాలువకు ఉదాహరణం. (శశాంక. ఆ. ౪.)

(౧౯) మఇల:

(౧) గిహ్మేదవగ్గి మసిమఇలాఇఁ (౧-౪౦)
(౨) మదమఇలీకఅకరంబసాహేహిం (౨-౨౧)

(౩) దీఅఓిర్వ అఇరేణ మఇలేణ (౨-౩౫)
(౪) ప ఇర్వ్వఏ ణ తుహ మఇలే అంగో త్తం (౫-౧౭)
(౫) ధూమ మఇలో వి పంకంకిలో వి (౬-౨౬)
(౬) పంక మఇలేణ ఛీరేక్క పాఇణా (౬-౬౭)
(౭) ణి వడంత బాహా మఇలేణ (౧-౩౪)

మఇల=మలిన అని వ్యాఖ్య. ఇది సంస్కృత మలినశబ్దంతో అన్నిటా సదృశంగా కనిపిస్తున్నా స్వతంత్రశబ్దం. మకిల, మంకు, మంగు, మణుకు మున్నగునవి మఇలకు సమానార్థకమైన పదాలు. "మకిలకా భావముఁబాప"—వర్ణాదివారి ప్రయోగం. మఇల జాత్తి = రజస్వలా, మఇలో = గతతేజాః అని హేమచంద్రుడు దేశీనామమాలలో గ్రహించడంవల్ల దీనిని మనం తెనుగుగానే గ్రహించాము.

(౨౦) పాణఉడీ:

పాణఉడీ అవి జలిఊణ. (హాలస్స ౩-౨౭)

"పాణఉడీ=చండాలకుటీ" అని వ్యాఖ్య. "పాణో శ్వపచః" అని దేశీనామమాల. పాణశబ్దం పాలసు, (హోలసు!) నుంచి జనించినది. మధ్యలకారం నకారంగా మారి పానసు, పాణసు, పాణసి అయింది. "పాణసి పువ్వుబోడులము" (హరిశ్చంద్ర. ఆ.౨). "పాణసి వారము" (శివరాత్రి ౩-౫౮) అని ప్రాచీనప్రయోగాలు. అంత్య సకారం క్రమంగా భ్రష్టమై పాణమాత్రం మిగిలింది.

(౨౧) తీరఏ:
కేలీఅ విరూసేఉం
ణ తీరఏ తమ్మి చుక్కవిణఅమ్మి
జాఇఅఏహి వ మాఏ
ఇమేహిఁ అవసేహిఁ అంగేహిం.
(పావచీఖలస్స ౨-౭౫)

(ఆ. ఎరవుతెచ్చుకొన్న తెఱఁగున వసము గా
కుండ జెడిన యిట్టి యొడలు గలిగి
అమ్మ! తప్పు లెన్ని యతడు చేసిన నెట్టు
లలుగఁజేతు నవ్వులాటకైన?)

ఉస్ససిఉంపి ణతీరఇ
కింఉణ గంతుం హాఅధగేహిం.
(కఇరాఅస్స ౩-౫౮)

ఈ పాడు స్తనాలతో ఊపిరిపీలువడానికే తీరదు. ఇక వెళ్ళడంకూడానా ?

అణ్ణహా ణతీరఇ (౪-౪౯)

"ణతీరఏ=నశక్యతే" అని వ్యాఖ్య. తీఱదు అని అర్థం. రూపాన్నిబట్టీ, అర్థాన్నిబట్టీ ఇది తెనుగు పదమే. "ఇరుద్యోడ దడవుగా నిలువఁదీఱదు" (భారతం ఉద్యోగ. ౧-౪౨.)

(౨౨) కుసుంభ :

కుసుంభశబ్దాన్ని పుష్పవాచకంగానూ, వర్ణవాచకంగానూ, వృక్షవాచకంగానూ పలుగాథలలో ప్రయోగించారు. కోసంభకిసలఅవణ్ణఅ (౧-౧౯), లగ్గం కుసుంభపుప్పంత్తి (౨-౪౫), కుసుంభకుస్వాప్పసాఏణ (౪-౯౨). కుసుమపెట్టిన వస్త్రం అనే అర్థంలో మఅగేకుసుంభరంజిఅ కంచుఅహరణ (౬-౪౫.)

కుః పృథివీ శోభత ఇతి కుసుంభః అని సంస్కృతపండితులు చెప్పే వ్యుత్పత్తి (భూమికి అందమైన పూలు గల ఏ చెట్టయినా అలంకారంగానే వుంటుందిగనుక) సమంజసంగా కనిపించదు. "కటుర్విపాకే కటుకః కఫఘ్నో, విదాహిభావా దహితః కుసుంభః" అని సుశ్రుతుడు తన గ్రంథరాజంలో పేర్కొన్నాడు. కుసుమ అని కూడా రాయలసీమ వ్యవహారం. ఇది తెలంగాణా, రాయలసీమ, కర్ణాటక ప్రాంతాలలో ఎక్కువగా పండే నూనెగింజలు. తక్కిన ప్రాంతాలలో లేని పంట. కుసుబి, కుసుబె, కుసుంబె అని కన్నడవ్యవహారము. కుసుకు, కుసు అనగా సన్నని ముళ్ళుగా కోసగా వున్న అని అర్థం. కుసుమలు మొనతేలివున్నందున దీనికి కుసుకు, కుసుమ, అని వ్యవహారం కలిగివుంటుంది. కుసుంబుశబ్దాన్ని సంస్కృతీకరించి పండితులు కుసుంభ అన్నారు. "పసిడి కమ్మలతోడి కుసుమపూవన్నియ నిద్దంపు బుట్టంబు నెఱయఁగట్టి" (కాశీ ౭-౨) అని ప్రయోగం.

(౨౩) ణడిజ్జఇ:

ణఅరఅసిఓ ణడిజ్జఇ (౧-౭౭)

"ఖేద్యతే ఇత్యర్థే ణడిజ్జఇ ఇతి దేశీ" అని వ్యాఖ్య. కష్టపడుతాడు అని అర్థం. నడిజ్జఇ అని పాఠాంతరం. "ణడిఓ వంచితః, ఖేదిత ఇత్యన్యే" అని దేశీనామమాల. ఇది నలి ధాతు, నలచు కర్మణి రూపమే. చెవఇ (చెప్పుతున్నాడు), చజ్జఇ (చూస్తున్నాడు) మున్నగు ధాతువులు ప్రాకృతంలో చేరాయిగనుక నలి ధాతువు చేరడంలో ఆశ్చర్యం లేదు.

(౨౪) పక్కల:

పక్కలో త్తి చోరజాఅ (౨-౧౮)

"పక్కలో ప్రవీణో యువా. పక్కలశబ్దో దర్పవతి యూని వర్తతే" అని కులబాలదేవుడు అంటున్నాడు. "పక్కో దృప్తః, సమర్థశ్చ" అని దేశీనామమాల. తెనుగులో మెుక్కలుడు, మెుక్కలి, మెుక్కడు అనే పదాలు మున్కరుడు, పీరుడు అనే అర్థంలో వున్నవి. పక్కలకు, మెుక్కలకు మూల రూపం మరొకటి వుంటుంది. లేదా మొదట మక్కల శబ్దమే మకారం 'మెు' కాగా మెుక్కల అయివుంటుంది.

(౨౫) చటుఅం:

తం చటుఅంఅ కరంకం (౨-౬౨)

"చటుఅం భిక్షాదానపాత్రం. దర్వీతి యావత్" అని వ్యాఖ్య. "చట్టు దారుహస్తః" అని దేశీనామమాల. చట్టువశబ్దము గరిటె, తెడ్డు అనే అర్థంలో తెనుగు తమిళాలలో వున్నది. "ప్రక్షాళితంబైన పసిడిచట్టువమున నన్నంబు నునిచి నియ్యభిఘారించి" (కాశీ. ౭-౧౪౭) "చట్టువం బొక చేత బట్టి ఖడ్గము సంక దగిలించి" (భార. విరాట. ౧-౨౧౧). గాథలోని అర్థాన్ని బట్టి చట్టి అనడం బాగుంటుందేమో! చట్టి నోరు వెడల్పుగా నున్న చిన్న పాత్ర. చిన్న మట్టి, కంచుపాత్రలకు కన్నడంలో చటుకి అని వ్యవహారం. చటుఅం అన డానికి 'తట్ట' అని శ్రీ అనంతకృష్ణశర్మగారు ఆంధ్రీకరించారు. వెడల్పుగా వుండే పాత్ర తట్ట. ఇక్కడ ఇదికూడా బాగుంది. బిచ్చం గరిటెతో వడ్డించే ఆచారం రాయలసీమ, కర్ణాటకప్రాంతాలలో లేదు. అన్నాన్ని మూతి చిన్నగా వుండే కుండలోనో, బానలోనో వండి, మూతి వెడల్పుగా వుండే తట్టలోనో, చట్టిలోనో తోడుతారు. బిచ్చం అడిగితే, చేయి పెట్టి తీసుకొని వేసే పాత్రలో పెట్టుకొని వేస్తారు. లేదా చేత్తోనే ఓ అన్నపుగడ్డ పట్టుకొని వచ్చి వేస్తారు. గరిటెతో బిచ్చం వడ్డించే ఆచారం నాకు తెలీదు. చట్టు రాతితో చేసిన పాత్ర. క్రమంగా మట్టిపాత్రకు కూడా వ్యవహృతమయింది. 'చటుఅం' ను నేను చట్టిగానే గ్రహిస్తున్నాను.

(౨౬) డోరో:

అణుహవఇ కణఅడోరో (౩-౧౧)

కణఅడోరో=కనకసూత్రం. డోరో, దారో కటిసూత్ర మని దేశీనామమాలలో గ్రహించడం గమనించ వలసిన సంగతి. డోరా, డోరా, ధారా అని హిందూస్తానీభాషలలో వ్యవహారం కలదు. దారం, తోరము తెనుగు పదాలు. దోరో తెనుగుశబ్దంలాగానే కని పిస్తున్నది.

(౨౭) లావణ్ణ ఉడే:

లావణ్ణఉడే అణంగగఅకుంభే (౩-౬౦)

లావణ్ణఉతే అని పాఠాంతరం. లావణ్యకుటే అని వ్యాఖ్య. పయోధరాలు లావణ్యకుంభాలు అని ప్రస్తుతవిషయం. ఉడే శబ్దానికి ఉతే అని ఉన్న పాఠాంతరం ఉళ్, లోపల అనే శబ్దానికి ప్రతి రూపమా అని సందేహం. లావణ్యానికి ఉళ్, వీడు, ఆశ్రయం అని పర్యవసితార్థము. లావణ్యకుటే అనే వ్యాఖ్యానంకంటె ఇది సమంజసంగా వుంటుంది. వత్థ ఉడో అనే శబ్దాన్ని "వస్త్రాశ్రయః, వస్త్రనిర్మిత ఆశ్రయ ఇత్యర్థః" అని దేశీనామమాలలో హేమ చంద్రుడు వివరించాడు. వత్థఉడో=వస్త్రకుటః అనడం పొసగదు. ఉళ్ శబ్దమే ఉడో, ఉలోగా మారిందనే ఊహకు పైవాదం సాధకం. 'వీడు' పర్యాయమైన 'ఉళ్లుశబ్దం' ప్రస్తుతం వ్యావహారికతమిళంలో వున్నది. తెనుగులో ఉళ్ 'లో' కాగా ఇల్లు, వీడు మున్నగువవి మాత్రమే మిగిలిపోయివుంటాయి.

(౨౮) అవ్వో!

'అవ్వో!' పదం దుఃఖాశ్చర్యసంభ్రమాలలో పలు చోట్ల ఉదాహృతం. అవ్వో దుక్కర ఆరఅ— (౩-౭౩) ఇక్కడ సంభ్రమాశ్చర్యాలు. అవ్వో అణుణఅ సుహసంఖిరీఅ—(౪-౬) ఇక్కడ కష్టం. ఉమ్ములు అఇ అవ్వో— (౫-౭౫) ఇక్కడ దుఃఖం. అవ్వో సోచ్ఛే అఘణో—(౬-౩౫) ఇక్కడ దుఃఖాశ్చర్యాలు. అవ్వో కింపి రహస్సం—(౬-౯౦) ఇక్కడ ఆశ్చర్యం. దుఃఖాశ్చర్య సంభ్రమాలను తెనుగువారు అమ్మో, అవ్వో, అమ్మయ్యో అనే శబ్దాలతో ప్రకటిస్తారు. అవ్వ అమ్మకు ప్రాచీనరూపం; భారతాదులలో ప్రయుక్తం. ప్రస్తుతం కన్నడంలోను, తెలంగాణాలోను వ్యవహృతం.

(౨౯) భిసణేమి:

భిసణేమి త్తిపిఅఅమం (౫-౧౨)

భసిణేమి, భసణేమి అని పాఠాంతరాలు. విచ్ఛరామి అని వ్యాఖ్య. విసరి వేస్తాను. "భిసణేమి ఇతి విచ్ఛరణే దేశీ" అని వ్యాఖ్యాతవివరణ. విసరు అనే ధాతువు ప్రాకృతదేవ మిది. విసరు-విసరు-విసణ-భిసణ అయి వుంటుంది. వీస్, బీస్ అని తమిళ కన్నడరూపాలు.

(౩౦) పుప్ఫుల:

పుప్ఫులసుఅంధేణ (౪-౩౯)

"పుప్ఫుల=కరీషాగ్ని దేశీ" అని వ్యాఖ్య. పిడకల నిప్పు. "పప్ఫోడో అగ్నిభేదః" అని దేశీనామమాల. పిడక + నిప్పుశబ్దాలు రెంటినీ కలిపి ఉచ్చరించేటప్పుడు కలిగిన వేగంవలన పిప్పుక అయి, మధ్య పువర్ణ సామ్యంవల్ల ప్రథమపివర్ణం పువర్ణంగా మారి పుప్ఫుల అయి వుంటుందని ఊహిస్తున్నాను. ఈ గాథ వ్రాసినవాడు అణ్ణఅ. ఇతను తెలుగువాడుగా కనిపిస్తున్నాడు. పిడకల నిప్పు అనే తెనుగుశబ్దాలనే గ్రహించివుండవచ్చును పిడకశబ్దానికి పిడుచు మూలం. పుప్ఫుల శబ్దానికి ఇంత కన్న మంచి వ్యుత్పత్తి చూపితే ఆమోదించడం నిస్సంశయం. ఫూఫూ అని ఊదడంవల్ల అనుకరణశబ్దంవల్లకూడా యిది పుట్టిన దనవచ్చు.

(౩౧) దే!

హిఅఅ దే విరమ ఎత్తాహే (౪-౪౫)
దే పహరసు వరాఈం (౫-౫౬)
దే సుఅణు పసిఅ ఏణ్హిం (౫-౬౬)

"దే శబ్దస్సంబోధనే" అని వ్యాఖ్య. దే హిఅఅ=ఓ హృదయమా! ఎదుటివారి దృష్టి మరల్పడం కోసం "ఇదిగో చూడండి! ఇదో చూడండి!" అని మనం సంబోధిస్తుంటాము. వచ్చుధాతువు లోణ్మధ్యమైకవచనరూపం 'రా'కు మారుగా 'దా' అని మనం వ్యవహరిస్తున్నాము. (దామ్మ దా...) సంబోధనార్థకంలో 'శివదో!' శివలీలావిలాసంలో వున్నది. దే! దో! అనే సంబోధనరూపాలు ప్రాచీనకాలంలో వుంటాయి. దా మాత్రం మిగిలి, దేదోలు జారి పోయాయి. దో అనే సంబోధనవాచకం ప్రస్తుతం మహారాష్ట్రింలోకూడా వున్నది.

(౩౨) పేఖరీ:

పుణరుత్తపేఖరీ ఏ (పోలన్న ౪-౭౧)

పునరుక్తమ్లేచ్ఛితకయా అని ఛాయ. "మ్లేచ్ఛితం గుప్తభాషితం" అని కులబాలదేవుని టీక. మ్లేచ్ఛితశబ్దం నుంచి పేఖరీ పుట్టివుంటుం దనే భ్రాంతితో మ్లేచ్ఛితకయా అని ఛాయ వ్రాసివుంటారు. పెచ్చారితనము=వాగుడు అనే అర్థంలో నాచనసోముడు ప్రయోగించాడు. "మచ్చరవు వాసుదేవుడు పెచ్చారితనంబు ప్రమానపిల నిట్లనియెన్" (ఉత్తరహరి. ఆ ౩.) ఈ గాథలోని అర్థాన్ని బట్టికూడా పెచ్చారితన మంటేనే సమంజసం. పేశ్—పెచ్ ధాతువునుంచి పెచ్చారి పుట్టివుంటుంది. ఈ ధాతువు తమిళంలో ఇంకా వున్నది. తెనుగున మరుగై పోయింది.

(౩౩) చోజ్జం:

బలిణో వాఅబంధే చోజ్జం (భోజఅప్ప ౫-౬)

చోజ్జం ఆశ్చర్యం. ఇది చుజ్జం అని చుకారాదిగా దేశీనామమాలలో పఠితము. "చోద్యం స్యా దద్భుతే ప్రశ్నేచోదనార్థేతు వాచ్యవత్" అని మేదినీకారుడు అన్నాడు. కాని చుదధాతువును బట్టి ప్రశ్నార్థకానికి, చోదనార్థకానికి వ్యుత్పత్తి చెప్పవచ్చును గాని ఆశ్చ

ర్యార్థానికి వ్యుత్పత్తి కుదురదు. ఇది పూర్తిగా తెనుగు పదం. సోటిగ, సొజ్జిగ అని కన్నడంలో ప్రాచీన రూపాలు. మేదినీకారుడు చెప్పినట్లు ఇది సంస్కృత మైవుంటే హేమచంద్రుడు దేశీనామమాలలో గ్రహించ వలసిన అవసరం వుండదు. చోజ్జశబ్దానికి చోజ్యం మూలరూపంగా వుండవచ్చునని భ్రాంతితో సంస్కృత కవులు ప్రయోగించగా మేదినీకారుడు తన నిఘంటువులో గ్రహించాడు.

(౩౪) ఉప్పంగో:

కామస్స లోహి ఉప్పంగరాఇఅం (౬-౧౫)

"ఉప్పంగశబ్దో దేశ్యం సమూహవచనః" అని వ్యాఖ్య. ఇది ఉప్పెన, ఉప్పెనగా అనే శబ్దాలనుంచి వచ్చిందేమో! దేశీనామమాలలో ఉంబర, ఉబ్బార శబ్దాలు అధికపర్యాయంగా గ్రహించబడినవి. ఇవి ముమ్మరం, ఉబ్బరం, ఉమ్మరం అనే తెలుగుశబ్దాలే ననడంలో సందేహం లేదు. ఈ శబ్దాలను అన్నిటా పోలిన ఉప్పంగకూడా తెనుగుపదం కాకతప్పదు.

(౩౫) అత్థక్క:

అత్థక్కగజ్జఉబ్భంత (౪-౧౬)

అత్థక్కరూసణం (౭-౭౫)

"అత్థక్కతి అకస్మాత్, అద్భుతేవా దేశీ" అని వ్యాఖ్య. ఆశ్చర్యం తెలుపడానికి తెనుగువారు అమ్మక్క, అమ్మా చెల్ల, అమ్మయ్య మున్నగు పదాలు ప్రయోగిస్తారు. వీని పోలిక గల అత్థక్క శబ్దంకూడా తెనుగే; ప్రాకృతమో, సంస్కృతమో కాదు.

(౩౬) పలాల :

ఫాలేఇ అచ్ఛభల్లం

వ ఉఅహ గ్గామ దేఉలద్దారే

హేమంత ఆల పహిఓ

విజ్ఝాఅంతం పలాలగ్గిం. (కాలసహాస్స ౩-౯)

ఈ గాథలోని వర్ణన అతిహృదయంగమంగా వున్నందున వివరిస్తున్నాను: చలికాలం పల్లెటూరి దేవాలయంముంగిట ఒక బాటసారి గడ్డివేసగడు వేశాడు. ఆరిపోతున్న గడ్డినిప్పును కలియబెడుతుండగా ఎలుగుబంటిని చీల్చుతున్నట్టు వున్నది.

కాలిన గడ్డి నిప్పు ఆరిపోగానే నల్లగా, పెద్ద రాశిగా కనిపిస్తుంది. కర్రతో దానిని కదిలిస్తే లోపల ఎర్రగా నిప్పు కనిపిస్తుంది. ఇది పొట్టచీల్చిన ఎలుగు బంటిలాగా వుందన్నమాట. దీనిని కవి ఎంత మనోహరంగా వర్ణించాడో!

ఇక్కడ గడ్డికి పలాల అని గాథాకారుడు ప్రయోగించాడు. "పలతి సస్యశూన్యత్వం ప్రాప్నోతి= పలాలః" అని శబ్దకల్పద్రుమవ్యుత్పత్తి. "ప్రోక్షణా త్తృణధాన్యంచ పలాలంచైవ శుద్ధ్యతి" అని మనువు. శబ్దకల్పద్రుమవ్యుత్పత్తి అసమంజస మవడానికి వీలులేదు. కాని పుల్లీ, పిల్లిరీ శబ్దాలను తృణపరంగా దేశీనామమాల ఉదాహరించినప్పుడు పలాలశబ్దాన్నికూడా గ్రహించాలి. తెనుగు కన్నడ తమిళ భాషలలో పుల్ తృణసామాన్యవాచి. చిప్పర—చిర్ పుల్—పచ్చిక. పుల్లీ, పిల్లిరీ, పలాలశబ్దాలు పుల్ తద్భవరూపాలే.

(౩౭) అలాహి:

అలాహి కిం పాఅరావీణ ! (౩-౩౭)

అలాహి=నివారణే. అక్కరలేదు అని అర్థం. అలాభి అని పాఠాంతరం. అలాహిశబ్దాన్ని నివారణ పరంగా శబ్దానుశాసనంలో నిపాతంచేసినట్లు హేమచంద్రుడు దేశీనామమాలలో సూచించాడు. వ్యుత్పత్తి కుదురకపోకదా—పీడ విరుగడైపోతుందని—నిపాతం చేయడం! గాథలోని సందర్భాన్నిబట్టి అలాహిశబ్దానికి "అక్కరలేదులే, ఒల్లను పో!" అని అర్థం. ఒల్ల శబ్దంనుంచికాని, నిషేధార్థకమైన అల్లశబ్దంనుంచి కాని అలాహి పుట్టివుంటుంది. అల్ల, ఇల్ల, ఉల్లశబ్దాలలో ఇల్లశబ్దం తెనుగులో లే అయి, ఉల్ల ఒల్లగా మారి, ఇల్ల వ్యవహారభ్రష్టమైంది.

(౩౮) ఉఅ:

ఉఅ ఓల్లిజ్జఇ (౭-౪౦)

ఉఅ ణిచ్చలనిప్పందా (౧-౪)

ఉఅ పోమ్మరాఅ (౧-౭౫)

ఉఅ సంభమ విక్ఖిత్తం (౫-౬౧)

ఉఅ సింధవ పవ్వఅ (౭-౭౯)

ఉఅహ తరుణోడరాఓ (౬-౬౨)
ఉఅహ పడలంతరో (౧-౬౩)

ఉఅ, ఉఅహ=పశ్య అని వ్యాఖ్య. ఈ రెండు శబ్దాలూ పలుమారు ప్రయోగింపబడినవి. కొన్ని మాత్రమే పైన ఉదాహరించాను. ఈ రెండుశబ్దాలూ పశ్య అనే లోట్మధ్యమపురుషలో నిపాతాలు. యథావత్తుగా అర్థం గ్రహించి నిపాతంచేయడంవల్లనే ఇవి దేశి శబ్దాలని విస్పష్టమౌతున్నదికదా! తెనుగుప్రాచీన సంబోధనరూపమైన ఓయి ఉఅ అయి, ఉఅహ అనే ప్రాకృత వేషంలో దర్శనం ఇస్తున్నది.

(౩౯) కవి:

(౧) తుజ్ఝకవి తహవి తహవి తణుఅఇ (హాలిఅలన్న ౧-౯౦)

(౨) భణ కస్సకవి కఓమాణో (౫-౩౨)
(౩) జస్సకవి ణం పిఅసహీ (౬-౨౪)
(౪) ధవలస్సకవి జిఅంతి గిట్ఠీఓ (౭-౩౮)

ఇంకా కొన్ని గాథలలోకూడా కవి ప్రయుక్తమైంది. ఇది తెనుగు చతుర్థీవిభక్తి కయి, కై మారువేషం. ప్రాకృతంలో చతుర్థీవిభక్తి లేదు. నాశికలోని అశోకుని పాలీశాసనంలో చతుర్థీవిభక్తి కనిపించదు. శౌరసేనీప్రాకృతంలో చతుర్థీవిభక్తి లేదనీ, మహారాష్ట్రీప్రాకృతంలో అకారాంతశబ్దాలకు ఏకవచనంలో మాత్రం క్వాచిత్కంగా వుందనీ వుల్నర్ పండితుడు ప్రాకృతవ్యాకరణప్రవేశికలో తెలిపాడు. (పుట ౩౨, ౩౩) తమిళభాషలో కు, అక్కు, కన్నడంలో గె, ఇగె, ఇంగే, ఇకే, కం, గం చతుర్థీ విభక్తిప్రత్యయాలు తెనుగు కై, కయిలను పోలి వున్నవి. తెనుగు కై, కయి ప్రాకృతంలో కవిగా మారివుంటుంది. ఈ కవిను సాధించడంకోసం సంస్కృతపండితులు కృతే అనే అవ్యయాన్ని కల్పించుకొని సంతృప్తి పడ్డారు.

(౪౦) అనుకరణశబ్దాలు:

(౧) మాణో సురసురంతో (౧-౭౪)
సురసురంతో=సురసురలాడుతూ.

(౨) హిఅఅం ధరధరేఇ (౨-౮౭)

ధరధరేఇ = తరతరలాడుతున్నది. "ధరహరిఅం కంపితం" అని దేశీనామమాల.

(౩) హత్థా థరహరంతి (౨-౬౫)
(౪) ధుక్కాధుక్కఇ జీఅం (౬-౮౩)


"ధుక్కాధుక్కఇ = హృదయే కంపో భవతి" అని వ్యాఖ్య. తుకతుకలాడుతున్నది జీవము.

(౫) సణిఅం సణిఅం (౫-౫౮)

"సణిఅం సణిఅం=శనైః శనైః"అని వ్యాఖ్య. మెల్లిగా. సన్నగా. సన్నగా సన్నగా అనే తెనుగు శబ్దం సణిఅం సణిఅం పదానికి అన్నిటా పోలివుంది. సన్న, చిర్, చిన్న మున్నగురూపాలు అన్ని దాక్షిణాత్యభాషలలోను కలవు. కనుక ఇది తెనుగే నడం అన్యాయం కాదు. ఇంకా మాట్లాడితే శనైః అనే అవ్యయానికికూడా చిన్న సన్న శబ్దాలే మూలమని ఘంటాఘోషంగా చెప్పవలసివుంటుంది.

హలహలం=కౌమారెవ్నక్యం, ఓడహఓ=తరుణ్యః, వాఉల్లఅం=చిత్రం, ణవరం=కేవలం, తిత్తిల్లఓ=దావారికః, కేల్లహలం=సుందరం, రించోళి=సమూహము, ఘల్ల ఫలం=కోష్ణసుగంధిజలం—మున్నగు ఉక్కుమెనగ వంటి శబ్దాలను మెదివి గంధం తీయవలసివుంది.

ఇంతకూ, దాదాపు రెండువేలఏండ్లక్రిందటి తెనుగుపదాలు ప్రాకృతసాహిత్యంలో ఏలా చేరిపోయాయో తెలుపడమే ఈ వ్యాసంయొక్క ఆశయం. సోపపత్తికంగా వున్న వాదాన్ని గ్రహించడానికి అభ్యుదయకాము లెవరూ వెనుకాడరనుకుంటాను.



ప్రాచీన ఖగోళము

౪

— శ్రీ వేలూరి శివరామశాస్త్రి —

ఋగ్వేదమునందు కొన్నిపట్ల తారానక్షత్ర పదము లేకార్థకములుగను, కొన్నిపట్ల భిన్నార్థకములుగను కనిపించును. 1 తైత్తిరీయ సంహితలో తారకలు వేరుగను, నక్షత్రములు వేరుగను చూపట్టును. 2 క్షత్రము కానిది నక్షత్రము అను వ్యుత్పత్తి తైత్తిరీయ బ్రాహ్మణమునందు కలదు. 3 పై బ్రాహ్మణమునందే మరొకచో —'పడుచు నీరు. అవి నీటిని తరించెను. కావున వానికి తారక లని పేరు. ఎవ డీ నక్షత్రములలో యజ్ఞము చేయునో వాడు ఆ లోకమునకు జనును. కావున నక్షత్రముల నక్షత్రత్వము. నక్షత్రములు దేవగృహములు చుడీ!' అని తారకా నక్షత్రవివరణము కలదు. 4

తొల్లిటినుండి నేటివరకు భారతీయులే కాక చీనావారును, కాల్డియావారును, గ్రీసుదేశమువారును, 'పుణ్యాత్ములు స్వర్గమున కరిగి నక్షత్రము లయిరియుందు' రని నమ్ముచున్నారు. పురాణముల కీ విశ్వాసము కలదు. పురాణములలో నక్షత్రములు ప్రసిద్ధములగు కొన్ని కథల కాధారము. ఇట్టి కథలు మన దేశమునందే కాక యవనదేశములందును గలవు. ఆ కథలకును, మన కథలకును చాల సామ్యము కలదు. కొన్ని పారసీక కథలకును, భారతీయకథలకును ఐక్య మున్నది.

వైజ్ఞానికదృష్టితో గూడ వేదములును, పురాణములును చుక్కలను చూచినటు లగపడును. అది ఆ కాలమునందేని సంపూర్ణము, లేక విశాలము అగు దృష్టి యని చెప్పుటకు వీలులేదు. సృష్టిరహస్యముతో నక్షత్రపుంజముల కేదో సంబంధ మున్నటులుమాత్రము వేదములయు, పురాణములయు అభిప్రాయ మైయున్నటులు మన మూహింపగలము.

విశ్వాసములనుండి శాస్త్రము మెలకత్తినపిదప తారకానక్షత్రములు స్వతంత్రము లాయెను. ఇరువదేడు భాగములుగా చేయబడిన సూర్యుని మార్గములో నొక భాగము నక్షత్రమని సిద్ధాంతములు పరిష్కరించెను. జ్యోతిషమునందు కొంచెము ప్రవేశము కలవారు రాశిచక్రమునందలి ఇరువదియేడు చుక్కలను నక్షత్రములనియు, రాశిచక్రమునకు వెలుపట నున్నవానిని తారకలనియు వ్యవహరించినను కవులు మొదలు గొల్లలవరకు తారకానక్షత్రముల నేకార్థకములుగా వాడుదురు. కాళిదాసు ఈభేదము నెరిగి యిటులు వ్యవహరించెను— 'నక్షత్రతారాగ్రహసంకులాపి జ్యోతిష్మతీ చంద్రమసైవ రాత్రిః' (రఘు-౬)

ఆకాశమున కోటానకోటులు చుక్క లున్నవి. వానిలో ఏ కొలదిచుక్కలో (సుమారు నూరులోపు)

---

(1) ౧-౫౦-౨; ౧౦-౬౮-౧౧; ౧౦-౫౮-౨; ౨-3౪-౨; ౪-౭-3..

(2) ౭-౫-౨౫.

(3) ౨-౭ ౧౮-3. చూ- 'నక్షత్రాణ్యపాన్న వేదానాసత్యానముచినకులవఖనపుంసకనక్షత్రనక్రనాకేషు ప్రకృత్యా' (౬-3-౭౫.)

(4) సలిలం వా ఇద మంత రాసీత్. య దతరన్. తత్తారకాణాం తారకాత్వమ్. యోవా ఇహ యజతే. అముం స లోకం నక్షతే. త న్నక్షత్రాణాం నక్షత్రత్వమ్. దేవగృహా వై నక్షత్రాణి. ౧-౫-౨.

ప్రాచీనగ్రంథములలో కనబడును. కాలబోధకములును, ఉత్పాతవ్యంజకములును, ఫలసూచకములును అగునని నమ్మిన నక్షత్రములనే ప్రాచీనులు గ్రంథస్థము కావించి యుందురు.

ప్రాచీనయవనజ్యోతిష్కులు నక్షత్రసముదాయ వివరణమునకు ఖగోళమును ౪౮ భాగములు చేసిరి. హిపార్కస్ ౧౦౨౦ చుక్కల తావు, కాంతిని నిర్ణయించి ఒక నక్షత్రనిఘంటువును రచించెను. టాలెమీ తన 'మాజెస్టు' అను గ్రంథమున ౧౦౩౦ చుక్కలను లెక్కించెను.

పదునేనవ శతాబ్దిలో తార్తారరాజు తైమూర్‌లంగ్ కుమారుడు ఉలూఘ్ బేగ్ అనునతడు సమరఖండ నగరమున గూరుచుండి చుక్కల యునికిచూచి టాలెమీ రచించిన మాజెస్టును పరిశోధించి మరియొక నిఘంటువును కూర్చెను.

పదునారవందల నలుబదియేడవ శకమున అంబర్ ప్రభువు జయసింహుడు ఆకాశమును నలుబదినిమిది భాగలుచేసి వేయి నక్షత్రములను నిరూపించెను. ఇతడు ఉలూబేఘ్‌ననే అనుసరించెను. కావున నిది ఆధునికము; మరియు యావనికము. ఇపు డిది దుష్ప్రాపము.

వేదములందును, పురాణములందును గల ఆఖ్యాయికలనుబట్టి నక్షత్రములు సునిరూపములు కావు. సంహితలయు, సిద్ధాంతములయు నిరూపణము బహు స్థూలము. కొన్నికొన్ని చుక్కల గుంపులు కలిసి ఒక్కొక నక్షత్రము. ఒక్కొకనక్షత్రముచుట్టు ఎన్ని చుక్కల గుంపు లున్నవో వాని వివరణ మెచటనేని లేదు. దీనికి మించి మరియొక చిక్కు కలదు. ఒక్కొక కాలమునం దొక్కొక రీతిగా నొక్కొక జ్యోతిష్కుడు నక్షత్రములను నిరూపించెను. ఒక్కొక రొక్కొక ఆకారము కల్పించిరి. సిద్ధాంతములందు ప్రధానములయిన వానికి స్థాననిర్దేశము కలదు గాని వానిచుట్టు గలవానికి లేదు. ఈరీతిగా మనకు నక్షత్రమానచిత్రము సరియగు నది లేదనియే చెప్పవలసివచ్చును. దానచేసి పలువురు విద్వాంసులు ఆంగ్లతారాపటమునే ఆశ్రయించిరి.

చుక్కలలో పలురంగుల చుక్కలు కలవు. రాశిచక్రమునందలి యిరువదినిమిది నక్షత్రములలో రోహిణియు, జ్యేష్ఠయు, ఆర్ద్రయు ఎఱ్ఱనివి. ఇవి కాక శూలతారయు ఎఱ్ఱనిదె. స్వాతి పీతము. ముక్తా వర్ణము. ఇవి దృష్టిగోచరములు.

సూర్యకిరణములే నక్షత్రదీప్తికి కారణమని ప్రాచీనుల అభిప్రాయము. నక్షత్రములు గ్రహములకు చాల దవ్వుగా నున్నవని వా రెరుగుదురు. ధ్రువతార బ్రహ్మాండపు పాలిమేరలో నున్నదని పురాణములును, సిద్ధాంతములును నిరూపించెను.

దీప్తినిబట్టి నక్షత్రములు స్థూలముగా రెండు విధములు: అస్పష్టముగా మినుకుమినుకు మని మెరయు నవి సూక్ష్మతారలు. స్పష్టముగా కనబడునవి నక్షత్రములు. మరియు ఛాయాపథము, నీహారము అను వ్యవహారము నక్షత్రపుంజములకు కలదు.

తారకల విరూపత్వముగాని, బహురూపత్వము గాని ప్రాచీనులు ఎచటను చెప్పినటులు లేదు. ఇక తారకాపుంజములనుగురించి చెప్పుటలో ఒక కృత్తికలే తైత్తిరీయబ్రాహ్మణమున కనిపించును. అదియు తారకా పుంజవిస్తృతికి గాదు.

నక్షత్రములు, వాని యాకృతులు మొదలగున వీదిగువ—

---

(౯) వేసవిలో మల్లార్ ప్రాంతమున అగస్త్య-ధ్రువనూత్రముక్రిందనున్న ఎఱ్ఱచుక్క శూలతార. ఇది అమంగళకర మని భావన. చంద్రుడు పూర్వభాద్రలో నున్నపుడు అచటివారు దక్షిణమునకు పయనింపరు. శూల తార దక్షిణమున నుండుటయే దీనికి కారణము. ఇటులు శ్రీపాలుడు చెప్పెనని ఆల్బెరూనీ ౧౧వ శతాబ్దిలో వ్రాసెను. అగస్త్యనిక్రింద Alpha Eridani యే శూలతార యని నవ్యులు.

నక్షత్ర	ఆకార	దృగ్యాంశ	సంఖ్య వరాహుల్ల	శ్రీపతి
అశ్విని	అశ్వముఖ	౧౪ అ	౨	౩
భరణి	పొక్కటిగడ్డలు	౨౧ ఈ	౩	౩
కృత్తిక	మంగల కత్తి	౧౫ ఇ	౬	౬
రోహిణి	బండి	౧౪ అ	౫	౫
మృగశిర	లేటితల	౨౧ ఈ	౩	౩
ఆర్ద్ర	మణి	౧౫ ఇ	౧	౧
పునర్వసు	ఇల్లు	౧౩ అ	౫	౪
పుష్య	బాణము	౨౧ ఈ	౩	౩
ఆశ్లేష	చక్రము	౧౫ ఇ	౬	౫
మఘ	శాల	౧౪ అ	౫	౫
పూ. ఫ	శయ్య	౧౪ అ	౮	౨
ఉ. ఫ.	మంచము	౧౪ అ	౨	౨
హస్త	చేయి	౧౪ అ	౫	౫
చిత్ర	ముత్తెము	౧౩ అ	౧	౧
స్వాతి	పగడము	౧౩ అ	౧	౧
విశాఖ	తోరణము	౧౪ అ	౫	౪
అనూరాధ	బలి	౧౫ ఇ	౪	౪
జ్యేష్ఠ	కుండలము	౧౩ అ	౩	౯
మూల	సింహపుతోక	౧౫ ఇ	౧౧	౧౦
పూ. ఆషాఢ	మంచము	౧౫ ఇ	౨	౪
ఉ. ఆషాఢ	ఏనుగుదంతము	౧౫ ఇ	౮	౪
శ్రవణము	త్రిపాది	౧౪ అ	౩	౩
ధనిష్ఠ	మద్దెల	౧౪ అ	౫	౪
శతభిషక్	చక్రము	౧౭ ఉ	౧౦౦	౧౦౦
పూ. భాద్ర	కవలపిల్లలు	,, ,,	౨	౨
ఉ. భాద్ర	శయ్య	,, ,,	౮	౨
రేవతి	మద్దెల	.. ..	౩౨ ౮	౩౨-౧౨
అభిజిత్	శృంగాటకము	౧౩ అ	౩	౩

పైనున్న పట్టికలో చిత్రాస్వాతీజ్యేష్ఠాభిజిత్తుల దృగ్యాంశములు పదమూడుకావున ఇవి పెద్ద వెలుగు కలవి. అశ్వన్యాదులు వానితరువాత. ఇటులు చూచి నచో యంత్రసాహ్యమున తేలిన నేటి ప్రభామానమును బట్టి రోహిణియు, శ్రవణయు, మఘయు, ఆర్ద్రయు మొదలగు కొన్ని ప్రథమశ్రేణికి చెందినవి కావున సూర్యసిద్ధాంతమునందలి యీ మతము సరియయినది కాదని బర్జెస్ వెక్కిరించెను. కాని యిది శ్రథ సను సరించి చేసిన విభాగము కాదు. ఎంతదూరమునుండి యేనక్షత్ర మెంత కనబడునో దానిగూర్చిన లెక్కయిది.

భూమి

వేదమునుబట్టియు, 6 పురాణమును బట్టియు 7 భూమి గోళాకారమని కొంత యూహింపవచ్చును.

---

(6) ౧-౧౨౩ ఋక్.

(7) 'తదా దహతి సందీప్తో గోళకం చైవ సర్వశః' (వాయు.౧౦౦-౧౫౯). మరియు నాప్రాచీన భూగోళము చూ.

వసిష్ఠసంహితయందును, పౌలిశసంహితయందును భూమి గోళమని స్పష్టముగా గలదు. 8 'జలజంతువుల చేతను, స్థలజంతువులచేతను పరివ్యాప్తమగు భూమి పూలచే పొదవిన కడపపూవుడివలె గోళాకారముగా నున్నదని ఆర్యభటు 9 డనెను. 'రెండు నూదంటురాల నడుమ నినుపగుండువలె శూన్యమున చుక్కల గుంపులనడుమ భూగోళము కలదు' అని పంచసిద్ధాంతికలో వరాహమిహిరుడు. 10 'దానవులు, మానవులు, దేవతలు, దయ్యములు, చెట్టులు, గుట్టలు మొదలగు చరాచరములతో నిండిన యీ భూమికి వే రాధారము లేదు. మూర్తమగున దేదేని భూమి కాధార మందువా, దానికి మరొక యాధారము ఉండవలయును. దానికిని మరొక యాధారము ఉండవలయును. కాన అనవస్థ పొసగును.' 'ఊహుం, పొసగదు. ఆ యాధారము స్వశక్తిచే భూమిని ధరించును అని యందును.' 'అటులేని భూమికే అట్టిశక్తి కలదని యేల అనవు? అదియు అష్టమూర్తియగు భగవంతుని మూర్తులలో నొక మూర్తి కాదా? వస్తుశక్తి విచిత్రము కాదా! 11 అగ్నికి ఉష్ణమువలె, చంద్రునకు శైత్యమువలె, జలమునకు ద్రవత్వమువలె, వాయువునకు చలత్వమువలె భూమికి అచలత్వము స్వభావము' అని భాస్కరుడు.

'భూమి శూన్యమునందు వ్రేలాడుచున్నచో ఏల క్రింద పడదు?'

'అది పడుచో నెక్కడ పడును? క్రింద పడునా? 'క్రింద' అనగా నేమి? క్రింద అనునది సాపేక్షము, 12 దేనితో? మీదతో. శూన్యమున క్రింద మీదు లేమి? శూన్యము 'అన్ని తట్టులను' శూన్యమే. కావున భూమి మొదలగునవి శూన్యమున స్వస్వశక్తిచే నిలిచియున్నవి.'

'భూమిపై నెచట నున్నను—'నేను భూమిమీద నున్నాను' అని ప్రతివాడును అనుకొనును. భూవ్యాసము రెండుచివరల నిరువు రున్నా రనుకొనుడు. ఏటి యొడ్డున నిలిచిన మనుష్యుని వలెను, నీట ప్రతిఫలించిన అల వాని నీడవలెను వా రిరువురును తలక్రిందులుగా నుందురు. మన మిచట నెటు లుంటిమో క్రిందివారుగూడ అటులే నిటారుగా నిలిచియుందురు'.

'మేరుపర్వత ముత్తరమున గలదు. సూర్యుడు దానిని ప్రత్యహము ప్రదక్షిణించును అను మాట నిక్కమగుచో సూర్యుడు దక్షిణముగా పోవుచున్నటులు మన కేల కనబడును?'

'భూమి గోళాకార మగునేని మన కది బల్లపరపుగా నేల కనబడును?'

'భూమి చాల పెద్దది. దాని పరిధిలో నొక చిన్న అంశముగూడ మనకు వంకరగాగాక సమముగా నున్నటులు కనబడును. భూమికన్న మన మెంతయో చిన్నవారము కావున మన కేకకాలమున కనబడున దెల్లయు బల్లపరపుగనే గనబడు' 13 నని భట్టోత్పలుడును, భాస్కరుడును చెప్పిరి.

---

(8) భట్టోత్పలుని బృహత్సంహితావ్యాఖ్య చూడునది.

(9) 'యద్వత్కదంబకుసుమగ్రంథిః ప్రచితః సమంతతః కుసుమైః, తద్వద్ధి సర్వసత్త్వై ర్జలజైః స్థలజైశ్చ భూగోళః.'

(10) పంచమహాభూతమయ స్తారాగణపంజరే మహీగోళః, ఖేఽయస్కాంతస్థో లోహ ఇవావస్థితో వృత్తః. తరునగనగరారామసరిత్సముద్రాదిభి శ్చితః సర్వః విబుధనిలయ స్సుమేరు స్తన్మధ్యేఽధః స్థితా దైత్యాః.

(11) మూర్తో ధర్తా చే ద్ధరిత్ర్యా స్తతోఽన్య స్తస్యాప్యన్యోఽప్యేవ మత్రానవస్థా, అన్త్యే కల్ప్యా చే త్స్వశక్తిః కిమాద్యే కింనో భూమిః సాఽష్టమూర్తేశ్చ మూర్తిః.

(12) 'ప్రతియోగిసాపేక్షం చాధః' భట్టోత్పలుడు.

(13) సమో యతః స్యా త్పరిధేః శతాంశః పృథ్వీచ పృథ్వీ నితరాం తనీయాన్, నరశ్చ తత్పృష్ఠగతస్య కృత్స్నా సమేవ తస్య ప్రతిభా త్యతస్సా.

గమనము

నక్షత్రములు స్థిరములు. భూమి తనచుట్టు తాను తిరుగుచు సూర్యునిచుట్టును తిరుగుచున్నది. దానచేసి గ్రహములకును, నక్షత్రములకును ఉదయాస్తమయములు కలుగుచున్నటులు భూమిమీద నున్నవారికి కనబడును. అసలు వానికి ఉదయాస్తమయములు లేవు.[14] అటు లగుచో భూమి తిరుగుచున్నటులు మన కేల కనబడదు ?

'పడవలో పోవువానికి ఏటియొడ్డున నుండు చెట్లు వెనుకకు పోవుచున్నటు లుండును. ఆ రీతిగనే నిరక్షదేశమువారికి అచలములగు నక్షత్రములు పడమటికి పోవుచున్నటులు కనబడును' అని ఆర్యభటు డనెను.[15] ౪౯౯ వ క్రీస్తుశకమున ఆర్యభటు డుద్ధరించిన యీ ప్రాచీనమతమును పదకశతాబ్దివరకును గల ఆచార్యు లందరును ఖండించిరి. అట్టివారు నేటికిని కొందరు గల రనినచో ఆశ్చర్యము కలుగవచ్చును.

భూమి తిరుగదు

'ఉమ్మరిసారెవలె తిరుగు నక్షత్రచక్రమునందు భూమి తిరుగుచున్నదని కొందరనిరి. అది నిక్కము గునేని మింటి కెగిరిన పిట్ట మరి గూడు చేరలేదు.' 'ఏట బడిన చీమ బలవత్ప్రవాహముదెసకే కొట్టుకొనిపోవును గాని రెండు రీదజాలదు. అటులే పిట్టయు తూర్పునకే పోగలుగునుగాని పడమటికి పోజాలదు. ప్రవాహబలము ముందు చీమవేగబల మెంతో భూమివేగబలము ముందు పక్షివేగబల మంత'. 'మరియు భూమి దినమున కొకసారి తిరుగునేని ఆ వేగమునకు ఆకాశమునందలి జెండాలు మొదలయిన వన్నియు పడమటి దెసనే చూడ వలయును; భూమి మెలమెలగా తిరుగునని అందువా సుమారు అరువదినాలుగు గడియలలో ఒకచుట్టుటులు తిరుగును ?' అని వరాహమిహిరు డనెను.[16]

'ఆకాశాభిముఖముగా విడిచిన బాణము పడమట నేల పడదు ? మేఘము లన్నియు పడమటిదెసకే యేల పోవు ?' అని లల్లుండు. 'భూమి ఒక ప్రాణములో ఒక కల నడచునేని యిది యొచటినుండి యొచటికి నడచుచున్నది ? భూమి తన వ్యాసముచుట్టు తాను తిరుగుచున్నచో ఎత్తయిన కొండలు, మేడలు ఏల పడిపోవు ?' అని బ్రహ్మగుప్తుడు.[17]

'భూమి రొల్లపుడును కదలుచుండు నెడల ప్రాణులు నిలువలేవు. మరియు ఒకచోటునుండి మరి యొక చోటికిని పోలేవు. నదులును, సముద్రములును ఏమయిపోగలవో ఆ దేవదేవునకే యెరుక. గిరిశృంగము నుండి బలువగు నొక రాతిని విడుచుచో అది పర్వతపాదముమీదకే పడును. భూమికి గతియే యున్నచో రెండు మూన్నాళ్ళ ముసురు లుండునా ?'

ఈ రీతిగా భాస్కరాచార్యునివరకును గల జ్యోతిష్కు లందరును ఆర్యభటునకు ప్రతిభటులయిరి. ఇంతియకాక పరమేశ్వరు డను నొక వ్యాఖ్యాత 'భూమి స్థిర మను మాటయే పరమార్థము. భూమి తూరుపుగా పోవుచున్న దనియు, నక్షత్రములకు నడక లేదనియు కొందరందురు. అది మిథ్యాజ్ఞానవిలాసము' అని ఆర్యభటుని అభిప్రాయ మయినటులు ఆర్యభటుని యందు తనకు గల భక్తిని మేరదాటించెను.

---

(14) విష్ణు. ౨-౭-అంశ, ౧౪-౧౫ శ్లోకములు చూచునది.

(15) అనులోమగతి ర్నౌస్థః పశ్యత్యచలం విలోమగం యద్వత్, అచలాని భాని తద్వ త్సమపశ్చిమ గాని లంకాయామ్.

(16) పంచసిద్ధాంతిక. ౯ అధ్యా. ౬-౯.

(17) ౬ ప్రాణములు ఒక పలము.

(18) బ్రాహ్మస్ఫుటసిద్ధాంతము చూ.

భూమి తిరుగును

పదవ శతాబ్దికి చెందిన పృథూదకస్వామి 19 రొకడుమాత్రము ఆర్యభటు సంగీకరించి 'భూమి తిరుగు నను వాదమే సరియైనది. ఒకే సమయమున గ్రహములకు పడమటగా దైనికగతియు, తూరుపుగా స్వగతియు అను నీ రెండువిధములయిన విపరీతగతులు నెల్లవు. మీరు ఎత్తిన వస్తువులు పడు నని యందురు. అవి యెచట పడును? భూమికి క్రిందుమీదులు లేవు. దానికి ఆ రెండు నొకటియే. చూచువాని యునికినిబట్టి ఊర్ధ్వాధో భేదము కలుగుచున్నదికాని అసలు లేదు' అని బ్రహ్మగుప్తుని ఖండించెను.

పాశ్చాత్యుల మతము

ఐరోపాఖండమునందు హీరాక్లిటస్, పైథాగొరస్ మొదలగు కొందరు భూమి తిరుగుచున్న దనిరి. 20 వారి మతమును పలువురు ఖండించిరి. వారిలో టాలెమీ గట్టివాడు. ప్రశియా దేశస్థుడు కోపర్నికస్ టాలెమీని 21 ఖండించి 'రాశిచక్రమునడుమ సూర్యుడు స్థిరముగా నున్నాడు. భూమియు, గ్రహములు నతనిచుట్టును తిరుగుచున్నవి' అని నిరూపించెను. పిదప టైకోబ్రూహీ అనువతడు 'భూమి పడమటినుండి తూరుపుగా ఆవర్తించుచున్నల ఎత్తు చోటునుండి పడిన రాయి పడమటగా నేల పడదు?' అని భారతీయజ్యోతిర్విదులవలెనే పూర్వపక్షము చేసెను. 22 ఈ రీతిగా టాలెమీమతమే స్థిరపడెను. ఇంతియకాక 'భూమి తిరుగు'నను వాదము మతద్రోహముగా నాటివారు తలపోసిరి. అటుపిమ్మట గాలీలియో టెలిస్కోప్ సాయమున నక్షత్రములే అచలము లనియు, అచలయే చల యనియు నిస్సందేహముగా నిరూపించెను. 23 ఇతడు ౧౬, ౧౭ శతాబ్దులనడుమవాడు. నేటి వైజ్ఞానికులు భూమి తిరుగుచున్న దనియు, సూర్యుడు స్థిరముగా నున్నా డనియు సప్రమాణముగా నిర్ధారించిరి. భూమి ౨౪ గంటలలో తన పరిధిని పరిక్రమించుచున్నది. ఇది దాని దైనికగతి. అది సూర్యునిచుట్టు ౩౬౫ ది. ౫ గం. ౪౮ ని. ౪౬ సె. కండ్లకు వృత్తాభాసముగా ఒక ప్రదక్షిణము చేయుచున్నది. ఇది దాని వార్షికగతి. నేటివారికి ఫూకో (Foucault) దోలకపరీక్షయు, న్యూటన్ ప్రత్యక్ష పస్యవేక్షణమే కాక ఆపేక్షికగతితత్త్వము మొదలగునవికూడ (Law of relative velocity) ఎంతయో సాయపడె.

(19) శ్రీపతి పృథూదకాచార్యులవారి మతము ననుసరించెను గాన పృథూదకులు శ్రీపతికివెనుకటివారు.

(20) వీరు క్రీ. వె. నాలుగవ శతాబ్దివారని అనుమానము.

(21) క్రీ. వె. ౧౬ వ శతాబ్ది.

(22) 'భూమితోపాటు భూవాయువును, రాయియు తిరుగును. కాన పడమటగా పడదు' అని టైకోబ్రూహీకి కొందరు సమాధానము చెప్పిరి. ఇది అత డిచ్చిన ఆపత్తికి సమాధికాని భూభ్రమణమును సమర్థింపదు.

(23) పోపు గలీలియోను పిలిపించి—'సూర్యునిచుట్టును భూమి తిరుగుట లేదని జనులకు నచ్చచెప్పెదువా, లేక విచారణ జరిపి శిక్షింపమందువా?' అని అడిగెనట. మంటలో త్రోసి చంపుటయే నాటి శిక్ష, గలీలియోకు నాడు ౭౦ ఏండ్లు, ఆ ముదిమిలో ఆ శిక్ష కాగలేక అతడు లొంగిపోయెనట.

మరియొక కథ కలదు—అతడు 'భూమి తిరుగుటలేదు' అని బిగ్గరగా చెప్పుచు దాపుననున్న ఒక మిత్రునకు వినబడునటులు 'భూమి తిరుగుటయే ధ్రువము' అని మెల్లగా పల్కెనట. (అశ్వత్థామా హతః, కుంజరః అను ధర్మరాజు గురుతు వచ్చును).

ఇంకొక కథయు కలదు.—అతడు తన మతమును వదలుకొనక మరణింపబోవుచు—'ఇప్పుడుకూడ భూమి తిరుగుచునేయున్నది' అని భూమిమీద పదాఘాతము చేసెనట.

సజీవరచన

(రేడియోగోష్ఠి)

అధ్యక్షులు (బెజవాడ గోపాలరెడ్డిగారు)— మన తరంలో, అనగా పోయిన పాతిక ముప్ఫై సంవత్సరాలలో తెనుగు భాషలో రచన అనేకత్రోవల నడిచింది. పాత సంప్రదాయాలు అల్లా వుంటూండగా, కొంత కొత్తదనంకూడా భాషలోకి వచ్చింది. కానైతే ఇప్పుడు జరుగుతూన్న రచన ఆంధ్రత్వం, తెనుగువారి నిత్యజీవితాశయం ఎంతవరకు చిత్రించగలుగుతోంది, ఒక వేళ ఇది జరుగనప్పుడు సజీవరచన సృష్టించడానికి మనం ఏం చెయ్యాలి అనే విషయాలు చర్చనీయం. ముందుగా మనం సజీవ రచన అంటే ఏమిటో నిర్ణయించాలి. ఈ విషయంలో శివశంకర శాస్త్రిగారు ఏమంటారో?

శివశంకరశాస్త్రిగారు—మాంద్యములో ఉన్న మనస్సులకు మహోల్లాసము కలిగించినా, కార్యతత్పరులను చేసినా, ఆ రచన సజీవమే నని స్థూలదృష్టితో అనవచ్చును. దుఃఖోపశమనము—ఏ విధానైనా సరే—చేసే రచనకూడా సజీవమే. సామాన్యలోకవృత్తముకాని, లౌకికజ్ఞానముకాని కలిగించే పాటవమే కాకుండా, అతిలోకవిషయములను కూడా అనుభూతిలోనికి తేగలిగినది కూడా సజీవరచనే. ఇంకో విధముగా కూడా చూతాము. అదివరకు ఒకరికి నీహార రూపముగా ఉన్న భావనను ధృవపరచిగాని, సంపూర్ణముగా దానిని తొలగించి దానిస్థానే నూతనచేతనము కలిగించినా గాని ఆ రచన సజీవమైనదే. లక్షణపరిష్కారము చేయడానికి వీలు లేకపోయినా, ప్రథమశ్రవణములో కాని, వీక్షణములో కాని వైచిత్రి కనబడి వినేవారిని సచేతనులను చేయగలిగితే, దానిలో జీవకళ ఉన్నట్లే.

శ్రీశ్రీగారు—సజీవరచన అంటే ఏమిటంటే నిర్జీవ రచన కానిది. నిర్జీవరచన అంటే చచ్చురాత. సమగ్రమైన సామాజికజీవితం ఎరుగని రచయితలు నిర్జీవరచన మాత్రమే చేస్తారు. కాబట్టి సజీవరచన రావాలంటే సంపూర్ణమూ, సర్వతోముఖమూ అయిన జీవితం కావాలి. పుష్టిగా, పూర్తిగా బతుకుతున్నవారే సుష్ఠుగా, స్ఫూర్తిగా రచన సాగించగలరు. అట్టివారి రచనలే సజీవరచనలు.

ప్రభాకరశాస్త్రిగారు—తన తోడిమానవవర్గముపై తన చెల్లుబడిని సాగించుకొని, (మంచిగానో, చెడ్డగానో—దాన్ని భవిష్యత్కాలమే నిర్ణయిస్తుంది) ఒక ప్రచలనము కలిగించి కార్యరంగములోనికి ప్రవర్తింపజేసే రచనలన్నీ సజీవరచనలే. వానిలో ప్రశస్త, అప్రశస్తనిర్ణయము అంత సులువుగా తేలతగినది కాదు. మానవవర్గము వివేకవిలసితమై, ప్రజ్ఞాపూరితమై పెరయుచున్నకొద్దీ ఆ రచనలలోని గుణదోషనిర్ణయము ఏర్పడగలదు.

ఎప్పుడూ, రచన—అందులో ప్రశస్తరచన—రసోల్బణమయిన ప్రతిభావికాసము గల సహృదయవర్గమే చేసేదిగా ఉంటుంది.

సామాన్యప్రజావర్గ మనే పాలలో కాకలు, పొంగులు వచ్చివచ్చి పయిపయిని తేరుకొన్న స్నిగ్ధమధురమయిన మీగడవంటిది సహృదయరచయితృవర్గము.

---

* ఆలిండియా రేడియో-మద్రాసు వారు ఉగాది నాడు జరిపిన సాహిత్య సమ్మేళనములోని ప్రసంగాలు. రేడియోవారి అనుమతితో.

దానిలో, లోలో ఇంకా కాకలు, పొంగులు, చిటచిటలు లేగి మెతకతనము తొలగి గమగమలాడుతూ నెమ్మదిగా వెలుగొనే జ్యోతివలె వెలసేది ప్రశస్తరచన. ఇరుగుపొరుగువారికి మంచి చేస్తూ పలకరిస్తూ ఆనందపరుస్తూ కలిసిమెలసి వర్తించే సజీవసత్పురుషునివంటిది సజీవప్రశస్తరచన.

మహత్తరమైన అంతరానుభూతి లేనివాని రచనలు లోతుకువెళ్లి పాతుకొనని మొక్కలవలె ఎక్కువ వ్యాపకము కాలేవు. ఆత్మానుభూతి, తత్వదృష్టి లోలోపల ఎంత హెచ్చువుంటే అంతంత వాని రచన ప్రజావర్గముమీద పనిచేయగలుగుతుంది. జీవరచనలన్నీ రసవంతము లగునా, కాదా అనే విషయములో, ఆ రసానుభూతి ప్రజావర్గముయొక్క అభ్యుదయమును, వివేకమును, వయఃపరిణామమునుబట్టికూడా వుంటుంది.

జి. వి. కృష్ణారావుగారు—రచనకు సౌందర్యమే జీవం. నిర్లిప్తత, సాధారణీకృతి, అనన్యత, ఏకత్వం, అఖండత, చిత్తవికాసం, సంతృప్తి ద్వారా వ్యక్తమయ్యేదే సౌందర్యం. సౌందర్యఅనుభూతికి, సృష్టికి సంస్కారం అవసరం. సంస్కారం లేనిచోట అనుభూతి లేదు. సృష్టి అంతకన్నా లేదు. సంస్కారం పుట్టుకతోవచ్చేది కాదు. శాస్త్రపరిచయం, కావ్యానుశీలనం, లోకానుభవం—వీటితోనే సంస్కారం కలుగుతుంది. మరోకవిధంగా లభించదు.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు—ఆс. అన్నింటికన్న ఆమాటే మరీమరీ నొక్కిచెప్పండి. అది సజీవరచనకి చాలా అవసరం. రచయితచుట్టూ ఉన్న సమాజం జీవంతో నిండిఉందికదా? దానితో సంబంధం రచయితకి సృష్టించే జీవమూ ఇస్తుంది, ఆ సృష్టికీ జీవం ఇస్తుంది. ఎటొచ్చీ ఇప్పుడు ఆ సమాజం అంటే ఏ నలుగురో కాదు. దగ్గరగా వచ్చి, చుట్టూ రచయితని పొదిగి పలికించినప్పుడు వచ్చే రచనలు ఎంత సజీవమైన రచనలేనా అవుతాయి. అనగా రచయితకు శాస్త్రపరిచయం, కావ్యపరిశీలనం అక్కరలేదని కాదు.

గడియారం శేషశాస్త్రిగారు—మనము వ్రాసేది ప్రతీది రచన కాదు. రచనకు వినోదము, చమత్కారము ఇలాంటి విశేషములు కొన్ని వుండవచ్చును. అంతకంటె ముఖ్యముగా ప్రజాజీవితఅభ్యుదయాన్ని లక్ష్యముగా తీసుకొని, వినోదాన్ని, ఉత్సాహాన్ని రేకెత్తించే వాఙ్మయవిన్యాసము సజీవరచన అనవచ్చును. అది పక్వమయ్యేకొద్దీ రససిద్ధమై శాశ్వతసరసరచన ఏర్పడుతుంది.

నార్లవారు—పుబ్బలో పుట్టి మఖలో మాడే రచనకూడా పుబ్బ, మఖలమధ్య సజీవరచనే. అంచేత శాశ్వతరచన అని సజీవరచనకు అర్థం చెప్పుకొనకపోతే ఈవిషయాన్ని గురించి ఇంతగా చర్చింపవలసిన పనే లేదు. ఏది శాశ్వతరచన కాగలదో జ్యోతిషంచెప్పడం ఎవ్వరికీ సాధ్యం కాకపోవచ్చు. తాత్కాలిక ప్రయోజనాన్ని మించి మరేదీ లేదని భావింపబడిన రచనకే శాశ్వతత్వం సిద్ధించవచ్చుకూడా. షేక్స్పియర్ నాటకాలకు శాశ్వతత్వం సిద్ధిస్తుందని ఆయనసమకాలికులలో ఎవ్వరూ అనుకోలేదు. ఆమాటకు వస్తే, షేక్స్పియరే అలాంటి ఆశకు పోలేదు. నాలుగు డబ్బులను గడించుకోడానికే ఆయన నాటకాలను వ్రాశాడు. వాటిని అచ్చువేయించడమైనా అనవసర మనుకున్నాడు. కాని వాటిలో గల శాశ్వతత్వలక్షణాలే వాటిని ఆ కాలానికీ, ఈ కాలానికీ సజీవరచనలను చేశాయి.

గడియారం శేషశాస్త్రిగారు—ఒక వ్యక్తిత్వము దేనిచే సచేతనమగునో అది జీవశక్తి. దానిలోపలి వెలుగే జీవకళ. దీనివంటి వెలుగే అచేతనములయందును కనబడుచుండును. దానినిగూడ జీవకళ యనుట గలదు. కాని వాని స్వరూపస్వభావాలు, పరిణతిప్రయోజనాలు భిన్నములు. ఆ భిన్నతను మణియందు, శిల్పమునందు, పద్మమునందు, ప్రాణులయందు, ధ్వనులయందు, వాఙ్మయములందు, మానవునందు, భావములందు అంతటను మనము గుర్తింపవచ్చును. తక్కినవానికంటె ప్రాణులయందును—వానిలో మానవునియందును, జీవకళ విలక్షణమైనది. ఇది కేవలభౌతికము కాదు. ఆత్మప్రతిబింబము. ప్రాణులయం దంతట ఆత్మవ్యక్తిత్వము కలదు. అది అప్రబుద్ధమగుటచే దానియందు జీవగుణములే సువ్యక్తము లగుచుండును. మానవునియం దట్లు గాదు. మానవత్వము జీవగుణములను ఆత్మజ్యోతియందు పక్వము చేయును. ఆ పరిపాకదశయందు జీవగుణముల

లోని మలినాంశములు కరగిపోయి అవి ఆత్మగుణములే యగును. ఆ సిద్ధి పరిపాకదశాంతరముల బట్టి యుండును. ఈవిధముగా మానవునియందలి జీవకళ ఆత్మప్రతిబింబమే యగును. అట్టి ఆత్మకళావిలాసముల వాఙ్మయరూపములే సజీవరచనలు. సజీవరచనలో జీవకళయు ఆత్మకళావిలాసమే యగును. రచనలు వాగ్రూపములు. వాగింద్రియవ్యాపారము మానవులకే ప్రధానమైనది. వాఙ్మయము మానవాభ్యుదయమునకే యేర్పడినది. అట్టి రచనలలో కేవలజీవగుణములే వర్ణితములు కారాదు. అయినచో అది మానవత్వమునే కించపరచును. దానిని సజీవరచన అనలేము. ఇంతేకాదు. దీనిని తాత్కాలికము, శాశ్వతము అని విడదీయరాదు. ఎందుకనగా జీవదశనుండి మానవత్వము పండువరకు మానవజీవితానుభూతిని వర్ణించు ఈ రచనలు ఒక్కనాటివి కావు. ఒక్క మానవునివి కావు. కావున ఇవి నిత్యనూత్నములు. శాశ్వతములు. ఇంతమాత్రమున ఈ రచనయందు తాత్కాలికములైన దేశకాలపరిణామములు ఉండవని కాని, ఉండకూడదని కాని చెప్పరాదు. జీవనదియందు వలె సజీవరచనలయందు దేశకాలపరిణామములు బాహ్యరూపమున గోచరించుట ఎంత స్వాభావికమో, వాని యంతర్వేణి అవిచ్ఛిన్నఆత్మజీవనధారగా ప్రవహించుచుండుట అంత సత్యము. కావున జీవగుణమాలిన్యములను తేర్చి ఆత్మకళావిలాసముల కూర్పునవే సజీవరచనలు.

సజీవరచనకు భాషాభావములు బాహ్యాభ్యంతర మూర్తులు. ఇంతమాత్రముననే సజీవరచన యేర్పడదు. భావసంకేతము భాష. మానవజీవితాభ్యుదయము భావము. దానిని 'సత్యం-శివం-సుందరం' చేయు సంస్కారము భావన. ఆ భావనాభావములను భాషయందు పొదుగుట సంధానము. అన్నిటికి సజాతీయసౌభాగ్యము చేకూర్చునది సంప్రదాయము. వీనిలో నొక్కొక్కటియు రచనకు జీవకళ పోయుచుండును.

భాష అనగా పదజాలము. ఇది వైయాకరణులు, ఆలంకారికులు తీర్చినదియో, నిఘంటువులలో, కావ్యములలో, వ్యవహారములో నిల్చినదియో ఏదైనను మన భావములకు సరియైన రూపము నీయగలదిగా నుండవలెను. ఎందుకనగా, పదములు నిఘంటువున, వ్యవహారమున సిద్ధమైన యర్థమునవే గాక సన్నివేశమున, సందర్భమున, సాహచర్యమున, స్వభావమున, ఉచ్చారణమున ఒక క్రొత్తవెలుగు, వింత పరిమళము, వేరు పలుకుబడి కలవై హృదయస్పందనములకు అనురణనములు చేయుచుండును. వానిని గుర్తించి ప్రయోగించినపుడే అవి రచనకు జీవకళ పోయగలవు. కొందరు వ్యవహారములో నున్నది సజీవభాష యనియు, తక్కినది నిర్జీవ మనియు అందురు. ఇది విచార్యము. వ్యవహారము రచనావిషయకము గాక నిత్యజీవితకార్యకలాప సంబంధియైనచో ఆ భాషకు సజీవనిర్జీవ వివక్ష పనిలేదు. అది వ్యవహారమాత్రప్రయోజనము కాబట్టి. వ్యవహారమునకందని పదజాలమంతయు నిర్జీవ మనుట సాహసము. రచనలోని సుసూక్ష్మభావములకు వ్యవహారములోని పరిమితపదములు చక్కని రూపము నీయలేవు. చిక్కని జీవకళ పోయలేవు. వ్యవహారములో సగానికి సగము సంకేతములతో, సైగలతో, అభినయములతో భావము చరితార్థ మగుచుండును. తక్కిన కొరతను పూరించు పరిమితపదజాలమే వాఙ్మయ మనియు, అదియే సజీవ మనియు అను టేమి సమంజసము! ఇంతే కాదు, వ్యవహారమునకు మిగిలిపోయిన భాషను కడ పెట్టినచో దాని నుపయోగించుకోలేని అరసికతయో, ఆ భాషలేని దారిద్ర్యమో మనకు మిగులును. అదియు గాక, వ్యవహారము ప్రజలది. ప్రజలు పెక్కు తరగతుల వారు, పెక్కు ప్రాంతములవారు; వారి వెంట భాషయు పెక్కు తరగతులై రచనయు పెక్కు తరగతు లగును. ఒక తరగతి మరియొకదాని దృష్టిలో నిర్జీవము కాకపోదు. ఈ విధముగా అది నియతవ్యవస్థ లేని దగును. కావున వ్యవహారమాత్రఫలకము గాక రచనకు జీవకళ పోయునదే సజీవభాష. ఇందు సంస్కృతములు, వికృతములు, దేశ్యములు, అన్యదేశ్యములు అను వివేచన పనిలేదు. చదువరులకు సూటిగా, తేటగా భావము నందీయగలిగి 'ఇది నా భాష' అనిపించుకొనదగినదే సజీవభాష. దీనిలో తెనుగుదన మెంత ఎక్కువగా పరిమళించునో అంత మిక్కిలిగా రచన సజాతీయము, సజీవము నగును. అట్టి భాష నిఘంటువులలో, కావ్యములలోనే గాక పల్లెల పలుకుబళ్లలో గూడ మనకు విరివిగ దొరకును.

భావన భావమునకు చేరినది. సంధానము భాషకు చేరినది. తోచిన భావమును ఒక భాషలో పెట్టుటగాక భావముయొక్క లోతులు తడవి సావయవముగ దానిని సాక్షాత్కరింపజేయునది భావన. ఈ భావమునకు అప్పటి అతని సంస్కారమే మూలము. ఈ సంస్కారము జన్మాంతరీయమేగాక సంప్రదాయసిద్ధమైన శిక్షణానుభూతులచే పక్వమైనది కావలెను. ఈ సంస్కారము విభిన్నమైనపుడు భావన పెడత్రోవల పట్టి భావమునకు సత్యము ఏర్పడును. విభిన్నసంస్కారము లుండకూడ దనికాదు; మానవాభ్యుదయమున కేది మార్గమో అది కావలెను. అట్టి సంస్కారమునకు సంప్రదాయసిద్ధమైన జాతీయశిక్షణమే పునాది. మఱియు ఒక భావమును భావించునపుడు తన్మూలకమైన రాగద్వేషాదులు మనలో పొంగుట సాధారణము. కవికీ స్థితి అత్యంతసహజము. కాని ఆ భావావేశమునకు అతడు పరాధీనుడు కాకూడదు. అయినచో అతని రచన విశ్వశ్రేయము కాలేదు. కవి విశ్వభావనుడైనపుడు అతనిలోని పొంగులు అంచుల కెగదట్టి సంస్కారమున నిగ్గుదేరి రచనలో జాలువారుచు తనలో ఆవేశము పొంగిపోనీని వశిత్వము ఆవేశమునుగాక ఆవేశానుభూతిని చెప్పగల ధారణయు, విశ్వభావనతో పక్వమగు సంస్కారము కవి భావనకు జీవకళ పోయగలవు.

సంధానము అనగా కూర్పు. కేవలము పదముల నొక సరణిలో కూర్చుటమాత్రమే కూర్పు కాదు. రచనలోని ఆంతరికసౌందర్యమంతయు ఇందు రూపొంది యందగించును. కావున దీని పరిణతి చాల సుకుమారమైనది. అలంకారఛందశ్శాస్త్రములు దీనిని గుఱించి పెక్కు నియమములు ప్రతిపాదించినవి. భాషోత్పత్తివ్యాకరణశాస్త్రములు తమ పలుకుబడిని ప్రతిపదమున ముద్రవేసినవి. ఏవి యెన్ని చేసినను భావమును సుకుమారముగ అందము కందించుటే వాని యుద్దేశము. మానవులు రచనలోని భావసౌభాగ్యము నందుకొని, స్వయముగా కర్తవ్యతాప్రవృత్తినందుటే దాని ప్రయోజనము. ఈ పని చేయుటలో కూర్పులోని నేర్పుతీర్పులే ప్రధానములు. ఇవి పదముల పలుకుబడితో భావముల ధ్వనింపజేయు సంప్రదాయానుభూతులవలన సిద్ధించుచున్నవి. తెనుగుదనమున ఆత్మీయతను వెలయించు ఈ పరిపాకమే కూర్పునకు జీవకళ.

శాస్త్రానురోధము అభివృద్ధినిరోధక మనియు, నియమబంధము కృత్రిమ మనియు కొందరి మతము. ప్రకృతియే నియమబద్ధము. మానవజీవిత మంతకంటె నియమవంతము. అయినపుడు మానవాభ్యుదయమునకై యేర్పడిన వాఙ్మయరచన నియమరహితము కావలె ననుట ఎట్లు? కవి తన భావముల నేకాంతగానముచేసి వాయుతరంగములలో విడుచువాడు కాడు. అతని రచనలో ప్రతివాక్యము మానవప్రవర్తనమున ప్రతిఫలించునది. మానవహృదయమున ముద్రవేయునది. మానవజీవితమున పంటకు వచ్చునది. అయినపుడు ఆ రచనకు రీతినియమము లక్కరలే దనుట యెట్లు? ఇట్లనుటతో నియమబద్ధముగాని రచన యుండదని కాదు. అట్లుండుటను మనము నివారింపలేముకూడ. అవ్యక్తములైన పిల్లల పలుకులనుండి పరిణతులైన పెద్ద ప్రసంగములవరకు ఇంటను బయటను ప్రతినిత్యము మనము రుచిచూచుచునే యున్నాము. వాని మాధుర్యమును, ప్రయోజనమును అందుకొనుచునే యున్నాము. ఇది అనుభవసిద్ధము. అయినను వాని అంతరువులబట్టియే అవి ఉపాదేయము లగుచున్నవి. కావుననే నియమము నుల్లంఘించుటకంటె జీర్ణించుకొను సత్యసంస్కారముల బలిమియే మనకు కావలసినది. నియమించు శాస్త్రము కటువే యైనను, దాని కటుత్వము కరగించి రచనలో మృదుమధురము చేయునది కళ. కళాసృష్టిలో శాస్త్రీయ నియమములే కాదు, భౌతికభావనాప్రపంచమంతయు కరగి రసమయమై విలసిల్లును. పురుషార్థములుగూడ సరసములై సుఖసంసేవ్యము లగును. కావుననే రససిద్ధమైన కవితాకళ రచనాసామగ్రిలో నంతట జీవకళ వెల్లివిరియించును.

సంప్రదాయము — రచనాసామగ్రిలోనంతట అంతర్లీనమై విలసిల్లు జీవకళ ఇది. మన మెఱుగని మన్వంతరములనుండి మనము చూడబోని యుగాంతరములవరకు మానవజీవితము వెంట నంటుకొని మణిహారములోని సూత్రమువలె ముందుకు నడుచునది సంప్రదాయము. భౌతికభావనాసృష్టియంతయు ఈ సంప్ర

దాయముతో స్వరూపస్వభావసిద్ధి పొందుచుండును. సంప్రదాయముద్ర లేని మానవజాతిలోని దాని యాచార వ్యవహారములను దేనినిగాని ఇది ఇది యని స్పష్టముగా గుర్తింపలేము. రచనలో ఏ యంగముగాని సంప్రదాయానుస్యూతము కానిచో ఆరచనకు జాతీయతాసిద్ధి పొసగనే పొసగదు. సంప్రదాయపుష్టమైన జాతీయత అవిచ్ఛిన్నధారగా ప్రవహింపని రచనకు సజీవత్వము సిద్ధింపదు. ఇట్టి సామగ్రీసంపన్నమైన రచనయే సజీవరచన.

కుటుంబరావుగారు—సజీవరచనకి అంగాలు సజీవమైన భాషా, సజీవమైన భావాలూనూ. ఏ భాషలో మనం నిత్యమూ భావచైతన్యం పొందుతామో, దాన్ని ఏ భాషలో ప్రకటిస్తామో అదే సజీవమైన భాష, వ్యావహారిక భాష. లోకోక్తులూ, సామెతలూ అందులోనే ఉంటాయి. జాతియొక్క సంస్కారాన్నీ, వికాసాన్నీ ప్రతిఫలించేవీ, పెంపొందించేవీ, అందుబాటులో ఉండేవీ సజీవమైన భావాలు. ప్రజలు సజీవరచనయెడల సులభంగా ఆత్మీయత ప్రకటించుతారు. దాని మంచిచెడ్డలనుగురించి ప్రజలకు స్పష్టమైన అభిప్రాయాలు ఏర్పడాలి. అనుమానాలు కలుగరాదు. అస్పష్టత ఉండరాదు. సాముదాయికం గనక సమాజంలోని వ్యక్తుల్ని కూడదీసి గుదిగుచ్చేదిగా ఉంటుంది.

ప్రభాకరశాస్త్రి గారు—సజీవరచన సాముదాయికమంటే నాకు తెలియదు. సజీవరచన భిన్న ప్రవృత్తులవారిని ఒక స్రోతంలోనికి తెస్తుందనే విషయములోకూడా నేను ఏకీభవించలేను. కొన్ని సందర్భములలో అట్లే వున్నా, కొన్ని సందర్భములలో ఏకముఖంగా వెడుతూన్న సంఘాన్ని ప్రబలమైన రచన చెల్లాచెదరుగా చేయడముకూడ సంభవిస్తుంది. అది మంచికా, చెడ్డకా అనే విషయము నేను చెప్పినట్లుగా భవిష్యత్కాలమే నిర్ణయింపగలుగుతుంది.

శేష—ఇప్పుడు విన్న మాటలబట్టి ఇలాంటి రచనల్లో ఏదో కదలిక కదలించే గుణము వుందనీ, అది ఏకత్వాన్ని భిన్నముగాను, భిన్నత్వాన్ని ఏకముగాను మార్చివేసి అలజడి కలిగిస్తుందేమో అనే ఆశంక తోస్తోంది. ఈ కదలిక సజీవరచనలోనే కాక జీవవంతమైన ప్రతిప్రాణి చేయు పనులలోనూ వుంటుంది. మానవుడు తక్కిన ప్రాణులకంటె సంస్కారము కలవాడై తాను లోకానికి ఏదో మంచిమార్గము చూపించుటకు చేసే రచన ఆ అలజడిని కలిగింపదా ? అయినా ఆ అన్నింటిని సమన్వయము చేస్తూ, జీవధర్మముకంటె విశిష్టమైన ఆత్మధర్మముతో, ఆత్మగుణాలనే ప్రతిష్ఠిస్తూ వుంటుంది సజీవరచన.

కుటుంబ—శేషశాస్త్రిగారు చెప్పినదానిమీద నేనూ ఒక మాట చెపుతాను. సజీవమైన రచన సంఘములో కల్పించే భిన్నత్వము నిజమైన ఏకత్వమును విచ్ఛిన్నము చేయడమువల్ల కలిగేదికాదు. సజీవమైన సంఘములో కృత్రిమమైన ఏకత్వము ఉన్నప్పుడు దానిని సజీవరచన తప్పక ధ్వంసముచేస్తుంది.

ప్రభాకర—నేనూ అనేది అదే. సజీవరచన అన్వయముఖముగానూ, వ్యతిరేకముఖముగానకూడా ఏకత్వములో బహుత్వాన్నీ, బహుత్వములో ఏకత్వాన్నీ వెలయిస్తూ అసాధారణప్రయోజనాలను సాధిస్తుంది. అదే "అన్వయముఖముగానే కాదు" అని నేను చెప్పినదాని భావము.

కృష్ణ—సౌందర్యము అఖండమైనది. కాబట్టి భిన్నభిన్నమైన విషయములన్నీ ఆ అఖండతలో లీనమౌతాయి. అందువల్ల రచన అనుభూతికాలములో ఎన్ని సంక్షోభాలు బయలుదేరినా, దుర్ఘూర్ణాపరుతాలు వీచినా, శాంతములో లయము పొందుతాయి. అందువల్ల సజీవరచన సామాజికసంబంధవిచ్ఛేదకము కాదు.

శ్రీశ్రీ—మొత్తముమీద సజీవరచన ఒక్కొక్కప్పుడు వినాశకముగా పనిచేసినప్పటికీ అది ఇతఃపూర్వము పాతుకుపోయి, ప్రయోజనాన్ని కోలుపోయిన భావాలని నిర్మూలనముచేసి, కుటుంబరావు గారు చెప్పిన కృత్రిమఏకత్వము స్థానే ఒక నూతన సమన్వయాన్ని సంపాదిస్తుంది.

గోపాల—ఇందాకా సజీవరచన అంటే ఏమిటో చర్చించాము. ఆ రచన ఎలా అవతరిస్తుందో, దాని బాహ్యాభ్యంతరరూపాలు ఎలా ఏర్పడుతాయో ఆలోచిద్దాము.

కేశవశాస్త్రి — రచనకు భాషాభావములు బాహ్యాభ్యంతరమూర్తులు. దానికి తోడై, భావన, కూర్పు, సంప్రదాయము—ఇవన్నీ ఉపకరిస్తూ వుంటాయి.

కృష్ణ—ఐతే, ఇక్కడ మరొక విషయాన్ని గుర్తుకు తెస్తాను. గుణక్రియాసమాహారమే ద్రవ్యమైనట్లుగా భావ,సంధానసమాహారమే భావము.

శివశంకర—సామాన్యంగా ఏ రచనలో అయినా సారళ్యము ఉండటము సముచితము. సరళత అన్నప్పుడు నిఘంటుశరణపదములను, విదగ్ధములను—విశేషముగా పారిభాషికపదములను, అన్యభాషాపదములను తప్పించడము తగిన పని. సారస్వతవిభాగంలో ఏ శ్రేణికి చెందినదానికి ఆ శ్రేణి ఉచితమైన పదజాలమును సమకూర్చుకోడము ప్రశస్తము. ప్రౌఢోక్తి, లలితోక్తి ఈ రెంటికినీ నడుమగా ఉండే ఉక్తివిశేషము కూడా ఉపయోగింపదగినదే. అనేకులకు అవగాహన కావలెనన్న ఆశయము కల రచనలో లలితోక్తినే లక్ష్యములో ఉంచుకోవలె. కథానకము, సామాన్యవచన, సాధారణవ్యాసము, వచననాటకము, నాటిక—ఇత్యాదిసారస్వతప్రక్రియలలో లలితోక్తినే పాటిస్తూ జాతీయములను, భాషీయములను ప్రయోగించవలెను. అందులోను కవివాక్యము కాని, కథాసంధిగాని ఈషత్ప్రౌఢముగా ఉండవచ్చును. వచనరచనలోకూడా అన్వర్థమయిన పదములను చమత్కారార్థము—కొంచెము మారుమూలలవైనా సరే, ప్రయోగించవచ్చు. మొత్తముమీద అన్వయము సరళముగా ఉండవలెను. కాని కొన్నిసందర్భములలో కాకాక్షిన్యాయము—అంటే ముందువెనుకల అన్వయము, వాక్యాంతరఅనుప్రవేశము, ముక్తపదగ్రస్తము—ఈ విధముగా గ్రథన నడపవచ్చును.

ఇక కావ్యభాషావిషయమై రెండు మాటలు. దృశ్యకావ్యములో సాధ్యమయినంత సరళత ప్రయోజనకారి. సరళత అంటే నిరలంకృతి అని భావించకూడదు. అలంకారరహితమైన రచన రమణీయము కానేకాదు. శ్రవ్యకావ్యము అందరికీ తెలుస్తుందని కాని, అనేకులకు తెలుస్తుందని కాని రచనాప్రౌఢిమను సడలనీయకూడదు. రచయిత తనకు హృదయంగమమైన అనుభూతిలో ఆనందామృతము సమకూర్చే విధానమే అవలంబిస్తాడు. దానికి అనుగుణమైన సంస్కార మున్నవారికే లోకయాత్రలో ఒక్కొక్క ఘట్టములో, ఒక్కొక్క సమయంలోనే ఉత్తమరచన ఉపాదేయ మవుతుంది. అవస్థాంతరముగాని, భావాంతరముగాని కల్గినప్పుడు ప్రశస్తరచన అయినా ప్రమోద మివ్వనే ఇవ్వదు. అనుక్షణము అనేకుల కవగతము కావాలనే వృథాశయము విడిచిపెట్టకపోతే అతిసామాన్యరచనలే వ్యాప్తమై ఉత్తమ సాహిత్యము ఉద్భూతము కాకపోతుంది. సారస్వతోపాసన వల్ల అతిలౌకికవిషయములనుకూడా భావనచేసి సిద్ధమైన కవి రూపకల్పనతో జాగ్రత్ప్రపంచానికి అవతరింపజేస్తాడు. అందుచేతనే నీరసములు, అమంగళములు, జుగుప్సాకరములు, హేయములు అయిన వింతభావాలు ఉత్తమవిశిష్టరచనలోనికి రావు. అలంకారశాస్త్రవిధానము ననుసరించి నేను అనే మాటలే కావు. మహాకవుల మార్గమును మథించిచూచినా ఇదే గోచరిస్తుంది. అటువంటి రచనను సమీక్ష చేసేటప్పుడు కవిహృదయ మేమిటి? అది సరసమా, విరసమా, నీరసమా? గ్రంథము ఎలా నిర్వహించాడు కవి? అనే ప్రశ్నలే ప్రధానము. అవాంతరప్రశ్నలు తర్వాతవి.

కుటుంబ—రచనలో ఉండే భాషను, భావాన్ని విడదీయడానికి వీలులేకపోయినప్పటికీ భావాన్ని గురించి, భాషనుగురించి విడివిడిగా చర్చించుకొనేటందుకు మనకవకాశ ముంది. మన మిప్పుడు మాట్లాడుకునేది కేవలము రచనాసామగ్రినిగురించి కాదు. కనుక సజీవరచనకు పనికివచ్చే భాషనుగురించీ, భావాలను గురించీ చర్చించుకుందాము. సజీవరచనకు సజీవభాష, సజీవభావము అవసరమని నేను ఇంతకుముందు చెప్పాను. ఏది సజీవభాష, ఏవి సజీవభావాలు అనేదాన్నిగురించి మనమిప్పుడు ఆలోచించాలి. ప్రభాకరశాస్త్రిగా రేమంటారో.

ప్రభాకర—నే నేమంటాను? మీ రన్నదే నేనూ అంటాను. అయినా నాలుగు మాటలు. మొలక మొలయడానికి క్షేత్రము పదను కావాలి. లోకోపకారకములైన

భావములు వెలయడానికి రచయితహృదయము గొప్ప పరిపాకము కలదై వుండవలె. ఆ పరిపాకపు టంతరువుల ననుసరించి భావప్రజ్వలనము ఉంటుంది. మానవ హృదయములతో ఇంతవరకు నిర్వచించడానికి వీలులేని పరమార్థానికి అభిముఖమై జరుగుతోంది. మానవవర్గమును పైమెట్టుకు తీసుకొని వెళ్ళగలిగిన మార్గములు ఈ ఉత్తమకవివర్గములో ఏర్పడును. వారు క్రాంతదర్శులు. వారు ఎంత మహోన్నత భావమునయినను సర్వప్రజాసుగమముగా చేయగలుగుట అత్యావశ్యకము. కనుక వారు భావములకు రూపు తీర్చే పరికరములను సర్వప్రజాసుగమములుగా వుండేటట్లు చూచుకోవలెను. ప్రధానమైన పరికరము భాష. అది అందరికీ తెలిసేది, అందరూ వ్యవహరించేదిగా ఉండేటట్లు రచయిత ప్రయత్నించవలెను. ఇప్పుడు సర్వప్రజలకు—మన తెలుగుదేశాన్ని గురించే మాట్లాడుతున్నాను—రాష్ట్రవిభాగముకూడా ఏర్పడబోతోంది. కనుక సమానస్వాతంత్ర్య మేర్పడుతుంది. భాషావిషయంలో. రేపటి తెలుగు సర్వప్రజల వ్యవహారంలో నుంచి తేఱుకునేదిగా వుండితీరుతుంది. భావ స్వాతంత్ర్యము ఇంతకు మున్నెన్నడూ కలుగలేదు. రేపటి కావ్యాల్లో వ్యవహారంకూడా మహోన్నత భావములు కలవై సజీవరచనలు అనిపించుకోవచ్చు.

శ్రీశ్రీ—భాషని, భావాన్ని వేరుచేసి చర్చించడాని కంగీకరించాము. కాబట్టి మొదట భాషాప్రయోగంగురించి నేను రెండు ముక్కలు చెపుతాను. భాషంటే మాటల సముదాయము. అనేక కారణాల వల్ల కొన్నికొన్ని మాటలకు ఇంతవరకు సాహిత్యరంగంలో ప్రవేశార్హత లేకపోయింది. ఏ మాటనీ ఈ విధముగా వెలివేయడానికి వీలులేదు. అందరు మనుష్యులూ జీవించే హక్కు ఎలాఅయితే ఉందో, అన్నిమాటలకీ సాహిత్యములో ప్రవేశించడానికి అలాగే హక్కు వుంది. ఈ సత్యాన్ని గుర్తించుకొని రీతినీ, ఔచిత్యాన్నీ పాటిస్తూ పదప్రయోగం చేయవలసి వుంటుందని నా ఉద్దేశము. రెండోది భావము విషయము. ఇన్నాళ్లుగా మనం అతిలోకఅమానుష ఆధ్యాత్మికవిషయాలకేసురించి ఆలోచిస్తూ నిత్యజీవితాన్నీ, సామాన్యమానవుణ్ణీ మరచిపోయామేమోనని నా అనుమానము. నిత్యజీవితములో బయలుదేరే సమస్యలూ, సామాన్యమానవుని పురోభివృద్ధికి తోడ్పడే భావాలూ ఇకమీద సాహిత్యములో ప్రాధాన్యము వహించాలి.

కుటుంబ—ప్రజలకు భావాలను సమగ్రంగా అందించి, ఆ భావాల కనుగుణమైన మానసిక చైతన్యాన్ని రేకెత్తించేది సజీవమయిన భాష. అటువంటి భాషలోనే ఒక విధమైన తియ్యదనమూ, నుడికారపు సొంపూ ఉంటాయి. లోకోక్తులు వగైరాలు అటువంటి భాషలోనే ప్రకటిస్తారు. సజీవమైన భావాలనుగురించి ఒక ముక్క. ప్రజల భావాలు వారివారి కష్టసుఖాల ద్వారా ఏర్పడుతూ ఉంటాయి. ఈ కష్టసుఖాలు, ఈ సమస్యలకు వెనకగా ప్రజల విశ్వాసాలూ, ఆచార వ్యవహారాలూ ఉంటాయి. వీటన్నిటినీ తగిలి, ఈ అన్నిటిలోనూ అభ్యుదయం కలిగిస్తూ ప్రజాజీవితానికి వికాసం చేకూర్చేదే సజీవమైన భావం.

శివశాస్త్రి—కుటుంబరావుగారు సజీవమైన భాష కావాలన్నారు. ప్రభాకరశాస్త్రిగారు అందరూ ఉపయోగించే భాష కావా లంటారు. శ్రీనివాసరావు గారు ప్రతిపదం రచనలో ప్రవేశించే అర్హత కలిగి వుండా లంటారు. ఇవన్నీ మంచివే. భాష సజీవమంటే నిర్జీవమైనదీ కొంత ఉండేమో అనిపిస్తుంది. ఏ భాష అయినా తన ప్రయోజనాలను సాధించేటందుకే పుట్టి పెరిగి వాడుకలోకి వస్తుంది. సన్నివేశము, సందర్భము ఆయా పదాలకు జీవకళ ఇస్తూవుంటాయి. ఈ విధముగా అంతా సందర్భానుగుణముగా సజీవభాషే అవుతుంది. అందరూ ఉపయోగించే భాష కవి వ్రాయాలంటే ప్రజలందరూ కవులుగానో, కవులే ప్రజలుగానో కావాలి. ఆ రోజులు రావాలని అందరమూ కోరుతున్నాము. ఏమైనా భాష వ్యావహారికమనీ, సంస్కృతమనీ, దేశ్యమనీ ఎన్నో హద్దులు చేసుకొని ఆ హద్దులవెంట నడవాలంటే రచన కుంటుపడుతుందేమో ననిపిస్తుంది. కావ్యాలలో, నిఘంటువులలో, వ్యవహారములో ఉండే పదాలేకాక సాధారణంగా రచనలోకి రాని పలుకుబడ్లు పల్లెలలో ఎన్నో ప్రాకు

లాడుతూ ఉన్నాయి. అన్నింటినీ పేకరించుకుని తన భావాన్ని అందరికీ అందీయుటములో అప్రయత్నముగా ఏభావ దొరలిపడుతుందో అది సజీవమూ అవుతుంది, అందరికీ అందుతుంది. రచయిత ఆ సంస్కార బలిమిని సంపాదించడము అవసరము. ఇక భావమంటే ప్రజాభ్యుదయము మనుకుంటాను. అది ఐహికమా, ఆముష్మికమా అని వేరు చేయడము కాదేమో? ఎందుకంటే, మనము ఐహికములో వుండే ఆముష్మికాన్ని సాధించవచ్చు. ఐహికజీవనములో చిక్కులు పడుతూ వుంటే, తరువాతి చింత మనకు పట్టదు. ఏ మానవునికైనా ఐహికజీవితములో అన్ని రంగాలలో కాకపోతే, ఏ కొన్ని రంగాలలోనైనా కొన్ని చిక్కులుంటాయి. వాటిని అధిగమిస్తూ మానవు డభ్యుదయము పొందవలెనన్న అతనికి నైతికపతనము లేని పరిశుద్ధప్రవర్తనమే శరణ్యము. మరియు మానవునిలో హృదయధర్మము గొప్పది. దానికి తోడై మేధాసంపత్తి కలదు. ఈరెంటితో నతడు తక్కిన ప్రాణిలోకమునకంటె నధికుడై వానికట్ల దైవకార్యము నిర్వహింపవలసినవా డగుచున్నాడు. అతనికి ఇల్లు నిండుటకంటె, ఒళ్ళు బలియుటకంటె, హృదయము పండుటే పరమామోదము. కావుననే స్వార్థమునకై దేవులాటకంటె పరార్థమునకై ప్రాకులాడుటయే అతని విహిత ధర్మము. ఈవిధముగ నైతికప్రవృత్తిలో, ఆత్మతృప్తిలో, పరహితప్రాప్తిలో మానవత్వము పండించుటే అభ్యుదయము. ఈ వివేకము కలిగించు భావములే సజీవరచనకు ఆయువుపట్టులు. సాంఘికముగా, దైవికముగా మానవుడొక జాతివాడనుకొనుట సహజము. తజ్జాతీయ సంస్కారము, విజ్ఞానము కండుకొలది అతడు విశ్వమానవజాతి వాడగును. అట్టి సంస్కారమును, పరిపాకమును వెలయించు భావములే రచనకు జీవకళ పోయగలవు.

కృష్ణ—భాషకీ, భావానికీ అవినాభావసంబంధముంది. కాబట్టి సజీవరచనలోని భాషాభావతత్త్వాలను కూడా జోడించే చెప్పవలసిఉంటుంది. సౌలభ్యంకోసం, శాస్త్రార్థవిచారణకోసం రెంటినీ విడదీస్తున్నాము. ఇంతకుముందు మిత్రులు చెప్పినట్లు సజీవరచనావిర్భావానికి రచయిత హృదయపరిపాకం, సమ్యగ్దృష్టి అవసరం. ఇక్కడ అభిప్రాయభేదం లేదనే చెప్పవచ్చును. అయితే సమ్యగ్దృష్టిలో కేవలప్రాచీనతా అర్వాచీనతా పక్షపాతంకాని, పాకృత్రిమభేదంకాని లేదని సత్యాన్వేషణ గోచరించాలి. ఇక భాషనుగూర్చి చెప్పవలసివచ్చినప్పుడు ఒక విషయాన్ని మనవిచేస్తాను. భాషలో లక్షలాదిపదాలున్నాయి. కాని నా ఉద్దేశములో ఏ ఒక పదానికీ మరొకటి పర్యాయపదం కాదు. కొన్నిపదాలు సమానార్థాలే అయినా సంవేదనస్థాపకత్వంలో తేడా ఉంది. అప్ప, అయ్య, తండ్రి, తాత, నాన్న మొదలైన పదాలు సమానార్థకాలే. అయినా సంవేదన కలిగించటంలో తేడా వుంది. అందువల్ల సమ్యగ్దృష్టి గల రచయిత యీ తేడాను గమనిస్తాడు. సన్నివేశము, పాత్రవాదము మొదలైన సందర్భాలకు అనుగుణంగా, సౌందర్యపరిపోషకంగా శబ్దాలు వాడుతారు. అందువల్ల రచయిత నిత్యవ్యవహారములో ఉన్న పదాలనే కాక శాస్త్రపరిభాషాప్రపంచాన్నీ యింతో అంతో స్పృశింపకతప్పదు.

కృష్ణశాస్త్రిగారు—ఏ మనిషినీ ఎలాగ వెలెయ్యకూడదో, ఏ వస్తువునీ ఎలాగ వెలెయ్యకూడదో ఏ మాటనీ అలాగ వెలెయ్యకూడదు. ప్రతిమాటకీ బోలెడంత పటిమ ఉంది. నన్నయ్యకుంటో, అంతకుముందు నుంచో ఇంతవరకూ, ముందూ ప్రతీ తెలుగువాడూ వాడే ప్రతీ మాటా మనదే. మన కవసరమూను. ఎటొచ్చీ, ఆ మాట ఉపయోగించే రచయితమీద ఆధారపడిఉంది. ఒకడి నోటిలోనుంచీ వచ్చిన మాట శవంచచ్చుమాటే. రోగి ముసలమ్మ. కాళ్ళు చాపి చతికిలబడి ఏమీ అనలేదు. మరొకడి నోటిలోనుంచి వచ్చిన మాట మనిషి. అది పలుకుతుంది, పలికిస్తుంది. కనుక ఏ పరిసరాల్లో ఏ పలుకు ఉపయోగిస్తే జీవం ఉట్టిపడుతుందో అది తెలుసుకుని ఉపయోగించడములో ఉంది విశేషం అంతా. అలాగే, మిత్రులు చెప్పినట్లు ఏ ఒక పదానికీ మరొకపదం పర్యాయపదం కాదు. ఒక్కొక్క పదానికి ఒక్కొక్క రుచీ, రంగూ, వాసనా ఉన్నాయి. కనుక కేవలమూ నిఘంటువు చూసి వాడేవాడిమాట నిర్జీవంగా ఉండి, అనుకున్న పని చేయదు.

ప్రభాకర—కృష్ణారావుగారు చెప్పినదానిలో సౌందర్యానికి ప్రాముఖ్యము ఇచ్చారు. తక్కిన గుణాలన్నీ దానిలో అంతర్భవిస్తాయి. నేను ప్రాముఖ్యమిచ్చే విషయముకూడా అందులో అంతర్భవించేదు. నేనుమాత్రము సంపూర్ణముగా వారి భావముతోనే, సౌందర్యస్థానములో పరమార్థ మనే పద ముపయోగిస్తాను.

నార్ల—భావం, భాష-ఈ ప్రశ్నకు అంతగా ప్రాధాన్య మివ్వవలసిన అవసరం నాకు కనబడదు. అనుభూతినుంచి చిత్తశుద్ధితో వెలువడిన రచన తను స్వభావాన్ని, స్వరూపాన్ని తనకు తనే సమకూర్చుకుంటుంది. ఏదైనా వ్రాసి వేయాలని కూర్చుంచేసే ఈ చిక్కులైనా, చర్చలైనా.

శివశంకర—సారస్వతాన్ని పరిశీలన చేసేటప్పుడు నిస్సారరచనలజోలికి పోకూడదు. ఉత్తమమైనవానినే ఉపలక్షించడము భావ్యము. ఈ విధానాన్ని అనుసరిస్తే అధునికసాహిత్యములో చాలా మంచి రచనలు ఉన్నవి. ఇన్ని సంవత్సరములు వృథాగా పోలేదనే నా విశ్వాసము. ముఖ్యముగా కథానిక, ఏకాంకిక, ఖండిక ఉద్భవించి ప్రవృద్ధి చెంది ప్రస్ఫుటరూపము పొందినవి. వీటిలో చాలా వైవిధ్యముకూడా గోచరిస్తుంది. తక్కిన సారస్వతశాఖలలో కూడా చాలా మంచి కృషి జరిగినది. ఉదాహరణలు ఇవ్వనవసరము ఉచితము కాదు. దేశీయభాషలతో పోల్చి మాస్తే మన సారస్వతము ఏంతమాత్రము తగ్గకపోగా పైచేయిగాకూడా ఉంటుంది. ముఖ్యముగా ఆంధ్రపద్యమునకు సాటిరాదగినది ప్రపంచములో లేదు. అధునికాంధ్రకవులలో అనేకులు ఉన్నతస్థానమునకు చేరినారు. మనకు ఇంచుమించుగా ౧౦౦ ఉత్తమకావ్యములున్నవి.

నార్ల—మనలో విద్యావంతులకు ప్రజాబాహుళ్యముతో సంబంధం తక్కువ. ప్రజాబాహుళ్యానికి విద్యతో సంబంధం తక్కువ. పాశ్చాత్యభావాలు తెలిసి, అధునికసాహిత్యరీతులతో సంబంధం గలవారికి జాతీయసంస్కృతితో, సంప్రదాయాలతో సంబంధం తక్కువ. జాతీయసంస్కృతీ, సంప్రదాయాలూ తెలిసినవారికి పాశ్చాత్యభావాలతో సంబంధం తక్కువ. ఇదికూడా సజీవరచనలు వెలువడ్డానికి ఒక పెద్ద ఆటంకమే.

ప్రభాకర—అధునికసాహిత్యంలో ఏదో ఉన్నత సంఘంవారు, వారి పైయెత్తు భావతో ఇంతవరకు ఒక్క సాహిత్యప్రయోజనంమాత్రం కొంతకొంత సాధించడం జరుగుతోంది. ఈ ప్రౌఢసాహిత్యం ప్రజాసామాన్యాని కేమాత్రమూ పనికిరాదు.

పాతిక ముప్పైయేండ్లనుండి లఘుకథలు, లఘునాటికలు, వృత్తగంధిరచనరచనలు, గేయరచనలు తెల్గునాట కొన్ని మంచిమంచివి సాగుతున్నవి. వీనిలో కొంత అపూర్వత, సౌలభ్యం ఉంటున్నది గాని ఇవి దేశములోని సంక్షోభములను, నిరాశలను వెల్లడించడమే కాని మానవసాక పరమార్థము గట్టు చేరగలందులకు అట్టే ఉపకరించేవిగా లేవు. వీటిలో కొన్ని విలాసివిలసితములతో కావ్యానికి లక్ష్యంగాకూడా ఉన్నవి.

శేషశాస్త్రి—ఈనాటి సాహిత్యంలో సజీవరచన బొత్తిగా లేదని యెవ్వరమూ అనలేము. అయినా ఇప్పటికీ పలుకుబడిని గడించిన పాశ్చాత్యసంపర్కము తర్వాత భారతసాహిత్యమును పూర్తిగా మార్చివేసినది. ఇరువదవ శతాబ్దపు మొందటిరోజులలో అటు సంస్కృతము న కనువాదములో, ఇటు అన్యదేశీయ రచనల కనుకరణములో మందముగా సాగినవి. స్వతంత్రరచనలు కొన్ని లేకపోలేదు. సంఘసంస్కారములను, ప్రణయపరమార్థములను గూర్చిన అవ్యక్తభావాలాపన కొంత జరిగినది. కాని అంతటను నిరాశానిర్వేదచ్ఛాయలు అలముకొన్నట్లున్నవి. ఏమైనను అవి చీకటిరాత్రులు. తన్ను గూర్చిన అజ్ఞానము—ఎదుటిని గూర్చిన వ్యామోహము—నాడు ప్రబలిపోయినది. ఇదంతయు పరదాస్యప్రభావము.

నార్ల—విదేశీదాస్యంవల్ల మన జీవితరంగం అతిపరిమిత మైపోయింది. అంచేత మన సాహిత్యరంగంపరిహద్దులుకూడా పరిమితం కాక తప్పలేదు. సైనిక, నౌకా, వైమానికరంగాలలో నిన్న మొన్నటి

వరకు మనకు దాదాపు ప్రవేశం లేదు. వేటకు వెళ్లడం కొండల్ని ఎక్కడం, అడవుల్ని దాటడం మొదలైన సాహసచర్యలు మన జీవితంలో సున్న. అన్యదేశాలతో, జాతులతో మనకు ప్రత్యక్షసంబంధం తక్కువ. ఒక్కమాటలో వైవిధ్యానుభూతికి మనకు అవకాశాలు తక్కువ. పరిమితరంగంలో సంకుచిత జీవితాన్ని మన జాతి గడుపుతూన్నంతవరకు సజీవరచనలు జరగడం కష్టమే. ప్రస్తుతం సజీవరచనల సంఖ్య తక్కువైతే అందుకు ఇదే కారణం.

కృష్ణ—సజీవరచనల కొరతకు సామాజికజీవితంలోని లోటే కారణం. సామాజికజీవితంలో మాంద్యం బయలుదేరి చైతన్యవిరహితం కావడానికి అనేక కారణా లున్నాయి. అయినా మూలకారణా లన్నీ పేర్కొనవలసివచ్చినప్పుడు తాత్వికరంగములో బయలుదేరిన స్తబ్దతనే ప్రధానంగా చెప్పవలసి ఉంటుంది. సర్వఅనర్థాలకు హేతువైన పారతంత్ర్యం మనకు ప్రాప్తించడానికి కారణం మన సమాజంలో అప్పటివరకు ఉంటూవచ్చిన ఆదర్శాలు, సిద్ధాంతాలు, తత్త్వాలే కారణం. విదేశదండయాత్రాప్రవాహం వచ్చిపడుతున్నప్పుడు దాన్ని అరికట్టడానికి తగిన ఉత్తేజం, జసంఘీభావం, ఆదర్శదీక్ష ప్రజలలో ఉద్దీపింపజేయగలిగిన శక్తి ఆనాటి భావాలకు, సిద్ధాంతాలకు, తత్త్వార్థాలకు లేకపోయింది. అందువల్లనే దేశం చీలికగా పరాధీన మైపోయింది.

ఇలా ప్రాప్తమైన పారతంత్ర్యంతో రెండు అనర్థాలు వచ్చిపడ్డాయి. మొదటిది దాస్యభావం. పాలకులు ఏమి చేసినా, చేస్తున్నా అదంతా శాస్త్రీయమనీ, ఉదాత్తమనీ, అవశ్యం అనుకరణీయమనీ, శాస్త్రం, సాహిత్యం అసలు మనకు పూర్వం లేవనీ భావించటం జరిగింది. రెండో అనర్థం ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు. పాలకవర్గంమీద ఉన్న ద్వేషంకొలది ఆ వర్గానికి సంబంధించిన శాస్త్రార్థాలు, కావ్యాలు, కళలు సర్వం పరిహరణీయాలనీ, కేవలం పూర్వవ్యవస్థను యథాతథంగా తిరిగి నెలకొల్పడమే పరమార్థమనీ భావించటం జరిగింది.

ఈ రెండు అనర్థాలు సమాజంలో ప్రబలంగా పాతుకుపోవటంవల్ల ప్రాక్ప్రతీచీసంస్కృతిసమన్వయం చేసి సర్వతోముఖాభ్యుదయకర మార్గాలు చూపుతూ వెలువడిన కొలది కృతులుకూడా ప్రజలలో వ్యాప్తం కాలేదు. వర్తమానరచయితలకైనా కొంతకాలంపాటు అలాంటి జీవరచనలు వరవళ్ళు కాలేకపోయాయి. ఇందుకు వీరేశలింగంగారి కృతులు, కన్యాశుల్కం, ప్రతాపరుద్రీయం, మాలపల్లి నిదర్శనాలు.

ఇప్పుడు పారతంత్ర్యంలో లేము. ఇక ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు ఉండవలసిన పనిలేదు. అందువల్ల కేవలం సత్యం, సౌందర్యం, అభ్యుదయం అర్థించి కృషి చేయాలి. సమాజం విజ్ఞానవంత మైతేతప్ప సజీవరచన బయలుదేరడానికి కాని, వాటిని ఆస్వాదించటానికి కాని వీలులేదు. అందువల్ల వివిధశాస్త్రార్థాలు ప్రజలలో వెదజల్లాలి. ప్రాచీన అర్వాచీనసాహిత్యాల విశిష్టత అవిశిష్టతలను వివరించి చెప్పాలి. నాటకప్రదర్శనాలు, సాహిత్యగోష్ఠీ ఇతోధికంగా జరగాలి. ఇవన్నీ సామాన్యమానవుని దృష్టిలో ఉంచుకొని జరపాలి కాని కేవలం కొలదిమంది విద్వాంసుల ప్రశంసకోసమో, లేక అంతర్జాతీయ ప్రశస్తి సముపార్జనకోసమో కారాదు.

శ్రీశ్రీ—మానవచరిత్రలో ఇదివర కెన్నడూ కని విని యెరుగని సదవకాశాలు ఈనాడు మనకు లభ్యమైనాయి. ముద్రాయంత్రం, సినిమా, రేడియో ఇవన్నీ అసంఖ్యాకులైన ప్రజాబాహుళ్యానికి సరసరచనలను అందజేయగల అవకాశాలు. అయినా ఆయుధాలు ఎన్నివున్నా వాటిని ఉపయోగించవలసినవాడు మానవుడే కాబట్టి ముందుగా అతడు బాహ్యప్రపంచములో కలిగిన మార్పులకు అనుగుణంగా తన రచనావిధానాలనూ, మనఃప్రవృత్తులనూ మార్చుకోగలగాలి. ఆయుధం స్వయంగా మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. శస్త్రవైద్యుడి చేతిలో వ్రణఖండనద్వారా ఆరోగ్యాన్ని ఇవ్వగలిగిన కత్తి హంతకుని చేతిలో ప్రాణహరణకి ఉపయోగిస్తుంది. నేడు మనకు లభ్యపడిన యంత్రాలు మంచికీ, చెడ్డకీకూడా ఉపయోగింపవచ్చును. ఈ మంచిచెడ్డల నిర్ణయం భవిష్యత్తుకి వదలిపెట్టడం భావ్యం కాదు. ఎప్పటికప్పుడే వీటిని మనం నిర్ణయించుకుంటూ ఉండాలి. క్రొ సదవ

ద్వేదనకి ఒకే ఒక్క ప్రామాణ్యం నేను గుర్తిస్తాను. అదేమిటంటే సాహిత్యం ప్రజాసామాన్యాని కెంత చేరువగా రాగలిగిందీ అని. ఈ దృష్టితో చూస్తే మన కున్న అవకాశాలకీ, మనం ఇంతవరకు సృష్టించగలిగిన సాహిత్యానికీ హస్తిమశకాంతరం కనవస్తోంది. అనగా ఈనాడు సజీవరచన వెలువడలే దని కాదు. రావలసి నంత సమృద్ధిగా రాలేదనే నా ఆవేదన.

వార్ల—సజీవరచన సమృద్ధిగా వెలువడ్డానికి శ్రీశ్రీ చెప్పిన అర్థవపరవిషయాలలో మనఃప్రవృత్తిలో పరివర్తనకు నేను అధికప్రాధాన్య మిస్తాను. లలాట లిఖితం, పురాకృతం మొదలైన మతవిశ్వాసాలవల్ల నేమి, మన సాంఘికఆర్థికవ్యవస్థల ఫలితంగా నేమి, కష్టాలను, బాధలను, అన్యాయాలను సహించడమే మన జాతికి ఒక ప్రధానలక్షణ మైంది. జీవితం ఎంత దుస్సహమైనా, ఏదో ఒక విధంగా దాన్ని భరించడమే మనకు చేతనైన పని. కాకపోతే, మన దేశంలోని దారిద్ర్యానికీ, దైన్యానికీ ఏనాడో ఎన్నో విప్లవాలు చెలరేగి వుండవలసింది. కష్టాలకు, బాధలకు మన జాతి నిరసనైనా తెలుపకుండా భరించినంతవరకు సజీవరచనలు వెలువడ్డం కష్టం.

కుటుంబ—సజీవరచనలు సాగడానికి నా దృష్టిలో ఈ అంతరాయాలు కనిపిస్తున్నాయి. ఒకటి ఇతరభాషాసంపర్కం. కేవలమూ పరభాషాసంపర్కం వల్ల జాతీయభాషాభావాలు నశించిపోతాయని నా అభిప్రాయం కాదు. కాని ఈ సంపర్కం ప్రజాజీవితంలో కలిగే పరివర్తనకు అనుగుణంగా జరగలేదు. ఒకవంక జీవితంలో ఉన్న సంస్కృతికీ, మరోవంక సాహిత్యంలో ఉన్న సంస్కృతికీ మధ్య అగాధం ఏర్పడింది. వ్యక్తిస్వార్థానికీ, సంఘక్షేమానికీ సామరస్యం లేకుండాపోయింది. మన దేశాన్ని ఇంత కాలమూ బాధించిన దాస్యంమూలంగా ఈ సమస్య మరింత క్లిష్టమయింది. సామాజికసమస్యల పరిష్కారానికి రాజకీయప్రతిబంధకాలు హెచ్చినకొద్దీ సజీవరచన వెనకపడింది. గ్రాంథికభాషావాదంకూడా సజీవరచనలకు అవకాశం లేకుండా చేసింది. వ్యావహారికభాషావాదాన్ని ప్రచారంచేసిన గిడుగు రామమూర్తిపంతులుగారు సజీవరచనలకు గొప్ప దోహదం చేశారు. ఈనాడు ప్రజలను కదలించే రచన లన్నీ వ్యావహారికభాషలోనే వెలువడటం మనం చూస్తున్నాం. ఇప్పటికీ మన విశ్వవిద్యాలయాలు వ్యావహారికభాషను నిషేధించటం శోచనీయం.

ఇకముందు సజీవరచనలు విరివిగా రావాలంటే జరగవలసిన మార్పులు చాలా ఉన్నాయి. అందులోకల్లా అతిముఖ్యమైనది స్వాతంత్ర్యం. రచయితకు సంపూర్ణస్వాతంత్ర్యం లేక సజీవరచన చెయ్యలేడు. మనకు రాజకీయస్వాతంత్ర్యం వచ్చింది కాని, భావస్వాతంత్ర్యం వచ్చినట్టు కనపడదు. రెండోవిషయ మేమిటంటే, రచయితలకు భావస్వాతంత్ర్యంఉన్నంత మాత్రంచేత సజీవరచనలు రావటానికి మార్గం ఏర్పడదు. ఆ స్వాతంత్ర్యాన్ని రచయితలు ఉపయోగపరచు కునే స్థితిలో ఉండాలి. అంటే, నా అభిప్రాయం—వారి జీవితాన్నీ, జీవితసమస్యలనూ, సాంఘికపరిణామాన్నీ సంపూర్ణంగా అవగాహనచేసుకోవాలి. జీవితం వారికి కరతలామలకంగా ఉండాలి. ఆ పైన, నిష్పాక్షికబుద్ధితో రచయిత సంఘంయొక్క ఉమ్మడి మంచికోసం కృషిచేసే విశాలహృదయమూ, సంస్కారమూ కలవాడై ఉండాలి. స్వార్థంకొరకు అల్పసంఖ్యాకవర్గాలను సమర్థింపరాదు. రచయితకు ప్రజల జీవితంమీదా, వారి జీవితవిధానాలమీదా, వారి భావాలమీదా ఆదరాభిమానా లుండాలి. జీవితాన్నీ, జీవితసమస్యలనూ, ప్రజల దుస్థితినీ చూసి ఏవగించుకుని పలాయనంచేసే రచయిత సజీవరచనలు చెయ్యలేడు.

వార్ల—కుటుంబరావుగారితో నేను ఏకీభవిస్తున్నాను. అయితే మరొక ముక్క చెప్పడంకూడా అవసరం అనుకుంటాను. వృత్తి, వివాహం ఈ రెండింటినీ మించి మానవుని జీవితానికి స్వరూపాన్ని దిద్దగలిగిన ప్రధానసంఘటనలు లేవు. అతడి వ్యక్తిత్వం, అతడి వికాసం, అతడి ధనికత్వం, అతడి సుఖం, అతడి ఆనందం—అన్నీ వీటిపైనే అధికంగా ఆధారపడి

వుంటాయి. ఈ రెండు ముఖ్యవిషయాలనుగురించి స్వయంగా, స్వతంత్రంగా నిర్ణయించుకొన్నప్పుడే అతడి పరిపూర్ణత్వం. కాని మన సంఘంలో చాలవరకు కులమే వృత్తిని నిర్ణయిస్తున్నది. కాగా, తల్లిదండ్రులే చాలావరకు వివాహాన్ని నిర్ణయిస్తున్నారు. దీనితో వ్యక్తిత్వం నశిస్తున్నది. నిస్సహాయత్వం ప్రబలుతున్నది. ఎంత చిన్న చిక్కు వచ్చినా, దాన్ని ఎదుర్కొనడానికి మారుగా, పక్కకు తొలగాలనే తాపత్రయం పెరుగుతున్నది. ఈ మనఃప్రవృత్తి మన జాతిని నిర్వీర్యం, నిస్తేజం చేసివేస్తున్నది. ఈ దుస్థితి తొలగి వ్యక్తిత్వం పరిపూర్ణంగా వికసిస్తేనేగాని సజీవరచన వెలువడదు.

శివశంకర—ఆంధ్రసాహిత్యము ఇంకా ఉత్తమము కావలెనంటేనూ, ఆంధ్రహృదయము రచనలలో ప్రతిబింబించవలెనంటేనూ రచయితలు కొన్ని విషయములు గమనించవలె. విధిగా సంస్కృతభాష అభ్యసించి, అందులో ఉత్తమవిధానములు అవగతము చేసుకోవడం ప్రథమము. ఆంధ్రభాషలో కూడా ఇంకా కృషి జరగాలి. ముఖ్యముగా వివిధ ప్రాంతములలో ఉన్న విశేష పదసందోహమును, వివిధవృత్తులవారి విశిష్టశబ్దజాలమును సంగ్రహించి, గ్రహించి, సమీక్షించి రచనలో సంధించవలె. అన్యభాషలో ఆలోచన చేయడముకన్న మాతృభాషలోనే మంచి భావన చేయడము ప్రశస్తము. అన్యభాషాగ్రంథములు పఠించినా వాటి ప్రభావము పరిస్ఫుటము కానీయకుండా సమ్యగ్దర్శనానికి చాలినంత మట్టుకే స్వీకరించాలి. మన సంభాషణావిధానము, ఆచారవ్యవహారములు, లోకవృత్తము, సంప్రదాయాలనూ ఇంకా తరచి చూడవలె. భారతీయహృదయమంటే ఏమిటో గ్రహించి, ఆంధ్రుడు దానిలో ఎంతవరకు ఇమడగలడో గాఢముగా యోచించవలె. జాతీయ, దేశీయ, ప్రాంతీయ భావాలకు ప్రాధాన్య మివ్వాలి. ఎరువు తెచ్చుకున్నట్టుండే అన్యభావాలనూ, ప్రభావమునూ పరిత్యజించాలి. అన్నిటికన్నా అంతర్ముఖత్వము అవలంబించాలి. అప్పుడు ఆత్మానాత్మవిభేదము విస్ఫుటమై స్వరసము గోచరిస్తుంది. దానివల్ల స్వారస్యము సంభృతమవుతుంది.

శేషశాస్త్రిగారు—ప్రజాజీవితమున నైతిక, సాంఘిక, రాజకీయాదిరంగములలో ఏనాటి కానాడు ఏవో విప్లవప్రతిఘటనలు జరుగుచునేయుండును. అవి దేశకాలపరిస్థితులకు సంబంధించినవి. ప్రజలలో నొకడైన కవి వారితోపాటు తానుకూడ నాటి యావేశోద్వేగములకు గురియగుట సహజము. కాని, దానితో అతని యాత్మశక్తి కుంఠితము కారాదు. ఆ వర్తమాన సంక్షుబ్ధసాధకకల్లోలములలో అచంచలుడై నిలిచి భూతానుభవముతో భవిష్యత్తునకు అభ్యుదయపథము వేయవలసిన బాధ్యత అతనిపై గలదు. భౌతికసంపదను భోగించుటకై ప్రాకులాడుటయు, అది యందనిచో ఆక్రోశించుటయు సామాన్యప్రజాగుణము. ఈ సంరంభమున మానవధర్మనీతి సంప్రదాయముల సరిహద్దులు చెదరగొట్టుకొని పోవుటయు వింతగాదు. దీనికి కామక్రోధాదుల కుమ్మక్కు మిక్కుటముగా నుండును. ఈ యలజడిలో కవి స్థితప్రజ్ఞుడై తన రచనలో అట్టి తాత్కాలిక సంఘటనలు ఇట్టి ప్రజాసామాన్యగుణముల వర్ణించుచున్నను, ఈ చీకటియాటలో లోపలి ఆత్మదీపమును వెలిగింపనిచో ప్రజలు తమ నీడలనైన తాము గుర్తింపలేరు. కవీ ఆ ప్రజల ప్రీతిగౌరవసన్మానముల కాసపడినచో తనధర్మమును తాను నిర్వహింపలేడు. మఱియు తన రచనను తాత్కాలిక ప్రయోజనముల కుపయోగింపదలచినచో వాని జీవితశక్తి అంతటితో నంతరించి భావిసంతతికి ఏమియు మిగులకపోవును. అప్పుడు సాహిత్యసుప్రతిష్ఠలేని జాతికి వర్తమానమున విలువలేదు. భవిష్యత్తున వెలుగులేదు.

ఇందుకు సమగ్రమైన భాషాదేశచరిత్రములను, సజాతీయమయిన సంస్కృతిసంప్రదాయములను సాధింపవలయును. ఆ యౌన్నత్యమంతయు సాహిత్య ప్రతిబింబితము కావలయును. ఆ సాహిత్యము శాస్త్రీయ సంస్కారముతో, కళామయజీవితముతో పరిపక్వము కావలయును. ఆ పరిపాకమంతయు సక్రమపద్ధతులలో, అధ్యయన-అధ్యాపనములతో ప్రచారితము కావలయును. దానికి తగిన పాఠ్యప్రణాళికయు, శిక్షణ విధానము, నెలకొనవలెను. ఈ మహాయజ్ఞమునకు

సాహితీసంస్థలు, విద్యాపీఠములు, ప్రజలు, ప్రభుత్వము, పత్రికలు, పాఠశాలలు—అన్నియూ ఏకదీక్షతో నడుము కట్టవలెను. తెలుగు నేలలో నాలుగు చెరగులు నా జాతి, నా భాష, నా సాహిత్యము అను అభిమానోత్సాహము లతో పరిమళింపవలెను.

ప్రభాకర—ఇప్పుడు ప్రజావర్గమంతా అన్న వస్త్ర దారిద్ర్యముతో, జ్ఞానదారిద్ర్యముతో తహతహ లాడుతున్నది. ముందు ఈ దారిద్ర్యబాధ తొలగ వలెను. రచయితృవర్గమంతా ముందుగా ఈ క్షామనివా రణమునకు సహాయపడే రచనలు సర్వతోముఖముగా సాగించవలసిఉన్నది. అవి పద్యకవితా రచనలు గావు. ప్రజల భాషలోనికి ప్రపంచవిజ్ఞానమంతా దించేవి కావలెను. అవి వచనరచనలే. వచనరచనలలోనే మోస గింపు లేని, నిద్దమైన భావప్రసారం ఉంటుంది.

తెలుగుదనము నిండార్లుగా పొంగి పారే రచనా వాహిని తెలుగునాట ఇకమీదనే వెలయవలసిఉన్నది. రచనకు భావముతోపాటు భాషకూడా సమయోగ్యత కలది. అందుకై ముందుగా, వడివడిగా భాషాసాధన సామగ్రీసంపాదనము జరగవలెను. ఆంధ్రసాహిత్య సాధనమునకు పునాదులయిన నానుళ్ళు, పలుకుబళ్ళు, సామెతలు, జంటపలుకులు, లజ్జులు, పలుకుగుత్తులు, పనిపాటలవారి పరిశ్రమగీతాలు, బాలకుల ఆటపాటలు, స్త్రీల సౌభాగ్యగేయాలు, నోములపాటలు, బిచ్చ గాండ్ర పాటలు, భక్తుల ప్రార్థనగీతాలు, వృద్ధుల వేదాంతకీర్తనలు, చమత్కారకథలు, పొడుపుకథలు, ఊళ్ళకథలు, వారి చరిత్రలు, ఊళ్ళలోని పూర్వపు పెద్దల కథలు, అక్కడి శిల్పములు, గ్రంథములు, జాతిపరిశ్రమలు, వాటి సంప్రదాయములు, బిరుదా వళులు, ఆచారవ్యవహారములు, గుళ్ళు, వాటి చరిత్రలు, శాసనములు, వాటిచరిత్రలు, నదుల కొండల ఊళ్ల మనుష్యుల పేళ్ళు, వాని పుట్టుపూర్వోత్తరాలు వగైరాలు దేశంనాలుగుచెరుగులనుండీ సేకరించడం జరగ వలెను. ఇటువంటివాటిలో ఆయా జాతుల ప్రజల సహజాభిరుచులు, పలుకుతీరులు, కూర్పునేర్పులు, ఛందస్సౌందర్యములు, సారస్యవైరస్యములు, ఆశావాస నలు అన్నీ అమాయికముగా అద్దములోవలె ప్రతిఫ లిస్తూఉంటై.


కృష్ణశాస్త్రిగారు—భయంలోనుంచి అసత్యం పుడుతుంది. అసత్యం ముసలీ, మృత్యువూను. కనుక అసత్యంలోనుంచి చైతన్యంతో ఊగిపోయే, తూగి పోయే సృష్టి ఎలాగ వస్తుంది, చెప్పండి. ఇంక, అసత్యం అనాకారంగాకూడా ఉంటుంది. అందుచేత అలా చూసీచూడ్డంతో కృష్ణారావుగారి సౌందర్యమూ, ప్రభాకరశాస్త్రిగారి పరమార్థమూ, శివశంకరస్వాముల శివమూ ఒకటే అవుతాయి. కనుక సత్యం తెలుసుకుని పలకడానికి రచయితకి భయం ఉండకూడదు. తూర్పు పడమర లనీ, హెచ్చు తగ్గు అనీ మానవుని విడదీసే భావం పూర్తిగాపోవాలి. మానవులందరూ కలిసి సమాన హక్కులతో, సమానభోగభాగ్యాలకోసం ఒక కుటుంబం అయారు అన్నది తెలుసుకొని అనుభవించి తీరాలి. అసలు విడదీసి అంతరాలు ఏర్పరిచే అంత రంగభావమే అనాకారమైనదీ, ద్వేషపూరితమైనదీని. అది పూర్తిగా నశించాలి.

గోపాలరెడ్డిగారు—ఎవరు ఎన్ని లక్షణాలు చెప్పినా, సజీవరచనకి దృష్టాంతం చెప్పమంటే అందరూ ఒకటే చెబుతారని తోస్తుంది.

రచన, రాగము రెండూ ఒకటే తరగతి కళా సృష్టికి చెందినవి. రచనకీ, రాగానికీ కూడా రసమే ప్రాణం. ప్రాణం వున్న రచనే సజీవరచన అని ఇప్పుడు సభ్యులంతా అనేకవిధాలుగా నచ్చచెప్పారు. ఆ ప్రాణం జాతిలో ప్రాణం కలిగినప్పుడే రచనలోకూడా వుంటుంది. శివశంకరశాస్త్రిగారు చెప్పినట్టు మనకి ఉత్తమరచన లేకపోలేదు.

మన దేశంలో ప్రతివిషయానికీ పెదవి విరిచి, నిస్పృహ చెందడం ఒక రివాజు. అది మన జాతికి సంభవించిన ఒక లక్షణం. తెనుగుభాషలో ఆధునిక రచన ప్రారంభంఅయి ఏభై సంవత్సరాలు కాలేదు. పద్యకవితలో చెళ్లపిళ్ల మొదలు శ్రీరంగంవరకూ, గద్య కవితలో చిన్నయసూరి, వీరేశలింగంమొదలు చెళ్లపిళ్ల వరకూ తెనుగుభాష ఎన్ని కొత్త పోకడలు, వొయ్యారాలు, సోయలు సూచించిందో చెప్పలేం.

సజీవరచన వృద్ధిచెయ్యాలి అంటే, మనం వో జాతీయప్రణాళిక తయారుచేసి, ఆమోదిస్తే అది జర గదు. "కట్టుబొట్టులో కవిత్వమా?" "సంకెళ్లలో సంగీతమా?"-అన్నట్టు రచన ఒకరు ఆపేదీ, మరొకరు ప్రేర పించేదీ కాదు. ఆంధ్రదేశంలో ప్రతి తెలుగుమనిషీ కవేనన్నాడు హరీంద్రనాథ్. ఆ మాట నిజమే. అందువల్ల మనకి ఏమీ భయం లేదు. ఇంత ఉత్సాహం, ఇంత ఉద్రేకం వున్న జాతిలో కవితాధార అరికట్టడం ఆ బ్రహ్మదేవుడి తరం గాదు.



సింహాచలం కొండపై నృసింహస్వామిఆలయ ముఖద్వారము

తెలుఁగు పాట

★

శ్రీ పాలెపు వెంకటరత్నం

మహిత భారత స్వాతంత్ర్యమంటపమున
భరతజనయిత్రిపావన పాదపద్మ
సన్నిధిని గాయకులు పాడసాగినారు
పావనాంధ్రజాతీయగాథావళులను.

శాతవాహనవిమలవంశప్రభూత
మై వెలిఁగిన సద్విమలాంధ్రదీప్తి
సకలభారతదివ్యవేశ్మమున నిలిచి
వెలుఁగుఁ జూపిన దారి దీపకళికవోలె.

మగధఘూర్జరబర్బరమాళవాది
సకలదేశరాజన్యప్రశస్తమకుట
రత్నకాంతిచ్ఛటాతివిరాజితామ
లాంఘ్రియుగసముపేత మా 'ఆంధ్రమాత'.

వీరచాళుక్యనిశ్చలవిజయహేతి
దీధితుల శాత్రవావళీదృష్టిరోధ
కరమహావీరభావసంగతమహోజ్జ్వ
లాత్మశక్తిసమేత మా 'ఆంధ్రమాత'.

విమలగోదావరీకూలవీథి రాజ్మ
హేంద్రసింహాసనాధ్యాసిహృదయజనిత
పావనాశయసముదయఫలమనంగ
మాకు భారతామ్నాయసంప్రాప్తి కలిగె.

నన్నయామ్రకుజంబు-తిక్కన్నపనస
ఘనమహీరుహ, మెఱ్ఱనకదళితరువు
తెలమిఁ గురిసిన మధురసవిలసితంబు
మాకు దొరకిన భారతామ్నాయఫలము.

ఏకశిల రాజధానిగాఁ 'గాకతమ్మ'
యిష్టదేవతగా శ్రీమహీశచరణ
పద్మసేవానియతి సద్వ్రతంబుగాఁగ
కాకతీయయశఃకాంతి గ్రాలె దిశల.

కాకతీయతురుష్కసంఘర్షణాగ్ని
జనితవిస్ఫులింగావళీచటులకాంతి
కనులు మిఱుమిట్లు గొన దిశల్ కానలేక
సమదశాత్రవనివహముల్ సన్నగిల్లె.

నందనందన చరణారవిందయుగళ
సుందరేందిందిరము కవిబృందవంద్య
భావనామయమూర్తి శ్రీ భాగవతమ
హాపురాణ మొనర్చె రామార్పణమ్ము.

భక్తి నెల్లపుడును దన పాదపద్మ
నిత్యసేవాపరాయణనియతులైన
రడ్డిరాజన్యవిమలశౌర్యప్రమోద
కలిత సద్గుణవల్లి మా తెలుఁగుతల్లి.

తెలుఁగుపలుకులఁ గల తీరుఁదీయములను
తెలిసి కావ్యసరస్వతిఁ గొలిచియున్న
భవ్యబుద్ధి మా కవిసార్వభౌమమహాళి
నాఁడె మాజాతికిడె మహానందభిక్ష.

విజయనగరరాజ్యేందిరావిమలహృదయ
సరసిజాంతర్ద్విరేఫమా చక్రవర్తి
శారదాస్తన్యపానస్వాదుజలముపోసి
మంచి పూఁదోఁట మాపీటఁ బెంచినాఁడు.

పెద్దనగులాబులు, తెనాలిముద్దమల్లె
పూలు, తిమ్మనపారిజాతాలు, రామ
భద్ర శేఫాలికలు, దివ్యపరిమళయుత
ధూర్జటికురంటకాదులు దొరకె మాకు.

సింహపురి, వీరపలనాఁడు, శ్రీకకుళము
రాణ్మహేంద్రము, బొబ్బిలి రాజధాను
లై సకలభారతీయరాజ్యాంగములను
తీర్చిదిద్దిన శక్తికిఁ దెలతు మేము.

కఱకుకత్తియు, గంటమ్ముఁ గలసిమెలసి
వీరభారతిమెడ కలంకారములయి
చెలఁగి దిక్కుల కాంతులఁ జిమ్మ దినము
లెంచి కడుభక్తితో నంజలింతు మేము.

ధీర పలనాఁటి నాగమ, వీరరుద్ర
మాంబి కాశ్చర్యజనక శౌర్య ప్రశస్తి
తతిమికొట్టఁగ రిపుకోటి తిరిగిచూడ
లేక, యపుడె పలాయనలీలఁ జూపె.

ఉలిని శిలపై పసందుగా మలచిమలచి
విపులవిశ్వంభరావీథి విమలశిల్ప
లలితసౌందర్యవిన్యాసలాస్యగతులఁ
దెలియఁజేసినవాఁడు మా తెలుఁగువాఁడు.

రాళ్లఁ గరఁగించి వివిధవర్ణములు గూర్చి
కొండగుహాలందు సుస్నిగ్ధకుడ్యచిత్ర
విశ్వమోహన సత్కళావిలసనముల
వెలయఁజేసినవాఁడు మా తెలుఁగువాఁడు.

సకలశాస్త్రకూలంకషాస్వాదమహిమ
వెలయ విజ్ఞానజలధిలోఁతులను దడవి
సకలదేశవిదేశీయజనుల కెలమి
తెలివి గూర్చినవాఁడు మా తెలుఁగువాఁడు.

అమలస్వర్గాపవర్గదాయకము, సామ
నిగమజనితము సుస్వరనిర్మలంబు
నైన కర్ణాటగానదివ్యామృతంబు
నొలుకఁబోసినవాఁడు మా తెలుఁగువాఁడు.

రాలచే శ్రావ్యమధుర గీతాల నాల
పింపఁజేసిన యులినేర్పు, నింపుగూర్చి
వీణె తీగెల రాగాల వెలయఁజేసి
శిలలఁ గరఁగించు నేర్పు మా తెలుఁగతనిదె.



పరువునష్టానికి వాల్మీకిఅభియోగం

'మహార్తిశ్రీ'

మహారాజశ్రీ ధర్మరాజగారి న్యాయ సభా సముఖమునకు—

అలఘు వ్యవహారము, సంఖ్య౧/౧౯౪౮

(౧) వాల్మీకి—వాది

౧. ఆంధ్ర కవిలోకము ప్రతినిధి తెలుగురావు,
౨. మద్రాసు ప్రభుత్వము } ప్రతి వాదులు

(౨) వాది: వాల్మీకి; తండ్రి పేరు: వల్మీకము గారు; వయస్సు: తెలియదు; వృత్తి: నివృత్తి; నివాసము: రామాయణమున్న తావున.

ప్రతివాదులు — ౧. ఆంధ్రకవి లోకము ప్రతినిధి తెలుగురావు; తండ్రి: సంస్కృతరావు; వయస్సు: వాదికంటె చిన్న; వృత్తి: కవనమల్లుట; నివాసము: ఇంకా రాష్ట్రము నిర్ధారింపబడలేదు.

౨. మద్రాసుప్రభుత్వము; నివాసము: మద్రాసు.

(3) వాది ఆదికవి; అనగా, కవిత్వమేలాగు చేయవలెనో లోకమునకు దారి చూపించినవాడు; పూర్వము రామాయణమను కావ్యమును సంస్కృతములో రచించెను. అందఱకును తెలియవలెనను అభిప్రాయముతో తేటతెల్లమైన భాషలో వ్రాసెను. దేశభాషలలో తర్జుమా చెయ్యనక్కఱలేకుండునట్లు తేలికగా వ్రాయవలెనను ఉద్దేశముతో, ఉదకమును స్పృశించి, కృతాంజలియై, ప్రాచీనాగ్రములు గల దర్భాసనమునం దుపవిష్టుడై, ధ్యానావస్థలో ప్రవేశించి, స్వకపోలకల్పితము కాకుండ జ్ఞాననేత్రముచే రామకథ నంతను యథావృత్తముగ చూచి వాది వ్రాసెను. ఈ కథ వాదియొక్క ఉపజ్ఞ కావున దీనియందు వాదికి సర్వస్వామ్యములు కలవు. మఱియు వాది ద్రష్ట కావున, వాది దర్శించి రచించిన కథకు భిన్నముగా నెవరైన నొక రామకథను వ్రాసిన వాదిహక్కులకు, ప్రతిష్ఠకు భంగము కలుగును. వాదిరామాయణముగాక ఇంకను లోకములో రామాయణములు కలవు. ఆ కథలకును, వాది కథకును చాల భేద మున్నది. ఒక రామాయణములో రామునకు సీత సోదరియట (పాపము శమించుగాక). ఆ కథలను అనువదించి వాదిపై రెత్తకుండిన అభియోజించుటకు వాదికి వ్యాజ ముండెడిది కాదు. కాని, ఇప్పుడు అందఱును, తొలుతనే వాదిని పేర్కొని దణ్ణముపెట్టి, వాదికథనే అనుసరించుచుంటి మనియు, కొన్ని తావులలో మెఱుగుపెట్టుచుంటిమనియు చెప్పుచు నిందాస్తుతులను వాదిపై వర్షింపుచున్నారు. దీనివలన వాదికి ఎక్కువగా పరువునష్టమై నందున, మనఃక్లేశము గలిగి దావాగ్నిలో వాది దుముకవలసివచ్చినది. పరువునష్టమునకు, మనఃక్లేశమునకు ధనరూపమైన పరి

హారమును ౧వ ప్రతివాదినుండి పొందుటకు ఈ వాది అర్హతను కలిగియున్నాడు.

(౭) ఇక, తెలుగునాడులో వాది రామాయణమునకు అనేకములైన అనువాదములు బయలుదేఱినవి. భాస్కర రామాయణము, కంకంటిరామాయణము, రంగనాథరామాయణము, గోపీనాథరామాయణము, లోకనాథరామాయణము, మొల్ల రామాయణము, నల్లరామాయణము, కొలనురామాయణము, కొండరామాయణము, వారి వాల్మీకము వీరి వాల్మీకము మొదలైనవి. ఇదియేగాక అపరవాల్మీకి, పరవాల్మీకి, పరాపరవాల్మీకి మొదలైన బిరుదములను కలిగినవారు బయలుదేఱుచున్నారు. ఎన్ని అనువాదములను వ్రాసినను ఈ వాది ఓపికబట్టి చాల కాలము కూర్చొనియుండెను. ఊరు కొన్నకొలది అనువాదములు లెక్కకందకుండ పోవుచున్నవి. ఇంక కొంత కాల మూరకున్నయెడల, వాదిరామాయణము ప్రచారములో లేకుండపోవునేమో అను భయము వాదికి కలుగుచున్నది. ఈ వాదికి అనేకులు ఆశ్రితులు కలరు. వారు వాదిరామాయణమును పురాణముగ చెప్పుకొని పొట్టపోసుకొనుచున్నారు. ఇపుడీ అనువాదము లెక్కువైనయెడల వాది రామాయణమును వినువా రుండక, వాది ఆశ్రితులకు జీవనాధార ముండకపోవచ్చును. ఆవిధముగ చాల కాలమునుండి వాది హక్కులకు, వాదియొక్క ఆశ్రితుల హక్కులకు భంగము కలుగుచున్నను తన మంచితనముచే వాది ఉపేక్షించి యూరకుండెను. కాని, ఈమధ్యన ఈ నూతనకవులు వాది కేమియు ప్రత్యేకమైన హక్కులు లేవనియు, తాము రచించిన రామకథ తమ ఉపజ్ఞ అనియు చెప్పి ఇంకను వాది తననుగురించి చెప్పుకొని యున్న మాటలన్నియు తమకు గూడ వర్తింపజేసుకొనుచున్నందున వాది తొందరగా మేల్కొనవలసివచ్చినది. లోకములో కవిత్వమారంభ మైనప్పటినుండి వాది కొక ప్రత్యేకమైన హక్కు ఏర్పడియున్నది. వాది వ్రాసినతరువాత కొన్ని వేలయేండ్ల వఱకును ఎవరు నిట్టిగ్రంథమును వ్రాసియుండలేదు. కనుక అవిరతోపభోగమువలన వాది కీ కథయందు హక్కుభుక్తము లేర్పడినవి. కోర్టులలో "వాల్మీకి-రామాయణమును చేతపుచ్చుకొని ప్రతిజ్ఞచేయుము. అట్లుచేసిన నేను నా వాదమును వదలుకొనెదను" అని వాదిప్రతివాదు లొకరినొకరు ఆహ్వానము చేసికొనుట అనాదిసిద్ధమైన ఆచారమైయున్నది. ఇట్టిగౌరవము వాదిరామాయణమునకే చెందినది కాని, మఱి ఏఇతర గ్రంథమునకు, వేదమునకైనను చెందలేదు. ఇది వాదికి ప్రత్యేకమైన హక్కు. దీనిని పురస్కరించుకొని ప్రతికోర్టులోను వాది రామాయణము నొకదానిని ప్రభుత్వమువారు నెలకొల్పుచున్నారు. దీనివలన వాదికి కొంత ఆదాయముకూడ వచ్చుచున్నది. ఈమధ్యన కొన్ని న్యాయశాలలలో భాస్కరరామాయణమునో, కంకంటిరామాయణమునో (ఇదిపైపెచ్చు ఉత్తర రామాయణము) ఉంచి దానిపై శపథము పట్టించుచున్నారు. ఇపుడీరామాయణములు న్యాయసభలలో ప్రవేశించినట్లే క్రొత్తగా రచింపబడుచున్న రామాయణములు వానిలో ప్రవేశింపవచ్చును.

క్రొత్తగా వ్రాసినవారిలో కొందఱు ప్రభుత్వములో పలుకుబడి యున్నదని, ధనార్జనము కొఱకు వారు వారిని లోబరుచుకొని కోర్టులలో తమ రామాయణములను పెట్టించుకొనుటకొఱకు ప్రయత్నించుచున్నారని వాదికి ఈమధ్యన తెలియవచ్చినది. దీనివలన వాదికి జీవనాధారము సన్నగిలుటయేకాక వాదిప్రతిష్ఠకూడ తగ్గుచున్నది. కోర్టులో చేపట్టిన గ్రంథము వాల్మీకిగ్రంథము కాదని కొందఱు బుద్ధిమంతులు గ్రహించి ఇక అనృతమాడవచ్చునని భావించుచున్నారని వాదికి తెలియవచ్చినది. వాదికి ధననాశము, గౌరవనాశము కలుగకుండ చేయుటకొఱకే గాక, ధర్మవ్యవస్థాపనము కొఱకు, న్యాయసిద్ధి కొఱకును వాది రామాయణమును కోర్టులో నెలకొల్పుట ఆవశ్యకమైయున్నది. ఇందులకై గవర్నమెంటు ముఖ్యమైన పార్టీ కావున వారిని రెండవ ప్రతివాదిగా చేర్చబడమైనది.

(౫) పైన ఉదాహరించినట్లు తెలుగు భాషలో అనేక రామాయణములు వెలిసినవి. వాదికంటె చాల కఠినముగ కొందఱు వ్రాసిరి, వ్రాయుచున్నారుకూడ. కొందఱు ఎక్కువ తేలికగా వ్రాసి దానిని వెకిలిగా చేయుచున్నారు. మఱికొందఱు వాదిని మించిపోయిరి. వీని అన్నిటివల్లను వాదికి లోకములో అప్రతిష్ఠయు, దానివలన మన క్లేశమును కలుగుచున్నవి. అనువాదము అందముగ లేకపోయినయెడల మూలముకూడ అందముగ లేదని జనులు భ్రమపడుట కద్దు. మూలమును మించిన రామాయణమును వ్రాసితిననియు, రసాచితిని పాటించి కథలో మార్పులు చేసితిననియు ఎవరైన అనువాదకుడు ప్రతిజ్ఞచేసినయెడల, అపుడుకూడ, మూలమునకంటె చక్కగనున్న అనువాదము దొరకెనని అందుచే మూలము నిక చూడనక్కఱలేదని జనులు వాదిరామాయణమును అవజ్ఞ చేయుట కద్దు. ఏవిధముగా చూచినను అనువాదములు వాదికి అప్రతిష్ఠను కలుగజేయుచున్నవి. కొందఱు తమ పేరులో వాదిపేరును జోడించి అసలురామాయణ మిదియే నని లోకము తలచునట్లు చేయుచున్నారు. వాది పేరు నుపయోగించుకొనుటకు ఎవరికిని హక్కు లేదు. తమ గ్రంథములు వాది గ్రంథములుగా అగుపడునట్లు చేయుటకు ఎవరికిని హక్కు లేదు.

(౬) తన రామాయణములో వాది గాయత్రీమంత్రమును కుదించెను. అందుచే ఈగ్రంథము ఇహపరసాధనమని లోకముచే భావింపబడుచున్నది. ఈవిధముగ మంత్రమును కావ్యములో కూర్చుపద్ధతిని కనుగొనుటకు వాది మొదటివాడు. కనుగొనినవెంటనే దానియందు విశిష్టాధికారములను వాది న్యాయప్రకారము స్వాయత్తీకరించుకొని యున్నాడు. శాసనములచే రక్షితమైన వాదిహక్కులను భంగపఱచుట కెవ్వరికిని అధికారము లేదు. ఈవిషయమై ప్రతివాది వర్గము వాదిచే లిఖితవాఙ్మూలములద్వారా తగాయిదాను పొందియున్నా సరకు చేయక తమ మార్గములోనే సాగుచున్నారు. వాదిరామాయణమును అనువదించుటకు ౧వ ప్రతివాదివర్గమునకు హక్కు గలదని వాదముకొఱకు అంగీకరించినను, పారాయణమున కుపకరించు సుందరకాండను అనువదింపకూడదనియును, ఒకవేళ ఎవరైన

అనువదించినను, అట్టి అనువాదమును పారాయణము చేయకుండ, పారాయణిక లోకమును నిరోధించుటకు వాది హక్కు కలిగియున్నాడు. కాని ఈభాగమును ఈ దావాలో కలుపక, అలాయిదాగా దాని కొఱకు దావా దాఖలుచేసుకొను హక్కును ఈ వాది తనలో మిగుల్చు కొను చున్నాడు.

(౭) రామకథలో వాదికి సర్వాధి కారము లున్నవి. పూర్వమాతడు బ్రహ్మచే అనుజ్ఞాతుడై ఈగ్రంథమును వ్రాసెను. అనుజ్ఞాప్రదానసమయములో బ్రహ్మ ఈ విధముగా వాక్రుచ్చెను:

"కురు రామకథాం పుణ్యాం
శ్లోకబద్ధాం మనోహరామ్,
యావత్ స్థాస్యంతి గిరయః
సరితశ్చ మహీతలే
తావ ద్రామాయణకథా
లోకేషు ప్రచరిష్యతి
యావ ద్రామస్యచ కథా
త్వత్కృతా ప్రచరిష్యతి
తావ దూర్ధ్వ మధశ్చ త్వం
మల్లోకేషు నివత్స్యసి"

—పుణ్యము, మనోహరము నైన రామ కథను శ్లోకబద్ధముగా రచింపుము. కొండలు, ఏఱులు భూమియం దెంతకాల ముండునో అంత కాలము లోకములో రామా యణ కథకు ప్రచారముండును. నీచే రచింప బడిన రామాయణ మెంతకాలము ప్రచార ములో నుండునో అంతకాలము నీవు క్రిందను, పైనను నా లోకములలో నివసింప గలవు.

ఈ అనువాదములు వచ్చినతర్వాత వాది వ్రాసిన కథలో మార్పులు జరుగు చున్నవి. ఇంకను ఇట్లే కొంత కాలము పోయిన యెడల, మనుజుల కొక రామాయణకథ ఏర్పడి వాల్మీకిరామాయణ మన నేమియో లోకములో తెలియకపోవచ్చును. వాది వ్రాసిన రామకథ లోకములో ప్రచార మున్నంత కాలమే వాది జీవించునని బ్రహ్మ ఆనతి ఇచ్చెను గావున, ఈవిధముగ కథలో మార్పులు చేయుటవలన వాది చిరంజీవిత్వ మునకు భంగము కలుగుచున్నది. ఇతరులకు ప్రాణోపద్రవమును కలుగజేయు కార్య ములనుగాని, కావ్యములనుగాని చేయుట న్యాయవిరుద్ధము.

(౮) ఇపుడు, ఒకటవ ప్రతివాది లోకముయొక్క ప్రతినిధి అనేక శాస్త్రముల నభ్యసించి, ప్రజ్ఞావంతుడై, అనేకవిధములైన గ్రంథములను రచింపుచు ఇంకను తృప్తి చెందక, వాదిరామాయణమును తెలిగింప సిద్ధముగ నున్నాడనియు, పదిపద్యములను వ్రాసి ఒక పెద్దమనుష్యునకు వినిపించె ననియు వాదికి తెలిసినది. తెలిసినవెంటనే అతడు నిద్రపోవుసమయము కనుపెట్టి వాది స్వప్నద్వారమున నోటీసు ఇచ్చెను. అతడు నోటీసును అందుకొనెనుగాని ఎట్టి ప్రత్యు త్తరమును ఈయ లేదు. ప్రతివాదికి వాది యందు గౌరవము కలదని వాదికి తెలియును గాని, ఇతరానువాదకుల దుర్బోధములకు లోనై వాదిపై ప్రతివాది కలముగట్టి నున్నాడు. ౧-వ ప్రతివాది ఈపని చేయకుండ నిరోధించుటకు ఈ అభియోగము తేబడినది.

(౯) వాది రామాయణమును ౧వ ప్రతివాది తెలిగింపబూనిన జాన్యవరి

౧౯౪౮ లోనూ, అలగాయతున్నూ ప్రస్తుతము ప్రతివాదుల నివాసమున్నూ, తమ అధికారములో నున్న మద్రాసు గ్రామములో ఈ దావా దాఖలు చేయుటకు వాదికి వ్యాజము కలిగినది.

(౧౦) కావున విమర్శించి—

౧. వాదిరామాయణమును అనువదింపకూడదని ప్రతివాదిలోకమును నిరోధింపవలయుననియు,

౨. ఒకవేళ అనువాదమున కధికార మున్నదని కోర్టువారు నిర్ణయించిన యెడల, వాదికథలో మార్పులు చేయకుండ ౧వ ప్రతివాదిని నిరోధింపవలయుననియు,

3. కోర్టులన్నిటిలో వాదిరామాయణమును పెట్టవలయునని ౨వ ప్రతివాదిని నిర్బంధింపవలయుననియు,

౪. తమ రామాయణము వాది రామాయణమువలె లోకమున కగుపడునట్లు చేయకుండ ౧-వ ప్రతివాదిని నిరోధింపవలయుననియు,

౫. ఈదావా ఖర్చులు ప్రతివాదుల వలన వాది కిప్పించవలయుననియు,

౬. ఇంకను, కోర్టువారు న్యాయ్యము, యుక్తము అని తలచిన పరిహారములను ఈ వాదికి ప్రతివాదులవల్ల ఇప్పించవలయుననియు

వాది ప్రార్థించుచున్నాడు.



ఉపకంఠప్రకృతి

★

శ్రీ కె. అన్నమరాజశర్మ

పారిజాతంబ! నీ తనూద్గారసౌర
భాంకురశ్రీల నే సౌరపంకమందుఁ
బొరలికొనివచ్చితో, — యీయపూర్వపుణ్య
భాగధేయమ్ము నీపాలి భాగ్య మయ్యె.

ఓ సుధాకర! శారదవ్యోమవీథి
జలధరాచ్ఛాదనమ్ములఁ దొలఁగఁద్రోసి,
ముద్దులను గ్రుమ్మరించు నీ మొలకనవ్వు
లేనిలింపకన్యక బదులిచ్చెనోయి?

శీతకోకంబ కర్బురశ్రీమనోజ్ఞ
వర్ణరంజితత్వత్పక్షపాళి నెవఁడు
దాఁకెనో, వాని యమృతహస్తం బదెంత
పూతమో; తార్కికునకైన బోధపడునె?

ఓ ప్రశాంతమనోజ్ఞారుణోదయంబ!
సాధుమతివోలె సంతమసంపు ముసుఁగు
జార్చి, తేజఃపయోరాశి జలకమార్చు
ప్రాకృతశ్రీకి నీ కిది ప్రకృతి యగునె!

జలజలం బాఱు సెలయేటి జలజనయన!
ఎవని యనురాగధనము హరింపనెంచి
రాగగీతికాలాపనరక్తిఁ దవిలి
ఈ రహోధ్యాననిష్ఠఁ దపించుచుంటి?

భూరినీహారలిప్తశృంగారశైల
శృంగమా! నీ గభీరమూర్తిం దలంప,
నవనవోన్మేషమైన హృన్మందిరమున
ప్రకృతిసౌందర్యమే నా కుపాస్యమయ్యె.

—

రామనవమి

[కథ]

శ్రీ మాస్తి వేంకటేశయ్యంగారు

"ఇదిగో, ఇక్కడ సీతాదేవి కూర్చొన్నది. మరి ఇదిగో, ఇక్కడ ఆమెప్రక్కననే మహానుభావుడు రాముడు నిలుచుకొన్నాడు. అల్లక్కడ నాలుగడుగుల అవతల అతని 'బంగారు' తమ్ముడు లక్ష్మణుడు నిలుచుకొన్నాడు."

రామనవమినాడు బోవనహళ్లి పొలిమేరలలో నడచుచు ఒక మహావృక్షముక్రింద కూర్చొన్న ఒక వృద్ధుని చూడగంటిని.

పడగ రొత్తుచున్న పాముకీవిని తలయెత్తి అతడు నావంక దృష్టి సారించినాడు.

తలపైన పెద్ద రుమాలు. ముఖమునిండ నెరసిన వెండ్రుకలు. రత్నాలవలె కాంతులీనుచున్న కన్నులు. తీర్చిదిద్దిన ముత్యాల కోవవలె నున్న సన్నని పలువరుస. ముసలివాడు నిజముగా మురిపెము చిమ్ముచున్నాడు.

అతనితో మాట్లాడవలె ననిపించి చేసై చేనందుకొంటిని: "ఆర్యా, మీదర్శన మబ్బినందుకు చాల సంతోషముగా నున్నది." జీవికి జీవికి మధ్యనున్న ఏదో ఒక అనిర్వచనీయమైన బంధము అపరిచితులతో కూడ ఈరీతిని మాటలుపెట్టుకొనుటకు మనలను ప్రేరేపించుచుండును.

నామాటలకు ఆయనకూడ ఆనందించినాడు. "నమస్కారము నమస్కారము అయ్యవార్లకు. ఎక్కడికి పయనము?" అన్నాడు. అని, నాచేతను అప్పటికి అరికట్టివేసినాడు.

పరస్పర నమస్కారములు, మర్యాదలు అయిన తరువాత, తాను కూర్చొనియున్న ఆ చోటియొక్క గొప్పదనమును తెలుపుటకై ఆ వృద్ధు ఈక్రింది పురాణ కథ చెప్ప ప్రారంభించినాడు:

"మహానుభావుడు శ్రీరాముడు తన అరణ్యవాసములో ఒక దినము ఇక్కడ గడపినట్లు చెప్పుకొందురు. ఆయన వెంట ఆయన చిన్న ప్రియురాలు సీతాదేవి కూడ ఉన్నది.

"వారి వెంట వారి పరిచారకుడుగా లక్ష్మణుడు. శతాబ్దముల వెనుక శతాబ్దములు నమ్మచేర్చిన మా ఊరి పెద్దలు ఇట్లని చెప్పినారు.

"తెల్లవారు ఝామున అదెక్కడ బయలుదేరినారోగాని మిట్టమధ్యాహ్నము వేళకు ఇక్కడికి చేరుకొన్నారు. పైన మధ్యాహ్నసూర్యుడు మటమటలాడుచు తలలు మాడ్చివేయుచున్నాడు.

"ఈచెట్టుక్రిందికి చేరుసరికి ఆ దేవి అలసిసొలసి సొమ్మసిల్లినది. 'ఏమి ఎండరా బాబూ!' అని నిట్టూర్చినది. ఆ నిట్టూర్పులో కమ్మని పరిమళము గుబాళించి ఆ వాతావరణమునంతను కమ్మివేసినది.

"ఆకాశవీథి త్రికపైయంచుల కెగబ్రాకుచు, కాళ్లకు రెక్కలు కట్టుకొని, పర్వజిరై వ్రథనముతో, రెక్కలు విరవిచ్చుకొని ఠీవిగా ఎగురు గరుడపక్షివలె సూర్యుడు నడిమింటి కెగిరినాడు.

"సువిదితమైన అతని ఆ పరాక్రమక్రమమునకు కొండలు, బండలే ఓటమి నొప్పుకొని అలసట చెందినవనగా, కుసుమకోమలిరాలైన సీతాదేవి అంతకంటె వేరేమి చేయగలదు?

— "రామరాజు తన రాణి యున్న వైఖరి గమనించినాడు. మిక్కిలి సంకటపడినాడు. 'ఏమీ దైవవిలాసము! ఏమి దురదృష్టము, ప్రాణుల నింత అలయించుచున్నది! విదేహరాజకూతురు, దశరథచక్రవర్తి కోడలు—ఆమెకా ఈ కష్టజీవితము! ఆమె ఈ బాధలకు అసలు తాళగలదా అని!'

"ఆయనకు తోడునీడగా ఆయన వెనువెంటనే ఉండిపోవలెనన్న తన కోరికకు ఆమె 'విధాయకధర్మ' మన్న పేరు పెట్టినది. ఆయనయెడల తనకు గల ప్రేమ ఫలముగా ఆయన ఇప్పు డీబాధల నన్నిటిని అనుభవించుచున్నది.

"ఆమె పడు పాట్లు తలపునకు రాగానే శ్రీరాముడు కలతపడిపోయి, గుబురుటాకులతో నిండి గుప్పుమని నీడ నిచ్చుచున్న ఈ మహావృక్షము నొకమారు వీక్షించి, స్త్రీజాతికి గల శక్తిసామర్థ్యముల హద్దులనుగూడ ఒకింత తలపోసి, 'ఈ చెట్టునీడను కూర్చొని కాస్త సేదదేరు'మని ఆయమను కోరినాడు.

"ఇదిగో ఇక్కడ సీతాదేవి కూర్చొన్నది. మరి ఇదిగో ఇక్కడ ఆమె ప్రక్కనే మహానుభావుడు రాముడు నిలుచుకొన్నాడు. అల్లక్కడ నాలుగడుగుల అవతల అతని 'బంగారు' తమ్ముడు లక్ష్మణుడు నిలుచుకొన్నాడు."

ఇవంతయు చెప్పుటలో ఆ పల్లెపెద్ద ఎంతెంతో సంస్కృతము గుప్పించినాడు. అది చూచి, ఎక్కడ నేర్చుకొన్నాడురా ఇత డింత సంస్కృతమని నే నాశ్చర్యపోతిని. ఉండబట్టలేక అడిగి వేసితిని కూడ— "అయ్యా, తమ రీ సంస్కృతము నెక్కడ నేర్చుకొంటి"రని. నే నా ప్రశ్న వేసినందుకు తన సంతోషము నొకింత కండ్లలో కనబరచుచు ఆ వృద్ధు డిట్లన్నాడు: "ఆ! నాకు తెలిసిన సంస్కృత మేపాటిది లెండు. మా ఆచార్యులవారి పాండిత్యమను గానుగ మాను వలయముతిరుగుచు తిరుగుచు శాస్త్రము లనెడు చెరకుగడలను నలచుచుండగా, దానియొక్క రుచిమరిగిన నేను ఆయన ప్రక్కనే నిలుచుకొని, అలవోకగా నాచేత వచ్చిపడిన ఆ చిలకరింపులను నాకుచు వచ్చితిని. నాపాండిత్య మదేమి అంత పెద్ద కొండ గాదు. ఆ ఇక్షుసారముయొక్క కొన్ని వడకలు (తునకలు) మాత్రమే.

"పురుషసింహుడైన శ్రీరాముడు చెంత నిలుచుకొనియుండగా, సీతాదేవి యిల్లిక్కడ కూర్చొని 'రామా! ఈ నీడ ఎంత హాయిగా ఉన్నది!' అన్నది. అయ్యగారూ! ఆమె పెదవులు పగడాలవలె లేత యెరుపు రంగులో నుండెను.

"చూచినారా, అయ్యగారూ, ఈ పండుగపూట కొత్తగా గాలియే లేకున్నది. తూర్పుగాలి విసురు ఆగిపోయినది. పడమటిగాలి యింకను రాలేదు.

"బహుశా పడమటి కొండలు గాలుల నన్నిటిని కూడగట్టి ఏదో ఒక విడుపుదినమునకై నిలిపివేసుకొన్నవేమో! లేదేని, ఇంత నిస్తబ్ధముగా నున్నదేల? గరికపోచ అల్లాడదేల?

"ఆరీతిని పోగుచేసిన వాయువులలో ఒక్క పిసరు ఆ కొండకోనలనుండి దాటి వచ్చి వీచిన చాలును, ఈ రోజు నిజముగా ఒక పండుగరోజయి పోగలదు.

"ఆ దేవి సొమ్మసిల్లి ఇక్కడకూర్చొనియుండగా, ఆమెదర్శనము చేసుకొని ఆమెఆశీస్సులు పడయుటకో అన్నట్లు ఒక చిన్నగాలితెర పడమటినుండి వీచుకొని వచ్చినది.

"చుట్టును కలయదిరిగి ఆమెకోమలదేహమును తాకినది. అకులతో ఆడుకొని ఏదో గుసగుసలాడినది. ఎట్లో ఒకట్లు అలసట పోద్రోలి హృదయముల కుపశాంతి నిచ్చినది.

"అలసటనుండి తేరుకొని సీతాదేవి చుట్టును కలయజూచినది. ఆహాహా! ఎంత అందముగా ఉన్నదా వనభూమి! భూవలయమంతయు ఆనందముతో దొప్పదోగి సర్వేసర్వత్ర కుసుమించిన చందముగా నున్నది! వసంతాగమము ప్రకృతికాంత మోముపై తెచ్చిపెట్టిన ఆ చిరునగవు అ దెంత ముగ్ధమోహనముగా నున్నది!

"చుట్టును పైరుపచ్చల సంతానము; రాచతీవితో ఒప్పుచున్న చెట్టుచేమల వితానము! ఏమిటైయుండునో విశేషము? ఇక్కడ సమావేశము కమ్మని వానిని పిలిచి పీటలువేసిన దెవరో?

"రంగమంతట నలముకొన్న ఆ ప్రకృతిసౌందర్యమును సీతాదేవి చూచినది. చూచి, అన్నది— 'రామా! ఈ ప్రదేశ మెంత మనోహరముగా నున్నది! అంతకంటె మనోహరమైనది మరేదైన నుండునా అని!'

"శ్రుతికి అపశ్రుతిగా మాట్లాడ నిష్టము లేక 'ఆహాఁ! ఉండదు'అని అందుకొన్నాడుగాని, సరిగా నంతకుముందే తన ప్రియురాలు మగ్నమై యుండిన ఆ ఉద్విగ్నావస్థ మనసులో నింకను ఆట్లే ఆడుచుండినందున మరి మాటలను పెంచలేకపోయినాడు.

"తన ప్రియుఁడాడిన ఆ రెండనగా రెండుమాటలు రాణి సీతను తృప్తిపరచలేకపోయినవి. ఆయనమాన

ముద్రను ఛేదించి ఆకారతను తీర్చుకొనుటకును, ఆయన నంతగా కలవరపెట్టుచున్నట్లు తనకు ప్రత్యక్షముగా కనిపించుచున్న అదేదో యోచననుండి ఆయనను తప్పించుటకును తన మాటల నింకను సాగింపబూనినది. 'అరణ్యక జీవితములోని కష్టముల నెంత యిదిగా వర్ణించితివయ్యా రామా! నేనును నీ వెంట వత్తు నన్నప్పుడు నా ఉద్దేశ్యమును అదెంత యిదిగా ప్రతిఘటించితివయ్యా! కాదుగూడ దని పట్టుపట్టి నేను నీవెంట రాక నేయుండినచో నే నీ యడవుల అతిలోకసౌందర్యమును చూచియుందునా చెప్పుము. చూచుచు చూచుచు ఇట్లే పదియేండ్లపాటు ఇతరచింత లేక ఉండిపోవుదమా అనిపించునంత నిర్భరమైయున్నదే ఈ రామణీయకము! అహో! నాకన్నుల కెంత విందుగా నున్న దిప్పుడు! అడవివెంట అడవి చూచుచు అందులోని ఆ అందమును, చందమును గమనించుచుండగా నా కె ట్లనిపించుచున్నదో తెలియునా? భూమిమీద కాక నే నెక్కడో స్వర్గములోని నందనవనములో తిరుగుచున్నట్లున్నది సుమా! ఏదో నాయందు దయదలచి నన్ను తీసికొనివచ్చితివి; నేనిదంతయు చూడగలిగితిని. అందువల్ల సరిపోయెకాని నీవు నన్ను తీసుకొనిరాకయుండినచో నాకీ మహాభాగ్యము లేకయే పోయెడిది కదా! మిట్టమధ్యాహ్నము వేళ చల్లని చెట్టునీడలలో కూర్చొని ఆనందము ననుభవించు ఈ అదృష్టము అంతఃపురవాసులకు లేదుకదా! మధ్యందినమున చెట్ల క్రింద నడచుట రాచజీవికి సంగతము కాదుగదా! అడవులలో రోజుకు రోజంతయు తిరిగినను హాయిగానే ఉండునన్న సంగతి యెరిగియుంటినిగాని ఇంతహాయిగా ఉండు నని మాత్రము నే నెరుగను. భావనను మించిపోయినది యథార్థము. ఆ అయోధ్యలో నేమున్నది! ప్రతినిత్యము చూచినను అదే సూర్యుడే, అదే చంద్రుడే! వారి కెందుకు తోచదో!'

"ఈ మాటలలో సీతాదేవి సగము తన హృదయములోని నిజమైన ఆనందమును వెళ్లగక్కినది. మరి సగము తన అధినాథుడు తన నిమిత్తముగా విషణ్ణుడు కారాదన్న ఆశను వ్యక్తీకరించినది.

"అవును, ఈ సంగతి రాముడును ఎరుగును. తనపట్ల ఆయమవిధివిధానములలో అనునిత్యము తనకు గోచరించుచుండిన ఆ స్నేహసంపత్తిని ఆయన ఆశ్చర్యముతో తిలకించుచుండినవాడే. ఆ స్నేహముయొక్క గాంభీర్యమును ఆయన ఆరోజు తిరిగి చూడగలిగెను. చూచి, ఎప్పటియట్లనే ఆశ్చర్యపడెను.

"అడవుల అందచందముల యీ ముచ్చటింపులో ఆనాడు వా రేమనిరో నేటికి నది నిజముగా నంతే యని నే నందును. నగరములలోని జీవితము మన ప్రజల జీవితానందమును ధ్వంసధూళి చేసివేసినది. ఆ కట్టడకలాపములకు నగరము లను పేరుతో పిలుచుటకన్న 'నగరము'లని పిలుచుటయే యుక్తముగా నుండును. మనిషికి తల దాచుకొనుటకు ఇల్లు కావలెను, నిజమే. కాని దానికితోడు వానికి ఆరుబయలుకూడ అవసరమే. సదా సర్వకాలము నాలుగుగోడలమధ్యనే పడియుండినచో మరి వారు ఆరుబయటియొక్క సౌభాగ్యమును తెలుసుకొనుట దెట్లు?

"ఆ సీతారాములు ఇక్కడ కూర్చొని యిట్లు మాట్లాడుకొనుచుండగా బంగారునాలుక మైనా ఒకటి ఈ చెట్టుమీదికి ఎగిరివచ్చి, పైకొమ్మమీద ఒకదానిమీద కూర్చొని, గొంతెత్తి పాటకు లంకించుకొని, చుట్టుపట్టుప్రదేశమునంతను తన్మయముగా ఊపివేసినది. ఆహా, ఒక పక్షి తనమీద వచ్చి వాలి పాట పాడినప్పుడే చెట్టు అంతటి ఆనందము పొందనేర్చును. మీరు వచ్చి నాతో మాటలకు పెట్టుకోకపోయియే యుండినచో నాకు మీతోడి యీ సంభాషణ యెట్లబ్బియుండును?

"అడవులలో మనకు వినబడు అనేకశబ్దములలో మైనాశబ్దమే మధురతమము. అట్లని, ప్రపంచమును నింపివేయుచున్న మిగతా శబ్దములలో మాధుర్యము లోపించినదని చెప్పుట కాదు. భగవంతుని యీ క్రీడామందిరములోని శబ్దములకును, అభిరుచులకును అంతెక్కడ? మనిషన్నవాడు తాను చూడనేర్చిన రంగులనన్నింటిని ఎక్కడనైన చిత్రింపగలడా? మన చెవులకు సోకు శబ్దములన్నియు మధురములే. ఏమందురా? ఆ అన్నింటిలోని 'కంఠము' మనలను భగవంతునివైపునకు పిలుచు ఒక్క పిలుపేకదా! అది ఒకప్పు డిట్లును శబ్దించవచ్చును, ఒకప్పుడు అట్లును శబ్దించవచ్చును.

"వాడు ఎక్కడనో మన మెరుగనిచోట ఉన్నాడు. వానినుండి అదిగో, అదిగో, పిలుపు వచ్చుచున్నది. ఎవ రది? ఒక పక్షి. పిలుచుచున్న వ్యక్తి కనబడడు. 'ఏం!' 'హిం!' 'హీం!' ఇదంతయు వాని క్రీడావిలాసము.

"వాడు మనలో నున్నాడని కొంద రందురు. ఉండవచ్చును; ఎందు కుండగూడదు? కాని, అవ

సిద్ధాంతములుచేయుట పాడిగాదు. మన ప్రభువు చిక్కువాడేకాని పట్టుబడువాడు కాడు."

"నేను బీజాపురములో ఒక గుమ్మటమునుగురించి విన్నాను. నీవు ఈ కొనను కూర్చొమ్ము; ఒక స్నేహితుడు అవతలికొనలో కూర్చొనిమ్ము. అతడు గోడకేసి గుసగుస లాడును. ఇవతల నీవు ఈ గోడనుండి ఆ గుసగుసలను విందువు. మరి ఆ రెంటిమధ్య కూన్య కాళమే ఉన్నది.

"ఒక నీళ్ళులేని బావి—నీ తల తిరుగునంత విశాలమైనది. నీ పిదళేవు. ఎందువల్ల ? అది వట్టి ఖాళీగనుక. నీ స్నేహితుడు నీ చెంత లేడు; నీ వతనిని తాకలేవు. నీ వతనిని చూడగలవు; అందుకే నీవు కృతజ్ఞుడవై యున్నావు.

"గుసగుసను నీవు నీ ప్రక్కనున్న గోడనుండి విందువు. అది అక్కడనే జన్మ మెత్తినదా ? అట్లు తలచుట యెంత అజ్ఞానము? వాడు లోపల ఉన్నాడా? వాడు బయట ఉన్నాడా ? ప్రశ్నకు తుది యెక్కడ? అలాగే; అలాకాదు ; కాని, అలాగే.

"అక్కడి ఆ గుమ్మటములో నీవు నీ స్నేహితుని చూతువు; ఇక్కడి గుమ్మటములో మన మిత్రుడు మనకు కనబడకుండనే గుసగుస లాడును. అతనికొరకని మనము చుట్టును కలయజూతుము. మరి, తలపోతలో దారి తప్పుదుము.

"నే నేమి చెప్పుచుంటిని? ఆc. పక్షి పాట పాడుచు చుట్టుపట్టు ప్రదేశమునంతను ముగ్ధపరచు చుండెను. ఆ పాటకు మిక్కిలి ఆనందించినదై సీతాదేవి యి ట్లనెను : 'మరొక గొంతు ఇంత మధురముగా నుండునా రామా ? అది మధువువలె రుచ్యముగా నున్నది.'

"తన హృదయానందము నీ మాటలతో వెల్లడించుచున్న ప్రియురాలినిగూర్చి రాముడు తమాషా కి ట్లన్నాడు : 'ఇంతకంటె మధురమైన ఒక గొంతును నే నెరుగుదును.'

"'ఏదా గొంతు ? నే నెప్పుడైనను దానిని విన్నానా ?' అని అడిగినది మా తల్లి—తన కంటె ఎంతో తెలిసిన భర్తనుండి అదేదో తెలిసికొందమన్న ఆశతో.

" 'నీవు నన్ను రామా అని పిలుచునదే ఆ గొంతు. నాపాలికి అదియే ఎంతో మధురతరము!' అన్నాడు రామచంద్రుడు. తమాషాలోకూడ అతను తథ్యమునే మాటలాడును. నిజమునకు భార్యపట్ల రామచంద్రునికి గల భావావేశము వర్ణింపరానంత ప్రశంసనీయమైనది. జగజ్జనని అటువంటి వ్యక్తి; అత డామె నంతగా ప్రేమించినా డన్నచో ఆశ్చర్య మేమి ?

"తన గొంతుక రామునిపాలికి నిజముగా మధురాతిమధుర మని సీతామాత నిష్కర్షగా ఎరుగును. కాని ఆయనను చూచి ఇంచుకంత నవ్వుదమన్న ఉబలాటము మాత్రము ఆయమకు వదలలేదు. తన ముఖ మాయనకేసి త్రిప్పి అరవిరిసిన పెదవులతో చిరునవ్వు చిందించుచు ఇట్లన్నది: 'ప్రతినిత్యము ఇటువంటి సంగతులే నాకు చెప్పుచుందువు. ఇటువంటి మాటలతో స్త్రీయొక్క గర్వాభిమానములను మరింత రెచ్చగొట్టి పరిపోషించుట న్యాయమా, నీవే చెప్పుము.'

"రాణిమాటలను విన్నాడు రాముడు. చిరునవ్వు నవ్వినాడు. మారుమాట లేక మూకీభావము వహించి, ప్రియురాలి నెమ్మోముమీద ఉన్న ఆ విలంబంపును కండ్లతోనే ఆస్వాదించుచు నిలచికొన్నాడు.

"సరిగా ఆ సమయమునకు అది యేడాది తొలి శుక్లపక్షములోని తొమ్మిదవ దిన మనియు, రాముడు జన్మించిన దిన మనియు సీతాదేవికి చటుక్కున జ్ఞాపకము వచ్చినది. జ్ఞాపకము వచ్చి, వెంటనే ఆమె హడావడి పడుచు ఇట్లని అన్నది : 'అయ్యయ్యో! రామా! ఎంత పొరపాటు జరుగనై యుండినది ! ఈదినము నీపుట్టిన రోజాపండుగ అన్న విషయమే పూర్తిగా మరచిపోతినే ! నిన్ననగా నిన్ననే ఈ సంగతి మనసుకు తెచ్చిపెట్టుకొంటిని. కాని, నే డది నాస్మృతిపథము నుండి ఎట్లు జారినదో జారిపోయినది. నా మందబుద్ధిని నే నేమని చెప్పుకొను !

"నేను మరచిపోతినే అనుకో, ఓయి లక్ష్మణా, మా జీవితములలోని మంచికంతకును బాధ్యుడవైన నీ వెట్లయ్య మరచితివి ? నీవే యి ట్లుపేక్షించినచో ఇక మా గతి యేమి? మంచిది, పోనిమ్ము, పుట్టినరోజు పండుగ ఇక్కడనే జరుపుదము. ఆ చెట్టుక్రింద నేను వంటచేసెదను. ఈ పరిసరములన్నియు చుట్టిచూచి, కూరలు, కాయలు, పండ్లు—నీ వేవేమి తేగలవో తెమ్ము. వెళ్ళు, తమ్ముడా, వెళ్ళి త్వరగా రా, వెళ్ళు.'

"ఏమి ఉత్సాహము ! ఏమి ఆనందము ! ఏమి హడావడి ! ఆమెమాటలలోను, చేతలలోను అదెంత విన్యాసము ! భర్త చెంత నున్నప్పుడు సీతాదేవి ప్రతి

మాటయు పరిక్రొత్తగా తీసిన తేనెవలె కమ్మగా నుండెను.

"వంటవార్పులలో తన సహచారిణికి తోడుపడవలె నని రాముడు తానుగా వెళ్ళి సులువుగా నుండునట్టి సన్నని ఎండిన పుల్లలను ఏరుకొని వచ్చి, తాను ప్రేమించునట్టివారికి దేవుడు సేవకుడుగా కూడ పనిచేయునన్న నిత్యసత్యమును ఖాయపరచెను.

"ఏమి, ఆ రోజువంటకము లేమని అడుగుచున్నావా? దానినిగురించి మాట లెందుకులే. రాచవారైనంతమాత్రమున ఈ అడవిలో వారి కేమి పంచభక్ష్యపరమాన్నభోజన మబ్బునా! నగరములలో లభించు నానావిధమైన వంటకములు ఇక్కడెట్లు దొరకును? ఏవో వంకాయలపులుసు వండుకొన్నారు. ఏవో అడవి కందమూలములతో కూర చేసుకొన్నారు. అడవిలోని ఏదో నీవారధాన్యముతో అన్నము చేసుకొన్నారు.

"అయ్యో, ఈ రీతిని ఆ రామజయంతినాడు సీతాదేవి—జనకరాజతనయ—స్వయముగా వంట వండి ఆయనకు పండుగచేసినది.

"అన్నతోపాటు తానును భోజనముచేసి మిగిలిన ఆహారపదార్థములను వదినెగారికి వడ్డించి లక్ష్మణుడు పెద్ద లిద్దరకు వారివారి చిత్తానుసారముగా ఊడిగము చేసెను.

"జీవితములోని ఎగుడుదిగుళ్లకు అతీతు లెవరు? భక్తు లనుకొను మాటలు నీవు వినియేయుందువు. 'జీవితములో శుక్లపక్షము, కృష్ణపక్షము కూడ ఒకటివెంట నొకటి ఉండనే ఉండును. కాబట్టి నీ మేలుకై మంచి నంతను సంచితముచేసుకొమ్ము. చేసుకోవా, ఎందుకును కొరగాకుండ పతనమై పోవుదువు.'

"ఈ స్థలమునుండి వెళ్ళిపోవునప్పుడు సీతాదేవి ఈ వృక్షమునకు దీవన లిడుచు ఇట్లన్నది: 'అవసర వేళలో నా కాశ్రయ మిచ్చిన ఓ సోదరీ, నీవు 'నిత్యకల్యాణము పచ్చతోరణము'గా కలకాలము పసిమితోను, పోడిమితోను విలసిల్లుదువుగాక! మా పండుగకు ఉదకముల నందించిన ఓ కూపమా, నీవు ఏనాటికిని ఎండిపోకుండ ఉందువుగాక!'

"కన్న బిడ్డ లిద్దరికి తల్లి యిడిన దీవనలవలె ఆమె ఆ చెట్టునకును, నూతికిని ఇడిన దీవనలు వాని నింతవరకు సురక్షితముగా కాపాడుకొని వచ్చినవి. ఇది అదే వృక్షము. ఇవి అవే నీళ్ళు.

"ఇది అదే చెట్టని మే మనుచున్నాము. బుద్ధిమంతులు కాదందురు. మాటలు పెంచుకొన్నందువల్ల ప్రయోజన మేమి? ఒకవేళ ఇది అదే చెట్టు కాదే అనుకొందుము. దాని బిడ్డ అయియుండవచ్చును; లేదా బిడ్డబిడ్డ అయియుండవచ్చును.

"ఈ చెట్టు ఇక్కడ లేనప్పుడు చూచినవారు ఈ యూరిలో ఒక్కరుకూడ లేరు. ఏనాటినుండి ఇది ఇక్కడ ఉన్నదో, మన మెరుగుదుమా? మన కెరుకలేని సంగతులను గురించి మాట్లాడిన ప్రయోజన మేమి?

"ఈ చెట్టు ఆకులను ఎవరును కోయరు. ఇది ఏనాడును పూర్తిగా మోడైపోయినదికూడ లేదు. వసంత ఋతువులో దీని సౌభాగ్యమే సౌభాగ్యము!

"దీని జాతికి చేరిన చెట్లలోనే ఇంకొక చెట్టు నీడకు దీని కున్న విలువయు, బలుపును ఉండవు. దీని క్రింద కూర్చొని చూడుడని నేను సర్వసమస్త ప్రజకు చెప్పుచున్నాను. దీనికి సాటి మరి ఉండదు. నిజము, ముమ్మాటికి నిజము చెప్పుచున్నాను.

"తన భర్తయొక్క అలనాటి ఆ పండుగను జరిపిన ఈ ప్రదేశముమీద సీతాదేవికి మహా-మమకారము. కనుకనే ప్రతిరామజయంతికిని ఆమె ఇక్కడికి కొంతగాక కొంతసేపైనను వచ్చిపోవుచుండును. రాముడు, లక్ష్మణుడు, సీత ముగ్గురును వచ్చుచుందురు. వచ్చి, సంతోషముతో, ఈ ప్రదేశమందు కొంతసేపు తిరుగాడిపోవుచుందురు. మా యూరిలోని తాతలును, ముత్తాతలును అటువంటి సందర్భములలో ఆ యన్నదమ్ములను, ఆ యమ్మలమిన్ననుగూడ చూచినారు. ఈ సంగతి మా యిండ్లలో తరతరాలుగా చెప్పుకొనుచున్నదే.

"మంచివారైనవారికి వారు కనబడుచుందురని చెప్పగా విన్నాను. అది కాదు, వారి దయకు పాత్రులైనవా రెవరో అట్టివారికి వారు కనబడుదురని నే నందును. మనుష్యుల కంత మహత్త్వము నిచ్చి, భగవంతుని సౌమ్యత్వమునకు హద్దు లేర్పరచుట యెందుకు?

"నాకును వారిని చూచు భాగ్య మేనాడైనను అబ్బకపోవునా అన్న ఆశతో యువావస్థనుండి ఇప్పటివరకు ప్రతి శ్రీరామనవమికిని ఇక్కడికి వచ్చి, పడిగాపులు పడుచునే యున్నాను. నేటికి నేడు గూడ

వారిని కన్నులారా చూడగల నన్న ఆశతోనే ఇక్కడికి వచ్చి, ఈ చెట్టుకు, ఆ బావికి చెంతను కూర్చున్నాను. ఒక్క రామనవమికూడ నే నిక్కడకు రాకుండ వదలిపెట్టినది లేదు.

"అసలు సీతారాములు కనబడుదురా అని అనేకులకు మీమాంస. నమ్మువారు కొందరు, నమ్మనివారు కొందరు. నామట్టుకు నేను, నా పెద్దలమాట నంగీకరించి నమ్మనే నమ్ముదును. వారు కనబడువారే అయితే మనము వారిని చూడగలదా అని! విశ్వాసము లేనిచో ఆ పని యెట్లు చేయగలము?

"మీకు గాలి కనబడదు. కాని, చేతిని అంత రిక్షములో కొంచెము ఆడించిచూడుడు. గాలి మీ శరీరమునకు తాకి 'ఇదిగో నే నున్నా'నని అనును. భగవద్విషయములోకూడ అంతే. మామూలు తరహాగా ఆయన మనకు కనబడువాడు కాడు. అతడు ప్రచ్ఛన్నుడే యుండు. కాని మీ మనస్సును గనుక మీరు ఆయనవైపు ప్రసరింపజేసితిరా, ఆయన మీ ఆత్మను తాకును. ఆ భాగ్య మబ్బినవారు తమ యెట్టయెదుట భగవంతుడు నడచుచుండుటను స్పష్టముగా చూడగలరు.

"అర్యా, మన యీ జీవితములో, అక్షరాలా మన సమక్షములోనే స్వర్గము, నరకము రెండును ఒకటిగా బద్ధమైనవి. మన మన కర్మానురూపముగా మనము వానిలో దేనికో ఒకదానికి పాత్రుల మగుచుందుము. వానిని రెంటిని విడదీయలేము. ఆ రెంటిని ఒకదానిలో చూచు నేర్పు, మహోత్సాహ, మానవులు నేర్చుకోవలసియున్నది.

"సీత, రాముడు, లక్ష్మణుడు—ముగ్గురును కలిసి నాయెదుట నడచుచుండగా నేను చూడగలనా? నా హృదయాధినాథుడైన ఆ భగవంతుని నే నెప్పుడు చూడగందును?

"చూడ నోచుకొంటిమేని మహామంచిదే. కాని చూచితీరవలె నని పట్టుపట్టుటమాత్రము తప్పు. మనము చూడజాలక పోయినను మునిగి పోవునది లేదు. ఏకాంత మున కూర్చొని, ప్రశాంతముగా వారినిగూర్చి తలపోయుదము. అదికూడ ఎంతో మంచిదే.

"రామా! రఘురామా! లక్ష్మీరమణా! నన్ను దయచూడవయ్యా! నాకు ప్రత్యక్షముగా సాక్షాత్కరించి నాయెదుట నిలువవయ్యా!"

ఆ వృద్ధుని మాటలు వినుచు వినుచునే నే నటు వైపు ఆ లోయలో నున్న ఒక చెట్టుకేసి చూచితిని.

అక్కడ ఇద్దరు వ్యక్తులు. ఒక యువకుడు నిలుచుకొనియు, ఆయనకు చేరువనే ఒక యువతి కూర్చొనియు ఉండుట గాంచితిని.

ఇద్దరును అప్పుడప్పుడే యౌవనములో పడినారు. యువతి నవ్వుచు ఏమో చెప్పుచున్నది. యువకుడు ఆమెమాటలకు చెవు లొగ్గుటయే లేదు. వట్టి కన్నుల మయ మైపోయినాడు.

"వారు సీతారాములై యుందురా?" అని నా మనస్సు ప్రశ్నించినది. ఆ తలపునకు హృదయము గంతులువేసినది. వారే ఎందు కై యుండగూడదు? ఇన్నాళ్ళుగా కాచుకొని కూర్చున్న ఈ వృద్ధుని కోరికను తీర్చుటకు వారు వచ్చియుండగూడదా?

ఆ యువతి గడ్డల నరుకుచున్నదా? ఆమె చేతులలోని గాజులు గలగల లాడుచున్నవి. మరి ఆ యువకుడు ఆమెతో నేమో చెప్పుచున్నాడే, అదేమి! అత డేమో మాట్లాడుచున్నా డన్న సంగతి విస్పష్టముగా కనిపించుచున్నది.

చెట్టుదగ్గరి ఆ యువదంపతులను నేను చూచుచుండుట కనిపట్టి, ఆ వృద్ధుడు తానును ఆ వైపు పరికించి యి ట్లనెను: "వారు నా కుమారుడు, కోడలును. ఇంటికి రమ్మని నన్ను పిలువ వచ్చినారు. ప్రొద్దున ఇంటినుండి బయలుదేరివచ్చునపుడు పూజావేళ కాగానే వచ్చి నాతో చెప్పుమని చెప్పి వచ్చియుంటిని. ఆ ప్రకారముగా నన్ను పిలువ వచ్చినారు వారు. ఒక పని నెరవేర్చినట్లును అయినది; సాహచర్యముగా కొంత కాలక్షేపము చేసినట్లును అయినది! జనముమీద జనముతో నిండిన యింటిలో శ్రేయములో నున్న యువతి తాను చెప్ప దలచుకొన్నదంతయు తన భర్తతో ఎట్లు చెప్పుకొగలదు? కాగా, తనతో బైటికి రమ్మని ఆమె సైగలు చేయును. చేసి, అతనిని ఆ చెట్టు క్రిందికో, బావి చెంతకో తీసుకొనిపోవును.

"తాళ్లు పేనుచునో, లేదా బట్ట లుతుకుచునో ఏదో ఒక పనిమీద నున్నట్లు కనబడుచు, వా రుభయులును కలిసి నవ్వుచు, మాటలాడుకొనుచు, పరస్పర ప్రేమానురాగములను వెళ్ళబుచ్చుచు కొంత కాలక్షేపము చేయుదురు.

"'తల్లీ యీరవమ్మా, ఒక్క క్షణ మిట్లు రావమ్మా! అబ్బాయి రామా, ఒక నిమిష మిట్లు రావోయి! పట్టణమునుండి వచ్చిన ఈ అయ్యగారు ఇదిగో మిమ్ములను గురించి భోగట్టా అడుగుచున్నారు. రండు. ఆయనకు నమస్కారము చేసి, ఆయన ఆశీర్వాదములను పొందుడు. సత్పురుషుని సారవాక్కులు ఫలించి, మన వంశము వృద్ధిచెందనిండు.

"మాటలలో బుద్ధిమంతులైన మానవులు కొందరు ఇంటి కుమారుడు రాముడని, ప్రతి స్త్రీయూ సీతయని చెప్పగా నేను విన్నాను. కాని ఈ సంగతి మనము వట్టిమాటలలో చెప్పిన చాలునా అని! ఇటువంటి తెలివిమంతుడు తన చెరకుగానుగను వెఱ్ఱి చెరకుతో నింపుచున్నాడు. ఇటువంటి వట్టి వెఱ్ఱిమాటలను రుబ్బినందువల్ల అదియేమిటి రసము నిచ్చును, ఏమిటి బెల్లము నిచ్చును? ఇతరుల ఇంతులను పేర్కొనుము. వీరి కను బొమలు ఎగిరిపడును. వారి పాలికి ప్రతి స్త్రీయూ సీత అయినప్పుడు మీరు కాకిబంగారునుండి పరమును సాగదీయవచ్చును.

"అతని యెదుట తిరుగులాడుచున్నది అక్షరాలా నిజముగా భగవంతుడే. కాని రాముని కన్న దశరథుడు అతనిలో తన కొడుకునే చూచినాడు కాని తన దేవునిని చూడలేదు. ఈ మాయకు అతీతుడైనవా డెవడు? తన కుమారునిలో భగవంతుని గుర్తించగల పరిజ్ఞానము ఆరోగ్యాధీశ్వరుడైన దశరథునికే లేకుండచేయబడినప్పుడు ఇక అది నాకు దయతలచబడునా అని! అవి వట్టి మాటలు. కొడుకులో భగవంతుని చూచుటకు, ముందు, ఎవరైనను సరే ఆత్మనుండి మమకారమును లాగివేయవలసియుండును. ఆ సమదర్శనము లభించుటకు మనిషి మోక్షార్హతకు చేరుకొని యుండవలెను. ప్రతి ఇసుక రేణువులోను, సృష్టిలో ప్రతికణమునందును రాము డంతర్గతుడై యున్నాడు. మాయ ముసుగువలె అతనిని కప్పియున్నది. అతనికి బుద్ధిపుట్టినప్పుడు అతడా తెరను ప్రక్కకు తొలగద్రోసి తననూ మనకు ప్రత్యక్షీకరింపజేయును. మాయ అన్నది కేవలము ఒక ముసుగే కాబట్టి ఇటువంటి అనుగ్రహము ఆయన సహజకారుణ్యముతో మనలో ఎవరిపట్లనైనను చూపవచ్చును. మానసిక నేత్రముమీద కప్పియున్న 'నేను, నాది' అన్న పొరను తప్పించుట మనిషి కంత సులభసాధ్యమైన పని కాదు."

అని ఈ రీతిగా ఆయన మాట్లాడుచుండగా, ఆ పిలుపు నందుకొని వా రిద్దరు కలిసి మాకేసి నడిచి వచ్చిరి. యువతీయువకు లిద్దరు పరస్పర సాహచర్యముతో నడుచుచుండగా చూచుట అది ఒక నిత్యదర్శనీయమైన దృశ్యము.

మే మున్న యెడకు వచ్చి చేరగానే వారు నాకేసి చేతులు జోడించిరి. అప్పుడు నేను వారిని చూచి "భగవంతుడు మీకు సుఖసంతోషముల నిచ్చుగాక!" అని దీవించితిని. యువకుడు తండ్రికి చేరువగా చేరుకొనెను. యువతి అతని వెనుక నిలుచుకొనెను.

ఆ సన్నివేశమునుగురించి ఆ వృద్ధుని అభిప్రాయమేమైయుండినను ఉండనిండు. నామనస్సులో మట్టుకు ఆ క్షణమున మానలుగురితో కూడిన ఒక చిత్రము రూపుదాల్చెను.

వారు ముగ్గురును దశరథుడు, రాముడు, సీతయునైరి. మరి నేను ఆయమతండ్రి జనకుడనైతిని. ఆ చిత్రము ఎంతో విస్పష్టముగా నాకు పొడగట్టినది. అది నా మనస్సులో నా ఆఖరు రోజువరకు అట్లే నిలిచియుండగలదు.

పిమ్మట నేనాయనతో ఇట్లంటిని: "మహాశయా, మీరు నాకీ పండుగనాడు బహుమంచికథను చెప్పితిరి. మిమ్ములను, మీ విధివిధానములను చూడగలుగుటచేత నేనెంతో హాయి పొందితిని. మరి నాకు సెలవిత్తురా?" ఈమాటలతో నేను బయలుదేరుటకు సిద్ధమైతిని. వృద్ధుడు లేచి నిలుచుకొని, నమస్కారపద్ధతిగా రెండు చేతులను తన ముఖమున కెదురుగా ఎత్తి జోడించెను. జోడించి ఇట్లనెను: "మీరుకూడ ఈ పండుగనాడు సాక్షాత్తు శ్రీరాములవలెనే నావద్దకు దయచేసినారు. భగవంతుడు మీపాల నుండు గాక! మరల నెప్పుడైన ఈవైపు దయచేసి మమ్ముల ననుగ్రహింపుడు."

"అట్లే కాని"మ్మని మనసులోనే అనుకొని, అవసరమైనప్పుడు విచారించుటకు ఉపయోగించును గదా అని, నే నావృద్ధును ఆయన పే రేమో అడిగితిని.

ఆ ప్రశ్న కతడు జవాబు చెప్పడు. "ఏమి పేరని నేను చెప్పుకొందును? పేరు లేదు, పెంపు లేదు. కీర్తి లేదు, ప్రతిష్ఠ లేదు. జీవితము తన్నితగలవేసిన ఆరడుగుల కీటకము మనిషి." అని మాత్ర మన్నాడు.

"అదంతయూ సరేనండీ. ఆ కీటకములలో అధమాధమకీటకమునకుగూడ తల్లి ఏదో ఒక పేరు పెట్టియుండు నన్న సంగతి మీ రెరుగనిదా చెప్పుడు." అని నే నంటిని.

తన పేరు ఉచ్చరించుటకు ఏమాత్రమును ఇష్టము లేకుండనే, నా బలవంతముమీద చివర కెట్లో చెప్పి నాడు. "అడ్డాలలో బిడ్డగా నున్నప్పుడు నన్ను నా తల్లి జవారా అని పిలిచెడిది. ఆ పేరుతో పిలుచుచునే నన్ను పెంచి పెద్దచేసినది. నే నింతవాడనైతిని. ఆ పేరుతో పిలుచుచునే ఈ ప్రపంచమునుండి మరుగుపడి పోయినది. ఆ పేరుతో, అంతటి వాత్సల్యసౌకుమార్య ములతో ఆ తల్లి పిలిచిన ఆ పిలుపే ఎంతో అరిష్ట మునకు, జ్వరములో నాలుకమీది ముండ్లవలె లేచు ఆత్మప్రేమకు కారణ మైనది. దానినే మానవులు జీవిత మనుచున్నారు."

"తాతగారూ, మీ విషయములో మాత్ర మట్లు కాదు. మీరు సత్యమార్గముననే చరించినారు. ఇప్పటి వరకు మిమ్ములను భగవంతుడు సన్మార్గముననే తీసుకొనివచ్చినాడు. ఇకమీదకూడ మిమ్ములను వదలిపెట్టడు." అని చెప్పి నేను వారి సెలవు తిరిగి తీసుకొని ఇంటికి వచ్చివేసితిని. ఆ వృద్ధునియొక్కయు, ఆయనవిధివిధానములయొక్కయు మెచ్చుకోలులో నాహృదయము లీన మైపోయినది.

ఇంటికి చేరుకొని, అక్కడ జరిగిన ఆ సంగతి సందర్భము లన్నిటిని ఇంటివారి కందరికిని చెప్పితిని. ఆ కథ విని, ఎంతో జాలితో నాభార్య "భగవంతు డా తాతపట్ల దయదలచుగాక!" అనెను. "యీరత్వను చూడవలెనని నాకు చాల ఆశగా ఉన్న"దని నాకూతు రనెను. "నీవు తలపోయు కోరికల నన్నిటిని ఎవడైన అసలు లెక్క పెట్టనేర్చునా!" అని నాఅల్లుడు కూతు రిని హెచ్చరించెను.

ఆ ఉదయము జరిగిన ఈసంఘటనపునస్మరణము నాటి పండుగకు ఎన్నడును లేని తేజస్సు తెచ్చినది. అనిర్వచనీయమైన ఆనందము నాజీవిని లోపల, బయట కూడ వెలుగువెల్లువతో ముంచినది.

అదిగో ఆ వృద్ధు నాయెదుట స్పష్టముగా కని పించుచున్నాడు. "అందరును చల్లగా నున్నట్లే నమ్ము చున్నాను. చూడు, నాజీవిత మెంత సంపన్నమై యున్నదో" అనుచున్నాడు.

లోకమాత లోలోపలనే మాటలాడుచున్నట్లు "నేను ఈరత్వను. నేను కూతురును. నేను నిత్యమైన సీతను" అన్నమాటలు నా హృదయములో స్పష్టముగా వినిపించుచున్నవి.

ఆ వృద్ధుమనస్సులో నున్న పద్ధతిగా ఆ మాత యొక్క దర్శనము నేను చేయలేదు. ఆ గొంతు నా చెవు లతో వినలేదు. కదలుచున్న పెదిమలను నా కండ్లతో చూడను లేదు.

సత్యము జ్ఞానక్షేత్రమును చేరినది. అది భావతల మును తాకినది. భవిష్యత్తులో ఏనాడో ఒకనాడు, ఈ చిన్న ఆత్మబంధము సఫల కేసినపుడు అది నిస్సందేహ ముగా ఆత్మను తాకితీరును.

సీతారాములు కనబడుట యున్నది ఎక్కడనైన కద్దా అని అడుగువారి పద్ధతిని వారు బుద్ధిమంతులే అని నే నొప్పుకొందును. అయితే, వారిజ్ఞానము పైపెంపును రక్షించును కాని, సత్యసారము నది చంపి వేయును.

జీవితమార్గమును వెలిగించున దేదో దానినే నేను సత్య మనుచున్నాను. అట్లు చేయలేనిది సత్యము కాదు; సత్యముయొక్క వట్టి ఆభాస.

ఆ పల్లెటూరి వృద్ధుయొక్క హృదయములో వసించుచున్న విశ్వాసము నా హృదయములో ఉబు కుట లేదు. నాకు దత్తమైన ఆ విశ్వాసము మీకు నిర్దిష్టము కాదు. భగవంతుని సృష్టిలో ముఖములందు వలెనే మనస్సులందు సత్యవిషయమున ఒకడు ఇంకొ కనిని పోలడు.

నా పల్లెటూరి వృద్ధుయొక్క ఆత్మ ఆయనకు ప్రాప్తమైన ఆ విశ్వాసములోని ఆ లాలిత్యమును పోషించి పెంచుకొన్నది. మీ జీవిలోని మాయావర ణముకూడ మీరు మీ హృదయము నప్పగించుచున్న ఆ సత్యముచేత తొలగిపోవుగాక!

నే నింకను ముందుకు పోవుదును : ప్రపంచము యొక్క దౌర్భాగ్యమయిన చరిత్ర అటువంటిది. అది ఈనాడు సీతారాముల పేర్లను కలిసి సంపూర్ణముగా పూజింపలేకున్నది.

కాని, పేర్లమట్టుకు పేర్లతో అది ఏమి చేసు కొన్నను సరే, అది వాని నంగీకరించినను నిరాకరించి నను సరే, తాము రూపించుకొన్న ఆ సత్యమును తమ మనస్సులలో నాటుటకు ప్రపంచము వెనుదీయ కుండునుగాక!

దాని బీజము మొలకెత్తి, పెరిగి పెద్దదై ఒక మహోన్నతవృక్ష మగుగాక! దాని నీడలో అందరికిని మనశ్శాంతి లభించి అందరును శాశ్వతాభ్యుదయ సంపన్ను లవుదురుగాక! ('త్రివేణి'నుండి)

ఆంధ్రుల ప్రాచీనత-
బ్రహ్మగిరి నిదర్శనాలు

శ్రీ రంగారావు నిప్పాణి

గత సంవత్సరము ఫిబ్రవరినుండి జూను నెలవరకు బళ్లారిజిల్లా రాయదుర్గం సమీపములోనున్న బ్రహ్మగిరివద్ద భారత ప్రభుత్వపు అర్షశాఖవారు (ఆర్కియలాజికల్ సర్వే) డైరెక్టరు జనరలు ఆర్. ఇ. యం. వీలరుయాజమాన్యమున అఖండమైన పురావస్తు పరిశోధనలు జరిపిరి. మహెంజోదారో, హారప్ప పరిశోధనల తర్వాత ఇంతటి పరిశోధనలు మరి జరుగలేదని విమర్శజ్ఞు లనుచున్నారు. ఈ పరిశోధనల ప్రాముఖ్యమును గమనించియే ఫ్రెంచి ప్రభుత్వమువారు ప్యారిసు 'మునీగుమో' సంఘము పరముగా మాన్షియర్ కజాల్ వారి సతీమణిని, వీని ప్రత్యక్ష పర్యాలోకనకై పంపిరి. ఆఫ్ఘనిస్తాన్‌నుండి, కాశ్మీరునుండికూడ పరిశోధకులు వచ్చియుండిరి.

ఆ జరిగిన పరిశోధనల ఫలితముగా అమూల్యములైన వస్తువులు బయటపడినవి. బయటపడి, మన ప్రాచీనతను ఇంకను కొన్ని వేలయేండ్ల వెనుకకు తీసుకొనిపోయినవి; ఆంధ్రుల ప్రాచీనత హారప్పా, మహెంజోదారో నాగరకతకంటె ప్రాచీనమా అన్న సందేహమును పురాతత్త్వవేత్తలకు ముమ్మరముగా కలిగించినవి.

బ్రహ్మగిరి సిద్ధాపురమువద్ద అశోకుని శిల్పశాసనమునకు సమీపముననే ఉన్నది. ౧౯౪౩ లో ఒకసారి మైసూరు అర్షశాఖాధికారియైన యం. హెచ్. కృష్ణాగారు తమ బృందముతో వచ్చి, ఇక్కడను, చిత్రకల్ దుర్గమువద్ద నున్న చంద్రవల్లిలోను కొంత మట్టుకు పరిశోధనలు జరిపిరి. ఆ పరిశోధనల ఫలితముగా, రమారమి క్రీ. శ. ౧ లో ఆ ప్రాంతమున ఒక పెద్ద పట్టణ ముండిన దన్నందుకు నిదర్శనముగా ఆ దగ్గరలోనే ఉన్న మెగలెతిక్ గోరీలవద్దను, తదితరత్ర కూడ అనేక నాగరకతా చిహ్నములు దొరకినవి.

పై పరిశోధనలు మూడు సిద్ధాంతములను నిర్ణయించుటకై జరుపబడెను.

౧౯౪౫ లో పుదుచ్చేరివద్ద జరిపిన పరిశోధనల మూలముగా లభించిన పురావస్తువులకును, బ్రహ్మగిరిలో దొరకువానికిని సంబంధ మేమైన ఉన్నదా ? పుదుచ్చేరిలో దొరికిన పురావస్తువులు భారత నాగరకత ప్రాచీనతను చాటుచున్నవి. అంతేకాదు మధ్యధరామహాసముద్ర సమీపములోనున్న ప్రాచీన దేశములతో ఈ దేశమునకు రాక

పోక లుండినట్లు నిరూపింపజాలిన ఆయా దేశాల వస్తువులు కొన్ని పుదుచ్చేరిలో దొరికినవి. ప్రాచీన వస్తుతత్వవేత్తలు వాటిని పరిశోధించి, ఆ వస్తువులు ఏ కాలము నాటివో కూడ తెలుసుకొన్నారు. వాటినిబట్టి భారత నాగరకత ప్రాచీనతనుకూడ అంచనావేయ వచ్చునని నిర్ధారణ చేసినారు.

ఆ పుదుచ్చేరి వస్తువులను ఈ బ్రహ్మగిరి వస్తువులతో సరిపోల్చి, వీటితోబాటు అటువైపు బొంబయి సముద్రప్రాంతమున మరియొక ప్రదేశములోకూడ పరిశోధనలు జరిపి, ఈ మూటిని సమన్వయించి భారత నాగరకతయొక్క ప్రాచీనతను ఇదమిత్థముగా అంచనావేయుటయే ఈపరిశోధన లన్నిటికిని గల ముఖ్యోద్దేశ్యము.

ఈ బ్రహ్మగిరి దక్షిణాపథమున మధ్యలో నుండబట్టి మిక్కిలి ప్రాముఖ్యము వహించుచున్నది.

కొండకు తూర్పుదిశయందు దొరికిన ఛర్టు, లేక క్వార్ట్జు ఉపకరణములు ఇతర దేశములలోని అతి ప్రాచీన మానవ నాగరకతకు చెందినవి. హిందూదేశములో అనేక స్థలములయందు ఇటువంటి ఛర్టు పురావస్తువులు దొరికినవి. కాని వాని కాలమును మాత్రము నిర్ణయించలేదు.

రొప్పంగ్రామ సమీపములో మెగలిథిక్ యుగమునకు సంబంధించిన చాల గోరీలున్నవి. ఇతర దేశములలో ఈ మెగలిథిక్ యుగముయొక్క కాలమును నిర్ణయించినారు. ఇక్కడి ఈ పరిశోధనల ఫలితముగా ఇటువంటివి ఏవైనను దొరికినయెడల భారతదేశ ప్రాచీన నాగరకత లెక్కాచారములను నిర్ణయించుట సులభమగును.

పరిశోధనలు


౧౮౯౨లో రైసు దొరగారు సిద్ధాపురము అశోకుని శిలాశాసనమును కనుగొనిరి. అక్కడి ప్రజలు దీనిని అక్షర గుండు, లేక రాక్షసిగుండు అందురు. మాస్కి యర్రగుడి స్తూపాలను బట్టి మౌర్యులు క్రీ. పూ. ౨౯౮-౨౨౦ వరకు పరిపాలించినట్లు నిర్ణయింపబడెను. బ్రహ్మగిరి శాసనము స్థాపమును సువర్ణగిరి(జొన్నగిరి)నుండి ఇసిల (సిద్ధాపురము) గ్రామమునకు తెచ్చినట్లు సూచించుచున్నది. దగ్గరనే యమ్మెతమ్మెణ్ణ గుండు; ఈశాన్యదిశను గిరజహళ్ల రాళ్లు; మధ్య నన్నహాగరినది. అటువైపు జటంగి రామస్వామికొండ దేవాలయము. అక్కడ ఉచ్చంగి పాండ్యుని శిలాశాసనము. ఈ అన్నిటినిబట్టి ఈ ప్రదేశములో ఒకానొక కాలమున ఒక పెద్దనగరము వెలసి, అది కాలక్రమమున భూగర్భితమైపోయి యుండవలెనని ఊహించిరి.

కొండకు తూర్పుదిశలో చిన్న కొలను. దానిని చండికేశ్వరికుంట అని పిలిచెదరు. దానికి సమీపమున చాళుక్యుల నాటి దుర్గవిగ్రహ మొక టున్నది. ఆ ప్రక్కనే రొప్పంగ్రామము. వందలకొలది క్రొమోలెక్సు (గోరీలు).

పశ్చిమముగా—శిథిలమైన హొస్య గ్రామము. అక్కచెల్లెండ్ర దేవాలయము, పగడిశాలు దేవాలయము, జైనదేవాలయము రెండవవీరబల్లాలుని శిలాశాసనము, త్రిశంకేశ్వర భాగ్యలక్ష్మి దేవాలయాలు, హులికుంటి కుంట ఉన్నవి.

శిలాయుగంనాటి చిత్రవిచిత్ర వస్తువులు

బళ్లారిజిల్లాలో క్రొత్తగా బయల్పడినవి.




మెగలెతిక్ పూర్వపు కదురుబిళ్లలు
౨౫౦౦ ఏండ్ల నాటివి



ఉంబరకుంటవద్ద దొరికిన ౨౫౦౦ ఏండ్లనాటి
మెగలెతిక్ శవశయ్యలు

కప్పగల్లు
కొండమీది



కొన్ని చరిత్రపూర్వ
చిత్రాలు




కప్పగల్ కొండవద్ద దొరికిన చరిత్ర
పూర్వపు రేఖా చిత్రములు




మెగలెతిక్ పూర్వపు రంగుల కుండపెంకులు—౩౮౮౦ ఏండ్ల నాటివి.




సంగనకల్ వద్ద బయల్పడిన కొన్ని చరిత్ర-పూర్వచిత్రాలు



సంగనకల్లుదగ్గర దొరికిన నియోలిథిక్ గొడ్డలికొనలు-౩,౪ వేల ఏండ్లనాటివి



సంగనకల్లు సమీపము లోని రాతివలయాలు



3 వేలయేండ్లనాటి-మెగలెతిక్ పూర్వపు కుండపెంకులు



చరిత్రపూర్వపు ఎచ్చింగు

ఇసిలగ్రామముయొక్క భూగర్భము నుండి రాతి ఆయుధములు, పెంకులు, ఇత్తడి ఇనుముపాత్రలు, ప్రాత క్రొమెలెక్సు (కుండలు - శవాలుపూడ్చునవి), వాటిపై 'క్యాప్‌స్టోన్సు'—పెద్ద రాళ్లు దొరికినవి.

పరిశోధనలవల్ల ఈ క్రింది విషయములు కనుగొనబడెను—

౧. చాళుక్యుల, హొయసలుల తీరు.

౨. ఒక మౌర్యుల పట్టణము.

౩. మౌర్యుల పట్టణమునకంటె పూర్వపు, లోహనాగరకతకు చెందిన నగరము. ఎర్ర బారిన గాజుపెంకులు. రమారమి నియోలెతిక్ యుగమునకు చెందిన నాగరికత.

౪. నియోలెతిక్ నివాసస్థానము.

౫. పిగ్మీలు (మరుగుజ్జులు) వాడిన రాతి ఆయుధములు.

అశోకుని శిలాశాసనము ౧౩ ప్రకారముగా ౩ ముఖ్యమైన వలసరాజ్యాలున్నట్లు తెలియుచున్నది. పెలినికాస్ (పైఠణ్), ఆంధ్ర (నాగార్జునకొండ), పులింద (వనవాసి), మరియు సలియపులూస్ (చిత్ర దుర్గము)—వీటి కన్నిటికి సువర్ణగిరి ముఖ్య పట్టణముగా నుండెను. ఆ పట్టణము డాక్టరు ఫ్లీటు హైదరాబాదులోని కనకగిరి యనియు, యాజ్దానీగారు మాస్కియనియు, డక్టరు చిలుకూరి నారాయణరావుగారు యర్రగుడి దగ్గరనున్న జొన్నగిరి యనియు అభిప్రాయ పడుచున్నారు. కాని, ఇటీవలి పరిశోధనల వల్ల చివరకు జొన్నగిరియే సువర్ణగిరి యని నిర్ధారణ చేయబడినది.

ఇసిల అనగా ఋషులుండు స్థలమని అర్థము. దాదాపు క్రీ. పూ. ౨౦౦ లో శాతవాహనుల కాలములో అది క్షీణించెను. వ్యాపార ముఖ్య కేంద్రము చంద్రవల్లి యాయెను.

ఇసిల నాగరకత చిహ్నములు—

౧. సొరకాయలవంటి పెద్దకుండలు—ఎర్రని రంగు కలవి (బహుశా శాతవాహనుల కాలపువి).

౨. బీహారులోని భీటాయందు దొరికిన మౌర్యులనాటి పాలిష్ చేయబడిన కుండలు. లోపల నల్లరంగు, పైన పసుపు, బ్రౌనురంగు కలవి.

౩. ఎరుపురంగు కుండలు.

౪. ముదురు ఎరుపురంగు కుండలు.

౫. బ్రౌనురంగు కుండలు.

కొన్ని గాజుపెంకులపైన తీగలు, లేక నీటి అలలుమాదిరిగా చిత్రములు చిత్రింపబడినవి. ఇటువంటివే 'ఇండస్‌వాలీ' (సింధులోయ) నాగరకతకు చెందినవి. రెండవవిధమువాటిలో గీతలతో అల్లినట్లు డిజైన్లు ఉన్నవి. సింధు లోయలోను, సుమ్మెనర్ లోయలోను, క్రీటులోను ఇవి కానవగును.

బ్రహ్మగిరిలో బిజాపూరు సంతతికి చెందిన నాట్యములు, సింహపు చిహ్నపు చాళుక్యుల బంగారు నాణెములుకూడ దొరకినవి.

మైక్రోలితిక్ యుగము

చిన్నచిన్న కత్తులు, రంపములు, అంబుల కొనను పెట్టు మొనలు—గట్టిఛర్టు,

లేక చాల్సిడోనీ రాతితో చేయబడినవి విరివిగా దొరకినవి. ఇవి రొప్పం గ్రామములో కనుగొనబడెను. ఇటువంటివే యూరపులోని అచెలియన్ కాలమునను, ఆఫ్రికాలో గాస్ఫియన్ కాలమునను, ఫ్రాన్సులో క్యాంపేనియన్ కాలములోను ఉండినవి. దాదాపు ౮౦౦౦౦ నుండి ౬౦౦౦౦ వరకు ఈ మరుగుజ్జుల యుగ ముండెను.

క్రోమెలెక్సు-గోరీలు రెండుమూడు విధములుగా ఉన్నవి. మెగలిథిక్ యుగమునకు చెందినవాటిలో చిన్న రాళ్లతొట్టి, దానికి ఒకవైపున ఒక చిన్నగండి-అందులో నుండి ఆ జీవుని రాకపోకల కనుగుణముగా ఏర్పరుపబడినది. ఈ తొట్టికి చుట్టు మంచి రాతికట్టడము; పైగా క్యాప్‌స్టోన్, లేక పెద్దరాయి. రెండవరకము కుండలలో శవాలను పూడ్చుట. ఇవి దాదాపు ౧౩౦౦౦ సంవత్సరాల నాటివి.

బ్రహ్మగిరిలో దొరికినవాటిలో ౪ సిపాయీలు ఒక కుండలోను, ఒక అబ్బాయి తనతలను తన తొడమీద నిడి యున్నమాదిరి, రెండు అస్థిపంజరములు-ఒకటి పద్మాసనము; రెండవది దాని తొడల మీద పండుకొన్నది దొరికినవి. అనగా ఆ కాలములో కూడ సహగమన ముండి యుండెనేమో! అన్నిగోరీలలోను తల ఉత్తర దిక్కున ఉన్నది. కాళ్లు దక్షిణపువైపు.

సమీక్ష

౧. ఈ బ్రహ్మగిరి అనాదియైన చరిత్ర పూర్వపు నాగరకతకు, చరిత్రనాగరకతకు సంబంధమును సూచించుచున్నది. ఈ ప్రాంతమునకు గ్రీసు, రోము మొదలగు దేశములతో వాణిజ్యవర్తకములు జరుగుచుండినట్లు చూపగల కొన్ని సామగ్రులు దొరికినవి.

౨. యూరపులోని చెలియన్, అచెలియన్, మూస్టెరియన్, మగ్దలీనియన్ యుగాలనాటి నిదర్శనములు దొరికినవి. (క్రీ. పూ. ౫౦౦౦౦ నుండి ౧౩౦౦౦ వేండ్ల నాటివి. ప్యాలీలెథిక్ యుగపువి)

౩. మైక్రోలెథిక్ యుగము.

౪. నియోపాలీ లెథిక్ యుగము. పాలిషుచేసిన కుండలు. (క్రీ. పూ. ౬౦౦౦-౪౦౦౦)

౫. లేట్ నియోలెథిక్ యుగము. ఇనుము, రాగి, ఇత్తడి పాత్రలు. (క్రీ. పూ. ౧౫౦౦-౫౦౦)

౬. మౌర్యులకాలము. కుండలు. (క్రీ. పూ. ౫౦౦-౨౦౦)

౭. శాతవాహనుల కాలము.

[ఈ బ్రహ్మగిరి పరిశోధన ఫలితాలను చూచి, అవి ప్రేరించిన ప్రేరేపణతో పూనాలోని దక్కన్ కాలేజీలో పనిచేస్తున్న శ్రీ బెండపూడి సుబ్బారావు, యం. ఏ., యల్. యల్. బి. గారు ఇటీవల ఆ బ్రహ్మగిరికి సమీపంలోనే సంగనకల్లు అనే గ్రామంవద్ద జరిపిన త్రవ్వకాలమూలాన బయల్పడిన విచిత్రవస్తువులు—బ్రహ్మగిరిపరిశోధనఫలితాలను మరింత ధ్రువపరచగలవి—ప్రక్కపుటలలో చిత్రింపబడినవి. ఈ ఛాయాచిత్రాలను శ్రీ సుబ్బారావుగారే నాకిచ్చినారు. ఇందుకు వారికి నేను చాల కృతజ్ఞుడను.]

దివ్యస్మృతి

శ్రీ కోలవెన్ను రామకోటీశ్వరరావు

నేటి స్వతంత్రభారతావనిలో శ్రీ వీరేశలింగకవి వర్యుని దివ్యజీవితాన్ని స్మరించగల మహాభాగ్యం ఆంధ్రజాతికి అబ్బినది. వంగదేశానికి శ్రీయుతులు రామమోహనరాయలు, బంకించంద్రులు, విద్యాసాగరులు చేసిన మహోపకారాన్ని ఒక్క పంతులుగారే ఆంధ్రదేశానికి సర్వతోముఖంగా అందజేశారు. నాడు నన్నయ్య, రాజరాజు పవిత్రగోదావరీస్రవంతికి వైపోడ్చి ఆంధ్రచరిత్రలో నూతనశకాన్ని సృష్టించినట్లే ఇప్పటికి రెండు శతాలనాడు శ్రీ పంతులుగారు ఆధునికఆంధ్రజాతికి నిర్మాతలూ, నాయకులూ అయినారు. మన సాహిత్యరంగంలో పంతులుగారితో పాటు ఎన్నదగ్గవారు శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవులు, శ్రీ గురజాడ అప్పారావుగారు. నేటి కవులూ, రచయితలూ, సారస్వతసేవకులూ వీరిలో ఎవరో ఒకరికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో శిష్యులై, వేర్వేరు రీతులలో వాసి కెక్కినారు.

రాజమహేంద్రవరం ఎంత పుణ్యం చేసుకున్నదో! బళ్ళారి, చెన్నపట్టణం, నెల్లూరు, మచిలీపట్టణం, కాకినాడలు ప్రధానంగా ఆంధ్రసాహితీవరులకు నిలయము లైనవి. మనకు ప్రత్యేకాభిమానాలు ఎంతగా ఉన్నప్పటికీ, అంతా కలిసి రాజమహేంద్రవరానికే అగ్రస్థానం ఇవ్వక తప్పదు. మా కొండవీటి శ్రీనాథుడు రాజమహేంద్రవరపండితులను పరాచకం చేశాడు. అయినా, రాజమహేంద్రవరమే సరస్వతీ నిలయము మనీ, అక్కడ పొందిన విజయమే విజయ మనీ అతనికి తెలియక పోలేదు. ఈ శతాబ్దిలో చిలకమర్తివారు, వడ్డాదివారు, న్యాపతివారు, వావిలాలవారు, ఉంగుటూరివారు, దామెర్లవారు—అంతా రాజమహేంద్రవరజీవితానికి ముగ్ధులైనవారే. ఆ నగరలక్ష్మికి అందాలు దిద్దినవారే. బందరుచెన్ననగరాలలో జీవితమంతా గడిపిన శ్రీ చెన్నాప్రగడ భానుమూర్తి కవికికూడా రాజమహేంద్రవరమే అత్యధికంగా ప్రీతిపాత్ర మైనది. అందుకనే తమ 'భారతధర్మదర్శన' కావ్యంలో 'గోదావరీకృష్ణలు' అని ముందుగా గోదావరినే స్మరించారు.

యుగపురుషుడూ, మహారథుడూ అయిన వీరేశలింగంగారు ఇటువంటి దిగ్దంతుల మధ్య జీవితం గడిపి మొత్తానికి తనదే పైచేయి అనిపించుకున్నారు. కృశగాత్రుడైన వీరునివలె, ఎండవానలకు జంకని పథికునివలె చిట్టచివరకు పంతులుగారు చెన్ననగరంలోనే పూజ్యులైన శ్రీ కొమర్రాజువారి సన్నిధిలో విశ్రాంతి పొందినారు.

ఇప్పటికి ఏభై పైబడి, ఇంకా అరవై అందుకోని మాతరంవారి కంతా చిన్నతనంలో శ్రీ పంతులుగారే ఆదర్శమూర్తులు. బడిలో తెలుగువాచకాలు పంతులుగారు రచించినవే. కళాశాలలలో చదివే కవి జీవితాలూ వారివే. ఇక ఉల్లాసంగా వచనగ్రంథాలు చదవాలంటే సత్యరాజాయాత్రలు, రాజశేఖరచరిత్ర, బ్రాహ్మవివాహము మహా రసపట్టులుగా ఉండేవి. ప్లీడర్ల ప్రపంచం వస్తే వ్యవహారధర్మబోధినిలోని వీరన్న, దొరయ్యసోదరుల వ్యాజ్యాలూ, సూర్యనారాయణ

* ఆలిండియా రేడియో-మద్రాసువారి అనుమతిని.

పంతులుదర్పమూ ఏమిచిత్రంగా కనుపించేవి! విన్నారా, ప్లీడరుగారు ఒక కేసు నెగ్గించినందుకు కక్షిదారు బంగారు మొలతాడు చేయించడమే కాకుండా తానే స్వయంగా ప్లీడరుగారి మొలకు అమర్చినాడట. శ్రీ రాయల వారు పెద్దన్నగారి పల్లకిని తనకేల పట్టి ఎత్తినట్లే సుమండీ. నాటకాల మాటకు వస్తే కృష్ణమాచార్యుల వారి చిత్రనళీయం, వేదంవారి ప్రతాపరుద్రీయం, తిరుపతివారి పాండవోద్యోగం, పంతులుగారి శాకుంతలం మహోన్నతశిఖరాలుగా ఉండేవి. శ్రీ హరి ప్రసాదరావుగారివంటి ఉత్తమనటుడు రాజఠీవితో రంగం ప్రవేశించి 'ఒరు లావని క్రేళ్వరితేనె, సూచి విన్యాసము లేని రత్నము' అనే పద్యాన్ని చక్కగా పాడి అభినయిస్తుంటే "వీరేశలింగంగారు మహాకవి. ఆయన శాకుంతల కాళిదాసుకావ్యానికి వన్నె పెట్టింది" అనుకుని గర్వించేవారము. సంఘసంస్కరణా, రాజకీయస్వాతంత్ర్యమూ రెండూ అత్యవసరములే. అయినా వీరేశలింగంగారికి సంస్కరణ కార్యకలాపంమీదా, న్యాపతి సుబ్బారావుపంతులుగారికి రాజకీయపునర్నిర్మాణంమీదా అభిమానం హెచ్చు. ఈ ఖ్యాతి పొందినవారు వీరేశలింగంగారు; యావద్భారతసంఘసంస్కరణసభకు ఒక సంవత్సరం అధ్యక్షులైనారు. మహామేధావులైన న్యాయమూర్తి రానడేగారు స్వయంగా వీరేశలింగంగారిని ప్రస్తుతించి అధ్యక్షపీఠాన కూర్చోపెట్టినారు. అపరవిద్యాసాగరులని అంతా వారిని కీర్తించారు. ఇక న్యాపతివారో? హిందూపత్రికాసంస్థాపకులలో ఒకరు. కాంగ్రెసుకు అధ్యక్షులు కాలేకపోయినా ఒకసారి ఆహ్వానసంఘాధ్యక్షులైనారు. చిరకాలం ప్రధానకార్యదర్శిగా ఉండి ప్రతిష్ఠ గడించారు. శాసనసభలలో మేటిసభ్యులనిపించుకున్నారు. ఈవిధంగా రాజమహేంద్రవరపు ఉత్తమపౌరులిద్దరూ సూర్యచంద్రులవలె భారతీయాకాశంలో వెలుగొందినారు. కొన్ని సంవత్సరాల పాటు వీరు సహచరులే. కాని క్రమంగా వారి పంథాలు వేరైనవి. ౧౯౦౫ సంవత్సరపు వందేమాతరం అలజడి నాటికి అన్ని దేశీయోద్యమాలకంటె స్వాతంత్ర్యోద్యమానికే ప్రాముఖ్యము వచ్చింది. అన్నిటికంటే ముందుగా దానికోసమే నడుములు బిగించవలె నన్న అభిప్రాయం ప్రబలింది.

కాని అంతకుపూర్వమే ఆంధ్రదేశంలో శ్రీ వీరేశలింగంగారి కృషిఫలితంగా వితంతువివాహాలపట్ల సమ్మతీ, సానిమేళాలంటే నిరసనా, స్త్రీవిద్యపైన అభిమానమూ బాగా పెంపొందినవి. వీరేశలింగంగారి వంటి మహనీయుడే ఈ పనికి పూనుకోకపోతే, మన రాజకీయజీవితానికి అస్తిభార మవదగ్గ ఉత్తమసంఘవ్యవస్థ అసంభవ మయ్యేదే. ౧౯౦౭ కు పూర్వం రాజకీయాలలో పాల్గొనడం సులభం, నిరపాయకరం. కాని సంఘసంస్కర్తల మార్గం కంటకావృతం. బహిష్కరణ ఆయుధానికి గురిఅయిన ధీరు లెందరో ఆంధ్రదేశాన్ని అలంకరించారు. వారికి ధన్యవాదాలు. వారంతా పంతులుగారి అనుచరులే.

కరడుకట్టిన సంఘంలో కదలిక కలిగించాలంటే ఎవరో కొందరు తెగించి ముందుకు దుమికితేతప్ప ఏ పనీ జరుగదు. చిత్తస్థైర్యంతోపాటు కొంత మొండితనం కూడా కావలసివస్తుంది. దురాచారాలను నిర్మూలించడానికై ఒక్కొక్కప్పుడు అతికఠినంగా విమర్శించడం జరుగుతుంది. సనాతనధర్మంలో నిగూఢమై ఉన్న ఉత్తమభావాలు ఉద్రిక్తులైన సంస్కర్తలకు గోచరించవు. పవిత్రమైన భక్తిభావాన్ని పురికొల్పే రూపకల్పన కేవలం మూఢమైన విగ్రహారాధనగా కనుపిస్తుంది. సంగీతమూ, భరతనాట్యమూ జాతికి ఉత్తేజాన్ని కలిగించే పవిత్రకళలైనా సంఘంలో ఒక వర్గాన్ని హేయమైన వ్యభిచారవృత్తికి బలిచేస్తున్నప్పుడు సంస్కర్తలు కళ్ళారా చూస్తూ ఊరుకోలేరు. పంతులుగారి వ్రాతలలోనూ, వాక్కులోనూ కొంత పారుష్యం విధిగా ఏర్పడింది. అందరికీ సమ్మతంగా ఉండేటట్టు, ఎవరి మనస్సుకూ నొప్పి కలగకుండా సున్నితంగా, లలితంగా, రమ్యంగా తమ రచనలను పంతులుగారు సాగించలేదు. ఒకవైపున కొంప అంటుకుంటూ ఉంటే, పన్నీటిజల్లు ఏమి పనిచేస్తుంది? గరళం పోయవలసిన చోట పానకంవల్ల ఏమి ప్రయోజనం? పంతులుగారు నిర్మొగమాటంగా, ఒక్కొక్కప్పుడు క్రూరంగా సంఘాన్నీ, వ్యక్తులనూ విమ

క్షించి అనేకమంది శత్రువులను కొనితెచ్చుకున్నారు. అందరిలోనూ మంచిగా మెలగాలనుకున్నట్లయితే, తాము తలపెట్టిన పంథాలో ఒక్క అడుగు ముందుకు సాగేది కాదు. అరణ్యాన్ని ఛేదించేటందుకు గొడ్డలి కావద్దూ! అందువల్లనే పంతులుగారి శైలిని రానురాను కుఠారంగా పరిణమించింది. ఇంత కాలం గడిచినతరువాత వారి రచనలలో కొన్ని భాగాలు చదువుతుంటే 'ఎంత తీవ్రత!' అనిపిస్తుంది. వారి ప్రహసనాలలో, హాస్యరసాన్ని చక్కగా పోషించినా, ఆ హాస్యానికి వెనుక రోషమూ, క్రోధమూ తాండవిస్తూ ఉంటవి. చిలకమర్తివారికీ, పంతులుగారికీ ఉన్న గొప్ప భేద మిదే. సంఘంలో తేదలచిన మార్పును ఇద్దరూ తమ కృతులలో సూచించారు. అందుకొరకే ఉభయులూ జీవితాన్ని ధారపోశారు. కాని చిలకమర్తి శిల్పి; పంతులు యోధుడు. కీర్తికాయులైన శ్రీ జొన్నవిత్తుల గురునాథంగారు ఇంగ్లీషులో పంతులుగారి జీవితం వ్రాశారు. భావంలోనూ, భాషలోనూ ఆ గ్రంథం ఉత్తమశ్రేణికి చెందింది. కాని ఎందువల్లనో అది అంతగా ప్రచారంలోకి రాలేదు. గురునాథంగారు పంతులుగారి శిష్యులు. పంతులుగారు ఆంధ్రనారీలోకానికి చేసిన మేలును వర్ణిస్తూ, ఆడపిల్లలకు పేర్లు పెట్టడంలోకూడా ఎంత మార్పు వచ్చిందో చెప్పినారు. చుక్కమ్మ, పుల్లమ్మ, పిచ్చమ్మ అనడానికి బదులు సత్యవతి, సరోజిని, హేమలత, త్రివేణి అంటున్నాము. సత్యవతి అంటే జ్ఞాపకం వచ్చింది. సత్యవతీచరిత్రలో కథానాయిక సాక్షాత్తు కోర్టు మునసబుఇంటిపను లన్నీ చేసేదిట. అత్తమామలంటే గౌరవంగా ప్రవర్తించేదట. చదువుకున్న ఆడపిల్లలు బొత్తిగా సంసారానికి పనికిరారనే అపోహ పోగొట్టడానికే పంతులుగారు సత్యవతిని సృష్టించారు. ఆమె అత్తగారు పూర్వకాలపు మనిషి. పైగా పట్టుదల ఎక్కువ. క్రొత్తగా కాపురానికి వచ్చిన కోడలు అత్తగారు చూస్తుండగా రాత్రిపూట గదిలోకి వెళ్లడం సదాచారం కాదనుకునే రోజు లవి. కోడలిమీద పంతంకొద్దీ సత్యవతిఅత్తగారు కొడుకు గదిముందరే రాత్రి భోజనానంతరం పీటం వేసి, ఏకులబుట్ట ముందు వేసుకుని వత్తులు చేస్తూ ఉంటుంది. సత్యవతిభర్త గదిలోనే ఉన్నాడు. ఎంత ప్రొద్దుపోయినా సత్యవతి గదిలోకి వెళ్లడానికి అత్తగారు అభ్యంతరంగా ఉంటుంది. చూసిచూసి చివరకు అర్ధరాత్రివేళ సత్యవతి గదిలోకి వెళ్లనే వెళ్లుతుంది. అత్తగారు కోపంతో చరచరా పోయి పడుకుంటుంది. సినిమా చూసి వెన్నెలలో బీచిషికారుకు వెళ్లి వినోదంగా స్వంతకారులో ఇంటికి చేరుకునే నేటి యువకదంపతులకు ఈ ఘట్టం ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది. ఇక గర్వంమాట అంటారా, మునసబుల కూతుళ్లే కాదు, హైకోర్టుజడ్జీల కూతుళ్లుకూడా—బి. ఏ. లు, ఎం. ఏ. లు పాసయినవాళ్లు నెమ్మదిగా, మర్యాదగా కాపురాలు చేస్తున్నారు. పంతులుగారి ఆత్మకు ఎంత హాయి అనిపిస్తున్నదో.

తమ సమకాలికుల వింత పట్టుదలలూ, సాంఘికమర్యాదలూ పంతులుగారు చిత్రించారు. లాంతరు పట్టుకుని ముందుగా నడవాలిసిందే. కాగడాలు పోయి క్రొవ్వొత్తులు అములులోకి వస్తున్న ఆ కాలంలో ఒక పెద్దమనిషి ఇంట్లో క్రొవ్వొత్తులు అయిపోయినవి, నౌకరు వచ్చి తనవెంట కాండిల్ స్టాండు పట్టుకు రావలసిన సమయం కాలేదు. ఈలోపుగా దుకాణాలు మూస్తారు. మ రేంగతి? అందుకని ఆ గృహస్థు తానే చీకట్లో బజారుకు నడిచిపోయి, క్రొవ్వొత్తి కొనితెచ్చి, తరువాత మర్యాదకు లోపం లేకుండా, నౌకరుతోను, దీపంతోను ఆలస్యంగా విందుకు హాజరవుతాడు. ఈరోజుల్లో అయితే డ్రైవరు హాజరులో లేనప్పుడు యజమానులే డ్రైవరు. ఇంటికి నడిచి వెళ్లి డ్రైవరును కలుసుకువచ్చి కారులో అవతల వీథిలో విందుకు వెళ్లినట్లే అనుకోండి. పంతులుగారు నన్నయవంటి వాఙ్మయనిర్మాత; తిక్కనవంటి కవిబ్రహ్మ. 'గద్యతిక్కన' అనే బిరుదు వారి కెంతో తగిఉన్నది. నవల, ప్రహసనం, శాస్త్రచర్చ, సాహితీవిమర్శ, జీవితగాథ, రాజకీయవ్యాసం అన్నిటికీ తగిన వెలుగు శైలిని పంతులుగారు సాధించారు. సులభమైన, గ్రామ్యమైన వచనాన్ని వ్రాశారు. కాని శ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారి వాదం వారికి పూర్తిగా

సమ్మతం కాలేదు. గిడుగువారూ, గురజాడవారూ వ్యావహారికభాషావాదాన్ని ప్రచారంచేయడానికి చెన్ననగరానికి వచ్చిన రోజులలో రాజధానికళాశాలావిద్యార్థులమైన పురాణం సూరిశాస్త్రి, వింజమూరి రంగాచార్యులూ, నేనూ వారిని ప్రతిఘటించాము. సభలలో అల్లరిచేశాము. వీరేశలింగంగారి శైలికి మించిన వచనశైలి ఉన్నదా అని దబాయించాము. ఆంధ్రసాహిత్యపరిషత్తును ఎదురీదుతున్న శ్రీజయంతి రామయ్యపంతులుగారే ఏవిధంగానైనా గ్రాంథిక భాషను నిలబెట్టగలరని ఆశించాము. వీరేశలింగంగారినే అధ్యక్షులుగా ఉంచి పచ్చయప్పహాలులో గిడుగువారి వాదాన్ని నిరసిస్తూ తీర్మానాలు చేయించాము. భాష, శైలి క్రమంగా మారకతప్ప దనీ, తెలుగు వచనశైలిలో వీరేశలింగంగారికంటె పైమెట్టుకు పోయే రచయితలు ఆంధ్రదేశంలో ఉద్భవిస్తా రనీ మాకు అప్పటికి గోచరింపలేదు. సాహితీసమితి రచనలూ, శ్రీ ఉన్నవవారి మాలపల్లీ, మాకు విజ్ఞానోదయం కలిగించినవి. భాష సజీవ మైనది. పరిణామం తప్పదు. భాషావాదానికి అడ్డుతగలలేము. కాని భూమిని సస్యశ్యామలం చేయడానికై అప్పుడప్పుడూ ఆనకట్టలు కల్పించి రచనాసలిలాన్ని రమ్యంగా ప్రవహింపజేయవచ్చు. అదే ఉత్తమరచయితల కార్యం. చివరరోజులలో పంతులుగారుకూడా ఒక బహిరంగ సభలో వ్యావహారికశైలికి సుముఖు లైనట్లు వినికిడి.

పంతులుగారు ప్రభుత్వకళాశాలలో తెలుగు పండితులు. పైగా రావుబహద్దరు. ఆయన కాంగ్రెసు రాజకీయాలలో పాల్గొనలేదు. కాని దేశీయమహాసభోద్దేశములు అనే వ్యాసాన్ని ప్రకటించి కాంగ్రెసు ఉద్యమానికి దోహదం చేశారు. శాసనసభలకంటే, మండల, రాష్ట్రీయసమావేశాలకంటే ఉద్యోగుల ప్రవర్తన బాగుపడడం ముఖ్య మని పంతులుగారి నమ్మకం. మేజస్ట్రీటులూ, మునసబులూ లంచాలు పుచ్చుకుని ప్రజలను పీడించడమూ, న్యాయవాదులే లంచాలు మాట్లాడిపెట్టడమూ ఆనాడు పరిపాటి అయింది. లంచాలు రాబట్టలేని ఉద్యోగులూ, సానుల సహవాసం లేని ప్లీడర్లూ శుద్ధచవటలని సామాన్యంగా అనుకునే వారు. వ్యక్తుల సత్ప్రవర్తనమీదనే సంఘశ్రేయస్సు ఆధారపడినదని మనసారా నమ్మి పంతులుగారు తమతరంవారి నైతికజీవితాన్ని బాగుపరచడానికే పాటుబడ్డారు. అందుకే తమ వాక్చాతుర్యాన్నీ, కావ్యరచనాకౌశలాన్నీ వినియోగించారు. ఇప్పటికీ ఇంకా ధారాళంగా వరవిక్రయాలు సాగిపోతున్నవి. బహుభార్యాత్వము నెమ్మదిగా తల ఎత్తుతున్నది. పంతులుగారి ఆశయాలను మనము విస్మరించామేమో అనిపిస్తుంది. వారిని పూజించేవారు లక్షలాది ఆంధ్ర దేశంలో ఉన్నా, వారి గ్రంథాలు ఎంతమంది చదువుతున్నారు? వాటిని అందంగా పునర్ముద్రణం చేయించి ప్రజానీకానికి అందుబాటులో ఎందుకు ఉంచకూడదు? ఇంతకంటే విపరీతం మరొకటి చూడండి:

రాజమహేంద్రవరంపాలచౌకులో పంతులు గారి శిలావిగ్రహ మున్నది కదా? రాజమహేంద్రవర పురపాలకసంఘంకాని, ఇన్నీసుపేటపౌరులుగాని ఆ శిలావిగ్రహాన్ని ఏవిధంగా గౌరవిస్తున్నారు? ఎలా కాపాడుతున్నారు? ఈ సంగతి తెలుసుకుంటే అంతు లేని విచారం కలుగుతుంది. ఇంతటనైనా రాజమహేంద్రవరంవారు జాగ్రత్తపడాలిసుమా.

చెన్ననగరానికీ, పంతులుగారికీ ఎంతో సంబంధ మున్నది. రాజధానికళాశాలలో వారు చాల సంవత్సరాలపాటు పనిచేశారు. పరశువాకం వెల్లాలవీథిలో వారి కాపురం. వారు ప్రకటించిన కొన్ని గ్రంథాల పీఠికలలో ఈ వెల్లాలవీథిని పేర్కొన్నారు. ఎగ్మూరు హైరోడ్డులోని వేదవిలాసంలో పంతులుగారు పరమ పదించారు. చెన్ననగరంలో వారి స్మృతిచిహ్నం లేకపోవడ మేమిటి? అయినా పంతులుగారికి వేరె స్మృతిచిహ్నాలు ఏర్పరచడ మెందుకు? లండను నగరంలో సెయింటు పాల్సుకేథడ్రల్ అనే దివ్యమందిర మున్నది; శిల్పసౌందర్యంలో వన్నెకెక్కింది. దాని నిర్మాత సర్ క్రిస్టఫర్ రెన్ అనే శిల్పి. మందిర మంతా కలయజూచినా ఎక్కడా రెన్ చిత్రపు కాని, ప్రతిమగాని కనుపించలేదు. ఒకమూల మాత్రం చలువరాతిపలకమీద "రెన్ మహనీయుని స్మృతి చిహ్నం చూడాలంటే, ఒక్కసారి మందిరాన్ని అవలోకించండి. అదే అతని చిహ్నం." అని చెక్కినారు. శ్రీ వీరేశలింగంగారి చిహ్నం యావదాంధ్ర దేశం. ఆయనను కన్న ఆంధ్రమాత ధన్యురాలు. ఆయనపుట్టుకతో ఆంధ్రజాతి తరించింది.

కన్యాకుమారి

శ్రీ సత్యవోలు సుందరరావు

ఏదైనా దేశం అంతట్లా అని చెప్పవలసి వస్తే ఆసేతు హిమాచలపర్యంతం అంటాం. దాన్నే ఇంగ్లీషులో Calcutta to Karachi అని గాని, Kashmir to Comorin అని గాని అంటారు. నిజానికి పై రెండు ప్రదేశాలూ కూడా చూడవల్సినవే.

కాశ్మీరంలో రమణీయప్రకృతిదృశ్యాలు, రమ్య కాసారాలు, అద్భుతమైన తేలుడు తోటలు (ఫ్లోటింగు గార్డెన్సు) ఇలాంటి ఆహ్లాదకరదృశ్యాలు ఉంటాయి.

ఇన్ని ప్రకృతిసౌభాగ్యాలు లేకపోయినా కన్యాకుమారికూడా కాశ్మీరంఅంతటి సుందరమైన ప్రదేశమే. ఉన్నవి అమ్మకోవెల, చక్కటి సముద్రమూ రెండే అయినా కన్యాకుమారిసౌందర్యం హృదయంలో గాఢంగా హత్తుకొంటుంది.

మహాపురుషులకు ఆత్మశాంతి నిచ్చిన ప్రదేశం కన్యాకుమారి. అచ్చట భూమికి ఆఖరుగా ఉన్న రాతి బండమీద కూర్చునేకదూ స్వామి వివేకానంద మనకు ఒక అమర సందేశం యిచ్చింది! (Message from the last stone of India) అది కొంచెం ఒడ్డుకు దూరంగా ఉన్న పెద్ద రాతిబండ.

అమరజీవి మహాత్ముడు కన్యాకుమారిని చూచి అన్నాడట—"The place is eminently fit for contemplation; like the Goddess, the waters around are virgin."

తిరువనంతపురంనుంచి కన్యాకుమారికి మంచి సిమెంటురోడ్డూ, రోడ్డు కిరుప్రక్కలా ప్రకృతిసౌభాగ్యాలూ! ఇలాంటి రోడ్లు ఇండియాలోనే చాలా కొద్దిగా ఉంటాయట.

ఊరు చిన్నదయినా చాలా అందంగా ఉంటుంది. మెయిన్‌రోడ్డుకు ఒక ప్రక్క తిరువాన్కూరు రాజావారి వేసవిబస మొదలైనవీ, రెండవవేపు బ్రాహ్మణుల ఇళ్లూ, కొంచెం వేరుగానూ దూరంగానూ పల్లెవారి గూడెమూ ఉంటాయి. రోడ్లు తీర్చిదిద్దినట్లుండి చాలా శుభ్రంగా ఉంటాయి.

యాత్రీకులు స్నానం చెయ్యడాని కనువుగా చప్టాలూ, మెట్లూ కట్టేరు—కెరటాలు తక్కువగా ఉండేచోటున.

కన్యకాపరమేశ్వరిగుడి తూర్పుముఖంగా ఉంటుంది. ఆలయం చిన్నదే. శిల్పకళ, పనితనం ఏమీ ఎక్కువగా ఉండవు. పెద్ద మంటపం, నల్లటి రాతి స్తంభాలూ ఇవే మనను ఆకర్షించేవి. అమ్మవారి విగ్రహం సుమారు మూడడుగుల ఎత్తుంటుంది. చిన్న కన్నెపిల్లలాగే కనపడుతూంటుంది.

ఉత్సవదినాల్లో తప్ప వట్టప్పుడు ఒక ముక్కున నత్తుతప్ప విశేషాభరణాలు ఏమీ ఉండవు. ఆ నత్తులో ఉన్న అమూల్యమైన వజ్రం దీపపుకాంతి పడ్డంవల్ల ఒక కాంతివంతమయిన నక్షత్రంలాగ కనబడుతూంటుంది—తళతళా మెరుస్తూ.

దేవిఅంటే తిరువాన్కూరురాజావారికి ఎంతో భక్తి. ఆమెప్రతీఉత్సవానికీ ఆతడు స్వయంగా వెళ్లి ఆమెను దర్శిస్తాడు. ఉపవాసాలుకూడా చేస్తారట.

స్థలపురాణము

అక్కడ పూర్వం పార్వతిఅంశవల్ల పుట్టిన ఒక కన్యక పరమేశ్వరుణ్ణితప్ప మరెవ్వరినీ పెండ్లిచేసుకోనని ప్రతినబట్టి తపస్సుచేసిందట. కొంతకాలానికి శివుడు ప్రత్యక్షమై ఒక ముహూర్తము నిశ్చయించి ఆ ముహూర్తానికి తప్పక వస్తాను, సిద్ధంగా ఉండవలసిందని చెప్పి అదృశ్యుడయ్యాడట. కాని కారణాంతరాలచేత ముహూర్తానికి సరిగా రాలేకపోయాడట. (హిమాలయపర్వతాలనుండి కన్యాకుమారికి చాలా దూరం ఉండడంవల్లేమో) ముహూర్తము దాటిపోవడం చూచి నిస్పృహ చెంది, ఆ కన్య 'నే నింక వివాహమే చేసుకోనని ప్రతిజ్ఞ పట్టి ఆజన్మాంతం కన్యగానే ఉండిపోయిందట. అందుచేతే ఆమెను కన్యకాపరమేశ్వరి అని పిలుస్తారు.

శివుడికి వార్త దారిలోనే తెలిసిందట. ఎప్పటికప్పుడామెనుగూర్చి వార్తలు వినవచ్చుకదా అని తానున్న అక్కడికి ఇరవైమైళ్ళదూరంలో శుచీంద్రమనే చోటున నిల్చిపోయాడట స్థాణుమూర్తి అనే పేరుతో.

శుచీంద్రందేవాలయంవంటి ఆలయాలు హిందూదేశంలో చాలా తక్కువ ఉన్నాయి. అచ్చటి కళా

వైదగ్ధ్యమూ, శిల్పచతురతా చెప్పడానికి కలవిగానట్టివి. ఆ స్తంభములమీది చెక్కడాలు, జీవం ఉట్టిపడే ఆ విగ్రహాలు, భయంకొల్పే, సుమారు పదడుగులఎత్తుండే ఆంజనేయవిగ్రహం ఇవన్నీ చూస్తుంటే మనస్సు ఆనందంతో కరిగిపోతుంది. ఎంతటి ధన్యజీవులో ఆ శిల్పులూ, కట్టించిన మహారాజులూను!

ఏ కొద్దిమంది యాత్రికులో తప్ప సాధారణంగా చాలామంది కన్యాకుమారిసముద్రాన్ని చూడ్డానికే వెళ్తారు. భక్తులకు దేవిని చూడడం ఒక అదృష్టం. కాని వెళ్ళిన ప్రతివారికీ ఆ సముద్రాన్ని చూచి ఆనందంతో తరించడం జీవితంలో ఒక ఆనందపు సంఘటన.

ఏసముద్రందగ్గరకెళ్ళినా—ఏదో ఒకే మాదిరి ఇసుక కనబడుతూంటుంది. కాని కన్యాకుమారిలో అన్నిటికన్నా విశేషం. అనేకరకాల ఇసుకలు, పెద్ద ముతకబియ్యమంత పెంకులు సన్నని బంగారురజను లాంటి మెరిసే ఇసుకవరకూ తొమ్మిదిపదిరకాల ఇసుకలు ఒడ్డమ్మటే దొరుకుతాయి. అన్నిటిలోనూ బియ్యపుఇసుక చూడటానికి బాగుంటుంది.

స ము ద్ర ము

ఎన్నో ఉన్నతశిఖరాలూ, నదీసంగమాలూ, ఎన్నెన్నో సముద్రాలూ చూస్తామేమోకాని కన్యాకుమారివద్దలాంటి అత్యద్భుతమైన ఆనందాన్నిచ్చే అంత చక్కని సముద్రాన్నిమాత్రం మరెక్కడా చూడలేమనే చెప్పవచ్చు.

పౌర్ణమినాటి సంధ్యవేళ సముద్రపుతీరానికి వెళ్తే అస్తమిస్తూన్న ఎఱ్ఱటి సూర్యుడూ, ఉదయిస్తూన్న పూర్ణచంద్రుడూకూడా ఒక్కసారే కనుపిస్తారు ఎదురెదురుగా. ఇద్దరూ చక్కగా ఒక్కలాగే ఉంటారు. కాని ఒకర్ని చూస్తే జాలి, ఒకర్ని చూస్తే ఆనందమూ కలుగుతుంది.

ఎఱ్ఱటి ఆనాటి సూర్యుడు తన ప్రేయసినుంచి ఎడబాటు సహించలేక ఖిన్నవదనుడై ఎఱ్ఱబారిన మొహంతో వెళ్ళిపోతూన్నాడా అనిపిస్తూంటుంది. అందుచేత అతన్ని చూస్తే జాలి. పాపం!

చంద్రుడుమాత్రం ధన్యజీవి! విభావరి తన మంచి ముత్యాలవంటి నక్షత్రాలతో అతనికి ఆహ్వానం ఇస్తూంది. అతడో! ఆనందంతో తొణికిసలాడుతూ తులుకుతూ నవ్వుతూ వస్తాడు. అతణ్ణి చూస్తే మనకు కూడా ముచ్చటేస్తుంది.

ఆ సముద్రదృశ్యాలు ఒక్క పౌర్ణమినాడే అని లేదు, ఎప్పుడూ ఆనందాన్నిస్తాయి.

రాత్రి తొమ్మిది గంటలకు మనం ఒడ్డున కూర్చుంటే ఆ అలల ఆందోళనతోబాటు మనస్సులో ఒకవిధమైన బరువు ఆలోచనలు తుపానులాగ లేస్తాయి. ఎంతో ఉత్సాహం, ఆవేదనా కలుగుతాయి. ముందు ఒక అగాధసముద్రము బుసకొట్టుతూ; వెనుక ఒక చల్లని భూభాగం. ఈ రెంటి మధ్య ఆచునా అసహాయులమైన మనం. "మేం ఇంత బలవంతులం ...మాకు శాస్త్రం తెలుసు. ఎలెక్ట్రిసిటీ మా బానిస" అని డంబాలుకొట్టే మనం ఆ క్షణంలో జగత్తులో ప్రకృతికున్న అద్భుతమైన శక్తి చూచి దాని ముందర మన అల్పత్వం గ్రహించి రిచ్చపోతాము.

అలలు ఎంతో ఘోష పెట్టుతాయి చెవులు గింగుర్లెత్తేలాగ. ఎందుకో ఈ సముద్రానికింత ఆవేదన, ఘోష అనుకుంటాం. కొంచెం లోతుగా ఆలోచించామంటే ఆ సముద్రము ఒక విరహవేదన అనుభవిస్తూన్న ప్రేమికురాలులాగ తోస్తుంది.


పగలల్లా ప్రియుడి ఎడబాటువల్ల ఉడికిపోతుందామె. చీకటిపడి రజనీకాంతుడి దర్శనం అవగానే ఆమెకు ఎంత సంతోషమో! అప్పటివరకూ పడిన ఆవేదన అతడితో చెప్పుకొంటుంది. అతడి కౌగిలిలో చేరడానికా అన్నట్టు తన ప్రతీ తెల్లని వెండికెరటాన్నీ పైపై కెత్తుతుంది—ఎంతో ప్రయాస, ఘోషలతో!

కాని చంద్రుడు హృదయహీనుడు. తనకోసం అలమటిస్తూ తన చేతుల్ని ఆప్యాయంగా పైకెత్తి పిలుస్తూన్న ఆమెను చూచి ఆనందంతో దిగి ఆమెను స్వీకరించడం మాని ఒకొక్క మెట్టూ పైపై కెక్కుతాడతను అసలామెను చూడనట్టు.

ఆమె పిలుస్తుంది; పలవిస్తుంది. చివరకు నిస్పృహతో అతణ్ణి గొంతెత్తి దూషిస్తుంది. హోరుతో. ఇలా రాత్రంతా విలపిస్తూనే ఉంటుంది. అరుణోదయం అయ్యేక సూర్యుడు వచ్చి ఆమెకథను వింటాడు. అతడు బహుశః చంద్రుణ్ణి చివాట్లువెడతాడు కాబోలు. తన తప్పు తెలుసుకొని చంద్రుడు సిగ్గుతో వెలవెల బారిన మొహంతో అదృశ్యుడవుతాడు.

ఇదీ కన్యాకుమారిలో జరిగే కథ ప్రతిరోజూ.

కన్యాకుమారి సుందరమైన ప్రదేశం. ఆరోగ్యకరమైన చోటుకూడా!



వైజ్ఞానిక జగత్తులో విస్మయ విశేషాలు

రసాయనశాస్త్రంవల్ల ఉపయోగం!

అది జర్మనీలో పెద్ద రంగుల ఫ్యాక్టరీ. అందులో ఒకచోట ఒక పెద్ద తొట్టిలో (tank) "నత్రికామ్లము" (Nitric acid) మరుగుతోంది. దానిని కనిపెట్టుకొని ఒకడు కూర్చున్నాడు. చుట్టుపక్కల ఎవ్వరూ లేరు. అజాగ్రత్తవల్లనో, లేక అతిజాగ్రత్తవల్లనో పాపము వాడు మరుగుచున్న నత్రికామ్లంలో పడిపోయాడు. తరువాత కొంతసేపటికి ఫ్యాక్టరీ యజమాని వచ్చి చూస్తే, మనిషిజాడే లేదు. ఎక్కడికైనా పరారిఅయ్యాడేమోఅని అందరూ అనుమానించారు. యజమానిమాత్రము వేరుగా తలిచాడు. మనిషి నత్రికామ్లంలో పడగానే శరీరం, ఎముకలు, దుస్తులు, హేటు, బూటు అన్నీ ఆ నత్రికామ్లం జీర్ణం చేసుకొని వుంటుందని!

ఆమనిషి పెళ్లాం పోయిన మొగుడెల్లాగూ పోయాడు, పోనీ, అతడు కూడబెట్టిన డబ్బైనా తెచ్చుకొందామని బాంకికి వెళ్లింది. కాని అక్కడో హంసపాదు! బాంకిమేనేజరు అన్నాడు—"మాకేమి తెలుసు? నీభర్త నిజంగా చనిపోయాడో లేదో. నీభర్త పరమపదించినట్లు రుజువుచూపిస్తే ధనము నీ కప్పచెప్తా"మని. చేసేదేమీలేక తిన్నగా ఫ్యాక్టరీ యజమానివద్దకు పోయి తన దుస్థితి ఎరుకచెప్పింది. యజమాని తెలివైనవాడు కాబట్టి వెంటనే అతనికి ఒక ఆలోచన తట్టింది. మానవుడి శరీరంలో కొద్దిగాక కొద్దయినా భాస్వరం ఉంటుందికదా. ఈమనిషి ఒకవేళ నిజంగానే నత్రికామ్లంలోనే పడిఉంటే అతని శరీరంలోని భాస్వరం నత్రికామ్లంతో కలిసి భాస్వరికామ్లము (Phosphoric acid) తయారవాలికదా అని, మనిషి పడిన ఆ నత్రికామ్లం పరిశీలించాడు. పరిశీలిస్తే అందులో భాస్వరికామ్లంపత్తా దొరికింది. ఇంకేముంది! మగడు పోయిన ఆ విధవ మగడు దాచిన ధనంతో సుఖంగా ఉంది.

జర్మనులు-గాలి

ఎవరో (పేరు తెలియదు) అన్నారట—"ఫ్రెంచివాళ్ళు భూమినంతా ఆక్రమిస్తే, ఇంగ్లీషువాళ్ళంతా సముద్రాలన్నీ వశం చేసుకొన్నారు. ఇంక జర్మనీవాళ్ళకు మిగిలింది గాలి ఒక్కటే." ఇది అప్పుడొక వెక్కిరింపు—పరిహాసము. ఈమాట అన్నవాళ్ళు గనక ఇప్పుడుంటే తలెత్తుకోలేరు. మొదటి ప్రపంచ యుద్ధంలో Chilli Saltpeter జర్మనీకి ఎగుమతి కాలేదు. జర్మనువాళ్ళకు ఏమీ పాలుపోలేదు. అకస్మాత్తుగా ఎవడో వెక్కిరించిన వెక్కిరింపు జ్ఞాపకం వచ్చింది.

"సరే, మనకు గాలే ఆధారం" అని పరిశోధనలూ, ప్రయోగాలూ సాగించారు. ఫలమేమంటే, గాలినుండి నత్రజని—ఎంతకావలిస్తే అంత—ఎప్పుడు అవసరమైతే అప్పుడు—ఎందుకు ఉపయోగించవలసివస్తే అందుకు—తీసుకోవచ్చు. ఇదే వాళ్ళను చాలామట్టుకు కాచింది. దైవోపహతులు కావడంచేత అప్పుడూ, ఇప్పుడూకూడా ఓడిపోయారులెండి. అది వేరే సంగతి.

సముద్రపు పట్టు (Sea-silk)

పట్టుపురుగుల సుడకపెట్టడంతో ప్రారంభమయి, మాయపట్టు (artificial silk from chemicals) వరకూ వృద్ధిచెందిన మానవుడి పట్టుపరిశ్రమ అంతటితో ఆగలేదు. సముద్రంనుండి కూడా పట్టుతీయడం కనిపెట్టా డిప్పుడు. సముద్రంలో, కొన్ని కలుపుమొక్కలుంటాయట (Seaweeds). అందులో ఒక రకం మొక్కల్ని Alginates అంటారు. ఇవే ఈ సరిక్రొత్తపట్టుకి ముడిపదార్థాలు. రెండటి ప్రపంచయుద్ధానంతరంనుండీ పాటుపడగా ఇది తయారైనది. ఈ పట్టు నిప్పులో కాలదు. కాలని పట్టుబట్టలు కట్టుకొని బయలుదేరితే, దారిలో అగ్నిప్రమాదం వచ్చినా భయంలేదు.

ఎంత ఉప్పో ?

సముద్రాల్లో ఎంత ఉప్పుందో అంచనాకట్టి తెలుసుకొంటే మతి భ్రమిస్తుంది.

సాధారణముగా సముద్రపునీరు ౩.౬% ఉప్పు కలిగివుంటుంది. సముద్రపు వైశాల్యము భూ వైశాల్యము కంటె మూడు రెట్లని తెలిసిన విషయమే కదా! సగటున సముద్రపులోతు ౨౩ మైళ్లుగా తీసుకొంటే, ప్రతి చదరపు మైలు వైశాల్యంలో ఉన్న నీటిలో ౩౧౩,౦౦౦,౦౦౦ టన్నుల ఉప్పు ఉంటుందని లెక్క తేలింది. ప్రపంచక మండలి జలవైశాల్యము ౧౪౫,౦౦౦,౦౦౦ చదరపు మైళ్లు. అందువల్ల ప్రపంచమంతటి జలములోను ఉండే ఉప్పుబరువు— ౪౫,౪౦౦,౦౦౦,౦౦౦,౦౦౦,౦౦౦ టన్నులు. అనగా సముద్రమంతా ఇంకిపోతే అంత వైశాల్యములోను, ౨౦౦ గజముల దళసరిని ఉప్పు గడ్డకట్టి వుంటుంది.

కొడవంటి నరసింహం.



సింహాచలందగ్గరి 'మాధవధార'లో దంపతిస్నానము

భారతదేశవిభజన

పూర్వాపరముల పునర్విమర్శ

= శ్రీ సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మ =

సేతుశీతనగమధ్యప్రాంతమగు భరతవర్షము వేదకాలమునుండియు ఏకదేశమే. ఈ దేశములో వివిధ ప్రాంతములను పలువురు రాజులు పరిపాలించుచున్నను, వారి నందరిని కూడగట్టుకొని తమ సార్వభౌమత్వము, చక్రవర్తిత్వము దేశమంతటికి వర్తించునట్లు చేయుటకు సమర్థులగు రాజులు అహర్నిశలు ప్రయత్నించుచుండెడివారు. సాంఘికముగ, మతవిషయికముగకూడ భారతదేశ మేకదేశమే. విజ్ఞానవంతులగు భారతీయులు తమ నిత్యకృత్యములలో నొక్కటిగ తమ దేశపు ఏకత్వమును పునరుద్ఘాటించుచుండెడివారు. తీర్థసంవాసులు అనేకశ్రమల కోర్చి దేశపు ఎల్లలను చూచి వచ్చి తమ జన్మ సార్థకమైనదని ఉప్పొంగిపోవుచుండువారు. సాంస్కృతికముగగూడ భారతదేశ మనాదినుండియు ఏకదేశమే. బ్రిటిష్ పరిపాలన ప్రారంభమై, విస్తరించినకొలది మన దేశ రాజకీయ 'ఏకత' కూడ సుస్థిరరూపము దాల్చి, చంద్రగుప్త అశోకుల కాలమునుండి మహారాష్ట్ర పేష్వాల కాలము వరకు కూడ దేశభక్తులకు ఆదర్శముగా నుండి, వారి కార్యాచరణాసక్తికి స్ఫూర్తి నొసగుచు, ఆశయసిద్ధికై వారు పురోగమించినకొలది అందని మ్రాని పండై, వెనుకకు పోవుచు, మృగతృష్ణవలె వారి చిత్తముల నాకర్షించుచుండిన ఆ 'ఐక్యభారతము' మనకు లభించినది. గత ఒకటిన్నర శతాబ్దములనుండి నిర్విరామముగా జరుగుచున్న స్వాతంత్ర్యపోరాటములో అనేకులు దేశభక్తులు తమ రక్తమును ధారవోసినది, అంతకు మించి, సామ్రాజ్యవాదుల కైత్యలో మ్రగ్గిపోయినది ఈ 'ఏక భారతదేశ' స్వాతంత్ర్య సముపార్జనకొరకే. కాని ఈనాడు అట్టి ఏకభారత దేశము కరువైపోయినది. ఒక సంవత్సరముక్రితము ఏ భారతదేశముకొరకు సేవచేయుట భారతీయుడు చేయగల మహోత్కృష్ట కార్యములలో నొకటిగా పరిగణింపబడుచుండెడిదో, ఈనాడు భారతదేశమునుగురించి ఆలోచించుట, అట్టి భారతదేశమును సాధించుటకు ప్రయత్నించవలెనని ఆలోచించుటకూడ చెప్పలేనంత విద్రోహకరమైపోయినది. కన్యాకుమారినుండి బదరీనారాయణమువరకు, మణిపూరునుండి పెషావరు వరకు వ్యాపించిన స్వతంత్రభారతదేశమునుగురించి ఇన్నాళ్లనుండి మనము కంటున్న కలలు కలలకన్న హీనముగా మిగిలిపోయినవి. ఏకభారత లక్ష్యసాధన కార్యములో అల్లంతదూరమున నుండినట్లగుపించి ఇన్నాళ్ళు మనలను ప్రోద్బలపరచిన ఆ గమ్యస్థానము మృగతృష్ణకన్న అన్యాయమైపోయినది.

గత రెండుదశాబ్దములనుండి మన దేశములో హిందూ-ముస్లింసఖ్యతా సమస్య తీవ్రరూపము దాల్చినది. ఇందుకు సామ్రాజ్యవాదుల 'విభజించి పాలించు' విధానముకన్న వేరొండు ప్రబలకారణ మేదియు లేదు. మన దేశములో స్వపరిపాలన కొరకు జరుగుచున్న పోరాటమునకు అంతరాయము కలిగించి, తద్ద్వారా తమ మనుగడను స్థిరమొనర్చుటకు సామ్రాజ్యవాదులు పన్నిన పన్నాగమే హిందూముస్లిములకు ప్రత్యేక నియోజకవర్గముల నేర్పాటుచేయుట. ఈ ప్రత్యేకనియోజకవర్గములవలన ముస్లిములు తమ ప్రతినిధులను తమ మతస్థులనుండియే ఎన్నుకొనవలసివచ్చి, అసలే విద్యాగంధము తక్కువైన

ముస్లింప్రజానీకములో మతమునకు, రాజకీయములకు అవినాభావసంబంధ మున్న దను భ్రమ కలిగినది. క్రమేణ వారు ఇతరమతస్థులకు, రాజకీయసంస్థలకు దూరమైపోయి, భారతజాతీయతనే విస్మరించుటకూడ జరిగినది. అసలే స్వార్థపరులై, స్వార్థపరులైన సామ్రాజ్యవాదుల ప్రోత్సాహ, ప్రోద్బలములతో వ్యవహరించుచున్న ఒక అఖండుని నాయకత్వమున పనిచేసిన ముస్లింలీగు సంస్థ ఈ కార్యము అతిత్వరగా సంపూర్ణముగా జరుగుటకు జయప్రదముగా పాటుబడినది. గత ఏడుశతాబ్దములనుండి తాము భారతదేశమును పరిపాలించిన విషయము జ్ఞప్తికి తెచ్చి, తా మొక ప్రత్యేకజాతి యని, తా మధికసంఖ్యాకులుగా నున్న ప్రాంతములు ప్రత్యేక ముస్లింరాజ్యముగా నేర్పడవలెనని, లేకున్నచో పూర్వము ముస్లిములు తమపై జరిపిన అకృత్యములకు హిందువులు ప్రతీకారము జరిపెదరని చెప్పెడు ప్రచారము సులభముగా ముస్లింప్రజానీకమునకు నచ్చిపోయినది. కాని ముస్లిములే విద్యావంతులై యుండి కొంచెము సూక్ష్మముగా పరిశీలించియుండినచో ఈ ప్రచారములోని శూన్యత గ్రహింపగల్గెడివారు. ముస్లిములు అధికసంఖ్యాకులుగా నున్న రాష్ట్రములలో పరిపాలన ఇప్పుడు వారే జరుపుచున్నారు. వారిపై ఎట్టి కేంద్రప్రభుత్వమైనను పెత్తనమువహించుస్థితిలో నుండదు. పైగా ఆ రాష్ట్రములలోని అల్పసంఖ్యాకులు ముస్లిము ప్రభుత్వముపైననే ఆధారపడియుండవలసివచ్చుటచేత ముస్లిములు అల్పసంఖ్యాకులుగానున్న రాష్ట్రముల హిందూప్రభుత్వములు అచ్చటి ముస్లిములను అతిజాగ్రత్తగా మర్యాదచేయుచుండవలసిన అగత్య మేర్పడినది. ముస్లిములు అధికసంఖ్యాకులుగా నున్న రాష్ట్రములు విడిపోయి, ప్రత్యేకదేశముగా ఏర్పడుటవలన ఇతర రాష్ట్రములలో అల్పసంఖ్యాకులుగా నున్న ముస్లిములకు గొప్ప ప్రమాదము తటస్థించుటకు అవకాశ మేర్పడును. కాని ఈ విషయమును ముస్లింలీగు నాయకులు, ముఖ్యముగా ముస్లిములు అల్పసంఖ్యాకులుగానున్న రాష్ట్రములలోనివారు విస్మరించిరి.

"భారతదేశము హిందూస్థాన్, పాకిస్థాన్ అని రెండుదేశములుగాగాని, లేక కాంగ్రెసు సూచిస్తున్నట్లు ౨౦ భాషాప్రయుక్తరాష్ట్రములుగాగాని విభజింపబడినను ఫలిత మొక్కటే" నను వితండవాదనలు ప్రబలినవి. ఇట్టివారికి దేశమునకు, రాష్ట్రమునకు గల విభేదము తెలియదో, ఇతరులకు తెలియదని వారు తలంచెదరో దురూహ్యము. దేశవిభజనయున్న రాష్ట్రవిభజనవంటి సామాన్యవిషయమే నని సూచించుచు, దేశవిభజనయం దెదుర్కొనవలసిన జటిలసమస్యలను, అందువలన కలుగు విషమఫలితములను మరుగుపరచి ఈవాదన ముస్లింలీగు కోర్కెకు మద్దతు ఇచ్చినది.

ముస్లిములు స్వతంత్రరాజ్యముగా ఏర్పడకపోయినచో హిందువులు వారిని అణచివేసెదరట. గత ఏడు శతాబ్దములనుండి భారతదేశములో ముస్లిములు సాగించిన పరిపాలనలో హిందువులను వారు కొంతవరకు కష్టపెట్టిన విషయము ఇప్పుడు వారికి జ్ఞప్తికి వచ్చియుండవచ్చును. భారతదేశము స్వతంత్రమైనచో అధికసంఖ్యాకులగు హిందువులు తమపై ప్రతీకారమునకు పూనుకొందురని ముస్లిములు భయపడి యుందురు. కాని దేశవిభజన వారికి శ్రీరామరక్ష కాగలదా ? అవిభక్తభారతదేశములో నుండిన ముస్లిములలో మూడింట రెండువంతులకు పాకిస్థాన్ ప్రవేశనార్హత లేదే! ఒకవంతు ముస్లిములు తమత్రోవ తాము చూచుకొన్న, మిగిలిపోయినవారు మరింత బలహీనులైపోయి, ఇదివరకటి ప్రతీకారవాంఛకు ఇప్పటి దేశవిభజనక్రోధానలము తోడైన హిందువుల మధ్య ఎట్లు జీవింపగల్గెదరు? వాస్తవమునకు హిందువులలో ప్రతీకారవాంఛ ఏనాడో పోయినది. ముస్లిముల ప్రతిపక్షధోరణి దానిని కొంతవరకు పునరుజ్జీవింపజేసినది. తా మొక ప్రత్యేకజాతి యను సిద్ధాంతమును లేవనెత్తకుండ ముస్లిములు భారతవ్యవహారములలో సమానభాగస్వాములుగా వ్యవహరించుచుండిన యెడల వారిపట్ల హిందువులకు సంపూర్ణ సౌభ్రాతృత్వము అలవడిపోయెడిది. ముస్లిములు అధిక సంఖ్యాకులుగా నున్న రాష్ట్రములలో వారు తమ సంస్కృతి, నాగరికత, భాషల అభివృద్ధికి తమ యిష్టము వచ్చినట్లు కృషిచేసికొనగల్గెడివారు. ముస్లిములు అధిక సంఖ్యాకులుగానున్న రాష్ట్రములలో అల్పసంఖ్యాకులుగా హిందువు లుండెడివారుకాబట్టి ముస్లిములు

అల్పసంఖ్యాకులుగానున్న రాష్ట్రములలో హిందువులు వారి నన్యాయము చేయుటకు సాహసించెడివారు కారు. దేశవిభజనవలన తామధికసంఖ్యాకులుగా నున్న రాష్ట్రములలోని ముస్లిములకు లభించిన ప్రత్యేకసౌకర్య మేదియు లేదు; కాని తాము అల్పసంఖ్యాకులుగా నున్న రాష్ట్రములలోని ముస్లిములు మాత్రము తీవ్రముగా నష్టపడిపోగల ప్రమాదమందున్నారు.

గత రెండు, మూడు దశాబ్దములనుండి పలు పర్యాయములు దేశమంతట మతకలహములు జరిగినవి. ఈ కలహములు దేశశాంతికి తాత్కాలికముగా భంగకరములైనను, పురోభివృద్ధికి ఆటంకములుగా పరిణమించలేదు. కొట్లాటలకు కేవలము స్థానికమతవిద్వేషములో, ఇతరస్థానికద్వేషములో కారణములై ఉంటుండెను. కొన్ని పర్యాయములు రాజకీయ కారణముల వల్ల కూడ కొట్లాటలు జరిగియుండవచ్చును. ఈ కలహము లెన్నడు తీవ్రరూపము దాల్చుటగాని, ఒకే పర్యాయము దేశమంతటికి వ్యాపించుటగాని, అన్ని కలహములకు ఒకే కారణము ఉండుటగాని, కలహములు కేవలము రాజకీయ కారణములవలనగాని జరిగియుండలేదు. కలహము సమసిపోయినంతనే ప్రజలు మామూలుగా ఎప్పటియట్లే, ఏమియు జరుగనట్లే సోదరులవలెనే కలిసి మెలసి తిరుగుచుండెడివారు. వాస్తవమునకు, తొమ్మిదేండ్ల క్రిందటివరకు హిందూ-ముస్లిం విభేదము లోక సమస్యగా పరిగణించుటకు వీలులేదు. కాని హిందూ-ముస్లిం సమస్యను పరిష్కరించుటకేనను నెపముతో దేశవిభజన ఆందోళన ప్రారంభమైనది. ఈ ఆందోళన ప్రారంభమైనప్పటినుండియే హిందూ-ముస్లిం సమస్య ప్రారంభమైనది. ఒకవేళ హిందూ-ముస్లిం విభేదములే యుండిన, దేశవిభజన వాటిని పరిష్కరింపగల్గునా? ముస్లిములు అధికసంఖ్యాకులుగానున్న రాష్ట్రములలో హిందూ-ముస్లిం వివాదములు వారికే హానిని కలిగించలేవు కదా. ముస్లిములు అల్పసంఖ్యాకులుగానున్న రాష్ట్రములలో దేశవిభజన, పాకిస్థాన్ స్థాపనవలన ముస్లిములకు ఏమి లాభము కలిగినది? వారు పాకిస్థాన్ వెళ్ళిపోవుట లేదు కదా. ఇదివరకటివలెనే వారిప్పుడుకూడ అధికసంఖ్యాకులగు హిందువుల సద్బుద్ధిపై ఆధారపడవలసినదే. అయితే, వారు పాకిస్థాన్ స్థాపనకు తీవ్రకృషి చేసి, తమ ప్రక్కనున్న హిందువులకు తమపట్ల గల గౌరవమును వమ్కునరించుకొన్నారు. పాకిస్థాన్ స్థాపనకు కృషి చేసినది ముఖ్యముగా హిందూ రాష్ట్రములలోని ముస్లిములే. సరిహద్దురాష్ట్రము పాకిస్థానుకు ప్రబలవ్యతిరేకి. పంజాబులో ముస్లింలీగు మంత్రివర్గ మెన్నడు పాలించియుండనేలేదు. సింధులో ఏర్పడిన ముస్లింలీగుప్రభుత్వము నిలువలేక, శాసనసభను రద్దుచేయించి తన యిష్టము వచ్చినట్లు ఎన్నికలు జరిపించి, కొంచెము సుస్థిరత సంపాదించుకొన్నది. బెంగాలులోకూడ ముస్లింలీగుప్రభుత్వము యూరపియన్ శాసనసభ్యుల కారుణ్యముతో సుస్థిరత సంపాదించుకొనెను. ముస్లింలీగుప్రధాననాయకులగు జిన్నా, లియాకత్ అలీఖాన్, కాలీకుజ్జమాన్, చుండ్రిగర్ ప్రభృతులు పాకిస్థానుకు చెందినవారు కానేకారు. తమకు ప్రవేశార్హతకూడ లేని పాకిస్థాన్ స్థాపనకు మొండిపట్టుదలతో కృషిచేసిన భారతముస్లిములు, పాపము, చరిత్రలో కని విని ఎరుగనంతటి మోసము పాలైనారు. దేశవిభజనద్వారా హిందూ - ముస్లిం సమస్య పరిష్కారము కాకపోగా, భారతముస్లిములు మరింత బలహీనులగుట మాత్రమే జరిగినది.

హిందువులు,ముస్లిములు పరస్పరము అనుమానించుకొనుచు ఐక్యముతో మెలగలేకపోయినందువలన భారతస్వాతంత్ర్యము, ఆర్థిక, సామాజికరంగములలో జరుగవలసిన సంస్కరణలు చాల వెనుకబడిపోయినవనియు, దేశవిభజన కంగీకరించియైన ఉభయులు తమతమ ప్రదేశముల నభివృద్ధిపరచుకొనుట శ్రేయస్కరమనియు కొందరి మతము. సామాజికసంస్కరణలలో హిందువులు, ముస్లిములుకూడ చాల వెనుకబడియున్నారు. ఇందుకు కారణము పరపరిపాలనమే గాని హిందూ-ముస్లిం విభేదములు కావు. ఒక మతములో సాంఘికసంస్కరణలు జరిగినచో రెండవ మతమువారు వాని నుపయోగించుకొని వారి నందరిని తమ మతములోనికి త్రిప్పుకొనజూచెదరని, ఆ భయమువలననే సాంఘికసంస్కరణలకు పెద్ద లెవ్వరు సాహసించుటలేదని చెప్పజూచుట మరింత శోచనీయము. హిందూమతములో ఈ కాలములో

ముఖ్యమైన సంస్కరణలు జరిగియే యున్నవి. అస్పృశ్యతానిర్మూలనము, కులవిభేదముల తొలగింపు, శారదాచట్టము మొదలగువానికన్న ముఖ్యసంస్కరణ లేవి యుండును? సిక్కులలో కూడ శిరోమణి అకాలీదళ మేర్పడి గురుద్వారాలను వశపరచుకొనుట జరిగినది. అన్నిటికిమించి ఆర్యసమాజము స్థాపింపబడి, హిందూ మతములో ఇతరులను జేర్చుకొనుట ప్రారంభించినది. కాని ముస్లిములలో మాత్రము ఇట్టి సంస్కరణలు జరుగలేదు. ముస్లిములకు సంబంధించిన సంస్కరణ లేవి ప్రస్తావించినను, వారి నాయకులు తమ మతము ప్రమాదమందున్నదని ప్రచారము ప్రారంభించి మతోన్మాదము రేకెత్తించుటకు ఆ అవకాశము నుపయోగించుకొనుచుండుటవలన ఎట్టి సంస్కరణలును సాధ్యపడలేదు. సాంఘికసంస్కరణలు త్వరగా జరుపుకొనుటకు దేశవిభజన జరుగవలె ననుట ఎలుకను చంపుట కిల్లు తగులబెట్టుకొనవలె ననుటవంటిదే.

రాజకీయ సంస్కరణలు మతవిద్వేషములవలన కొంత వెనుకబడిపోయినట్లు కనిపించెడుమాట వాస్తవమే. హిందువులు,ముస్లిములు ఐక్యముతో ఎట్టి ప్రతిపాదనలు చేసినను తా నామోదింప సిద్ధముగా నుంటిననియు, వారి అనైక్యతవల్లనే భారతరాజ్యాంగసంస్కరణలు జరుగు నవకాశము లేకుండ పోవుచున్నదనియు బ్రిటిష్‌ప్రభుత్వము పలుమార్లు సాకు చెప్పుచున్నది. కాని ఇది నిజము కాదు. దేశములో మతకలహములను, మతవిద్వేషమును పెంపొందించి, హిందూ ముస్లింసమస్యను తెచ్చిపెట్టినది బ్రిటిష్ ప్రభుత్వమే. హిందూ-ముస్లింసమస్య తీవ్రరూపముదాల్చునట్లు చేసిన ప్రత్యేకనియోజకవర్గముల విధానమును హిందువులు, ముస్లిములు ఏకముగా నుండగనే ప్రవేశపెట్టినారు. ఒకవంక హిందూ-ముస్లిముల మధ్య విభేదములు పెంచుచు, వేరొకవంక ఆ విభేదములవలననే రాజ్యాంగసంస్కరణలు ఆలస్య మగుచున్నవని చెప్పుట సామ్రాజ్యవాదులు ఈ దేశములో సుస్థిరముగా పాతుకొనిపోవుటకు పన్నిన పన్నాగమే కాని వేరు కాదు.

భారతదేశవిభజన హిందూ-ముస్లిం సమస్యను పరిష్కరింపలేకపోగా, దేశనైసర్గికఐక్యతను భగ్నమొనర్చి, దేశరక్షణను కష్టతరమొనర్చు ననువిషయము అందరు అంగీకరింతురు. రాజకీయముగ దేశమొకటి ఏర్పడుటకు భౌగోళికపు టెల్లలు నైసర్గికములై యుండనవసరము లేదని కొందరి మతము. నైసర్గికముగా ఒకటిగ నున్న యూరపుఖండములో అనేకదేశము లేర్పడ లేదా? నైసర్గికముగా ఒకటిగా నున్న ఉత్తర అమెరికాలో అనేకదేశము లేర్పడలేదా? యూరపులో అనేకదేశము లేర్పడుట మంచియో చెడ్డో మనము ఇప్పటికైనను గుర్తింపగల్గినాము. యూరపురాజ్యములన్నియు —కనీసము పశ్చిమప్రజాస్వామ్యరాజ్యములన్నియైనను —కలసి ఒక రాజకీయకూటముగా ఏర్పడి పరస్పర రక్షణబాధ్యతవహింపవలెనని అంగీకరించుచు ఈమధ్య జరిగిన ఒడంబడిక మన దేశవిభజన అంగీకరించినవారికి చక్కని సమాధానమిచ్చుచున్నది. అమెరికా ఖండమింకను పరిపూర్ణముగా అభివృద్ధిచెందకుండుట చేతను, అప్పటి జనసంఖ్య తక్కువగుటచేతను, ప్రజలు శాంతియుతప్రజాస్వామ్యకాము లగుటచేతను వివిధదేశములు కలసిమెలసి వ్యవహరింపగల్గుచున్నవి. అటువంటి ఉదాహరణలను ముందుంచుకొని మన దేశవిభజనకు పూనుకొనుట తగని పని.

వాయుయానము, ఆటంబాంబు మొదలగు మారణాస్త్రములు ఉపయోగింపబడుచున్న ఈకాలములో నైసర్గికపుటెల్లలు దేశమునకు రక్షణ నివ్వలేని సంగతి కొంతవరకు వాస్తవమే. కాని ఒక ప్రక్క హిమాలయములు, మూడుప్రక్కల సముద్రముచే సంరక్షింపబడు భారతదేశముపై విమానదాడి సల్పుటయైనను కష్టమే యగును. బొంబాయిపై దాడి చేయుటకు కరాచీనుంచి బయలుదేరుట, ఏడెన్‌నుండి బయలుదేరుట ఒకటియే యగునా? దూరమునుండి వచ్చి దాడిచేయుట సంభవమే యైనను కష్టప్రదము. ఫ్రాన్సు, పోలెండు మొదలగు సరిహద్దు దేశములను రెండేసి వారములలో కబళింప గల్గిన హిట్లరు చిన్న కాలువచే వేరుచేయబడిన

ఇంగ్లండును ఏమిచేయగల్గినాడు? అతనివద్ద నౌకలు, విమానములు, మారణాస్త్రములు తక్కువగానుండెనా!

భారతదేశవిభజన దేశమున కంతకు నష్టమేయైనను, హిందువులకన్న ముస్లిములే ఎక్కువ నష్టపడెదరను విషయమును అమాత్యత్రయము గుర్తించినది. అందువలననే దేశవిభజన కూడదని వారు స్పష్టముగా చెప్పిరి. ముస్లింలీగు నాయకులు మాత్రము తమ స్వప్నము అనుకొననంత త్వరగా ఫలప్రదమగుట కుత్సాహమునొంది, సహజస్వార్థ్యముతో దేశవిభజన జరిగితీరవలసినదేనని పట్టుబట్టిరి. ప్రపంచములోని ముస్లింరాజ్యములన్నిటికన్న పాకిస్థాన్ బలవత్తరమైనదై యుండును. ముస్లిం జనసంఖ్య పాకిస్థానులో నున్నంతగా మరియే ఇతర ముస్లిం రాజ్యాలలోను ఉండదు. అందువలన పాకిస్థాన్, అనగా తాము ముస్లింప్రపంచమునకంతటికి నాయకులు కావచ్చునను ఆశ వారిని ఊరించినది. ఈజిప్టునుండి చిట్టగాంగువరకు ముస్లింరాజ్యములుండిన, ఏనాడైనను హిందూదేశమును తిరిగి తమ ఆధిపత్యము క్రిందకు తెచ్చుకోవచ్చునను ఆశ, గత ఏడు శతాబ్దములనుండి తమ పూర్వులీదేశమును పాలించిన మధుర స్మృతులు వారి విచక్షణాజ్ఞానమును మందగింపజేసినవి. మరొక స్వతంత్రముస్లింరాజ్యస్థాపనకొరకు వారు భారతముస్లిములను బలిదానముచేయుటకైనను సిద్ధపడిరి. దేశము విభజింపబడినను, హిందువులు తమ ప్రక్కనున్న ముస్లిములపట్ల అకృత్యములు జరుపరని ధైర్య ముండుట చేతనే అధికసంఖ్యాకులగు ముస్లిముల ప్రయోజనములను విస్మరించుటకు వారు పాల్పడియుండవచ్చును.

బ్రిటిష్ ప్రభుత్వనైఖరి ఎల్లప్పుడును తేటతెల్లముగనే యున్నది. భారతదేశము తమ పట్టునుండి విడిపోవుట వారి కెన్నడు సంతోషకరము కాదు. కన్సర్వేటివులు భారతస్వాతంత్ర్యమే పనికిరా దందురు. భారతదేశమును వీలైనన్నివిధముల దోచుకొని బ్రిటిష్ ఆర్థికవ్యవస్థను బలపరచవలె నందురు. కాని కార్మికపక్షదృక్పథము వేరు. భారతదేశ స్వాతంత్ర్యేచ్ఛను వారు కాదనలేరు. భారతదేశము తమ పట్టునుండి విడిపోవుట కిష్టపడరు. భారతదేశము స్వతంత్రమై, బలిష్ఠమైన, ఎప్పటికైన దూరప్రాచ్యములోను, మధ్య ప్రాచ్యములోను, ఆఫ్రికాలోను బ్రిటిష్ సామ్రాజ్యమును, తెల్లవారి ఆధిక్యమును రూపుమాపుటకు పూనుకొనునని వారికి భయము. కాబట్టి భారతదేశమునకు స్వాతంత్ర్య మిచ్చినను, భారతదేశము బలిష్ఠము కాకుండునట్లు చూడగల్గినచో, భారతదేశమువలన ప్రమాదము చాలవరకు తగ్గును. ఇన్నాళ్ళనుండి కన్సర్వేటివులచే ప్రోత్సహించబడిన ముస్లిములు దేశవిభజన కోరుచున్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల ప్రకారముకూడ ఆ కోర్కె కాదనుటకు వీలులేనిదిగానే కన్పించుచున్నది. కాబట్టి దేశవిభజన కంగీకరించినచో ముస్లిములు బ్రిటిష్ వారికి శాశ్వతముగా కృతజ్ఞులైయుండగలరు. హిందువులేమిచేసినను అవసరమైనప్పుడు తమ సేనలకు పాకిస్థానులో నైనను స్థావరము లభింపగలదు. కాబట్టి దేశవిభజనమే బ్రిటిష్‌వారికి మంచిది. అయినచో, అమాత్యత్రయ ప్రణాళికలో దేశవిభజన కూడదని ఏల వాదించిరి? బ్రిటిష్ వారికి కావలసినది భారతదేశము బలహీనముగా నుండుట. అది శాశ్వతముగా సాధించుటకు దేశవిభజన కన్న వేరైన మార్గమున్న అది ఉత్తమోత్తమమని చెప్పవచ్చును. దేశవిభజన జరిగినచో అందుకు బ్రిటిష్ వారిని కొందరైనను నిందించెదరు. విభజన జరుగకుండగనే భారతదేశము బలహీనముగా నుండుచో బ్రిటిష్ వారిపై శంకయే ఉండదు. ముస్లిములు అధికసంఖ్యాకులుగా లేని అస్సాం, తూర్పుపంజాబ్, పశ్చిమ బెంగాలులు వారి ఆధిపత్యమునకు వప్పచెప్పబడుటవల్ల ముస్లిములు ఎల్లప్పుడు బ్రిటిష్ పక్షపాతులుగానే ఉండిపోగలరు. దుర్బలమైన కేంద్రప్రభుత్వము ఏర్పడుచో భారతదేశము బలవత్తర మగునను భయ ముండదు. దేశవిభజన జరుగకుండుటచే హిందువులుకూడ బ్రిటిష్ వారికి కృతజ్ఞులై యుందురు. వీని నన్నింటిని సాధింపగల్గినది అమాత్యత్రయప్రణాళిక ఒక్కటియే. భారతదేశము విభజితమైనను కాకపోయినను బలహీనముగా నుండుటయే బ్రిటిష్‌వారికి కావలసినది.

ఇది ఎరిగియుండియు కాంగ్రెసునాయకులు అమాత్యత్రయప్రణాళికను, దేశవిభజనను కూడ ఏల అంగీకరించిరి? భారతదేశములోని అల్పసంఖ్యాకుల రక్షణకు వారికి కొన్ని ప్రత్యేకహక్కులిచ్చుటకు కాంగ్రెసు ఎప్పుడును అంగీకరించుచునే యున్నది.

కాంగ్రెసువిధాన మెన్నడును రాజీవిధానమే. కాని గత రెండుదశాబ్దములలో వారు ముస్లిములను కూడగట్టుకొనివచ్చుటకు చేసిన ప్రయత్నములు సఫలముకాలేదు. దేశవిభజనకు ముస్లిములు కోరుదురనిగాని, బ్రిటిష్‌వారంగీకరింతురనిగాని కాంగ్రెసునాయకులు భావించి యుండక పోవచ్చును. అందువలననే చిన్న చిన్న విషయములందు కూడ వారు మిక్కిలి పట్టుదల వహించుట, ఆపన్నమైన రాజీలు భగ్నమైపోవుట జరిగినది. సప్రూ కమిటీ రిపోర్టు భగ్నమైపోవుట ఇందు కొక చక్కని ఉదాహరణయని చెప్పవచ్చును. ముస్లింలీగ్ ద్విజాతి సిద్ధాంతమును ప్రతిపాదించి ప్రచారము ప్రారంభించిన తర్వాత ముస్లిములలో కాంగ్రెసుపలుకుబడి త్వరత్వరగా తగ్గిపోజొచ్చినది. దాని సరికట్టుటకు కాంగ్రెసునాయకులు ఏమియు కృషిచేయలేదు. ద్విజాతిసిద్ధాంతము వలన ముస్లిములకు కలుగు నష్టములను ముస్లిములలో తీవ్రముగా ప్రచారముచేసియుండినచో లీగుకు అంత త్వరలో ప్రాబల్యము లభించియుండెడిది కాదు. ముస్లిముల మతాసక్తికూడ ముస్లింలీగుకు కొంత తోడైన మాట వాస్తవమే. యుద్ధానంతరము కాంగ్రెసునాయకులు జైళ్ళనుండి విడుదలై వచ్చిన తర్వాత జరిగినదంతయు వారు ముస్లింలీగుతో ముస్లింలీగ్ చెప్పిన షరతులపై రాజీచేసుకొనుటయే. జైళ్లకు పోకుండ బైట ఉండిన శ్రీ రాజగోపాలాచారి, శ్రీ భూలాభాయ్ దేశాయ్ ప్రభృతులు అందుకు విత్తనములు నాటి ఉంచిరి. హిందువుల స్వాతంత్ర్యేచ్ఛను ముస్లిములు అదనుగా ఉపయోగించుకొనిరి. బ్రిటిష్ ప్రభుత్వము తగని పాత్ర నిర్వహించినది. దేశవిభజనకు అంగీకరించని పక్షమున తమకు ప్రభుత్వములో సగము పాలు ఇవ్వవలసినదని ముస్లిములు కోరుచుండిరి. అంతకన్న అమాత్యత్రయము సూచించిన ప్రణాళికయే బాగున్నట్లగుపించినది. అస్సాం, బెంగాల్, పంజాబ్, సింధు, సరిహద్దు రాష్ట్రములు ముస్లిములచే పరిపాలింపబడినను, ఒకరకమగు దుర్బలకేంద్రప్రభుత్వము రక్షణ, రాకపోకలు, విదేశవ్యవహారములు నిర్వహించుచుండును కాబట్టి దేశమంతయు కలిసి కట్టుగా పనిచేయుటకు అవకాశమున్నది. ఈనాడు ముస్లిములలో వ్యాపించియున్న ప్రతిపక్షధోరణి ఒకటి రెండుదశాబ్దములనాటికైనను తగ్గిపోయి, వారు సరియైన ధోరణికి రాగలరు. అప్పుడైనను మన రాజ్యాంగచట్టము మార్చుకొనుటకు అవకాశ ముండును. రాజ్యాంగచట్ట మెట్టిదైనను, దేశవిభజన జరుగకుండ స్వాతంత్ర్యము లభించుట కొండంతగా అగుపించినది. అందువలన కాంగ్రెసు విధిలేక అమాత్యత్రయప్రణాళికను ఆమోదించినది. అమాత్యత్రయ ప్రణాళిక ప్రకారము రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు జరిగి, సమావేశములు ప్రారంభమైనవి. ఆ సభలో పాల్గొనుటకు ముస్లింలీగు నిరాకరించెను. కాని వేవెల్ కుతంత్రముద్వారా వారు కేంద్ర ప్రభుత్వములో ప్రవేశించిరి. రాజ్యాంగపరిషత్తులో ప్రవేశించని వారికి కేంద్రప్రభుత్వములో ప్రవేశించు నర్హత లేదు. అయినను వేవెల్ వారి నాహ్వానించి, చేర్చుకొనెను. ఇది కేవలము బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల మోసమే. ముస్లింసభ్యులు కేంద్రప్రభుత్వములో ప్రవేశించిన తరువాత వారి ధోరణిపట్ల కాంగ్రెసుకు త్వరలోనే విముఖత కల్గినది. ఒక వేళ స్వాతంత్ర్యము లభించినను వీరు దేశశ్రేయోభివృద్ధికి గాక దేశవినాశమునకే పని చేసెదరని కాంగ్రెస్ సభ్యులకు స్పష్టముగా తెలిసిపోయినది. అమాత్యత్రయప్రణాళిక సూచించిన దుర్బల కేంద్రప్రభుత్వమును ముస్లింలీగు సభ్యులు త్వరలోనే నాశన మొనరించెదరని, ఆ తరువాత అరాజకము తప్పదని కాంగ్రెసువారు గుర్తించిరి. అందువలన అట్టి అతుకులబొంత దేశము కన్న దేశవిభజనమే మంచిదని వారు భావించిరి. ఇట్లు భావించుట పొరపాటు కావచ్చును కాని వారి అప్పటి మనోభావములను బట్టి వారికి మంచిదని తోచినది వారు చేసిరి. ఒకటి రెండు దశాబ్దములలో ముస్లిముల వైఖరి మారవచ్చును, అయితే రెండు మూడేండ్లలోనే ఇప్పటి ముస్లిములు అరాచకము తెచ్చిపెట్టెదరేమో! ముస్లిములు విడిపోయినచో తక్కిన ప్రాంతములైన త్వరలో అభివృద్ధి చెందవచ్చును కదా. దేశవిభజన కంగీకరించని పక్షమున దేశమంతట కల్లోలములు, బ్రిటిష్‌పరిపాలన తప్పవుకదా. ఇష్టము లేనివారిని కట్టిపెట్టియుంచుటకు ఇంతటి మూల్యము.

చెల్లించుట సమంజసమా! ఇట్టి భావములతోనే కాంగ్రెసు నాయకులు దేశవిభజనకు అంగీకరించిరి.

౧౯౪౭ వ సం. ఆగస్టు ౧౫ వ తేదీన భారత దేశము విభక్తమైనది; స్వాతంత్ర్యముపొందినది. కీడు, మేలు ఒకే తల్లికి పుట్టిన కవలపిల్లలు; ఒకేనాణెపు రెండు ముఖములు. ఒక దానిని వెన్నంటి రెండవది ఉండి తీరును.

దేశము విభజింపబడినను అది ఉభయపక్షములకు సంతృప్తికరముగా జరిగియుండినచో పరిస్థితి వేరుగా నుండెడిది. కాని దేశవిభజనకార్యక్రమము త్వరత్వరగా జరుగవలసివచ్చుటచేత చాల లోటుపాట్లు ఉండి పోయినవి. దానికితోడు పాకిస్థాన్ ప్రతీపధోరణి మరింత గందరగోళమునకు కారణమై, దేశవిభజనవలన చెప్పలేనంత అనర్థము ప్రాప్తించినది.

దేశవిభజనసమయమున ముఖ్యముగా గమనించ వలసినది సరిహద్దుల నిర్ణయము. పంజాబ్, బెంగాల్ రాష్ట్రములలో హిందువులు అత్యధికసంఖ్యాకులుగా నున్న ప్రాంతములు విడదీసి ప్రత్యేకరాష్ట్రములుగా ఏర్పరచి ఇండియన్ యూనియనులో చేర్చిరి. కాని ఇదికూడ సంతృప్తికరముగ జరుగలేదు. పశ్చిమ పంజాబుకు చెందవలసిన ఖుల్నా జిల్లా, అస్సాముకు చెందవలసిన చిట్టగాంగ్, కొండజాతిప్రాంతము పాకిస్థానుకు కట్టబెట్టి, పాకిస్థాన్ సరిహద్దు బీహార్ సరిహద్దులవరకు వ్యాపించునట్లు చేసిరి. అట్లే పశ్చిమ పంజాబునుండికూడ లాహోర్ జిల్లా విషయమున హిందువులకు కొంత అన్యాయము జరిగినది. తమకు కూడ అన్యాయము జరిగినదని ముస్లిములును అనేక ఫిర్యాదులు చేసిరి. అస్సాం, తూర్పుబెంగాల్ సరిహద్దుల విషయమై ఒక విచారణసంఘము ఇప్పుడుకూడ పనిచేయుచున్నది. విభజనకార్యమంతయు నెమ్మదిగా ఆలోచించి జరిపియుండినచో ఇంతకన్న సంతృప్తికరముగ నుండెడిది.

ఒక దేశము రెండుదేశములుగా విభజింపబడినప్పుడు ముఖ్యముగా జనాభాపరటానుసరించి ఆలోచించి తీరవలెను. యూరపులో గతయుద్ధానంతరము అనేక నూత్నదేశములు ఏర్పడి, ఒక దేశములో మరొక దేశమునకు చెందిన ప్రజ లుండుటచే జరిగిన కల్లోలములు, వానిని నివారించుటకు కొన్ని దేశములమధ్య జరిగిన జనాభామార్పిడి మనకు తెలియును. సుడేటన్ జర్మనులు జెకోస్లవేకియాపతనమునకు కారణమైన సంగతి ఎవ్వరికిని జ్ఞప్తికి తేనక్కరలేదు. గ్రీస్, టర్కీలమధ్య, బాల్కన్ రాజ్యములగు రుమేనియా, బల్గేరియా, యూగోస్లేవియా, గ్రీకులు తమమధ్య జనాభాపరటాలు ఏవిధముగా జరుపుకొన్నది మనకు తెలుసును. అవిధముగానే పాకిస్థానులో మిగిలియుండు హిందువులను, భారత యూనియనులో మిగిలియుండు మహమ్మదీయులలో కొంతమందిని మార్చుకొనువిషయమో, వారికి ప్రత్యేక రక్షణలు, హక్కులు ఇచ్చువిషయమో దేశవిభజనకు ముందే ఆలోచించుకొనవలసినది. ఒక దేశపు ప్రజలు ఇంకొకదేశములో అల్పసంఖ్యాకులుగా నున్నప్పుడు, ఆ అల్పసంఖ్యాకులకు ఇవ్వదగిన హక్కులు, రక్షణలను గురించి నానారాజ్యసమితి యుద్ధానంతరము కొన్ని సూచనలు చేయుట, యూరపియన్ రాజ్యములలో అవి అమలుజరుగుట జరిగినది. కాని మన దేశములో అదేమియు ఆలోచింపబడలేదు. ఎక్కడివారక్కడ, యథాతథముగా నుండిపోయెదరని భావించబడినది. జనాభా మార్పిడికి కాంగ్రెసునాయకులు ఆదినుండియు విముఖులే. కాని కాలము వేరొక విధముగా మారినది. తూర్పు పశ్చిమ పంజాబులలో స్వాతంత్ర్యోత్సాహముతోపాటు మతోన్మాదము ప్రజల నావేశించి, కిరాతకృత్యములు జరిపించినది. అట్టి సంఘటనలు చరిత్రలో ఎన్నడు మానవుల మధ్య కాదు సరికదా, జీవకోటిమధ్యనే జరిగియుండక పోవచ్చును. పశ్చిమపంజాబునుండి హిందువులు, సిక్కులు, తూర్పుపంజాబునుండి ముస్లిములు ప్రభుత్వమున కిష్టమున్నను లేకపోయినను వెళ్లిపోవకతప్పలేదు. గందరగోళముగా జనము బయలుదేరి వచ్చివేయుట ప్రారంభమైనది. అటుపైన ప్రభుత్వములు జోక్యము కలుగజేసుకొని వారిని నియమప్రకారము, జాగ్రత్తగా, రక్షణతో తీసికొనివచ్చుటకు ప్రారంభించినవి. చరిత్రలో ఎన్నడు కని విని ఎరుగనంతటి జనాభాపరటా రెండుమూడునెలలకాలములో ముగిసిపోయినది. పశ్చిమపాకి

స్థానమునుండి దాదాపు ౫౦ లక్షలమంది హిందువులు, సిక్కులు భారతయూనియన్ చేరిరి. తూర్పు పంజాబ్, ఢిల్లీలనుండి దాదాపు అంతమంది ముస్లిములు పాకిస్థాన్ వెళ్ళిపోయిరి. కాందిశీకుల సమస్య ఇప్పటికి కూడ ప్రభుత్వముల ప్రథమాలోచనమే అయియున్నది. తూర్పు, పశ్చిమపంజాబ్ ప్రభుత్వములు ఈ జనాభా పరటాద్వారా దాదాపు నామమాత్రములే అయిపోయి, ఇప్పుడు తిరిగి ప్రతివిషయమును పునరారంభించుకొనవలసి వచ్చినది. కాందిశీకులను జాగ్రత్తగా తీసికొని వచ్చి, తాత్కాలికసౌకర్యముల నేర్పరచుటకన్న వారికి శాశ్వతపునరావాసపుటేర్పాట్లు జరుపుట కష్టతరమైన కార్యము. ఇందుకు ఇండియా, పాకిస్థాన్ ప్రభుత్వములు రెండును తీవ్రకృషిసలుపుచునే యున్నవి. అయినను ఆ సమస్య సంతృప్తికరముగ పరిష్కరింపబడుటకు మరి రెండేండ్ల కాలమైనను పట్టును.

జనాభాపరటాతోపాటు మారిపోవుచున్న వారి ఆస్తివిషయమై ప్రశ్న ఉద్భవించినది. భారత యూనియనునుండి వెళ్ళిపోయిన ముస్లిములు బీదవారు. పాకిస్థానునుండి వచ్చివేసిన హిందువులు, సిక్కులు భాగ్యవంతులు. వారు బయలుదేరి వచ్చునప్పుడు తమ స్థిరచరాస్తులను వదలివేసి రాక తప్పదుకదా. కట్టుగుడ్డలు తప్ప మరేమియు వారివద్ద నుండుటకు పాకిస్థాన్ అనుమతించలేదు. వారు భారతయూనియన్ వచ్చినతరువాత తామచ్చట పోగొట్టుకొన్నంత ఆస్తి తమకు కావలెనని అడుగుట సహజమే. వారి ఆస్తికి సరియైన పరిహారమిచ్చుట పాకిస్థాన్ ప్రభుత్వవిధి. ఈ కర్తవ్యమును పాకిస్థాన్ ప్రభుత్వము గుర్తించదు. ఇక్కడనుండి వెళ్ళిపోయిన ముస్లిములు భాగ్యవంతులై, చక్కని గృహముల నాక్రమించుకొని (ముందుగా వెళ్ళిన కొంతమంది మాత్రమే) సుఖముగా జీవించుచున్నారు. ఇచ్చటికి వచ్చిన హిందువులు, సిక్కులు ఖాళీగా ఉన్న ముస్లిము గృహములనుకూడ ఆక్రమించుకొనరాదని మన ప్రభుత్వము కట్టుదిట్టముచేసినది. జనాభా పరటాను మన ప్రభుత్వ మెన్నడు గుర్తించదు. వెళ్లిపోయిన ముస్లిములుకూడ తిరిగివచ్చినచో మనకు సంతోషము.

దేశవిభజనవలన భారతదేశచరిత్రలో ఒక నూతన ఉపాఖ్యానము ఆరంభమైనది. అదే సంస్థానాల సమస్య. సంస్థానములపై బ్రిటిష్‌సార్వభౌమత్వ మంతరించగానే దాని తరువాత ఏర్పడిన ప్రభుత్వముల సార్వభౌమత్వము స్థాపింపబడవలసినది. అట్లు జరుగకపోయినచో దేశములోని ఆరువందల సంస్థానములకు స్వతంత్రత ప్రకటించుకొనుటకు హక్కు లభించి, దేశము రెండుగాగాక ఆరేడువందల భాగములుగా చీలిపోవును. ఈ ప్రమాదమును బ్రిటిష్‌ప్రభుత్వము గుర్తించినది గాని అట్లు జరుగకుండుటకు ప్రత్యేకనిబంధన లేమియు పెట్టలేదు. సంస్థానములు ఐచ్ఛికముగా ఏదో ఒక అధినివేశములో కలిసిపోవచ్చునని బ్రిటిష్‌ప్రభుత్వ మనెను. ఏ సంస్థానమైనను సర్వస్వతంత్రముగ నున్న దానిని తాను గుర్తించనని మాత్రము బ్రిటిష్‌ప్రభుత్వము తెలియజేసినది. కాంగ్రెస్ అట్లుగాక సంస్థానములన్నియు భౌగోళికముగా తమ ప్రక్కనున్న దేశములో చేరిపోవలసినదేనని, సంస్థానాధీశ్వరులు తమ నిరంకుశపరిపాలనకు స్వస్తిచెప్పి బాధ్యతాయుతప్రజాప్రభుత్వముల నేర్పరచవలెనని నొక్కివక్కాణించుచునే యుండెను. ముస్లింలీగ్ తన మామూలు హిందూవ్యతిరేకధోరణిలో సంస్థానములు స్వతంత్రముగా నుండిపోవచ్చుననియే వాదించెను. ఈ వాదన లెట్లున్నను క్రియారూపములో సంస్థానములు ఏదో ఒక అధినివేశములో చేరిపోయినవి. మొదట కొంతకాలము బుకాయించిన తిరువాన్కూరు, మైసూరులు త్వరలోనే చల్లబడినవి. కాని హైదరాబాదు, కాశ్మీరులు కొరకరాని కొయ్యలుగా మిగిలిపోయినవి. జునాగఢ్ పాకిస్థానులో చేరి, ప్రజావిప్లవము, రాజపలాయనము తరువాత ఇప్పుడు శాంతించి, తిరిగి భారతయూనియనులో చేరుటకు ప్రజాభీష్టము ప్రకారము నిర్ణయించినది. పశ్చిమపాకిస్థానులో కీలకసంస్థానమైన కలత్ ఇన్నాళ్ళనుండి మారాముగా వేచియుండి ఈమధ్యనే పాకిస్థానులో చేరిపోయినది. కాశ్మీర్ తలవనితలంపుగా భారతయూనియనులో చేరి, కదనరంగముగా మారి, అంతర్జాతీయ సమస్యయై ఉభయులను కలవరపెట్టుచున్నది. ఇక హైదరాబాదు మిగిలియున్నది. భారతదేశములో ముస్లింపరిపాలనకు నిజాంప్రభువు మంగళగీతము పాల

పించదలచిన ట్లున్నది. ఆయనకు వంతపాటకులుగా రజాకర్లు ప్రళయగీతములు ఆలపించుటకు విలయజంత్రములద్వారా దుర్భరధ్వనులు జరిపించుచున్నారు. ఇది ఎంతకాలమో !

భారతయూనియన్, పాకిస్థానుల పట్ల అగ్రరాజ్యముల వైఖరి వింతగొలుపుచున్నది. భారతదేశము తమ చేతిక్రిందనుండదని, పాకిస్థానును చేరదీయవలెనని బ్రిటన్, అమెరికాలు కొంతకాలము ప్రయత్నించినవి. రష్యా గోడమీది పిల్లివలె ఉండుటకు పేరుగాంచినదగుట తనవైఖరిని అస్పష్టముగానే యుంచినది. ప్రపంచరాజకీయములు దినదినము శరవేగముతో ముందుకు పోవుచుండుటచే పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోవుచున్నవి. యుద్ధము ఈనాడో, రేపో అన్నట్లున్న ఈనాడు అగ్రరాజ్యములు ఇండియా, పాకిస్థానులలో దేనిని వదలుకొనలేని స్థితిలో ఉన్నవి. కాశ్మీరును ఏవిధముగానైనను పాకిస్థానుకు కట్టబెట్టి, తద్వారా రష్యాసరిహద్దులలో తమకు స్థావరములు సంపాదించుకొనవలెనని కొన్నాళ్ళ క్రిందట వరకు తాపత్రయపడిన అమెరికా, బ్రిటనులు ఇప్పుడు కాశ్మీర్ సమస్యనుసరించిన ప్రస్తావన వీలైనంత వరకు వాయిదాపడుట మంచిదని భావించుచున్నవి. ఇండియా, పాకిస్థానులలో దేనికిని కష్టముకలిగించకుండ ఉండుటయే వారి ప్రస్తుతవైఖరి. మొత్తముమీద అమెరికా, బ్రిటనులు పాకిస్థానుకే ఎక్కువ సహాయకారులుగానుండును. అందువలన భారతయూనియన్ పారిశ్రామికాభివృద్ధి కొంతవరకు కుంటుపడును.

ఆర్థికరంగములోకూడ ఇండియాపాకిస్థానుల మధ్య ఉండవలసినంత, ఉండదగినంత సహకారము లేదు. తూర్పుబెంగాలునుండి పశ్చిమ బెంగాలుకు వచ్చుచున్న జనపనారపైనను, పశ్చిమపాకిస్థాను నుండి బొంబాయికి వచ్చుచున్న ప్రత్తిపైనను పన్నులు విధించబడినవి. ఇవి యథాతథపు ఒడంబడికకు విరుద్ధము. అయినను, అవిభక్తభారతదేశపు అప్పుల కన్నిటికి భారతదేశమే బాధ్యత వహించి పాకిస్థానుపై బాధ్యత తగ్గించినది. అయినను పాకిస్థాన్ తగినంత సహకారము చేయలేదు. ఏప్రెల్ ఒకటవ తేదీనుండి పాకిస్థాన్ స్వతంత్రముగా తన ఖజానావ్యవహారములు నిర్వహించుకొనవలసినది. కాని అందుకు తగిన ఏర్పాట్లు ఇంకను జరుగకపోవుటచే, ఆ ఒడంబడికను మరి మూడునెలల కాలము పొడిగించుటకు భారతప్రభుత్వము అంగీకరించినది. ఇట్టి సుహృద్భావమే ఇరుపక్షములు ఎల్లప్పుడు ప్రదర్శించుచుండినచో దేశపునరైక్యము ఏనాటికైన సాధ్యపడునేమో!

దేశవిభజన తాత్కాలికావేశములవల్ల జరిగినది. హిందూ, ముస్లింనాయకులు ఆయావేశములు తగ్గిపోయిన తర్వాత, ప్రశాంతముగా ఆలోచించినచో దేశవిభజన కూడదని అంగీకరించేవారే. కాంగ్రెస్ తొందరపడి దేశవిభజన కంగీకరించకుండ ఉండినచో ఒక దశాబ్దముకాలములో ముస్లిములు సత్యమును గ్రహించుకొనగల్గెడివారేమో ! అంతవరకు అమాత్యత్రయ పథకము సూచించినదానికంటెకే ఏదో దుర్బలకేంద్రప్రభుత్వ మేర్పరచి ౧౦ ఏండ్ల తర్వాత సర్వజనాభిప్రాయముకొరకు ముస్లింప్రాంతములలో ప్లెబిసైట్ జరిపి అప్పటి వారి ఉద్దేశముల ప్రకారము అవసరమైనచో దేశవిభజన జరిపిన బాగుండెడిదేమో. ఇట్టి సూచనలు కొంతమంది చేయకపోలేదు. అప్పటి పరిస్థితులలో కాంగ్రెస్ నాయకులకు ఇది అంత ఆకర్షకముగా కనిపించలేదు. వారి దృక్పథము తప్పైయుండవచ్చును. అది దేశక్షేమముకొరకు జరిపిన తప్పేనని మనము గుర్తించవలెను.

దేశవిభజనవలన హిందువులు, ముస్లిములుకూడ నష్టపడినను ముస్లిములకు కలిగిన నష్టమే పెద్దదని చెప్పవలెను. పశ్చిమపాకిస్థానులో ముస్లిమేతరు లెవ్వరును లేరు. త్వరలోనే తూర్పుబెంగాలునుండికూడ హిందువు లందరు వచ్చివేయగలరు. పాకిస్థానులో ముస్లిమేతరు డొక్కడును ఉండడు. కాని ఇండియన్ యూనియనులో మూడుకోట్లమంది ముస్లిములు మిగిలిపోయి యుందురు. వీరికి రక్షణ ఏమి? ఇప్పటి హిందువులు, ప్రభుత్వము ముస్లిములను శ్రద్ధతోనే రక్షించెదరు. వారికి ప్రత్యేకహక్కులు, రక్షణలు ఉండును. కాని కొంతకాలము పోయినతర్వాత హిందువులలో ప్రతీకారవాంఛ ప్రబలినచో, పాకిస్థాన్ ఈ ముస్లిములకు

ఎట్లుతోడ్పడగలదు? హిందూస్థాన్‌పై దండెత్తియా? ఇండియా, పాకిస్థానుల పునరైక్యమునకు ఎక్కువగా ఆందోళన జరుపవలసినవారు భారతదేశములో మిగిలియున్న ముస్లిములే.

మనకు స్వాతంత్ర్యము లభించినది; భారతమాత భుజస్కంధములు ఛేదింపబడినవి; యుగపురుషుడు, అపరబుద్ధుడు గాంధీజీ అస్తమించినాడు. ఈ మూడు చారిత్రాత్మకసంఘటనలు ఒక్క సంవత్సర కాలములోనే జరిగినవి. మొదటిదానివలన జనించిన సంతసము కన్నతక్కిన రెంటివలన జనించిన దుఃఖమే ఎక్కువైనది. తరతరములనుండి మన పెద్దలు ఊహించి, ఆశించి, కష్టించిన ఆ స్వతంత్ర భారత స్వరూపము మనకు కరవైపోయినది. ఆ 'ఏకభారత' దేశమును సాధింపగల్గిననాడే మన స్వాతంత్ర్యసమరము జయప్రదముగా ముగిసినట్లగును. సేతుశీతనగ పర్యంతము భరతవర్షము అనాదినుండియు ఏకదేశమే. అది ఇకముందట్లుండకపోయినచో అది మన తప్పే యగును.



ఉత్తర భారతదేశంలో జైనశిల్పము

శ్రీ కొమరగిరి నరసింహారావు

చారిత్రకపరిశోధన నేటి పరిపూర్ణ పరిపక్వస్థితిని పొందని కాలంలో బౌద్ధజైనమతాల పరస్పర సామ్యవిభేదాలు చాలామందికి తెలియలేదు. కొంత కాలం పండితులలోగూడా జైనం బౌద్ధంలోని ఒక శాఖమాత్రమే అనే, అభిప్రాయం చాలా ప్రబలంగా వుండేది. కాని జాకొబీ, బూలర్ మహాశయుల పరిశోధనఫలితంగా యీ అభిప్రాయం నేడు పూర్తిగా మాసిపోయింది. జైనం బౌద్ధమతజనితం కాదనీ, అది ఒక స్వతంత్రమైన ప్రత్యేకమత మనీ నేడు నిర్వివాదంగా తేలిపోయింది. ఈ రెంటికీ గల పరస్పర సన్నిహితసంబంధంవల్ల నేటికీ కొన్ని శిథిలాలు బౌద్ధులవో, జైనులవో అనే సందేహం కలుగుతూంటుంది. అత్యంతజాగరూకతతో పరిశీలిస్తేనేగాని యీ విషయాలు స్పష్టంకావు.

హిందూమతసంప్రదాయాలమీద జైనమత ప్రభావ మొకప్పుడు అత్యంత ప్రబలంగా వుండేది. జైన శిల్పం భారతీయశిల్పాని కెంతో దోహద మిచ్చింది. ఉదయగిరి, ఖండగిరి గుహాభ్యంతరాలయాలలోని ముఖబంధచిత్రసౌభాగ్యమూ, మథురశిథిలాలలో కనిపించే ఆయాగపటతోరణాలలో ద్యోతకమయ్యే ఉజ్జ్వల కళావిశిష్టతా, గిర్నారా, శత్రుంజయాపర్వత ప్రాంతాలలోని స్తంభాలమీద వెలుగొందే సునిశిత కళాసౌందర్యమూ, అబూశిఖర దేవాలయాలలోని ప్రసిద్ధ వాస్తుశిల్పచాతుర్యమూ యిందుకు ప్రత్యక్షనిదర్శనాలు.

జైనశిల్పం ముఖ్యంగా వాస్తుశిల్పంలో పరిపూర్ణతను సాధించింది. జైనధర్మం చాలావరకు వాస్తుశిల్పంలోనే వ్యక్తమవుతుంది. జైనులు చేసిన గొప్ప గొప్ప కార్యాలలో విశేషంగా వాస్తుశిల్పనిర్మాణాలే కనిపించటానికి కారణం దేవాలయనిర్మాణం ముక్తిసాధనకు సన్నిహితమార్గము అనే జైనుల గాఢవిశ్వాసమే.

జైనుల కట్టడాలలో ప్రతిదీ ఎంతో నేత్రపర్వంగా వుంటుంది. వారి ఆరామాలూ, ఆలయాలూ, ఎక్కువ భాగం విశాలోన్నతగిరిసానువులలోని ప్రశాంతప్రదేశాలలో నిర్మితాలు. మూడు నాలుగు వేల అడుగుల ఎత్తున్న గిర్నారా శత్రుంజయా పర్వతోత్తమ్ములలో ఎన్నో దేవాలయ సముదాయాలు (cities of temples) ఉన్నాయి. దేవాలయాలను యీ విధంగా సమూహాలుగా నిర్మించటం జైనులకు మాత్రమే దక్కిన ఒక ప్రత్యేకత. గిర్నారా శత్రుంజయా శిల్పాల ఆకారప్రకారాలలో యింత కళానైపుణ్యమూ, వైవిధ్యమూ వున్నా, జునాఘడ్ ప్రాగ్భాగంలోని బావాప్యారీమఠంలోనూ, మరికొన్ని జైన గుహలలోనూ తప్ప మరెక్కడా చరిత్రపరిశోధన కుపయుక్త మయ్యే ఆధారాలు లభించవు.

జైనశిల్పకళాసౌందర్యానికి (చక్కని కళానిపుణతకుగాని, సునిశిత రేఖావిన్యాసానికి గాని) చిత్తూరులోని జయస్తంభాలూ, అబూశిఖరంమీది ఆలయాలూ మనోహరమైన నిదర్శనాలు. బెంగాలులోని పార్శ్వనాథవిగ్రహ మున్న సమేతశిఖరతీర్థమూ, పాట్నాలోని జలమందిర తలమందిర దేవాలయములూ మరికొన్ని నిదర్శనాలు.

జైనమతప్రభావంలో పెంపొందిన భారతీయ చిత్రకళాభాగానికి కొన్ని నిదర్శనాలు జైనఆగమాల సచిత్రవ్రాతప్రతులలో కొన్నింటిలోనూ, జైనా

చార్యులు సాంవత్సరికోత్సవసందర్భంలో తమ మత గురువులకు పంపు క్షమాపణపత్రాలలోనూ (వీటినే విజ్ఞప్తిపత్రాలనికూడ అంటారు) ద్యోతక మవుతూన్నాయి.

భారతీయశిల్పాన్ని కొన్ని తరగతులుగా విభజించటం సమంజసంకాదు. వాస్తుశిల్పంలో కాని, ప్రతిమా శిల్పంలోకాని నిటానికి బౌద్ధ, జైన, బ్రాహ్మణ శైలు లంటూ లేవు. కాని ఆయా కాలాలలో భారతీయ శైలికి చెందిన బౌద్ధ, జైన, బ్రాహ్మణశిల్పశిథిలాలు మాత్రం వున్నాయని చెప్పవచ్చును. వివిధసంప్రదాయప్రభావంవల్ల ప్రాంతీయాచారవ్యవహారాలలో కొంత మార్పు కలిగి ఆయా అవసరాల కనుగుణంగా కళావిధానంలోగూడా కొంత మార్పు కలిగి ఉండవచ్చును. అంతేకాని, అవి ఒక ప్రత్యేకశైలికి చెందినవి అని చెప్ప సాధ్యంకాదు. అందువల్లనే జైన బౌద్ధశిల్పాలు కొన్నింటిలో ఏవి ఏ ధర్మానికి చెందినవో తెలుసుకోవటం చాలా కష్టతరం. జైనశిల్పాన్ని పరిశీలించే ముందు యీ విషయాన్ని జ్ఞాపకముంచుకోవటం అవసరం.

జైనశిల్పశిథిలాలలో ముందు మన దృష్టి నాకర్షించేవి ఒరిస్సాగుహాలు. వీటిలో చాలా భాగం తీర్థంకరవిగ్రహాలతో నిండి వున్నాయి. ఈ తీర్థంకరులలో పార్శ్వనాథునికి అత్యంతప్రముఖస్థానం వున్నది. ఈ గుహాలను శ్రద్ధగా పరిశీలిస్తే యిందులో బౌద్ధమతానికి చెందినవి అని చెప్పదగిన శిథిలాధారా లేవీ కనుపించవు. బుద్ధవిగ్రహాలుగాని, బౌద్ధాగమాలకు చెందిన సన్నివేశాల చిత్రాలుగాని యిందులో గోచరించవు. త్రిశూలాలూ, స్తూపాలూ, స్వస్తికలూ, చక్రాలూ, శ్రీదేవీవిగ్రహాలూ, తదితరప్రతీకలూ ఉన్నాయి. కాని బౌద్ధజైనములకు రెంటికీ యివి సామాన్య మయిన వే.

ఇప్పు డున్న జైనశిల్పాలలోని అత్యంత ప్రాచీనశిథిలాలవల్ల జైనులుకూడ భిక్షుకగృహాలు నిర్మించారని స్పష్టమవుతుంది. కాని వారి ఆచారవ్యవహారాలనుబట్టి వారు అనుసరించిన నిర్మాణవిధానంలో కొద్ది మార్పు కనుపిస్తుంది. జైనశ్రమణులు ఎప్పుడూ పెద్దపెద్ద సంఘాలుగా నివసించే ఆచారం లేదు. అందువల్ల బౌద్ధచైత్యాలను పోలిన మందిరాలు వీరి కవసరం లేకపోయింది.

ఉదయగిరిగుహాలు చాలా ప్రాచీనమైనవి. ఖండగిరిలోనివి తరువాతికాలపువాటివి. ఉదయగిరిలోని హాతిగుంఫ చాల ప్రఖ్యాతిసిద్ధ మయినది. ఇందులో ఖరవేలుని రాజ్యకాలంనాటి ఒక అపభ్రంశ ప్రాకృతపు శాసనం ఉంది. దానివల్లనే యీ గుహ కింత ప్రాధాన్యము కలిగింది. ఈ శాసనం కొంత గుహాముఖంమీదనూ, మరికొంత లోపల పైభాగంమీదను వ్యాపించి ఉంది. ఇంతకుమించి యీ గుహాలో శిల్ప విషయాలలో చెప్పుకోతగిన విశేష మేమీ లేదు.

శిల్పదృష్ట్యా రాణీ, గణేశగుంఫలు అత్యంత ప్రసిద్ధ మయినవి. ఇవి రెండూ రెండంతస్తులవే. వీటిలోని ముఖబంధచిత్రాలు అనన్యకళాసౌందర్య సంపన్నములై మానవప్రకృతిలోని వివిధసన్నివేశాలతో చిత్రితములై ఉన్నాయి. ఈ రెంటిలో రాణీగుంఫ పెద్దది. శిల్పసౌకుమార్యంలోనూ, రేఖావిన్యాసంలోనూ యిది తక్కిన గుహా లన్నింటికంటె సుందరతర మయినది. ఈ చిత్రాలలోని సన్నివేశాలన్నీ పార్శ్వనాథుని జీవితానికి సంబంధించిన వివిధఘట్టాలే అని చక్రవర్తివంటి పండితుల అభిప్రాయం.

ఈ గుహాలోని శిల్పంలో మథురశిల్పంలో వలెనే స్త్రీపురుషుల వేషధారణలో గ్రీకుభారత శైలుల సమ్మిళితప్రభావం ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తుంది. మథురలోవలెనే వీటిలోగూడా స్త్రీలు మిక్కిలి ఘనమయిన చరణమంజీరములు ధరించటం కనుపిస్తుంది. ఈ శిల్పంలో యీ ఆభరణసౌభాగ్యమూ, శాస్త్ర నైపుణ్యమే కాక అక్కడక్కడా వినూత్న భావకల్పలతా, జీవితసౌందర్యమూ, సునిశితహాస్యమూ గూడా ద్యోతక మవుతూన్నాయి. ఈ ఘట్టాలలో ఆఖేటమూ, యుద్ధమూ, నాట్యమూ, శృంగారమూ మొదలయిన మానవజీవితములోని వివిధ భావరీతులూ చిత్రితమై ఉన్నాయి.

జైనశిల్పంలో రెండు ప్రత్యేకగుణాలు కనుపిస్తాయి—స్తూపారాధన, విగ్రహారాధన. స్తూపాలు

ప్రథమంలో ప్రసిద్ధులౌ ఆచార్యుల నిర్యాణచిహ్నాలు గానే పరిగణింపబడినా క్రమంగా రానురానూ అప మానశిల్పకళానిలయాలుగా మారిపోయినాయి. ఇందుకు మథురలోని వోద్వ స్తూపమే నిదర్శనం. స్తూపనిర్మాణం బౌద్ధులలో ఉన్నంత ప్రబలంగా జైనులలో లేక పోయినా మథురలోని వోద్వస్తూపాన్ని బట్టి వీరు గూడ యిందులో ఒక ప్రశంసాపాత్రమయిన స్థితిని చేరుకున్నారని చెప్పవచ్చును.

జైనులకు వారి యిరువదినాలుగు తీర్థంకరులు ముఖ్యమైన ఆరాధ్య దైవతాలు. కాని మహాయాన బౌద్ధులవలెనే వారుకూడ భువనాధిపతులు, వ్యోమాంత రులు, వైమానికులు, జ్యోతిష్కులు అని చతుర్విధ విభాగంతో వ్యక్తమవుతూన్న ఇంద్రుడు, గరుడుడు, గంధర్వులు, అప్సరసలు, సరస్వతి, లక్ష్మి మొదలయిన హిందూదేవతలను గూడా ఆరాధించేవారు. తీర్థంకరుల విగ్రహాలకు ఒక్కొక్కదానికి అడుగున ఒక్కొక్క సంజ్ఞ ఉంటుంది. సామాన్యంగా అవి బుద్ధ ప్రతిమల వలె పద్మాసనధ్యానముద్రతో చిత్రితములై ఉంటాయి.

ఇక మథురశిల్పశిథిలాల విషయంలో—మథుర అనాదిప్రసిద్ధమయిన ఒక పురాతనపట్టణము. ఇది కాత్రకు దక్షిణంగా సుమారు అరమైలు దూరంలో ఉన్న కంకాళిస్తూపంనుంచో, ఆ సమీపప్రాంతం లోనో బయటపడ్డది. ఈ స్తూపంలోని శిల్పకళా సంవిధానం భారతచిత్రకళాచరిత్రలో ప్రాచీనభారత శిల్పానికీ మాధ్యకాలికభారతశిల్పానికీమధ్య ఒక విధ మయిన సేతువుగా వర్తించటంవల్లనూ, గాంధారశైలికి అత్యంతసన్నిహితంగాఉండటంవల్లనూ యింత ప్రాము ఖ్యతను గడించింది. అటు వాయవ్యాన గాంధారమూ, యిటు ఆగ్నేయాన అమరావతి, తూర్పున సారనాథూ —యీ మధ్యప్రదేశంలో ఉండటంవల్ల యీ మథుర శిల్పంలో వీటన్నిటి ప్రభావమూ ప్రతిబింబిస్తుందంటే ఆశ్చర్యం లేదు. ఈ మథురాగాంధార శిల్పవిధానం క్రీస్తు పూర్వం ఒకటవ శతాబ్దంలో జనించి క్రీస్తుశకం ౫౦-౨౦౦ మధ్యకాలంలో మిక్కిలి ప్రాబల్యంలో ఉన్నట్టు తోస్తుంది.

మథురశిల్పాలలో ఆయాగపటములు అనేవి చాలా చిత్రంగా ఉండి మనలో కుతూహలాన్ని రేకెత్తిస్తాయి. ఇవి సాధారణంగా నలుచదరంగా నున్న రాతిపలకలు. వీటిపై అత్యంతమనోహరమయిన నగిషీతో ధ్యానసమాధినిష్ఠితుడయిన ఒక జినవిగ్రహం గాని, మరియేదయినా ఒక ఆరాధ్యచిహ్నంగాని చిత్రితమై ఉంటుంది. త్రిశూలాలూ, స్వస్తికలూ, పర్షియా అఖిమీనియన్ శైలిలో నున్న స్తంభాలూ, చక్రాలూ, మరికొన్ని ఆభరణాలూ ఆయా స్థలాలలో ఉచ్చైస్తుగా శిల్పితాలై రమ్యంగా ఉంటాయి. ఇవి ముఖ్యంగా సంజ్ఞాత్మకాలు.

ఈ ఆయాగపటాలలో రెండు ముఖ్యమయినవి. ఒకటి ప్రఖ్యాతనాట్యాచార్యుడయిన ఫుగునూనుని పత్ని శివయాస ప్రతిష్ఠించినది. రెండవది ఆ మొహినీ ప్రతిష్ఠించినది. ఇందులో మొదటి ఆయాగపటాన్ని బాగా పరిశీలిస్తే జైనస్తూపాకారప్రకారాలు స్పష్ట మవుతాయి. ముఖద్వారాని కిరుపైపులనుంచీ బయలు దేరిన చిన్నచిన్న రాతిస్తంభముల ప్రాకారమూ, ఆ ప్రాకారాని కానుకుని లోపలివైపున స్తూపంచుట్టూ కొద్దిమార్గమూ, ద్వారోపరిభాగాన తోరణాలూ, వాటి నుండి వ్రేలాడే పుష్పగుచ్ఛమూ, ఆ ద్వారమున కిరు పైపులా దిగంబరదేవదాసీవిగ్రహాలూ, వాటి పార్శ్వ ముల లావుపాటి స్తంభాలూ యీ ఆయాగపటాలలోని శిల్పకళాఖండాలు. తోరణంమీద అంకితాన్ని తెలిపే శాసనం ఒకటి ఉంది. దీనివల్ల యిది అత్యంతప్రాచీన మయినదనీ, కనిష్కుని ముందుకాలానికి చెంది ఉంటుం దనీ డాక్టరు బూలర్ మహాశయుని అభిప్రాయం. విన్ సెంట్ స్మిత్ యీ పటంమీదనూ, మరి యితర స్తంభాల మీదనూ చిత్రితమై ఉన్న దేవదాసీమూర్తులు చాలా అసభ్యంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. బాహ్యంగా బహిర్నేత్రానికి గోచరమయ్యేశిల్పసౌందర్య భ్రాంతిలోపడి అంతర్యానిహితమై జ్ఞానచక్షువుకు గోచ రించే జైనధర్మరహస్యాన్నీ, జైనశిల్పాశయాన్నీ అవ గాహన చేసికోలేని పాశ్చాత్య పరిశోధకులు కొందరు అలా పొరపడటంలో ఆశ్చర్యం లేదు. మథురలోనూ, సాంచీలోనూ ఉన్న శిల్పస్త్రీమూర్తులు శిల్పుల సంకు

చిత తుచ్ఛభావోన్మాదకారణంగా వెలసినవి కావు. సర్వవ్యాపకమయిన అనిర్వచనీయామరసౌందర్యాన్ని తమ అంతరంగవీక్షణంలో దర్శించి తత్ప్రతిబింబంగా చిత్రించిన అతిలోకలలిత కళాఖండాలు.


ఈ ఆయాగపటాలతరువాత అవటి వోద్వస్తూపం మన దృష్టి నాకర్షిస్తుంది. ఇది దేవతానిర్మిత మని ప్రతీతి. క్రీస్తుశకానికి ఎన్నో శతాబ్దాలకు పూర్వం యిది సృష్టంకావటంవల్లనూ, ఎంత పరిశోధనచేసినా యీనిర్మాతల విషయం తెలియకపోవటంవల్లనూ దీన్ని యిలా అనుకుని వదలివేసిఉంటారు. ప్రథమంలో ధర్మరుచి, ధర్మఘోష అనే జైనశ్రమణుల కోరికమూలాన సప్తమజినుడైన సుపార్శ్వనాథుని గౌరవచిహ్నంగా దీన్ని స్వర్ణమయంగానూ, రత్నఖచితంగానూ కుబేరుడు కట్టించినాడట! తదనంతరం యిరువదిమూడవ జినుడయిన పార్శ్వనాథుడు దీనిమీద నే యిటుకతో ఆలయనిర్మాణం చేయించాడని జైన సంప్రదాయసిద్ధమయిన ఒక ప్రతీతి.

ఈ స్తూపమధ్యభాగంలో పద్మస్థమయిన ఒక త్రిశూలంమీద ప్రతిష్ఠితమై బౌద్ధజైనహిందూధర్మాలకు సమానధర్మసంజ్ఞ అయిన ధర్మచక్రం చిత్రితమై ఉంది. దీనికి ఒక వైపున నలుగురు జైనసేవికల మూర్తులూ, ఒక శయితసింహమూ ఉన్నాయి. రెండవ వైపున కొంత శిథిల మైపోవటంవల్ల అక్కడ ఉన్న పురుషమూర్తుల సరియైన స్వభావం తెలిసికోవటం కష్టసాధ్యం.

వీటితరువాత మథురశిల్పంలో తోరణాలు చాలా ప్రముఖ మయినవి. వీటిని పరిశీలిస్తే దేవతలూ, మానవులూకూడా జైనతీర్థంకరులకూ, స్తూపాలకూ, ఆలయాలకూ ఎంత వినమ్రభక్తిప్రపత్తులు ప్రకటిస్తూ ఉన్నారో విదిత మవుతుంది. ఇందులో ముఖ్యంగా ఇరువురు సుపర్ణులూ, ఏవురు కిన్నరులూ ఒక స్తూపాన్ని ఆరాధిస్తూన్నట్టు చిత్రితమయిన తోరణం చారిత్రకంగా చాలా ప్రధానమయింది. సాంచీశిల్పంలోకూడ యిలాంటిదే ఒక సన్నివేశం ఉన్నట్లు బూలర్ మహాశయుని అభిప్రాయం. అయినా సాంచీవిగ్రహాలు ఎక్కువ గ్రీక్ కిన్నరులవలె ఉన్నాయనీ, మథురలోనివి అస్సీరియాశిల్పాలలోని సుపర్ణులవలె ఉన్నాయనీ ఆయన అంటారు.

ఒరిస్సా జూనాగఢ్ గుజరాత్ దేశాలలో బయటపడిన గుహాలూ, ఆలయాలూ, ఆరామాలూకూడా కేవలం శిథిలాలవలె గాక సునిశితరేఖావిన్యాసంతోనూ, ఉజ్జ్వలకళాసౌష్ఠవంతోనూ, ఉదాత్తభావౌన్నత్యంతోనూ మూర్తిమంతమయిన శిల్పకళాదేవతగా గోచరిస్తాయి. ఇందులో భారతీయశిల్పంలోని ఆధ్యాత్మికత, కేవలాలంకరణ, వాస్తవికత మేళనమయిన త్రికం (Triune Eutity) ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తుంది. ఇది కేవలం అనుభవైకవేద్యం. ఇందలి అంతర్విభేదాలు శిల్పపరిజ్ఞానమూలాలు కావు. రసనాపరిగమ్యమానములు;

[సి. జె. షా గ్రంథాన్ని అనుసరించి]



భూప్రదక్షిణము

— శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య —

భూగోళములో ప్రతి దేశమందును నూటికి తొంభైతొమ్మిదిమంది వ్యవసాయములోనో, పరిశ్రమలలోనో, ఇతరవృత్తులలోనో కాయకష్టము చేసి ఏదోవిధముగ జీవనోపాధిని సంపాదించుకొని వారివారి కుటుంబములయు, బంధువులయు, స్నేహితులయు మధ్య కాలము గడుపుచుండువారు. అట్లు కాలక్షేపముచేయుటయే వారి అభిమతము. ఇతరుల మూలమున ఎట్టి భయముగాని, ప్రమాదముగాని లేకుండ జీవించుటతప్ప వారు కోరునది మరొకటి లేదు. కాని వీరిపై పెత్తనము, అధికారము వహించుచుండు నూటికి ఒక్కరు ప్రతిదేశమందు ఉన్నారు. ఇట్టివారికి నాయకు లన్న పేరు గలదు. నాయకవర్గములో చేరినవారు పలుకుబడి గలవారు. వారిలో కొందరు మేధావులు; ఎక్కువ తెలివితేటలు గలవారు. జట్టుకు జట్టుకు ముడిపెట్టి ఇతరులను తైతక్కలాడించగలవారు. ప్రపంచములో ప్రస్తుతము కనుపించుచుండు అశాంతికంతకు వీరి మనోభావములే ప్రధానకారణములు. సామాన్యజనులకు స్వతహాగా నిశితమైన ఆలోచనా శక్తిజ్ఞానము లేదు. వారివారి వృత్తులకు సంబంధించిన జ్ఞానమును, వారు నివసించు గ్రామములయు, ప్రాంతములయు, ఇరుగుపొరుగు వారియు పరిస్థితులను గురించిన జ్ఞానమును వారికున్నదే గాని దూరవిషయముల గురించినట్టియు, క్లిష్టములగు రాజకీయ ఆర్థికవిషయములనుగురించినట్టియు జ్ఞానము వారికి లేదు. నాయకు లేలాగు చెప్పిన ఆలాగు నడుచుకొనుట వారికి సహజము. మానవకోటిలో నాయకవర్గము, అనుచరవర్గము అను ఈ వర్గవిభేదము తప్పనిది. ఎన్ని భేదములు నశించినను ఈ భేదముమాత్రము శాశ్వతము. ఆ కారణముచేత నాయకవర్గములో చేరిన ఏ కొద్దిమందో ప్రతిదేశమందును ప్రజలచేత ఇష్టమువచ్చినట్లు నాటకమాడించుటకు వీలగుచున్నది. అధికారమునకుగాను, పలుకుబడికిగాను పోటీ చేయు నాయకులమూలముననే భయరహితమగు జీవితము ప్రజాసామాన్యమునకు దుస్సాధ్యమగుచున్నది. పూర్వకాలమున మతమును సాధనముగ తీసుకొని నాయకులు నాయకత్వమును వహించియుండిరి. ప్రస్తుతయుగములో మతమున కుండిన ప్రాధాన్యమంతయు సన్నగిల్లి పోయినది. ఐహికసౌఖ్యమునకాధారమైన ఆర్థికసంపదను సమకూర్పగలమని చెప్పుకొనువారు నాయకు లగుచున్నారు. అట్టివారే అధికారములోనికి వచ్చుట మామూలైనది. యుద్ధములన్నిటికి వారే కారణభూతులు.

నాయకులు-అనుచరులు : యుద్ధసన్నాహము

ప్రస్తుతము భూగోళమంతను ప్రదక్షిణము చేయువానికి గోచరించు విశేష మెట్టిది? సామాన్య జనులు యథాప్రకారము వారివారి పనులను చేసుకొనుచునే ఉన్నారు. కాని అధికారములో నుండు పరిపాలకులమాత్రము అనేక దేశములలో యుద్ధసన్నా

హము చేయుటయంకే కాలముగడుపుచున్నారు. యుద్ధము కొద్దినెలలలోనే రాబోవుచున్న దను నిశ్చయము గలవారై, అట్టి యుద్ధములో జయము సంపాదించుటకు కావలసిన వస్తుసామగ్రిని, అర్థబలమును, అంగబలమును సమకూర్చుకొనుచున్నారు. అజ్ఞాతవాసము ముగిసినతర్వాత కౌరవులు, పాండవులు పద్దెనిమిది అక్షౌహిణుల బలమును సంపాదించుకొనుటకు ఎట్టి ప్రయత్నముల జేయుచుండిరో అట్టి ప్రయత్నములలోనే అగ్రరాజ్యములవారు ఇప్పుడు మునిగియున్నారు. కురుక్షేత్రమందు జరిగిన యుద్ధములో పద్దెనిమిది అక్షౌహిణులలోని లక్షలకొలది సైనికులు ప్రాణములు గోల్పోయిరి; వారి భార్యలు అనాథలైరి; వారి పిల్లలు పితృవిహీనులైరి. దీనిమూలమున ఎవరు ఎట్టి గొప్పఫలమును సాధించగలవారైరి? ఇదేవిధముగ ముప్పైసంవత్సరములమధ్య రెండు ప్రపంచయుద్ధములు జరిగినవి. ఎందరో ప్రాణములను గోల్పోయిరి; ఎందరో వికలాంగులైరి; సుక్షేత్రములు ఊసరక్షేత్రములైనవి; పరిశ్రమలు నశించినవి. ద్వాదశవర్షక్షామమేగాక శాశ్వతక్షామముచే మానవకోటి అంతయు బాధపడవలసిన స్థితిలోనికి వచ్చిరి. కాని మూడవ ప్రపంచయుద్ధమునకు అగ్రరాజ్యములవారందరు దారి తీయుచున్నారు. మధ్యరాజ్యములవారు, అల్పరాజ్యములవారు నిస్సహాయులై ఏదో ఒక పక్షమును అవలంబించవలసిన స్థితిలో నున్నారు. ఇది మనము తెచ్చిపెట్టుకొనుచుండు ప్రళయమేగాని వేరొకటి కాదు. కాని దీనిని రాకుండచేయుటకు ఎవరుకూడ ఎట్టి ప్రయత్నము చేయకపోవుటయేగాక ప్రళయశక్తులను ప్రోత్సహించుటలోను, బలపరచుటలోను నిమగ్నులై ఉన్నారు. ఇదియే ధూమ్రప్రదక్షిణము చేయువానికి కనిపించుచుండు విపరీతము.

అమెరికా యుద్ధసన్నాహము

ప్రస్తుతకాలమున ఐశ్వర్యవంతములగు దేశములన్నిటిలో అమెరికాదేశము అగ్రస్థానమును వహించియున్నది. అక్కడి ప్రజల కుండునంత ధనము మరే దేశమువారికి లేదు. కాని ఏప్రిలు నెలలో అచ్చటి పరిపాలకుల, అధికారవర్గములోనివారు చేసిన పని ఎట్టిది! ఏప్రిలు ౧ లేదీనాడు ట్రూమన్ అధ్యక్షుడు ౩౦౦ కోట్ల డాలర్ల విలువగల సైన్య పరికరములను సమకూర్చుటకు నిశ్చయించెను. ఇదిగాక ౧౯౪౯ లో ఖర్చుపెట్టుటకు ఇదివరలో నిశ్చయించుకొన్న మొత్తమునుండి ౩౪ కోట్ల డాలర్లను ఈ సంవత్సరమే సైనిక సామగ్రికై ఖర్చుపెట్టవలసినట్లు కాంగ్రెసుకు (శాసనసభకు) సందేశము పంపెను. ౨ లేదీనాడు రక్షణశాఖాధ్యక్షుడు దేశములో ౧౯ మొదలు ౨౬ సంవత్సరముల వయస్సుగల యువకులందరు నిర్బంధసైనికశిక్షను పొందవలసినట్లుగ విశదపరచెను. ౧౩ లేదీనాడు ట్రూమన్ అధ్యక్షుడు కాంగ్రెసుకు ఇంకొక సందేశము పంపుచు రష్యావారికి అమెరికావారికంటె రెండింత లెక్కువగ జలాంతర్గాములును, పంద్రెండురెట్లు ఎక్కువగ విమానబలమును ఉన్నవనియు, వారితో తులతూగగల బలమును అమెరికావారు సంపాదించుటకు వెంటనే ౨౩౪ కోట్ల డాలర్ల ద్రవ్యమును ఖర్చుపెట్టుట తప్పదనియు చెప్పగా, కాంగ్రెసువారు అంతటి ద్రవ్యమును జలాంతర్గాములకొరకును, విమానములకొరకును ఖర్చుపెట్టుటకు సమ్మతించిరి. ౨౦ లేదీనాడు ఈ అధ్యక్షుడే నౌకానిర్మాణమునకై ఆరుకోట్ల డాలర్లను కోరెను. ౨౨ లేదీనాడు రక్షణశాఖాధ్యక్షుడు కాంగ్రెసులో మాట్లాడుచు, రాబోవు మూడు సంవత్సరముల మధ్య దేశమును రక్షించుటకై ౪౫౦౦ కోట్ల డాలర్ల ద్రవ్యము కావలయునని అంచనా వేసెను. అధికారవర్గములోని అమెరికనులేగాక, పలుకుబడి గల అనధికారులుకూడ యుద్ధసన్నాహములనుగురించియే మాట్లాడుట పరిపాటి అయ్యెను. అటంలాంటిక్ సభ కొకప్పుడు అధ్యక్షుడుగ నుండిన బరూక్ అను ప్రసిద్ధపురుషుడు శాసనసభలో మాట్లాడుచు "ఐరోపాఖండవాసులకు మార్షల్ ప్రణాళిక ననుసరించి మనము చేయదలచిన సహాయము వ్యర్థము కాకుండుటకు వారికి సైనిక సహాయము చేయుటకూడ అవసరము. అందుచేత మన సైనికబలమును ఎంతో వృద్ధిచేసుకొనవలసియున్నది." అని చెప్పెను. రెండవ ప్రపంచయుద్ధములో పశ్చిమ రంగమందలి సైన్యము లన్నిటికి అధిపతిగ నుండిన ఐసన్‌హోవరుకూడ ఇదే శైలిలో మాటలాడుచు

"యుద్ధము ప్రారంభమైన తర్వాత మొదటి రెండు నెలలలోనే మనకు జయము లభించునట్లు మనము యుద్ధ సన్నాహము చేసుకొనవలెను. అట్లు జరుగనియెడల మనకు జయము లభించుట సందేహము" అని చెప్పెను. ఈలాటి అభిప్రాయములను గత నెలలో వ్యక్తపరచిన వారు అమెరికన్ నాయకులుమాత్రమే కాదు. అమెరికాసహాయము లేనిది రషియాను ఓడించుట సాధ్యము కాని పని అనియు, రషియాను ఓడించినగాని పాశ్చాత్యుల నాగరికత నిలబడజాలదనియు విశ్వసించు ప్రముఖులనేకులు ఇట్లే మాటలాడుట మామూలగుచున్నది. బెల్జియందేశమునకు ప్రధానియు, కొంత కాలముక్రిందటి ఐక్యరాజ్యసమితికి అధ్యక్షుడును అయిన స్పాక్ కనడాలో ఈమధ్య ఈ ధోరణిలోనే మాట్లాడెను. దక్షిణఆఫ్రికాప్రధానియగు స్మట్సుకూడ ఇట్టి అభిప్రాయములనే వ్యక్తపరచెను. రషియాతో యుద్ధము తప్పదన్న అభిప్రాయము కలవారగుటచేతనే అమెరికాప్రభుత్వమువారు వారి దేశమునకును, రషియాలో ఒకభాగమగు సైబేరియాకును మధ్యనుండు అల్యూషియన్ ద్వీపములలోను, అలాస్కారాష్ట్రమందును సైనిక నావిక వైమానికశిబిరములను బలపరచుకొనుచున్నారు. ఇట్లే మధ్యధరాసముద్రములో స్పెయిన్ దేశమందును, బ్రిటిష్‌వారి అధీనమందుండు మాల్టాద్వీపమందును సైనికశిబిరములను స్థాపించుకొను ప్రయత్నములో నున్నారు. గనుక యుద్ధసన్నాహమొక్కటియే ప్రస్తుత అమెరికా ప్రభుత్వము వారికి పరమలక్ష్యముగ నున్నదని స్పష్టమగుచున్నది.

ఐరోపాకు సహాయము

ఐరోపా ఖండములోని పదహారుదేశములవారికి పదినెలలుగ అమెరికావారు చేయనెంచిన ఆర్థికసహాయము ఏప్రిలు 3 తేదీన శాసనరూపము ధరించెను. రాబోవు నాలుగుసంవత్సరములమధ్య వారు ఇందుకై సుమారు ౬౦౦ కోట్ల డాలర్లను ఖర్చుపెట్టి, ఆ దేశములవారికి కావలసిన ఆహారపదార్థములు, బొగ్గు, ఉక్కు, యంత్రసామగ్రి మొదలైన ద్రవ్యములను సరఫరాచేయుటకు నిశ్చయించుకొని ఉన్నారు. ఇట్టి సహాయములేక యూరపుఖండవాసులు ప్రస్తుతము అనుభవించుచుండు క్లిష్టపరిస్థితులనుండి విముక్తులగుట సాధ్యము కాదని విషయజ్ఞులందరు అభిప్రాయపడి ఉన్నారు. ఈ దేశములయొక్క ఆర్థికపరిస్థితులను విమర్శించుటకు ఏర్పరచబడిన ఒక కమిటీవారు నాలుగు సంవత్సరములతర్వాతకూడ ఈ పరిస్థితులు చక్కబడజాలవనియు, మరికొన్ని సంవత్సరములకాలము అమెరికావారు ఇట్టి సహాయము చేయుటకు సంసిద్ధులుగ నుండవలెననియు వారి నివేదికలో స్పష్టపరచిరి. అనగా ఈ దేశములకును, అమెరికాకును శాశ్వతమైన ఆర్థికసంబంధము ఏర్పడనున్నదని మనము గ్రహించవలెను. పదిమాసములక్రిందట అమెరికా మంత్రియగు మార్షలు ఈ సహాయమునుగురించి మొట్టమొదట ప్రశంసించినపుడు కష్టములో నున్న ఐరోపావారికి సహాయము చేయుట పారమార్థికధర్మమను ఉద్దేశముతో నుండెను. కాని ఈ పదిమాసములమధ్య రషియాకును, అమెరికాకును మధ్య ద్వేషభావము విపరీతమైన కారణముచేతను, రషియావారి అధికారము, పలుకుబడి పశ్చిమఐరోపాదేశములలోనికి ప్రాకనిచ్చుకూడ దను అభిప్రాయము అమెరికా ప్రభుత్వవర్గములలో నాటుకొన్న కారణముచేతను ఆర్థికసహాయము పారమార్థికముగగాక రషియాను ఓడించుటలో ఉపయోగకారిగ నుండగలదను అభిప్రాయము బలపడెను. ప్రస్తుతము ఈ సహాయవిషయములో అమెరికావారు చూపుచుండు ఉత్సాహమున కంతకు ఇదియే ప్రధానకారణము. రషియాపై వారు చేయుచుండు యుద్ధసన్నాహమున కిది యొక ప్రధానాంగము. దీని మూలమున పశ్చిమయూరపు దేశములలోనివారు అమెరికాకు మిత్రులగుదురనియు, ఆ దేశములలో అమెరికావారికి కావలసిన శిబిరములు లభించు ననియు వారి విశ్వాసము.

అమెరికాసహాయము శాసనరూపమును, కార్య రూపమును ధరించెనని తెలియగనే పదహారుదేశముల ప్రతినిధులు ప్యారిసునగరములో సమావేశమై ఆ సహాయమును చక్కగ వినియోగించుటకు కావలసిన కార్యనిర్వాహకవర్గము నొకదానిని ఏర్పరచుకొనిరి. ఈ వర్గమువారు అప్పుడప్పుడు సమావేశమగుచు ఏదే

దేశమునకు ఏలాటి సహాయము ఎప్పుడెప్పు డవసరమో నిర్ణయించుచుందురు. ఈ పదహారుదేశముల మధ్య ఆర్థిక సంబంధము బలపడుటకును, అవసరమైనయెడల ఇవన్నియు కలిసి రష్యాపై యుద్ధము చేయుటకును ఇది యొక సాధనము.

పశ్చిమయూరపుసమాఖ్య

ఈ పదహారుదేశములలో ఇంగ్లండు, ఫ్రాన్సు, బెల్జియం, హాలెండు, లక్సెంబర్గు అను అయిదుదేశములు ఇదివరలోనే ఒక "పశ్చిమయూరపుసమాఖ్య" అను పేరుతో ఆర్థికవిషయములందేగాక రక్షణవిషయము లందుకూడ కలిసిపనిచేయుటకు తీర్మానించుకొని యున్నవి. ప్రస్తుతము ఈ అయిదుదేశముల ప్రతినిధులు లండనులో అప్పుడప్పుడు సమావేశమగుచు, వారి సైనిక నావిక వైమానిక బలము లన్నియు యుద్ధకాలమందు ఏలాగు కలిసిపనిచేయవలసి యుండునో ఆలోచించుచున్నారు. ఈ సమాఖ్య జయప్రదమగుటకు అమెరికా వారి సైనికసహాయము అత్యవసరమన్న అభిప్రాయమును వీరు వ్యక్తపరచిరి. అమెరికాప్రభుత్వమువారు వారితో ఏకీభవించి, వారికి కావలసిన సైనికసామగ్రిని సరఫరాచేయుటకు సిద్ధపడుచున్నారు. ఇదికూడ అమెరికావారు రష్యావారితో రానున్న యుద్ధములో జయము సంపాదించుటకు చేయుచుండు సన్నాహములో ఒక ప్రధానమైన అంగము.

ఇటలీ ఎన్నికలు

ఈ యుద్ధసన్నాహముల మూలమునకే ఏప్రిలు మాసములో ఇటలీ దేశమందు జరిగిన ఎన్నికలకు ఎక్కువ ప్రాధాన్యము గలిగిన దన్న మాట చదువరులకు తెలిసియున్నది. ఇటలీలో అయిదుకోట్ల జన మున్నారు. ఇది దక్షిణయూరోపులో మధ్యధరాసముద్రములోనికి చొచ్చుకొనివచ్చి, ఆ సముద్రతీరము యొక్క మధ్యభాగముగ నుండు దేశము. ఆసముద్రమున గత రెండువందల సంవత్సరములుగా బ్రిటిష్‌వారి ఆధిపత్యము స్థాపింపబడియుండెను. ఇప్పుడు వారు బలహీనులగుటచేత వారి ఆధిపత్యము తగ్గిపోయెను. ఆ ఆధిపత్యమునకై రష్యావారును, అమెరికావారును పోటీ చేయుచున్నారు. ఇటలీగాక, ఈ మధ్యధరాసముద్ర తీరమందు స్పెయిన్, ఫ్రాన్సు, ఆల్బేనియా, యూగోస్లేవియా, గ్రీసు అను దేశము లున్నవి. వీటిలో యూగోస్లేవియా ఆల్బేనియా దేశములు కమ్యూనిస్టు ప్రభుత్వమునకు లోబడి, రష్యావారి అనుచరవర్గములో చేరినవి. అవి మధ్యధరాసముద్రమునకు కొంత దూరములో నుండుటచేత వాటిద్వారా ఆ సముద్ర మందు ఆధిపత్యము సంపాదించుట రష్యాకు సాధ్యము కాలేదు. స్పెయిన్ ఫాసిస్టుప్రభుత్వమునకు లోబడి రష్యాకు విరోధివర్గములోనుండు దేశము. ఫ్రాన్సులో కమ్యూనిస్టుపక్షమునకు కొంత బలమున్నను ప్రభుత్వము వారి చేతులలో లేదు. అందుచేత ఫ్రాన్సు ద్వారా మధ్యధరాధిపత్యమును సంపాదించుటకు రష్యావారికి వీలులేకపోయినది. గ్రీసులో కూడ కమ్యూనిస్టులు అధికారములో లేరు. వారికి రహస్యముగను, పరోక్షముగను సహాయము చేసి, ప్రభుత్వమువారితో అంతర్యుద్ధము నొకదానిని రష్యావారొకసంవత్సరముగ సాగించుచున్నను వారి కింకను విజయము లభించలేదు. అమెరికావారి సహాయముతో గ్రీసు ప్రభుత్వము వారు కమ్యూనిస్టులవలన కలుగుచుండు ప్రమాదమునుండి తప్పించుకొనుచున్నారు. గనుక ఇక మిగిలిపోయినది ఒక ఇటలీదేశమే. ఏప్రిలులో జరిగిన ఎన్నికలకుంద కమ్యూనిస్టుపక్షము జయము సంపాదించుటకు కావలసిన ద్రవ్యసహాయమును రష్యావారెంతో చేసిరి. కాని, కమ్యూనిస్టులకు ఎదిరిపక్షమువారగు క్రిశ్చియన్ డెమోక్రాటులు గెలుచుటకు అమెరికా వారును, బ్రిటిష్‌వారును అనేకసాధనములను ఉపయోగించిరి. తుదకు ఎన్నికలలో క్రిశ్చియన్ డెమోక్రాటుపక్షము వారే అధికసంఖ్యాకులుగ ఎన్నుకొనబడిరి. ఇటలీలో ఏర్పడబోవు ప్రభుత్వము ఈపక్షమువారిదే. ఈ విజయము నిజముగ అమెరికావారికి విజయమని చెప్ప వలసియున్నది. రష్యాసామ్రాజ్యాధికారమును, తద్వారా కమ్యూనిస్టుపక్షమువారి ప్రభుత్వము వ్యాపించకుండునట్లు చేయుటకు కంకణముకట్టుకొన్న అమెరికావారికి ఇటలీలోని ఎన్నికలలో కమ్యూనిస్టుల

ఓడిపోవుట ఎక్కడ లేని సంతోషమును కలిగించినది. ఇటలీ పశ్చిమయూరపుసమాఖ్యలో చేరి, రషియాను ఎదుర్కొనుటలో ఒక ప్రధానదేశముగ నుండునని చెప్పవచ్చును. రషియాపై యుద్ధసన్నాహము చేయుచుండు అమెరికాయొక్క మిత్రవర్గములో ఇటలీకూడ చేరినది. ఇదియే ఇటలీఎన్నికలకు గల ప్రాధాన్యము.

అట్లాంటిక్ సమాఖ్య

పశ్చిమయూరపుసమాఖ్యలో కనడా దేశము కూడ చేరుట అవసరమను అభిప్రాయము కొందరు వ్యక్తపరచియున్నారు. ఇది జరిగినను జరుగకపోయినను, కనడా అమెరికాను అనుసరించు దేశములలో నొకటియగుటచే రషియాకును, అమెరికాకును యుద్ధము సంభవించినయెడల అది అమెరికాపక్షమున చేరి యుద్ధము చేయుట తప్పదు. గనుక ప్రపంచపటముయొక్క సహాయముతో ఈవిషయముల నన్నిటిని పరిశీలించినయెడల అట్లాంటిక్ మహాసముద్రమునకు పశ్చిమతీరము నుండు అమెరికాఖండములోని దేశములు దాని తూర్పుతీరమునందుండు ఐరోపాఖండదేశములు ఒక గుంపుగ కూడి రషియాపైకి యుద్ధము ప్రకటించు పరిస్థితులు ఏర్పడినవని స్పష్టమగును. గత పదిమాసముల నుండి అమెరికావారు, బ్రిటిష్‌వారు పన్నుచుండిన పన్నాగముల ఫలిత మిదియే.

కమ్యూనిష్టులపై అమెరికావారి ప్రచారము

ఇట్టిఫలితము సమకూరుటకు కమ్యూనిష్టుపక్షమునకును, కమ్యూనిష్టు తత్వమునకును విరోధముగ అమెరికావారును, బ్రిటిష్‌వారును చేయుచుండు ప్రచారము ఒక ప్రధానకారణమని గ్రహింపవలెను. ప్రపంచములో ఏప్రాంతమందుగాని ఏవిధమైన అల్లరులు జరిగినను వాటి కన్నిటికి కమ్యూనిష్టులు, వారి తత్వము ప్రధానహేతువు అని అమెరికావారు, బ్రిటిష్‌వారు ప్రకటించుట మామూలైనది. కమ్యూనిష్టులు స్వదేశాభిమానము లేనివారనియు, రషియావారెట్లు చెప్పిన వారట్లు నడుచుకొనువారనియు, దేశమందు ఏదోఒక విధమైన అల్లరులను లేవదీసి సంక్షోభము కలిగించి, అధికారములోనికి వచ్చుటయే వారి సంకల్పమనియు ఈ ప్రకటనలయొక్క ధోరణి. సాధారణముగ ప్రపంచములోని వార్తాపత్రికలకు వార్తలను పంపువారు అమెరికావారు, బ్రిటిష్‌వారు. వారు పంపువార్తలు ఈ ధోరణిలోనే యుండును. దీనికి ఎన్నో దృష్టాంతము లున్నవి. గత మాసములో అనేక దేశములందు కొద్దిగనో, గొప్పగనో అల్లరులు జరిగినమాట వాస్తవమే. అట్టి అల్లరులు దక్షిణఅమెరికాలోని బ్రెజిల్, కొలంబియా, వెనిజ్వెలాదేశములందును, మధ్యఅమెరికాలోని కోస్టరికాయందును, జపానులోను, తూర్పుజావాలోను, బర్మాయందును, సింహళద్వీపమందును జరిగినట్లు వార్తాపత్రికలు ప్రకటించినవి. ఈ అల్లరులలో ఎంతో నష్టము సంభవించెను. కొన్నిచోట్ల పట్టణములు, పల్లెలు మంటగలసెను. భవనములు వినాశమయ్యెను. అనేకులు ప్రాణములు కోల్పోయిరి. ఆస్తినష్టము తప్పలేదు. సమ్మెలద్వారా పరిశ్రమలు స్తంభించెను. కాని దీని కంతకు కారకు లెవ్వరు అను విషయములో కమ్యూనిష్టులే కారకులని వార్తాపత్రికలు ప్రకటించినవి. నిజము బ్రహ్మకే తెలియవలెను. కాని ఇట్టి ప్రకటనలుమాత్రము వార్తాపత్రికలలో ప్రచురణములగుచుండుటచేత, ప్రపంచమందలి అల్లరుల కన్నిటికి కమ్యూనిష్టులే కారణమనియు, కమ్యూనిష్టుతత్వము నశించినగాని ప్రపంచశాంతి కలుగదనియు అనేకదేశములలో అభిప్రాయము వ్యాపించుట ఒక వింత కాదు.

రషియావారి చర్యలు

అమెరికా చేయుచుండు యుద్ధసన్నాహమునకు ప్రత్యామ్నాయముగ రషియావారు ఏప్రిలుమాసమందు ఫిన్లాండుదేశముతో సైనికసంధిని చేసుకొనిరి. ఇదిగాక జర్మనీకి ప్రధానపట్టణమగు బర్లిన్‌నగరము నందుండి బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచిఅధికారులను, సైన్యములను తరిమివేయుటకు కావలసిన పరిస్థితులను కల్పించిరి. ప్రస్తుతము బర్లిన్ నాలుగుభాగములుగ విభజింపబడి, ఒక్కొకభాగము ఒక్కొకరి అధీనమందున్నది. కాని బర్లిన్ తూర్పుజర్మనీలోని పట్టణము.

తూర్పుజర్మనీ అంతయు రషియావారి అధీనమం దుండు భాగము. పశ్చిమజర్మనీ బ్రిటిష్, అమెరికా, ఫ్రెంచివారి అధీనమం దున్నది. బర్లిన్‌నుండి తూర్పు జర్మనీమీదుగ నూరుమైళ్లదూరము ప్రయాణముచేసిన గాని బర్లిన్‌లోని బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికావారు పశ్చిమజర్మనీలోని తమతమ భాగములకు వచ్చుటకు వీలులేదు. కాని ఈ నూరుమైళ్ల మార్గము రషియావారి అధీనమందున్నది. గతమాసములో ఈ మార్గముమీదుగ బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికావారు బర్లిన్‌నుండి ప్రయాణముచేయు విషయములో రషియావా రనేక నిర్బంధముల గావించిరి. ఈ పరిస్థితులలో వీరు బర్లిన్‌లో ఉండుట సాధ్యముకాని పని. కాని రషియావారు కల్పించిన నిర్బంధముల మూలమున వీరు బర్లిన్‌పట్టణమును ఖాళీచేసి, పశ్చిమజర్మనీకి వచ్చుట వీరి ప్రతిష్ఠకు భంగకరము. బర్లిన్‌ను తమ వశములో ఉంచుకొనుటకు వీరు రషియావారిపై యుద్ధము ప్రకటించుటతప్ప మార్గాంతర మేమియు లేదు. కాని యుద్ధము ప్రకటించుటకు వా రింకను సంసిద్ధులగుట లేదు. వారిది ప్రస్తుతము బహుసందిగ్ధావస్థగ నున్నది. తూర్పుజర్మనీని ప్రత్యేకరాజ్యముగ నిర్మాణముచేసి, బర్లిన్‌లో జర్మన్‌కమ్యూనిస్టుప్రభుత్వము నొకదానిని స్థాపించి, అదియే జర్మనీ కంతకు నిజమైన జాతీయ ప్రభుత్వమని ప్రకటించుటకు రషియావారు ఉద్దేశించియున్నారు. ఇట్టి పరిణామము కొద్ది రోజులలోగాని, వారములలోగాని జరుగవచ్చును.

పాలెస్టయిన్

ఇంతవరకు అమెరికాఖండమందుండి అట్లాంటిక్‌మహాసముద్రముమీదుగ పశ్చిమయూరపుదేశములకును, ఇటలీకిని, రషియాకును మనము ప్రయాణము చేసితిమి. భూప్రదక్షిణములో ఇది ఒక ప్రధానఘట్టము. ఇప్పటినుండి పాలెస్టయిన్‌దేశమునకు ప్రయాణమైన రౌడీల అప్పుట చూడవలసిన దృశ్యము లెన్నియో కనుపించును. గత మూడుమాసములనుండి ఆ చిన్నదేశములో నివాసముచేయుచుండు ఏడులక్షల యూదులకును, పదునాలుగులక్షల అరబ్బీలకును మధ్య భయంకరమగు అంతర్యుద్ధము జరుగుచున్నది. దేశమును విభజించి, యూదురాజ్యము నొకదానిని, అరబ్బీరాజ్యము నింకొకదానిని కల్పించుటయే ఈ రెండు జాతుల మధ్య ఏర్పడిన వివాదమును పరిష్కరించుటకు సాధనమని గత నవంబరులో ఐక్యరాజ్యసమితివారు తీర్మానించిరి. ఈ విభజనకు యూదులు అంగీకరించిరిగాని అరబ్బీలు అంగీకరించలేదు. గత ముప్పై సంవత్సరములనుండి బ్రిటిష్‌వారు ఈ దేశమునకు పాలకులుగ నుండిరి. ఇండియాలో హిందూమహమ్మదీయుల విషయమున వారనుసరించిన భేదోపాయమునే ఇచ్చటకూడ వారనుసరించి, కొంతకాలము యూదులకు ప్రియమిత్రులుగను, మరికొంతకాలము అరబ్బీలకు మిత్రులుగను నటించిరి. ఇండియాను వదలుకొనవలసిన పరిస్థితులు ఏర్పడినట్లే పాలెస్టయినును వదలుకొనవలసిన పరిస్థితులు కూడ బ్రిటిష్‌వారికి ఏర్పడి, తుదకు మే ౧౫ తేదీకి తమ అధికారమును వదలుకొనునట్లును, ఆగష్టు ౧ తేదీకి తమ సైన్యముల నన్నిటిని ఉపసంహరించుకొనునట్లును వారు తీర్మానించుకొనిరి. బ్రిటిష్‌వారు వెళ్లిపోయినతర్వాత పాలెస్టయినును పాలించు అధికారము ఎవరికి ఉండవలె ననువిషయములో యూదులు తమకు చెందవలసిన భాగమందు తమకును, తక్కిన భాగమందు అరబ్బీలకును ఉండవలెనని నిశ్చయించుకొని, ఆ నిశ్చయమును ఆచరణలోనికి తెచ్చుకొనుటకు యుద్ధ మారంభించిరి. మూడు మాసములుగ ఈ యుద్ధము జరుగుచునేయున్నది. మే ౧ తేదీకిగాని బ్రిటిష్‌వారి అధికారము తొలగదు. ప్రస్తుతము వారిదే అధికారము. కాని కలకత్తా, నౌకాలి, లాహోరు మొదలగు ప్రదేశములలో ౧౯౪౬ లో అల్లరులు ప్రారంభమైనప్పుడు ఉదాసీనులై చూచుచుండినట్లు బ్రిటిష్‌వారు ప్రస్తుతము పాలెస్టయినులో ఉదాసీనులుగ నున్నారు. పాలెస్టయినులో ఉన్న అరబ్బీలు ఒంటరిగ యూదులతో యుద్ధము చేసి గెలుచుట సాధ్యముకాదు. కాని చుట్టుపట్లనుండు ఆ అరబ్బీరాజ్యములు—ఈజిప్టు, ఇరాక్, ట్రాన్సుజార్డన్, లెబనన్, సిరియా, సావూద్ అరేబియా — వారికి సహాయము చేయుటకు సిద్ధపడియున్నారు. ఇప్పుడు

ట్రాన్సుజార్డన్ రాజు యూదులపై యుద్ధము ప్రకటించి, పాలెస్టయిన్ ప్రవేశించినట్లును, కొద్ది రోజులలో తక్కిన అరబ్బీరాజ్యముల సైన్యములు అతనితో కలియునట్లును తెలియుచున్నది. గనుక ఈ అంతర్యుద్ధము మధ్యప్రాచ్యములో చాల భాగము లోనికి వ్యాపించగలదు.

పుణ్యక్షేత్రములు

క్రైస్తవులకు, యూదులకు, మహమ్మదీయులకు పావనములైన జెరూసలం మొదలైన పుణ్యక్షేత్రములు పాలెస్టయినులో ఉన్నవి. ఈ యుద్ధములో అవి కూడ వినాశమగు సూచనలు కనుపించుచున్నవి. యుగయుగములుగ పుణ్యక్షేత్రములుగ పరిగణింపబడు పట్టణములను, దేవాలయములను నాశముగావించుటకైనను ఉభయపక్షములవారు సంసిద్ధులుగ నున్నారేగాని, యుద్ధమును విరమించి రాజీమార్గమున వారి వివాదమును పరిష్కరించుటకు వారికి బుద్ధి పుడుకలేదు. నాలుగుకోట్ల జనముతో కూడిన ఏడు అరబ్బీరాజ్యముల మధ్య పదిపదిహేనులక్షల యూదులతో కూడిన ఒక యూదురాజ్యము స్థాపింపబడినంతమాత్రమున అరబ్బీలు పొందు నష్టముగాని, వారికి కలుగు ప్రమాదముకాని ఎట్టిది లేదు. కాని మతదురభిమానము, జాతిద్వేషము వారిని పట్టి పీడించుచున్నది. నాయకుల అధికారకాంక్ష కూడ దీని కొక ప్రబలకారణము.

ఐక్యరాజ్యసమితి మహాసభ

దేశవిభజనము జరుగుటయే మంచిమార్గమని సూచించిన అమెరికావారు వారి అభిప్రాయమును ఇప్పుడు మార్చుకొని, ఈవిషయమును తిరిగి ఆలోచించుటకై ఐక్యరాజ్యసమితిమహాసభను సమావేశపరచియున్నారు. ప్రస్తుతము న్యూయార్కులో దీనిని గురించి మహాసభవారు ఆలోచించుచున్నారు. దేశవిభజనమునకు బదులు, దేశమంతయు కొన్ని సంవత్సరములకాలము ఐక్యరాజ్యసమితియొక్క ధర్మకర్తృత్వమున పాలింపబడవలెనని అమెరికావారొక తీర్మానమును ప్రతిపాదించియున్నారు. కాని యూదులు దీనికి సమ్మతించుటలేదు. అరబ్బీలుకూడ ఆమోదింతురో లేదో తెలియదు. రష్యావారు దీనికి విరోధులుగ నున్నారు. ఇదివరకు మహాసభవారు గావించిన దేశవిభజనతీర్మానమే సమంజసమైనదనియు, దానిని ఆచరణలో పెట్టుటకే మహాసభవారు ప్రయత్నించవలెననియు, ఆతీర్మానమును ఆచరణలో పెట్టుటకు సామర్థ్యములేని సభవారు ధర్మకర్తృత్వతీర్మానమునుమాత్రము ఎట్లు ఆచరణలో పెట్టగలరు అనియు రష్యావారి వాదము. గనుక సభవారు ఎట్టి తీర్మానము చేసినను యూదులు, అరబ్బీలు ఇద్దరు కలిసి దానికి సమ్మతించు పరిస్థితులు అగుపడుట లేదు. వారుభయులు సమ్మతించని తీర్మానమును ఆచరణలో పెట్టుటకు ఐక్యరాజ్యసమితివారొక గొప్ప సైన్యమును పాలెస్టయినుకు పంపవలెను. అట్టి సైన్యము సమితికి లేదు. దానిని సమకూర్చు సందర్భములో రష్యావారికిని, అమెరికావారికిని తీవ్రమైన అభిప్రాయభేదము లున్నవి. దేశవిభజనమే మంచిదని వాదించు యూదులును, రష్యావారును కలిసి అట్టి విభజన పనికిరాదని వాదించు అమెరికావారిపైనను, అరబ్బీలపైనను యుద్ధమునకు దిగినయెడల మూడవ ప్రపంచయుద్ధము మధ్యప్రాచ్యములో ప్రారంభమైనట్లే.

భరతఖండము

పాలెస్టయినునుండి తూర్పుగ ప్రయాణము చేసి భరతఖండమును ప్రవేశించిన యెడల ఇచ్చట గమనించదగిన విషయములు కొన్ని గోచరించును. భరతఖండములో ఇప్పుడు ఏర్పడియుండు నెహ్రూ ప్రధాని ప్రభుత్వము శైశవదశయం దున్నది. దానియొక్క ప్రధానలక్షణము శైశవ మన్న మాటను మనము మరువరాదు. దంపతుల కెవరికైన లేకలేక పురుషసంతానము కలిగినప్పుడు అతడు వంశమునకు ఐశ్వర్యమును, అభివృద్ధిని చేకూర్చుగలవాడైనను పుట్టినవెంటనే అతడట్లు చేయలేనివిధమున, వందల సంవత్సరములక్రిందట మనము కోల్పోయిన స్వాతంత్ర్యము మన కిప్పుడు లభించిన కారణమున వెంటనే స్వాతంత్ర్యఫలముల నన్నిటిని మనము సంపాదించుటగాని, అనుభవించుటగాని సాధ్యముకాని పని. అందుచేత ప్రభుత్వమును విమర్శించువారు కొంత దూరదృష్టితో విమర్శించుట

మంచిది. తొందరపడి ప్రభుత్వము చేయు పనులన్నిటిని ఖండించుటగాని, చేయవలసిన పనులను అది ఇంకను చేయలేదని ఈరాలపాడుటగాని న్యాయము కాజాలదు.

మతసంస్థలు : రాజకీయములు

ఏప్రిలు మాసములో నెహ్రూప్రభుత్వమువారు చేసిన పనులలో నాలుగు ముఖ్యముగ గమనించవలసి యున్నవి. మతమును, కులమును ఆధారముగ చేసుకొని రాజకీయ విషయములందు పనిచేయదలచిన సంఘములను శాసనములద్వారాను, మంత్రివర్గముల ఉత్తరువుల ద్వారాను రద్దుచేసినగాని దేశమందు ఐక్యభావము, జాతీయభావము ఏర్పడజాలవను తీర్మానమును ప్రభుత్వమువా రామోదించిరి. మతమునకును, రాజకీయములకును ముడిపెట్టుటయు, మహమ్మదీయులైనంత మాత్రము చేత హిందువులకు లేని సదుపాయములు తమ కుండవలెననియు, ప్రత్యేకనియోజకవర్గములు, ప్రత్యేక ప్రాతినిధ్యము, ప్రత్యేక విద్యాసంస్థలు—ఇవన్నియు దానికి సాధనములనియు మహమ్మదీయులు వాదించి, తదనుసారముగ వారు ప్రవర్తించుటచేత దేశవిభజనమును, లక్షలకొలది జనులకు ప్రాణనష్టమును, అర్థవినాశమును సంభవించినదిగదా ! ఇదే విధముగ మతమునకును, కులమునకును, రాజకీయములకును ముడిపెట్టుటచేత ఇకమీదటకూడ మన కిట్టి ప్రమాదములు రాకతప్పవు. కాని ఈ ముడిపెట్టు అలవాటు ఒక మహమ్మదీయులందు మాత్రమే కనుపించుట లేదు. హరిజననాయకులగు అంబేడ్కరువంటివారిలోను, మద్రాసు రాష్ట్రములోని బ్రాహ్మణేతర నాయకులలోను కనుపించుచున్నది. హరిజనులు ప్రత్యేక జాతివారనియు, అగ్రవర్ణములవారని చెప్పుకొను హిందువులతో వారి కెట్టి సంబంధము లేదనియు డాక్టరు అంబేడ్కరు వాదము. బ్రాహ్మణులు వేరుజాతి అనియు, బ్రాహ్మణేతరులు మరియొక జాతివారనియు మద్రాసు రాష్ట్రములోని జస్టిసుపక్షమువారియు, కాంగ్రెసుపక్షమునకు చెందినవారిలో అనేకులయు వాదము. ఈవాదము ననుసరించియే ప్రస్తుతము మద్రాసులోని మంత్రివర్గ రాష్ట్రపాలనమును గావించుచున్నారు. దీనిమూలమున గలుగనున్న ప్రమాదము ఇంతింత కాదు. గనుక పై తీర్మానమును ఆమోదించిన నెహ్రూప్రభుత్వమువారు దానిని ఆచరణలో పెట్టుటకును, దాని ననుసరించి మద్రాసులోను, ఇతరరాష్ట్రములలోను పరిపాలనము జరుగునట్లు చేయుటకును వెంటనే ప్రయత్నించవలెను. లేనియెడల హరిజనసమస్య తీవ్రరూపము ధరించుటయు, వారికిని అగ్రవర్ణములవారికిని మధ్య అల్లరులు బయలుదేరుటయు సత్యము. సంయుక్త రాష్ట్రములలోని కొన్ని ప్రాంతములందు ఇట్టి అల్లరులు ఇదివరకే బయలుదేరినవి. ఆకలిగొన్నవానికి అన్నము పెట్టుటయు, విద్యలేనివానికి విద్యాదానము చేయుటయు వాంఛనీయముగాని, ఇట్టివారు బ్రాహ్మణులా, బ్రాహ్మణేతరులా, హరిజనులా అన్న వితర్కము అసంగతము. వ్యక్తియే సత్యము. జాతి, కులము, వర్ణము—ఇవి సంబంధములను సూచించు మాటలు మాత్రమే. సుఖదుఃఖములు, సంతోషము, బాధ, మంచి, చెడ్డ అనునవి వ్యక్తికి చెందిన విశేషణములు గాని, సమిష్టివాచకములగు జాతి, కులము, వర్ణము మొదలైనవాటికి అన్వయించునవి కావు.

ప్రభుత్వమువారి ఆర్థికప్రణాళిక

నెహ్రూ ప్రభుత్వమువారి రెండవపని వారి ఆర్థికోద్దేశములనుగురించి చేసిన ప్రకటన. మన స్వాతంత్ర్యమింకను శైశవదశలో నున్నదని భావించుట కిదియే తార్కాణము. సామాన్యప్రజల దారిద్ర్యమునకంతకు సాహుకారీవిధానము కారణ మనియు, స్వలాభమును మాత్రమే ఉద్దేశించి పరిశ్రమలను, తక్కిన ఆర్థికవ్యవహారములను నడుపు సాహుకార్ల యాజమాన్యమును పూర్తిగ రద్దుచేసి, ప్రభుత్వమువారి యాజమాన్యమును స్థాపించినతప్ప ప్రజల దారిద్ర్యము అడుగంటదనియు కమ్యూనిస్టులేగాక సోషలిస్టులుకూడ వాదించుచున్నారు. కాంగ్రెసు సాహుకార్ల అధీనములోనికి వచ్చిన కారణముచేతనే సాహుకారీవిధానమును రద్దుచేయుటకు నెహ్రూ ప్రభుత్వమువారు వెనుదీయుచున్నారనికూడ వీరి వాదము. ఇట్టి సందర్భములో ఎంతవరకు సాహుకారీవిధానము అమలులో నుండునో, ఎంతవరకు

ఆర్థికవ్యవహారములు ప్రభుత్వమువారి యాజమాన్యమున నడుపబడునో ప్రజలకు తెలియబరచుట ప్రభుత్వము వారికి విధి అయ్యెను. ఆ విధిని వారు ఏప్రిలు ౬ తేదీ గావించిన ప్రకటనమూలముగా నిర్వహించిరి.

ఈ ప్రకటన చాల ముఖ్యమైనది. ఇందుమూలమున గొప్ప విషయ మొకటి స్పష్టపరచబడెను. సోషలిస్టుపద్ధతి ననుసరించి వ్యవహారముల నన్నిటిని ప్రభుత్వమువారు నడుపుటకు వీలులేదు. సైనికసామగ్రిని తయారుచేయు పరిశ్రమలు, రైల్వేలు, అణుశక్తి— ఇవిమాత్రమే ప్రభుత్వయాజమాన్యమున నడుపబడును. బొగ్గు, ఇనుము, ఉక్కు, వాయువిమానములు, విద్యుచ్ఛక్తి మొదలైనవాటికి సంబంధించిన వ్యవహారములలో ఇప్పటివరకు పనిచేయుచుండునట్టి వన్నియు యథాప్రకారము సాహుకార్ల యాజమాన్యమున పది సంవత్సరముల కాలము ఉండవచ్చును. వీటిని అభివృద్ధిచేయుటకు కావలసిన వసతులను ప్రభుత్వమువారు కల్పింతురు. కాని వీటికి సంబంధించి క్రొత్తగా స్థాపింపబడు పరిశ్రమల నన్నిటిని ప్రభుత్వమువారే స్థాపించి నడిపెదరు. మూడవ తరగతిలో చేరిన ౧౬ భారీపరిశ్రమలు సాహుకార్ల అధీనమందే ఉండును. కాని వాటిని నడుపుటలో ప్రభుత్వము వారు అవసరమైన శాసనములు చేయుదురు. వాటిమూలమున దేశమున కెంత లాభము కలుగవలెనో అంత లాభము కలుగుటకు కావలసిన ఏర్పాటులు చేయుదురు. లాభనష్టములు సాహుకార్లవికాని, పై విచారణ ప్రభుత్వమువారిదే. ఇంతమాత్రముచేత ఈ వర్గములో చేరిన పరిశ్రమలను ప్రభుత్వమువారు స్థాపించి నడిపించకూడదని కాదు. అవసరమైనయెడల వారట్లు చేయుటకు సిద్ధముగ నుందురు. ఇవిగాక తక్కిన పరిశ్రమలు—ముఖ్యముగ కుటీరపరిశ్రమలు—వ్యక్తుల యాజమాన్యమున ఉండును. వారు వాటిని ప్రత్యేకముగాని, సహకారసంస్థలద్వారాగాని నడుపవచ్చును.

సాహుకారీ యాజమాన్యమున జరుగు వ్యవహారములలో కార్మికులకు తగిన వేతనములు లభించుటకును, సాహుకార్ల లాభము ఒక నియమిత మొత్తమును మించకుండనుండుటకును ఏర్పాట్లు జరుగును. ఈ ఏర్పాట్లను నిర్ణయించుటలో కార్మికులయొక్కయు, యజమానులయొక్కయు, ప్రభుత్వమువారియొక్కయు ప్రతినిధులతో కూడిన కమిటీలు ఉపయోగింపబడును.

ధనికులకు, దరిద్రులకు మధ్య నుండు అంతరాళమును తగ్గించుటకు పన్నులవిధానమును ప్రభుత్వమువారుపయోగించి, ధనికులవద్దనుండి ధనమును వసూలుచేసి, దానిని దరిద్రుల ఆరోగ్యము, విద్య మొదలగువాని అభివృద్ధికి ఉపయోగించెదరు.

సోషలిస్టులు కోరునట్లు ఆర్థికవ్యవహారముల నన్నిటిని ప్రభుత్వమువారి యాజమాన్యమున వెంటనే నడుపకుండుటకు నెహ్రూ-ప్రభుత్వమువారు సూచించిన కారణములు గమనింపదగియున్నవి. ప్రస్తుతము ప్రభుత్వమువారు ఎదుర్కొనవలసిన గడ్డుసమస్య లనేకము లున్నవి. వారి దృష్టి అంతయు చాలవరకు వాటికై వినియోగించవలెను. వాటిని వదలి ఆర్థిక సంస్కరణమునకై ప్రయత్నించుట ప్రమాదకరము. ఇదిగాక ఆర్థికవ్యవహారముల నన్నిటిని నడుపుటకు కావలసిన అనుభవము ప్రభుత్వమువారికి చాలదు. అనుభవము క్రమక్రమముగగాని లభించదు. అందుచేత క్రమక్రమముగనే వ్యవహారములను ప్రభుత్వమువారి యాజమాన్యములోనికి తేవలయునేగాని ఒకేపరుగున వాటిని వశపరచుకొనుట తగదు. ఇదిగాక ఇన్ని పరిశ్రమలను ఇప్పుడు నడుపుచుండు సాహుకార్లవద్దనుండి కోట్లకొలది ద్రవ్యమును పరిహారముక్రింద నిచ్చి, కొనుగోలుచేయుట నష్టకరము. వారుపయోగించు యంత్రములు, పరికరములు చాల పాతపడ్డవి. రోజురోజుకు క్రొత్తయంత్రములు ఉపయోగములోనికి వచ్చుచున్నవి. ఇట్టిస్థితిలో ప్రస్తుతము జరుగుచుండు పరిశ్రమలను ప్రభుత్వాధీనముచేసుకొనుట ఉచితము కాదు. సాహుకార్లకు ఎట్టి పరిహారము నియ్యక వారి ఆస్తులను అపహరించు పద్ధతిని ఎవరును హర్షింపరుగదా! ఇదిగాక ప్రభుత్వయాజమాన్యమున వ్యవహారములను నడుపవలయు నన్న ఉద్యోగస్థులసేవకులను నియమించవలెను. లంచగొండితనము లేక, నమ్మకముగ వారి వారి విధులను నెరవేర్చు ఉద్యోగస్థులు లభించుట సులభసాధ్యము కాదు. క్రమేపీగాని అట్టివారి సంఖ్యను వృద్ధిచేయుటకు వీలుండదు. గనుక ఇట్టి

పరిస్థితులలో వ్యవహారములన్నిటిని ప్రభుత్వమువారి యాజమాన్యమున నడుపుటకు బదులు క్రమక్రమముగ అట్టిపద్ధతిని ప్రవేశపెట్టుటయే అనుసరణీయము. సహకారీ పద్ధతిలోని లోపములను తగ్గించుటకును, కార్మికుల సౌఖ్యమునకు కావలసిన సదుపాయములను కల్పించుటకును, సహకార్ల లాభము తగ్గించుటకును కావలసిన ఏర్పాటులను చేయుట ఉత్తమమార్గముగాని, సహకారీ విధానము నంతను పూర్తిగ రద్దుచేయుట ఆచరణయోగ్యము కాని పని.

ప్రజాసైన్య నిర్మాణము

నెహ్రూ ప్రభుత్వమువారు తలపెట్టిన మూడవ పని ఐచ్ఛిక ప్రజాసైన్యనిర్మాణము. దేశరక్షణకై గొప్పసైన్యము కావలసియున్నది. మహాత్మగాంధీ గారి అహింసా పద్ధతుల ననుసరించి దేశరక్షణను చేయుటకు ఏ ప్రభుత్వమువారికిని ధైర్యము చాలదు. ప్రస్తుతకాలమున అన్ని దేశములలోను సైన్యము రెండు భాగములుగ నున్నది. సైనికవృత్తి మూలమున జీవించు వారితో కూడినది మొదటిభాగము. అట్లుగాక ఏదో కొంతకాలము సైనికశిక్షణను పొంది అవసరమైనప్పుడు సైన్యములో చేరినవారితో కూడుకొన్నది రెండవ భాగము. వీరికి సైన్యములో పనిచేయుట జీవనోపాయముకాదు. వీరు పరిశ్రమలందో, వ్యవసాయము నందో, ఇతరుల వృత్తులందో పనిచేయుచు, జీవనము సంపాదించుకొనుచుందువారు. కాని రెండు మూడు సంవత్సరముల కాలము సైనికశిక్షణమును పొందినవారగుటచేత అవసరమైనప్పుడు యుద్ధము చేయగలిగి యుందురు. దీనికే ప్రజాసైన్యమని పేరు. ౧౩౦,౦౦౦ సంఖ్యగల ఇట్టి ప్రజాసైన్యమును నిర్మాణము చేయుటకు ప్రభుత్వమువారు పూనుకొనియున్నారు. దేశరక్షణయందు పాల్గొన నుత్సహించు విద్యావంతు లందరికి వారి అభిలాష తీరుట కిది మంచి అవకాశము కలిగించుచున్నది.

ఇండియా పాకిస్థాన్ ఒడంబడిక

ఇండియా పాకిస్థానములమధ్య పరిష్కరించవలసిన వివాదాంశము లెన్నో ఉన్నవి. కాశ్మీరసమస్య పరిష్కారమైనగాని అవి ఏవియు సంపూర్ణముగ పరిష్కారము కాజాలవు. కాని ఈమధ్య వాటిలో కొన్నిటిని పరిష్కరించుటకు రెండురాజ్యముల ప్రతినిధులు కలకత్తాలో సమావేశమై ఒకవిధమైన ఒడంబడికను చేసుకొనిరి. ఇందులోని ప్రధానవిషయము కాందిశీకులకు సంబంధించినది. పశ్చిమపాకిస్థానములో సింధు రాష్ట్రమునందుతప్ప తక్కిన ప్రాంతములందు హిందువులుగాని, సిక్కులుగాని లేరు. సింధురాష్ట్రములో నుండికూడ అయిదులక్షల హిందువులు, సిక్కులు ఇదివరకే ఇండియాకు వచ్చిచేరిరి. ఇప్పుడు మిగిలిపోయిన వారు ఆరులక్షలు. కాని తూర్పుపాకిస్థానములో సుమారు ౧౩౦ లక్షల హిందువు లున్నారు. వీరి జీవితము దుర్భరముగ నున్నది. భయకంపితులై వీ రక్కడ కాలక్షేపము చేయవలసిన స్థితిలో నున్నారు. వీరి ప్రాణములకుగాని, స్త్రీల మానములకుగాని, ఆస్తులకు గాని భద్రమున్నది లేకున్నది. అందుచేత గత ఎనిమిది మాసములకుమధ్య సుమారు ౧౫ లక్షల హిందువులు పశ్చిమబెంగాలుకు పారివచ్చిరి. ఇంకను అవిరామముగ అనేకులు వచ్చుచున్నారు. ఇట్లు వీరు లక్షలకొద్ది తూర్పుపాకిస్థానమునుండి పరుగెత్తివచ్చుట మూలమున ఇండియాకును, పాకిస్థానమునకును నష్టకరమన్న భావముతో వారి స్థితిగతులను చక్కబెట్టుటకును, వారు పాకిస్థానమందే నివసించుటకు తగిన పరిస్థితులను కల్పించుటకును ఇండియా పాకిస్థాన్ ప్రభుత్వముల ప్రతినిధులు కలకత్తాలో సమావేశమై ఇండియాలో అల్పసంఖ్యాకులగు మహమ్మదీయులయొక్కయు, పాకిస్థానములో అల్పసంఖ్యాకులగు హిందువులయొక్కయు రక్షణార్థమై కొన్ని ఏర్పాటులను గావించిరి. వీటిమూలమున అల్పసంఖ్యాకులు ఈ రాజ్యములనుండి పారిపోకుండుట జరుగునని అందరు భావించుచున్నారు. ఇదిగాక ఈ రెండురాజ్యముల మధ్య జరుగు వ్యాపారము, వ్యాపారసుంకములు, పోస్టురవాణాలు, రైలు ప్రయాణీకులు—వీటికి సంబంధించిన సమస్యలనేకములనుగూడ వీరు పరిష్కరించగలిగిరి. నెహ్రూప్రభుత్వమువారు గతమాసములో గావించిన పనులలో పేర్కొనదగినది ఇది ఒకటి.

పాకిస్థాన్ రాజ్యాంగతత్వము

కాని, ఈ ఏర్పాటుల నన్నిటిని అమలులో పెట్టుటయందే అనేక చిక్కులు సంభవించగలవు. తూర్పు పాకిస్థానములోని హిందువులు ఆస్తిపరులు. వారి ఆస్తిని కబళించుటకు మహమ్మదీయులు మిక్కిలి ఉత్సాహవంతులుగ నున్నారు. ఇది గాక అప్పటి మహమ్మదీయులు హిందూరాష్ట్రమగు అస్సామును ప్రవేశించి, ఆరాష్ట్రములోని మహమ్మదీయుల సంఖ్యను వృద్ధిపరచుటకు కంకణము కట్టుకొని యున్నారు. ఇట్టి సందర్భములో పైన పేర్కొన్న ఏర్పాటులు ఆచరణలోనికి వచ్చుటయందు అనేక కష్టము లున్నవి. ఇండియా ప్రభుత్వము వారి ఆదర్శము కులమతరహితమైన రాజ్యమును నిర్మించుటయే. దానికి తగినట్టి రాజ్యాంగవిధానమునే మన రాజ్యాంగపరిషత్తు వారు సృష్టించుచున్నారు. పాకిస్థాన్ ఆదర్శము ఇట్టిది కాదు. మహమ్మదీయమతసిద్ధాంతముల ననుసరించి రాజ్యాంగవిధానమును నిర్మించుట వారి ఆదర్శము. అట్టి విధానములో మహమ్మదీయేతరులకు మహమ్మదీయులతో సమానత్వ ముండదు. ఇదిగాక పాకిస్థాన్ రాజ్యములోని ప్రజలు లీగుపక్షమునకే తప్ప మరి ఏ రాజకీయపక్షమందుగాని సభ్యులు కాకూడదనియు అట్టి రాజకీయపక్షములను నిర్మించదలచుట హేయమనియు ఈ మధ్య జిన్నా ప్రకటించెను. కాని మహమ్మదీయేతరులు లీగులో చేర్చుకొనబడరు. అట్టి వారు ప్రత్యేక రాజకీయపక్షములను నిర్మించుకొనుటకు వీలులేదు. గనుక వారు సంఘములద్వారా రాజకీయములలో పాల్గొనుట సాధ్యముకాని పని. అట్టి సందర్భములో వారికి హక్కులుండుటగాని, ఉన్న హక్కులను రక్షించుకొనుటగాని దుస్తరమగును. వాయవ్య సరిహద్దురాష్ట్రములో అబ్దుల్ గఫర్ ఖాన్ నాయకత్వమున అనేక సంవత్సరములనుండి అహింసా సూత్రము ననుసరించి పనిచేయుచుండిన "రెడ్ షర్ట్స్" పార్టీని కూడ రద్దు చేయుటకు సిద్ధపడియుండు పాకిస్థాన్ ప్రభుత్వము హిందువులు నిర్మించుకొను రాజకీయ పక్షములు సక్రమములని తలచునా? వ్యక్తిస్వాతంత్ర్యమును, ప్రజాస్వామ్యసిద్ధాంతములను, సర్వమత సమానత్వమును అంగీకరించక మతమునకును, రాజకీయములకును ముడిపెట్టు పాకిస్థాన్ రాజ్యాంగ మెక్కడ? ఆ రాజ్యములో అల్పసంఖ్యాకులగు హిందువుల రక్షణ మెక్కడ? (1-5-'48)



వెయిటర్ - సర్వర్

[కథానిక]

శ్రీ వి. డి. ప్రసాదరావు

కాస్త్రిల్లుసావాసంవల్ల రాజా చెడ్డాడో, రాజా సావాసంవల్ల కాస్త్రిల్లు చెడ్డాడో వాళ్ళ తల్లులకు తెలియలేదు.

ఒకళ్ళ నొకరు ఎరగని తల్లులైతే, పరాయి తల్లి కొడుకే తన కొడుకును చెడగొట్టున్నా డనుకొనేది. వంశగౌరవాభాసలు తప్ప, వంశభాగ్యాలు మిగలక ఆదారిద్ర్యంలో ఆ అమ్మలిద్దరూ ఇరుగుపొరుగున, అన్యోన్యంగా పెరిగారు. కుల మింటిపాటుల్లోనే ముంగడిక్కలేని జీవనాలు గడుపుకొంటూ ఆ బ్రాహ్మణ తల్లీ, రాజుతల్లీ పొరపొచ్చాలు లేకుండానే గుట్టుగా పల్లెటి జీవనం గడుపుకొంటున్నారు.

కాస్త్రిల్లుతల్లి కొక్కడే కొడుకు. రాజా చిన్నవాడే, ఒక పెద్దఅప్పగారు, తల్లి గారాబాన్ని, మంచితనాన్ని దుర్వినియోగం చేసి, బీదతనాన్ని చీదరించుకొంటూ, అర్థికయోగాని కనుపైన బ్రతుక్కు మరిగి, పట్టణంలో రంగేలావీథికి చేరుకుంది. ఆ రాజా తల్లి తోడి యిల్లాలితోబాటు తనకూ కొడు కొక్కడే ననుకొని, కూతురే లేదనుకొని, మనసు రాయిచేసుకొంది అభిమానంతో...

కాస్త్రిల్లుకు తన తల్లి రాజా నెక్కువ ఆదరంతో చూస్తుందనీ, ఏ చిలిపికజ్జాలోనైనా తప్పంతా తన నెత్తినే కట్టుందనీ కోపం. ప్రతీకారంగా రాజా మీద అక్కసు. రాజుకు తన తల్లి, తను అంతటి బీదదే అయినా ఆ కాస్త్రిల్లుతల్లి ముందర వల్లమాలిన వినయంతో, ఏదో గొప్పవాళ్ళని తక్కువవాళ్ళు చూసినట్లు చూసి, వాళ్ళ అబ్బాయి ఏం చేసినా తనదే తప్పని తనను తిట్టిపోస్తుందనే ఉక్రోషం.

ఇద్దరికీ ఆలోచనకు తెలిసినవి—అక్కసులు, కోపాలు.

కాని ఒక్కనిమిషం రాజా కనబడకపోతే కాస్త్రిల్లుకు తోచేదికాదు. కాస్త్రిల్లు ప్రక్కనుండకపోతే రాజా నిస్పృహుం డైపోయేవాడు. ఆ అనురాగం ఇద్దరికీ బుద్ధిగతంగా తెలియదు. కనబడ్డనిముషాన్నించి కొట్టుకొంటూ, తిట్టుకుంటూ, కీచులాడుకుంటూ, ఒకళ్ళమీద ఒకళ్ళు పితూరీలు చెప్పుకుంటూ, ఒకడి కొకడు ఏం అపకారం చెయ్యాలో వెదుకుతుంటూ రోజంతా కలిసే తిరిగేవారు. బడికి వెళ్ళకపోటానికి ఒకళ్ళ కొకళ్ళు కారణం. చెట్లుచేమలు ఎక్కేందుకు, చెరువులో నడిరొండలో ఈతలాడేందుకు, పంతులింటి ముందు పల్లేరుకాయలు పోసేందుకు అన్నిటికీ ఒకళ్ళ కొకళ్లతో డుండాల్సిందే. పంతాలుపోయి, కొట్టుకోవాల్సిందే!

ఈ గడుగ్గాయులకోసం తపించి తపించి తల్లులు తనువులు చాలించారు.

బతుకుబాటలు బాల్యం దాటకుండానే వైన బడ్డాయి. ఆ పల్లెకు చదువుసంధ్యలు లేని ఆ గడుగ్గాయులంటే కృతజ్ఞత ఉండాల్సిన అవసరంకనబడలేదు. వాళ్లకూ, నిప్పూ నీరు పుట్టక, పల్లెఅంటే కృతజ్ఞత కనబడలేదు. చిన్నవాడే అక్కయ్య చచ్చిపోయిం దనుకొమన్న తల్లి అభిమానపు మాటల్తో, బంధుత్వం తెంచేసుకొన్న అక్కయ్యదగ్గిరకే మళ్లీ రాజా బయలుదేరాడు. కాస్త్రిల్లు 'భూత్'అని అతోవ తుంచేసుకొని మరోదోవను పట్టణం చేరుకొన్నాడు.

౨

అప్పుడు ఆదరంతో, కన్నీళ్లతో బ్రతిమాలుతూ "చెయ్యరా నాయనా" అని తల్లి తన మంచికి చెప్పిన పనులు ఒక్కటీ ఒక్కనాడూ చెయ్యక, తల్లిని తిట్టూ గడిపాడు కొన్నాళ్లు.

ఇప్పుడు కోడికూసేటప్పటికే లేచి, విభూతి పెట్టుకొని, అయ్యరు ఆజ్ఞలు ఉరుముతూంటే, అణా కానీ ఇచ్చినవాడల్లా హోటల్లో అధికారం చెలాయిస్తుంటే, తక్కిన పేపలాగా పడిఉండి, బల్లలదగ్గర్నుంచి వంటింట్లోకి, వంటింట్లోంచి బల్లలదగ్గరకు అర్ధరాత్రిదాకా, ఆ కొత్త జాగాలోనే మైళ్లు తిరుగుతూ, కాళ్లూ చేతులూ బలపాలు కట్టి, అయ్యరు ఈసడింపుగా పారేసిన మెతుకులు ఆదరాబాదరగా తింటూ, అర్ధరాత్రికి హోటలువీధివరాండా నాపరాళ్ళమీద కొల్లాయి పరుచుకొని, పగలు తిన్న దెబ్బల ఉలిక్కిపడుతూ, నిద్రలో ఒళ్ళు మరిచి, తెల్లారాక మళ్ళీ అయ్యరు కేకలకు అదటున లేచి పని లోకి పోతాడు.

అప్పుడు తల్లి ఆదరంగా ఆదరువు లన్నీ చేసి పెడుతూంటే, కోడి కెలికినట్లు కెలికి, నంజి, విస్తరి చింపి, కేకలతో లేచిపోయేవాడు. ఉన్న ఒక్క మంచమూ, బొంతా తనకే పక్క వేసి, తల్లి కాచుక్కూచుంటే, అర్ధరాత్రికి తిరిగివచ్చి, ధూంధాంలు చేస్తూ, పొద్దెక్కేదాకా పడుకొని గుర్రెట్టేవాడు.

ఇప్పుడవన్నీ జ్ఞాపకాలుగా మరీ ఏడిపిస్తూండేవి. కంటికీ, కడుపుకూకూడా నదరైన తినుబండారాలు తన చేతులమీదుగానే అందరికీ యిస్తూ, తనమాత్రం మూతికి చిక్కం కట్టిన దూడలాగా అఘోరిస్తూంటే బాధే వేసేది. పైగా, పైసా ఇచ్చిన ప్రతివాడికీ, అయ్యరు కాదు లోకువ, తనే! అటు జనమే తిట్టారో, ఇటు అయ్యరే తిట్టాడో క్షణక్షణం మార్పుగానే ఉండేది.

"ఏం, ఈ కాఫీ ఇల్లా తగలడిం దేమయ్యా! నే నిచ్చేది డబ్బు కాదా!"

అయ్యరు ఎటు చెప్తాడో! వాళ్ళ పక్షమో, తన పక్షమో తెలియదు. పోనీ, త్రాగేవాడికి తృప్తిగా ఇంకో కప్పు చేసుకొచ్చిస్తే, అయ్యరు వాళ్ళముందర గౌరవమే చూపించి, తర్వాత ఒంటరిగా "ఎవరమ్మ మొగుడి సొమ్మని ఇచ్చావురా! ధగిడీకా, జీతంలో కట్టుకో!" అని ఉరిమేవాడు. ఆ జీతం లెఖ్ఖల్లో ఎంత ఉన్నా, ఏడాదికి రెండు లాగూలు, చొక్కాల్ని మించి కనబడేది కాదు. అదయినా, హోటలు గౌరవంకోసం, 'సర్వర్' శుభ్రంగా ఉండాలనే ఘరానా ఖాతాదారుల మెప్పుకోసం. అంతకుమించి బీడీలకుకూడా పైసా అడేదికాదు. అదికూడా ఎవరి దగ్గరో ముష్టే.

అల్లా అని మళ్ళీ కాఫీ ఇయ్యకుంటే, ఖాతా దారు తగువుపెట్టుకొన్నాక—"వచ్చిన వాళ్ళతో పోట్లాడి నా బేరం చెడగొట్టుకొనేందుకురా, నిన్నిక్కడ పెట్టుకొంది? గతిలేనివాళ్ళని తెచ్చుకుంటే బాగానే ఉంది నాకు సాయం!" అని అయ్యరు చివాట్లెట్టే వాడు. తిట్లు పడాల్సిందే తప్ప, మళ్ళీ పరకు ఇచ్చే తెలివి తక్కువకు పోరాదు. దానికికూడా మళ్ళీ అద నెరిగి, అపవాద మెరిగి, ఇస్తూనే ఉండాలి. ఆ అదను అయ్యరు ముఖంలో గ్రహించే మానసికతత్వపరిశోధనాప్రజ్ఞా విశేషం అయినాడు కింకా అలవడలేదు. ఏ ఖాతాదారు ఏనిమిషంలో 'ఘరానా' అవుతాడో, ఏ నిమిషంలో 'చెంబేటీ'రకం అవుతాడో తెలియదు. వాళ్ళ ప్రవర్తన కాదు దానికి గీటురాయి. వాళ్లవల్ల అయ్యరుకు కలిగే ప్రత్యక్షలాభాలు. అవి అయ్యరుకూ, వాళ్ళకీ తెలిసే రహస్యాలు.

ఇడ్లీల్లో పచ్చడికీ, సాంబారుకీ ఇరవైమార్లు తిప్పినా, మంచినీళ్ళకు మరో పదిసార్లు పంపించినా, కాఫీలో డికాక్షనుకు, పంచదారకు, పాలకు, చివరకు సాసర్లకు ఒకొక్కక్కడు ఎన్నిమాట్లు తిప్పినా కిమ్మన కుండా తిరగవలసిందే. పాలలో నీళ్ళు ఎక్కువ కలప నందుకు అయ్యరూ, కలిపినందుకు ఖాతాదార్లూ తిట్టు తూంటే సమంగా భరించవలసిందే. అయినదానికీ, కానిదానికీ అడ్డమైన మాటలూ ప్రతిచిల్లరమనిషీ అంటూంటే, పళ్లెటి గడుగ్గాయి—అభిమానా న్నంతా

పటాపంచలు చేసుకొని పక్కన పడేసులా ఉండాల్సిందే. మొదటిరోజుల్లో పౌరుషం పొడచూపేటప్పటికి అయ్యరు తల చితక్కొట్టాడు. బుద్ధిగల గొడ్డుగా తయారయ్యాడు కాస్తుల్లు.

౩

కొత్త లాగూ, కొత్త చొక్కాతో నీటుగా జేబులో డబ్బులు గలగలలాడిస్తూ, పదమూడేళ్ళ షోకిల్లా-రాజా హోటలు లోకి వచ్చాడు. ఠీవిగా కుర్చీలో కూర్చొని కాస్తుల్లును చూడగానే వచ్చిన అనురాగ పూరితమందహాసాన్ని అణగద్రొక్కుకొని "వెయిటర్!" అని కేక వేశాడు. కాస్తుల్లు స్నేహితుడు కనబడేటప్పటికి హోటలనే మాట మరచిపోయి, "...ఏరోయ్" అని పలకరించాడు.

రాజా ఇంకా గౌరవప్రదర్శనఘట్టంలోకి దిగాలనుకొనేలోపలే, ప్రక్కనున్న కాప్రునాయుడుగారు, ఎంగిలి ముక్కలతో "డామ్ ఫూల్, కస్టమర్ను హోటల్లో అవమానంగా పిలుస్తావురా! ఏరోయట, ఏరోయ్! వెయిటర్ అంటే నామర్దా అయితే ఆ పని కెందుకు దిగావ్? పుట్టుకతో వస్తుందే మీకు ఆ జాతిగుణం!" అంటూ లంకించుకొని, పట్టాలు తప్పించి, తన అభిమానవిషయమైన 'కులద్వేషం'లోకి తిప్పి, ఈ కుట్టి వెయిటరు ఆధారంగా ఉపన్యాసం నడిపాడు. అయ్యరుకూడా ఇట్టే మలిగిపోయి "ఏం? ఇంకా జలుబు కుదర్లేదే? కస్టమర్ని గౌరవించాలని ఎన్ని మాట్లు చెప్పాలి నీకు?" అంటూ ఉరిమాడు.

కాస్తుల్లు చీవాట్లు తింటూన్నందుకు అలవాటుగా వచ్చిన సంతోషంలో, మిత్రుడు కనబడగానే కలిగే ఆదరాభిమానాలు రాజాలో మణిగిపోయాయి. కాస్తుల్లు రాజాను చూడగానే వచ్చిన ఆప్యాయతంతా ఉడుకుమోతుతనంలో కోపంగా మారి, గ్రుక్కలు మింగటంలో కంఠంలోనే అణగారి, కంటి చూపులో అశక్తంగా వెలువడింది.

ఆ అణన్నరలో ఎంత హోదా చెలాయించుకో వచ్చో అంత హోదా రాజా పూర్తిగా చెలాయించుకొన్నాడు.

"ఏయ్, పచ్చడి తీసుకురా!...ఈ పొడుప్లే చేమిటి! ఇంకో దాంట్లో తీసుకురా...ఈ ఆకులో పురుగు లున్నాయి, ఇంకో ఆకులో తే...ఇంకొంచెం పచ్చడి తే...అరగంటైనా మంచినీళ్ళు తెచ్చావేం?... ఎక్కడి నీళ్ళివి, కుడితి తొట్టిలోవా?...వేరే తీసుకురా...ఇంకొంచెం డికాక్షన్ వెయ్యి...అలా అంత పోస్తావేం? మళ్ళీ పాలు ఏవీ... పంచదారేదీ?...... ఒక చెమ్చా చాలంటే...ఛా! తగలడ్డట్టే ఉంది వెధవకాఫీ..."

కాస్తుల్లు, కిమ్మనకుండా, రోజుకుంటూ తిరుగుతూనే భరించాడు. ఆ రాత్రి పడుకోబోయేటప్పుడు వచ్చిన కంటినీరు, రాజామీద కోపంవల్లో, లోకంమీద కోపంవల్లో తెలియలేదు.

౪

ఆర్థికపరిస్థితి ఎల్లా ఉన్నా, పరంపరాగతమైన నైతిక బుద్ధి అంతరాత్మరూపంలో నిత్యం కుమిలిస్తూ, చిన్ననాటి తల్లి ఆదరము, తమ్ముడిమీద ఆపేక్ష, మధుర స్మృతులుగా అలయిస్తూన్న రాజా అక్కకు, తమ్ముడు కనబడగానే పట్టరాని సంతోషమయింది. వాత్సల్యంతో, ఆదరంతో తమ్ముణ్ణి ముంచెత్తేసింది.

కాని పల్లెటిగడుగ్గాయికి, మంకుతనంలో పెరిగినవాడికి, ఆ ఆదరాభిమానాలే విషప్రాయంగా చిరాకెత్తిచ్చాయి. నాల్గు నాళ్ళతో మొగం మొత్తింది. అక్కయ్యవృత్తికి అక్కయ్య నీసడిస్తూ, (ఆ డబ్బును మాత్రం ఆశిస్తూనే) అక్కయ్యను తిట్లు మొదలెట్టాడు. తన అంతరాత్మతోపాటివిగానే ఆ తిట్లను గౌరవంతో సహించింది. ఆ సహనశీలత్వం గడుగ్గాయికి మరీ ఉద్రేకం తెప్పించేది. ఏదో చిలిపికారణం పెట్టుకొని, "ఛీ! నీ భోగంతిండి తినా"నంటూ విసవిసా బైటికి వెళ్ళేవాడు. "నాయనా! రా"మ్మంటూ ఏడుస్తూ బ్రతిమాలున్న అక్కయ్యను చీదరించేసుకుంటూ పరుగెత్తాడు.

నాలుగురోజుల ఉపవాసదానంతో పట్టణం సగం అహంకారాన్ని చితగ్గొట్టింది. అక్కయ్యాగ్గిర వెళ్ళటానికి అభిమానంమాత్రం ఇంకా చావలేదు. అయ్యర్ హోటల్లో క్లీనరుగా ప్రవేశించాడు.

౫

"ఏయ్! బల్ల సరిగ్గా తుడవలేదు. ఆ మూల తుడూ!"

'వెయిటర్' కాస్తుల్లు 'క్లీనర్' రాజామీద అధికారం చెలాయిస్తున్నాడు. ఆ ఒక్కరోజా అక్కనూ

నిత్యకృత్యంగా పెంచి, వడ్డీతోసహా తీర్చుకొంటున్నాడు. శాస్త్రుల్లో అహంకారాన్ని, అభిమానాన్ని చితగ్గొట్టినట్టే, రాజులో కూడా అభిమానాన్ని, అహంకారాన్ని అయ్యరు చితగ్గొట్టాడు. అయ్యరు తనకు ప్రసాదించిన బహుమానాలన్నీ శాస్త్రుల్లు రాజుకు ప్రసాదించి, కసితీర్చుకొంటున్నాడు. అయ్యరు దూరంగా ఉన్నప్పుడు ఇద్దరూ కలసేవారు. మళ్లీ ఆ రాక్షసుడి కేకతో ఒకళ్ళమీద ఒకళ్లు ఉగ్రోపక్రోధాల్లోకి, తమ పనుల్లో ఉన్నట్లు తము ఉండేవాళ్లు. ఒకళ్ళమీద ఒకళ్లు అయ్యరుకు పితూరీలు చెప్పేందుకు అన్ని అవకాశాలూ వినియోగించుకొనేవారు. అయ్యరు చేతుల్లో రెండవవాడికి దెబ్బలు తగల్తూన్న నిమిషాన్ని మించి సంతోషసమయం వేరే ఏదీ ఇద్దరికీ ఉండేదికాదు.

* * * *

రాత్రి ఎనిమిదింటికి ఖరాఖాకాతాదార్ల మెప్పుకోసం వెయిటర్ శాస్త్రుల్లు క్లీనరు రాజును కేకలేస్తున్నాడు. పొద్దున్నే విడిగా కలబడి ఇద్దరూ తన్నుకున్నారు. ఆ ద్వేషం ఉద్యోగధర్మాల్లో తీరుతూంది.

శాస్త్రుల్లు ప్లేటుతో నిలబడి, "బల్ల తుడవ్వేరా ఎంతసేపటికీ! బద్మాష్" అని రాజుమీద కేకలేశాడు. అంతకుముందే బాల్చీతో నీళ్ళు తెస్తూ, బరువుకు బోర్లబడి మోకాళ్లు చెక్కుకుపోయి, గాయాలు నిమురుకొంటున్నాడు రాజు. అలుకుగుడ్డ పుచ్చుకొని బల్ల దగ్గిర కొచ్చి, కాలు నిమురుకొంటూ నెమ్మదిగా తుడవబోతున్నాడు.

శాస్త్రుల్లు "ఎంతసేపురా నిలిచేది!" అని మళ్ళీ అరిచాడు.

రాజుకు భరించే స్థితి దాటుతూంది. తుడవటం ఆపి నిలబడి, శాస్త్రుల్లవంక ఉరిమి చూశాడు. శాస్త్రుల్లు ధీమాతో "మిడిగుడ్లేసుకుని అల్లా చూస్తావేరా తుడవక" అంటూ సాగించాడు.

రాజు చేతిలో ఉన్న గుడ్డ శాస్త్రుల్లు మొహాన్నేసి కొట్టాడు. శాస్త్రుల్లు చేతిలో ప్లేటు రాజుమీదికి విసిరికొట్టాడు. ఇద్దరూ కలబడ్డారు. బల్లలు గగ్గోలయ్యాయి.

అయ్యరు యిద్దరిజుట్టూ లంకించుకొని దొడ్లోకి ఈడ్చుకువచ్చి, స్మృతి తప్పేదాకా ఇద్దరికీ బడిత పూజ చేసి, "పీడ విరగడై పొండి వెధవల్లారా!" అంటూ ఇద్దరినీ పెరడావతల పెంటకుప్పమీదికి విసిరేశాడు.

* * *

తెల్లవారేసరికి పెంటకుప్పమీద ఇద్దరికీ స్పృహ వచ్చింది. ఆ బాధలో, ఆ ఒళ్ళు తెలియని స్థితిలో, అంతఃస్ఫురంతిగా మనస్సుకు తెలియకుండా హృదయంలో మాత్రమే అణిగున్న పరస్పరానురాగం ఎప్పుడు ఉబికి, ఒకర్నొకర్ని దగ్గిర తీసిందో ఏమో! ఒకర్నొకరు కౌగిలించుకొంటూ నిద్రలేచారు.

"రాజూ!"

"శాస్త్రుల్లూ!"

ఆ కన్నీళ్లలో, బాల్యంనుంచీ పైపూతగా దళమౌతున్న ద్వేషం కరిగిపోతోంది.

కన్ను తెరుస్తూ లేవబోయారు. రాజు కాళ్ళ దగ్గిర పాదాలమీద చేతు లేసుకొని కోమతో పడిపోయినట్లు వాడిపోయి కుప్పగా పడిఉంది అక్క! నాలుగు నాళ్లబట్టి తమ్ముడికని వెదుకుతూ తిండీ తిప్పలూ లేక ఊరంతా తిరిగితిరిగి సోషిల్లి ఈ పెంటకుప్పదగ్గర తమ్ముడి కాళ్లమీద చేతు లేసుకొని పడిపోయింది.

శాస్త్రుల్లు రాజును చుట్టుకొన్న చేతుల్తోనే అదరాగా లేచి "అక్కయ్యా!" అన్నాడు.

రాజు మొహం చెల్లనట్లు తలవాల్చి కన్నీరు కారుస్తున్నాడు.

అక్క రాజును చూసి, నీరసంగా అంటూంది: "నాయనా, అన్నం తిందుగాని రా! భోగం తిండి కాదు నాయనా! వృత్తి మానేశాను! రా పోదాం! శాస్త్రుల్లూ! రావా నాయనా!"

నాలుగురోజుల ఆవేదనా కంఠాన్ని పూడ్చివేసి, కన్నులను కరిగించేస్తోంది!

రాజు సిగ్గుతో తల వాల్చి ఉన్నాడు.

శాస్త్రి రెండు నిమిషాలు చెల్లబోయిచూశాడు. రాజును లేవదీసుకొంటూ అక్క కౌగిలిలోకి కదిలాడు.

"అక్కా, పద పోదాం—మన ముగ్గురికీ లోకమే మారిటితల్లిగా పరిణమించింది. మనకి మనమే దిక్కు. రాజూ, పద పోదాం!" అంటూ కదిలాడు.

ఆ ఆదరణలలో మళ్ళీ తెల్లవారింది.

కలగూరగంప

గొడుగు

సామ్రాజ్యాధిపతి మొదలుకొని సామాన్యమానవునివరకు గల ప్రతివారికీ— చిన్న పెద్దలకు, స్త్రీ పురుషులకు పనికివచ్చే వస్తువులలో గొడుగొకటి. "అందలంబు గొడుగు లపనంబు పేల్కట్లు" అన్న కవివాక్యానుసారం రాజలాంఛనాలలో ఇది ఒకటని తేలుతుంది. మహారాజులకు "ఛత్రపతి" అనే బిరుదు తగిలించడం మనకు మామూలు. అటువంటి రాజులను పొగడవలసినపుడు "ఏకచ్ఛత్రాధిపతిగా యేలినా" రంటారు భట్రాజులు. మన చరిత్రలో ఛత్రసింగ్ అనే పేర్లుకూడ తటస్థపడుచున్నవి.

దేవతల విషయంలోకూడా గొడుగునకు గొప్పతనం కద్దు. దేవతార్చనలోని షోడశోపచారపూజా సందర్భంలో "ఛత్రం ధారయామి" అంటూ గొడుగు పడతాము. భగవన్నుతి చేసే సందర్భంలో బమ్మెరవారును "ధర సింహాసనమై, నభంబు గొడుగై" అని భగవంతుని "భువరాజసంబు"నకు లోపం లేకుండా చేసినారు. దేవాలయాలలోని ఉత్సవవిగ్రహాల నూరేగించునపుడున్నూ ఈ ఛత్రమర్యాద చర్వితచర్వణంగా నేటిదాకా జరుగుతూనేవుంది. "తిరుపతిగొడుగులు" అన్న పేరుతో యేటేటా శ్రీవెంకటేశ్వరులకు ఛత్రములు చెన్నపట్నంనుండి సమర్పింపబడుచున్నవి. ఈగొడుగులు నిర్ణీతకాలంలో చెన్నపట్నంనుండి మేళతాళములతో, ధూపదీపనైవేద్యములతో, భక్తుల భజనఘోషలతో బయలుదేరి, కాలినడకను తిరుమల చేరుచున్నవి. శ్రీమహావిష్ణువుయొక్క దశావతారములలో రెండింటికి గొడుగులతో సంబంధం కలిగింది. మొదట వామనావతారఘట్టంలో, బలిచక్రవర్తితో "గొడుగో, జన్నిదమో, కమండలువో, నాకుజ ముంజియో, దండమో" అన్నపుడు, గొడుగు చేత ధరించి వచ్చినట్లు స్ఫురించుచున్నది. తర్వాత కృష్ణావతారంలో, దేవేంద్రునితో దెబ్బలాట వచ్చింది. ఇంద్రుడు "వాదిరిగా రాళ్ళవాన" కురిపించినాడు. వెంటనే కృష్ణుడు "ఏ ఎండ కా గొడుగు పట్టవలె"నన్న ధర్మసూత్రప్రకారం రాళ్లవానకు రాతిగొడుగే మంచిదని గోవర్ధనగిరినే గొడుగుగా పట్టి, గోవులను, గోపకులను రక్షించినాడు.

మన దైనికజీవితంలోకూడా అడుగడుగుకు గొడుగు కావలసివస్తుంది. ఎండకూ, వానకే గాక "అల్పునికి ఐశ్వర్యం వస్తే అర్ధరాత్రిలో 'గొడుగుపట్టుకొన్నా'" డన్న సామెత మనకు తెలిసినదే. ఇదిగాక, అప్పులవాళ్లను మొహం తప్పించుకొని తిరగడానికిన్నీ—రంగుకళ్ళద్దాలవలెనే చూచినా చూడనట్లు నటించునట్లు— గొడుగు camouflage లాగా ఉపయోగిస్తుంది.

రంగురంగుల గొడుగులమీద పిల్లలకు ప్రీతి మెండు. పెండ్లిలో వరునికి కాశీయాత్రకు క్రొత్త గొడుగు కొంటారు.

ఈవిధంగా రాజు మొదలు రౌతుదాకా గల ప్రతివారికేగాక సర్వసంగపరిత్యాగులకు సన్యాసులకున్నూ ఛత్రమర్యాద కలదు.

సర్వదా గొడుగును విడనాడకపోవడంవల్ల చేంబర్లినుకు గొప్పపేరు వచ్చింది. అతని గొడుగును ముందు పేర్కొని తర్వాత ఆయనపేరు చెప్పేవారు ఆరోజుల్లో. ఆయనగొడుగునుగూర్చి ముచ్చటించని పత్రిక లేకపోయింది.

కడచిన యుద్ధంలో "పారచూట్" అనే ఒకరకం గొడుగును విరివిగా వాడినారు. దీని సహాయంతో సైనికులు విమానాలనుండి శత్రుభూమిలో దూకేవారు.

అతిపురాతనకాలంనుండీ ఆధునికయుగందాకా తన ప్రయోజకత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ కోల్పోక, యేదోరూపంతో కాలప్రవాహమును ధిక్కరించి నిలిచియుండడంలోనే గోడుగుగొప్పతనం యిమిడి యున్నది. ఎన్ని వస్తువులు పుట్టిన కొద్ది రోజులకే ముక్కు గోడుగులవలె నామరూపాలు లేకుండా నశించి పోవడంలేదు! అట్లు కాని గోడుగు పత్రికాప్రశంసకు పాత్రము కాదా?

చె. శ్రీ. వెంకటరామయ్య.

* * *

యోగి యేలవారి శ్రీరామచంద్రరావు

ఈయన కృష్ణామండలమునందు బందరునగరమున ౧౮౭౪ సంవత్సరమున జన్మించి, బాల్యము గోదావరి జిల్లా ధవళేశ్వర గ్రామమున గడపి, రాజమహేంద్రవరమున (Normal School) సాంఘ్లేయ పాఠశాల యందు చదివి, పిఠాపురము రాజావారి యాస్థానమునం దున్న యుకని మాతామహునకు పెంపక మివ్వ బడి, తాతగారి వద్ద కత్తికఱ్ఱసాములను, రాజావారి యాస్థానమున నున్న మల్లసమరశిఖామణులవద్ద ముష్టి యుద్ధములు నితర దేశీయవ్యాయామకళలను జక్కగ నేర్చుకొని, రాజమహేంద్రవరమున నున్న దొరతనము వారి సర్వకళాశాలయందు వ్యాయామాచార్యునిగ నియమింపబడి, పాశ్చాత్యవ్యాయామవిద్యాజ్ఞానము చేకూర్చుటకు కాకినాడరేవునుండి యోడమీద చెన్నపురి కేగి, యచ్చట 'చెన్నపురివ్యాయామాభ్యసనక్రీడాసంఘ (The Madras Physical Training and Field Games Association) మను పేరబరగు నొక నూతనసంస్థయందు హాయిణవ్యాయామకళలను మూడు సంవత్సరములు నేర్చుకొని, తిరిగి యుద్యోగపదవి వహించి, వ్యాయామకళాశాఖను పెంపొందించి, ప్రత్యేకాభ్యసన తరగతి నొకదానిని నెలకొలిపి, సాగించి ముప్పది యొనిమిది సంవత్సరము (౧౮౯౯-౧౯౧౪) లాచార్యపదవి నలంకరించి, పిదప నుప కారవేతనము నొంది, తెలుగువారి శరీరదౌర్బల్యము బోగొట్టుటకు తెనుగుసీమ నంతయు దిరిగి, యుత్కృష్ట బోధనలు సల్పి, తొంబదియారవ యేట చెన్నపురి యందు నిర్యాణము జెందెను.

ఈయన చెన్నరాష్ట్రములోని పాఠశాలల యందు దేహసాధనకళలు బోధించుట కుపాధ్యా యులను శిక్షావినీతులుగ జేయుట కొక తర గతి నిర్మించుటకై దొరతనమువారి యనుమతి నొంది, వందలకొలది విద్యార్థులకు సామూకసరతులు కఱపి, పరీక్షలలో వారి నుత్తీర్ణులుంగా జేసి, వారిమూలమున వ్యాయామవిద్య నాంధ్రదేశమున నెల్లమండలముల వ్యాపింపజేసెను. ఈయనవలన క్రమశిక్షితులైన శిష్యు లుత్తరసర్కారులు, దత్తమండలములందేగాక దక్షిణ మండలములందును,తిరువాంకూరు, కొచ్చిను, మలబారు, మైసూరు మొదలగు దూరరాష్ట్రములందుగూడ గన బడుచున్నారు.

వ్యాయామాభ్యసనతరగతి విద్యార్థుల యుప యోగార్థమునకును, కళాశాలావిద్యార్థులు, ప్రజలందఱ ప్రయోజనముకొఱకును విదేశీయకవాతులను, డంబెల్సు, బార్బెల్సు సాధకములను, దండెములు, బస్కీలు, సంతోలో (ముగ్దరులు), గద (ఖరోలా), యోగాసనములు,ముద్రలు మొదలగు జాతీయవ్యాయామ కళలను తేటతెల్లము గద్యమునందు సరళమైలిని రెండు కృతులు రచించి వరుసగా ౧౮౯౯, ౧౯౧౫ సంవత్సరములందు ప్రచురించెను.

ఈయన వ్యాయామాచార్యపదవి నొందినపుడు (౧౮౯౯) రాజమహేంద్రవరమునం దున్న సర్వకళా శాల తెలుగువారి కందఱికిని కేంద్రవిద్యాపీఠము. అప్పటి విశ్వవిద్యాప్రణాళికయందు వ్యాయామసాధ కము వ్యర్థము. ఇతని దీక్షవలనను, నిరంతరకృషి ఫలమువలనను, ఊరు పేరు లేక, బూజుపట్టి, సర్వకళా శాలయం దదృశ్యమైన వ్యాయామకళను విస్ఫుటమూర్తిగా మార్చి, స్వతంత్రపరిణామము నిచ్చి, ప్రత్యేకస్థలావరణములను సమకూర్చి, వివిధసాధనకలాప ములను సేకరించి, అచ్చటి వ్యాయామకళాశాఖను దక్షిణభారతవర్షమునం దద్వితీయమైన వ్యాయామ సంస్థగా శోభింపజేసి, ఆంధ్రదేశమునకంతటికి శాశ్వత మైన కీర్తి సంపాదించెను.

ఉపకార వేతనమునందినపిదప నింట విశ్రాంతి చెంది మిన్నకయుండక, పూర్వముకన్న దేశసేవ నగ్గలముగా జేయ మొదలిడెను. ఉద్యోగదశయందువలె నొక కళాశాలాధిపనమే గాక యాంధ్రదేశమంతయు నితని కార్యస్థాన మయ్యెను. మొట్టమొదట రాజమహేంద్రవరమునం దున్న విద్యాసంస్థలయందు దేహపరిశ్రమను సాధకములను బోధనచేయుచు, నితరపట్టణములకు బోయి, యచ్చట నారోగ్యవిధులను, యోగవ్యాయామ పద్ధతులను, అష్టాంగములు దేశీయక సరతుసాములను బోధించుచు నుపన్యాసముల నిచ్చుచు పెక్కు మండలములందు దిరుగుచు నాంధ్రదేశాటనము జేసి, జాతీయోద్యమమునకు జాల పాటుపడెను.

భరతవర్ష జాతీయశరీరదౌర్బల్యమును, దేశక్షీణతను రూపుమాపుటకు దేశాటనము చేసి, జాతీయాభ్యుదయమునకు తన యావచ్ఛక్తిని, జీవితమును ధారవోసిన దేశాభిమాని ఈయన పాశ్చాత్యభారతీయవ్యాయామ విద్యా పారంగతుడు; వ్యాయామశాస్త్రగ్రంథకర్త; సరసకవి; ఆంధ్రసాహిత్యాభిమాని. అట్టి మహనీయుని జీవితాదర్శములు సదా స్మరణీయములు; అట్టి దీర్ఘాయువాచరించిన యారోగ్యనియమము లామోదనీయములు; అట్టి శాస్త్రజ్ఞుని వ్యాయామహితోపదేశములు శ్రేయోదాయకములు.

వేలూరి వెంకటరమణారావు.

* * *

సెలవు కోరే రైళ్లు


పని చేసే కాలం పరిమితం కావాలనీ, వేతనములు హెచ్చు కావాలనీ ఈనాడు కార్మికులు, ఉద్యోగస్థులు, ఉపాధ్యాయులు ఘోషిస్తున్నారు. అంటే విశ్రాంతికాలం హెచ్చుగా కావాలని వాళ్ల కోర్కె కోరుతున్న వన్నమాట.

నోరులేని యాగయంత్రాలే ఇటువంటి విశ్రాంతి కోరుతున్నపుడు జ్ఞానవంతుడైన మానవునిలో అటువంటి కోరికలు రేకెత్తడం అసహజం కాదు.

రైళ్లు మనదేశమందు పుట్టిన కొత్తలో—వాటిని ప్రవేశపెట్టిన దొరలకు మోస్తరుగానే—రైళ్లకుగూడా ఆదివారంనాడు సెలవియ్యాలా అక్కర్లేదా అనే ప్రశ్న ఉదయించింది. ఈ సమస్య తీవ్రతర మయింది కూడను.

రైల్వేల యాజమాన్యం ఇంగ్లీషువారిది. ఆదివారం క్రైస్తవులకు పవిత్రమైన సెలవుదినం. అందుచేత అటువంటి సెలవురోజున రైలు నడపడం అపవిత్రకార్యంగా ఎంచారు అధికారులు. ఈ విషయమై ఎంతటి ప్రతిఘటన జరిగిందో, రైల్వే అధికారులు ఎంత ఎగురెత్తుగా వాదించారో తెలిపేటటువంటి చారిత్రక నిదర్శనాలు పొందుపరుస్తా:

౧౮౫౫ నుండి ౫౮ వరకు కోర్టుఆఫ్ డైరెక్టర్సు వారు, కామన్సుసభవారు—భారతదేశంలో ఆదివారం రోజున రైళ్లు నడపడానికి అనుమతివ్వరాదా, కూడదా అనేవిషయంమీద గుంజాటనపడుతూ ఉన్నారు. ఈ సమస్యను అసలు లేవదీసింది "ఈస్టిండియన్ రైల్వే" ట్రాఫిక్ మేనేజర్ రోచ్. అతడు ౧౦ సెప్టెంబరు, ౧౮౫౫ న ఒక ఆదివారం రైలుని హౌరా, బర్ద్వానుల



బాపూజీ స్మారకపోస్టుస్టాంపు నమూనా. అక్షరాలలో కొలది మార్పులతో ఈ బొమ్మతో స్టాంపులు మరి ౩ నెల్లో ప్రచారంలోకి వస్తవి.

మధ్య విలాసార్థం నడపాలని అన్నాడు. ఇండియా ప్రభుత్వంవారి కిది నచ్చలేదు. ౧౫ అక్టోబరు, ౧౮౫౬ నుంచి కోర్టు ఆఫ్ డైరెక్టర్స్‌వారు ప్రజాభిప్రాయం తెలుసుకోకుండానే ఇటువంటి ఉద్యమానికి ఎందుకు పూనుకోవాలి అని ఆలోచించి మిన్నకున్నారు.

౧౪ జనవరి, ౧౮౫౪ తేదీన మద్రాసు రైల్వే మేనేజర్, టి. ఎ. జంకిన్సు తిరువళ్లూరు ఉత్సవసమయానికి జనవరి ౨౫వ తేదీన—అంటే మరుసటి ఆదివారం, ఒక స్పెషల్ ట్రెయిన్ నడపడానికి గవర్నమెంటువారి అనుమతి కోరాడు. దీనికి కన్సల్టింగ్ ఇంజనీరు—"తిరువళ్లూరు చూడబోయేవారికి శనివారం రాత్రిబండీయే సరిపోతుంది. అదీగాక శనివారం ఒక పూట సెలవు. అందుచేత అదనంగా ఆదివారంనాడు రైలు వేయవలసిన అగత్యంలే" దని సర్దిచెప్పాడు. మద్రాసు ప్రభుత్వం వారు అతని నిశ్చయాన్ని మీరి ౨౫వ తేదీన తొలిసారిగా ఆదివారపు రైలు నడవడానికి అనుమతిచ్చారు. అటువంటి అంతరంగికవిషయాల్లో జోక్యం కలుగజేసుకోకూడ దని హెచ్చరిస్తూ కోర్టు ఆఫ్ డైరెక్టర్స్‌వారు మద్రాసుప్రభుత్వంవారికి తాఖీదు పంపించారు. మద్రాసు రైల్వే ఏజంటు జంకిన్సుకి అవసరము నెంబడిని స్పెషల్ ట్రెయిన్సుగాని, అదనపు రైళ్లుగాని నడిపించడానికి అధికార మిచ్చారు మద్రాసు ప్రభుత్వము వారు. ఇండియాప్రభుత్వం వారి ౮ నవంబరు, ౧౮౫౬ తేదీ ఉత్తరాన్ని (నెం. ౫౧౫౬) సూచిస్తూ, ఆదివారంరోజున మాత్రము రైళ్లు నడపడం అనవసరమని కూడా వ్రాశారు.

ఈ విషయంలో మద్రాసు ప్రభుత్వంవారు ఓ కడకి రాలేక, "ఒకవేళ హిందూమహమ్మదీయ పండుగలేవైనా ఆదివారంనాడు పడినట్టయితే ఆరోజులందు ప్రత్యేకంగా అదనపు రైళ్ళు నడిపించవచ్చునా" అని ఇండియా ప్రభుత్వంవారిని సలహాచేశారు.

ఈ విషయమై ప్రముఖసభ్యుల అభిప్రాయాలు ఎటువంటి వింత ధోరణిలో సాగిపోయినవో చూపుతాను:

లార్డు హేరిస్ చెప్పిన మాటలు ఇవి—

"మన (ఇంగ్లండ్) దేశప్రభుత్వంవలెనే ఈ భారతదేశప్రభుత్వంకూడా క్రైస్తవమతానికి చెందిన దని నేను ఉద్దేశపడుతున్నాను.

"చర్చి ఆఫ్ ఇంగ్లండ్ ఆదివారమును పవిత్ర దినంగా నిర్దేశించింది. కనుక ఈ సూత్రం భారత దేశానికికూడా వర్తిస్తుంది. "ఆదివారంనాడు ప్రత్యేక సౌకర్యంకోసం అదనపురైళ్ళు నడపడం క్రైస్తవ మతానికి కేవలం విరుద్ధంగా నడిచిన ట్టవుతుంది."

ఈవిధంగా హేరిస్ ప్రభువు తన మంకుపట్టును, మతోన్మాదాన్నీ వెల్లడించుకున్నాడు.

"మతవిషయానికీ, రైళ్ళు నడవడానికీ మధ్యని ఇటువంటి బలవత్తరమైన లంకె ఉంటుందని రైల్వే అధికారులకు ఎంతమాత్రము స్ఫురించియుండ లేదు. స్ఫురించియుండినట్టయితే, వారు ఆదివారం రైళ్లు నడపటానికి అనుజ్ఞకోసం వ్రాసియుండరు."

హేరిస్ ప్రభువు ఇంకా యిలా చెప్పాడు:

"రైళ్లు క్రిస్టియన్ ప్రభుత్వంచేత నడపబడుతున్నవి గనుక ఆమతసూత్రాల్ని పాటించితీరాలని నా ఉద్దేశం. లేకపోయినట్టయితే, నేటివు (భారతీయు) ల దృష్టిలో మనం అలుసైపోతాం." రైల్వే బోర్డులో మరొక సభ్యుని ఉద్దేశ మిది:

"రైల్వేల యాజమాన్యం క్రైస్తవప్రభుత్వానిదైనప్పటికీ రైళ్లు భారతీయుల సౌకర్యంకోసం ఈ దేశంలో నడపబడు తున్న వన్నమాట గుర్తుంచుకోవాలి."

"ఈ వాదం వినడానికి బాగానే వుంది. యథార్థమే కూడాను. కాని, మన ప్రయోజనాల కిది ఎదురు చుక్క అయినప్పుడు మాత్రం పాటించడానికి వీల్లేదు" అని మరొక సభ్యుడు.

ఇండియాలో ఆదివారపు రైళ్లు నడపటాన్ని గురించి ది ఆనరబుల్ సర్ మాంట్ గామెరీ సుముఖభావం కనబరిచాడు. అయితే, సుప్రీమ్ గవర్నమెంట్ వారి సువిస్పష్టమైన తాఖీదు లేనిదే ఏమీచేయజాలమని జారుకున్నాడు.



[ఢిల్లీలో ఆడపోలీసులు. ఢిల్లీ పోలీసుశాఖవారు ఈమధ్య స్త్రీరక్షకభటదళాన్ని తయారుచేశారు.]

ఈ సందర్భంలో కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ వారి మనస్తత్వాన్ని పట్టి చూడ్డం అవసరం. ౨౫ అక్టోబర్, ౧౮౫౬ తేదీన మద్రాస్ ప్రభుత్వం ఛీఫ్ సెక్రటరీ ఇండియాప్రభుత్వానికి వ్రాశాడు:

"ప్రస్తుతం బెంగాలులో అమలుజరుగుతున్న ఆచారాలు వివరించ" మని.

దీనికి బదులుగా ఇండియా గవర్నమెంట్ దగ్గర్నుంచి ఇట్లు జవాబు వచ్చింది:

"బెంగాలు ప్రభుత్వంనుంచి ఉత్సవాలకు గాను స్పెషల్ట్రెయిన్లు కావాలని అర్థిస్తూ మా కెన్నడూ అర్జీలు వచ్చియుండలేదు."

చివరకు కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ ౨౮-౬-౧౮౫౭ తేదీన ఈ తాఖీదు జారీచేసింది.

"ఈ విషయం సెలవుల మతవిషయాలలో ధారుచుకొనేదిగా పరిగణించడం మాకు చాల విచారకరము. స్పెషల్ట్రెయిను కోరడంలోని ఉద్దేశము చట్టవిరుద్ధముగా ఉండినట్లయితేనన్నా, అది ప్రజాశాంతి క్షేమాశ్రమయినా భంగకరముగా ఉండినట్లయితే నన్నా అది త్రోసిపుచ్చడానికి కారణం వుండివుండేది. అలాంటి దేదీ గోచరించడం లేదు గనుక ఈ సమస్యను రైల్వేబోర్డువారి పరిష్కారానికి వదిలేస్తున్నాము."

ఈ రాద్ధాంతసిద్ధాంతాలన్నీ అయినతరువాత కామన్సు సభవారు వారి ౨౮ జూన్, ౧౮౫౯ సమావేశమున ఇట్లా ప్రకటించారు:

"ఆదివారమురోజున ఇండియాలో రైళ్లు నడుపుటను గురించి కోర్ట్ ఆఫ్ డైరెక్టర్సుకు, రాష్ట్రీయ ప్రభుత్వములకు, రైల్వేకంపెనీలకు మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు యావత్తూ పరిశీలనార్థం మాకు పంపించవలసింది" అని.

ముద్దా సోమప్ప శాస్త్రి



విమర్శనము

శ్రీరామానుజప్రభావకల్పకము

పూర్వభాగము. గ్రంథకర్త: బుక్కపట్టణము నరసింహాచార్యులుగారు, తాడిపత్రి, అనంతపురము జిల్లా. వెల ౪ రూ.

మతత్రయములో నొకటైన విశిష్టాద్వైతమును దేశములో మహోజ్జ్వలముగా వెలయించి, దానిని ఆసేతుశీతాచలముగా ప్రతిష్ఠింపజేసిన పరమాచార్యులు శ్రీ రామానుజాచార్యులు. ఆదిశేషుని అపరావతార మని విఖ్యాతిగాంచినవారు. అట్టి మహనీయుని జీవితచరిత్ర ఇది. వీరి చరిత్ర తెలుగువారి కంతగా పరిచితము కాక పోవుట శోచనీయము. అందుకు గల కారణమును శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఈగ్రంథపు ఉపోద్ఘాతములో ఉల్లేఖించినది వాస్తవమేమో అనిపించుచున్నది. ఏమైననేమి కాని రామానుజచరిత్ర ఆంధ్రులా బాలవృద్ధము చదివి తప్పక మననము చేయదగిన జీవిత మనుటకు సందేహము లేదు. ఆ చరిత్రను నరసింహాచార్యులుగారు ఈగ్రంథములో కేవలము నిస్సారమైన చరిత్రగా గాక కావ్యరీతిని రసవంతముగా, ఒక కమ్మని కథవలె, సరళశైలిని గుదిగుచ్చి జిజ్ఞాసులోకమునకు మహోపకారము చేసినారు. రామానుజజీవితములోని సంఘటనలు, విశేషములు, కథలు అన్నియు ఇందులో సంపూర్ణముగా గ్రహింపవచ్చును.

* * *

పాడిపంటలు—ఉగాది సంచిక

దేశైశ్వర్యమునకు మూలకందములైన పాడిపంటలను శాస్త్రీయపద్ధతులలో, సక్రమముగా నడిపించి, వానిని ఇతోధికాభ్యుదయముగా పెంపొందించుటకు మద్రాసు వ్యవసాయశాఖవారి ‘పాడిపంటలు’ పత్రిక మిక్కిలి కృషిచేయుచున్నది. రైతులోకము దానివల్ల చాల మేలుపొందుచున్నట్లుకూడ పొడగట్టుచున్నది. పాడిపంటలను గురించిన సమస్తవిషయములును ఇందులో కరతలామలకముగా చర్చింపబడుచున్నవి.

ఈయేడు మొదలుకొని ఇది ఉగాదిసంచికలను గూడ ప్రచురింప బూనినది. ఇదితొలి ఉగాది సంచిక. పత్రికాశీర్షయములకు అనురూపమైన విశిష్టరచనలును, చిత్రములును ఇందులో అనేక మున్నవి. వెల ౪ అణాలు.

* * *

వైద్యపత్రిక

సంపాదకులు: జీ. వి. నరసింహాచార్యులుగారు, చేబ్రోలు, ప. గో. జిల్లా. అలోపతీ, ఆయుర్వేదము, హోమియోపతీ మొదలైన అన్నిరకముల వైద్యములను చర్చించుటకై యిది ప్రారంభింపబడినట్లు తెలియుచున్నది. శుభమస్తు. సంవత్సరచందా ౩ రూ.

* * *

గాంధీమహాత్ముని సుభాషితములు

రామనామము, వర్ణవిభాగము మొదలైన కొన్ని విషయములను గురించి మహాత్ముని అభిప్రాయములను ‘యంగ్ ఇండియా’ పత్రికనుండి సుబ్రహ్మణ్యభాగవతులుగారిచేత అనువదింపజేసి ఏలూరు వాస్తవ్యులైన ఈదర వెంకటరావుపంతులుగారు ప్రచురించిన లఘుగ్రంథము.

గ్రంథ స్వీకారము

అభినవ భారత చరిత్ర

౧౯౨౦ నుండి అసహాయోద్యమారంభము వరకు గల భారతీయవిప్లవోద్యమమును గురించిన క్లుప్తచరిత్ర ద్వితీయ ముద్రణము. చరిత్రజిజ్ఞాసువులకు ఉపయోగకరము. రచయిత: తూములూరి శివరామయ్యగారు. ప్రకాశకులు: దుర్గా మోడరన్ బుక్ డిపో, బెజవాడ. వెల రూపాయి పావలా.

త్యాగరాజకీర్తనలు

సవ్యాఖ్యానము. సచిత్రము. వ్యాఖ్యాత: కల్లూరి వీరభద్రశాస్త్రిగారు. సంపాదకుడు: విస్సా అప్పారావుగారు, ౧/౧౩ శ్రీపురంవీథి, రాయపేట, మద్రాసు. ప్రకాశకులు: ఆంధ్రగానకళాపరిషత్తు, రాజమహేంద్రవరము. వెల: కాలికో ౧౨ రూ.; సాదా ౧౦ రూ.

ఆదర్శలోకాలు

జాతీయ నాటకము. రచయిత : కె. యల్. నరసింహారావుగారు. ప్రకాశకులు. 'కళావాణి' ప్రచురణలు, రేపాల, మాధవరం పోస్టు, కృష్ణాజిల్లా. వెల ౧ రూ.

బిడాలశాస్త్రి

కావ్యము. రచయిత : సుసపూడి సుబ్బారావుగారు, నరసాపురము. వెల ౧ రూ.

మార్క్సిస్టు మూలసూత్రాలు

రచయిత : వందూరి ప్రసాదరావుగారు. రూ. ౨.

ఈ నాడు

సాంఘిక నాటకము. రచయిత: 'ఆత్రేయ'. రూ. ౧.

ఆదర్శప్రేమ

నవల. రచయిత్రి: వాండావాసి లెవిస్క్. అనువాదకుడు : 'ప్రవాసి.' వెల రూపాయన్నర.

పై మూడును బెజవాడ ప్రజాశక్తి ప్రచురణాలయ ప్రచురణలు.

శ్రీ త్యాగరాజచరిత్ర

రచయిత : యోగి శుద్ధానందభారతి. ప్రకాశకులు : సాధనగ్రంథమండలి, తెనాలి. వెల ౪ అ.

గాంధీమహాత్ముని దశావతార లీలలు

వచనము. రచయిత : నాళం కృష్ణరావుగారు రాజమహేంద్రవరము. వెల ౧౨ అ.

గాంధీజీ నిర్యాణము


బుర్రకథ. రచయిత : కర్రి రామారావు రెడ్డి గారు. ప్రకాశకులు : మాకేటి పద్మయ్య అండు సన్సు, రాజమహేంద్రవరము. వెల ౨ అ.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No, 7, Thambu Chetty St., G. T., Madras. Editor—S. Sambhu Prasad.

నానాదేశ ప్రకృతిరామణీయకము

'డ్రైపాయింట్ ఎచింగ్' చిత్రాలు

చిత్రకారుడు—ఫ్రెడరిక్ ఇ. హాల్పెర్న్



౧. ఆఫ్రికాకొండకోనల్లోని మృగయూథము



౨. పోర్చుగీసు ఇండియాలోని 'దామణ' గ్రామసీమ